
'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 6.50

సంపుటి: 16
సంచిక: 96

గురువారం 21-12-2023



SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



దైవం మానుష రూపేణ...

వైద్యుడ్ని దైవంతో పోలుస్తారు.. కోటిన్నర కుటుంబాలకు ఉచిత వైద్యం అందిస్తూ ఇప్పటివరకు నలభై లక్షల మందికి ప్రాణం పోసిన జగనన్నని ఏమని పిలవాలి !

హాస్పిటల్ నుంచి ఇంటికి వెళ్ళేప్పుడు జీవనభృతికై రోగికి డబ్బులిచ్చి మరీ చిరునవ్వుతో సాగనంపే మన హృదయాధినేత

శ్రీ వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి గారు

చిరకాలం చిరునవ్వుతో చిరంజీవిగా వెలుగొందాలని ఆశిస్తూ... వారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు...



- కుటుంబానికి రూ. 25 లక్షల వరకూ ఆరోగ్యశ్రీ పెంపు - కొత్త కార్డుల పంపిణీకి శ్రీకారం.
- ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స అందించే వ్యాధులు 1,059 నుండి 3,257 వరకు పెంపు
- క్యాన్సర్ వంటి ఖరీదైన జబ్బుల చికిత్సకు సైతం పరిమితులు లేకుండా ఉచితంగా సేవలు
- 10,032 పైగా వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌లు
- 1126 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు
- 542 అర్బన్ క్లినిక్‌లు
- ఐదు దశల్లో జగనన్న ఆరోగ్య సురక్ష
- గడప వద్దకే నాణ్యమైన వైద్యసేవలు
- 1088 కొత్త 108, 104 సేవలు
- వైఎస్ఆర్ ఆరోగ్య ఆసరా
- వైఎస్ఆర్ కంటివెలుగు
- నాడు-నేడు ద్వారా అత్యాధునిక వసతులు
- వైఎస్ఆర్ టెలీమెడిసన్ సేవలు
- వైద్య సిబ్బంది నియామకం
- ప్రతి మెడికల్ కాలేజీకి అనుబంధంగా
- మల్టీస్పెషాలిటీ హాస్పిటల్స్ నిర్మాణం..
- ఉచితంగా వైద్యం.
- మీ ఇంటి వద్దకే ఉచితంగా మందులు

రూ. 8,480 కోట్లతో 17 నూతన ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణం.. గతంలో వున్న 11 కాలేజీలు ఆధునీకరణ.



ఈ ఏడాదే ప్రారంభమైన 5 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు వచ్చే ఏడాది మరో 5, ఆపై ఏడాది 2025-26లో మరో 7 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రారంభం.



వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

రాజ్యసభ సభ్యులు

ఇది ప్రాణం విలువ తెలిసిన ప్రభుత్వం...


మారిన సర్కారు బడి..
మురిసిన చదువుల తల్లి..
జగనన్న అమ్మ ఒడి
జగనన్న గోరుముద్ద..
జగనన్న విద్యా కానుక
BYJU'S The Learning App
మన బడి నాడు-నేడు..
జగనన్న విద్యా దీవెన
జగనన్న వసతి దీవెన..
ఇంగ్లీషు మీడియం విద్య - CBSE సిలబస్‌తో
దేశ చరిత్రలో తొలిసారిగా తల్లుల గురించి, వారి పిల్లల చదువుల గురించి ఆలోచించిన మనసున్న నాయకుడు మన జగనన్న...
విద్యారంగంలో ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన అమ్మఒడి పథకం వల్ల అక్షరాస్యత రేటు పెరుగుతుందని నోబెల్ గ్రహీత జాన్ బి. గూడెనఫ్ ప్రశంసించారు.
పోషకాహార లోపానికి వ్యతిరేకంగా 31.88 లక్షల మంది మహిళలు మరియు పిల్లలకు లబ్ధి చేకూర్చేలా ఏపీ ప్రభుత్వం చేపట్టిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ చొరవను నీతి ఆయోగ్ ప్రశంసించింది.
ఏపీ ప్రభుత్వం చేపట్టిన నాడు-నేడు కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకుని దేశవ్యాప్తంగా 14,500 స్కూళ్లను ఆధునీకరించాలని కేంద్రప్రభుత్వం శ్రీకారం చుట్టింది.
నాడు
నేడు
జగనే కావాలి రావాలి
విద్యావ్యవస్థలో వినూత్న పథకాల ద్వారా..
విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేస్తూ,
ప్రతి పేద విద్యార్థి ఉన్నత చదువులు అభ్యసించేలా
కృషిచేస్తున్న ప్రియతమ ముఖ్యమంత్రివర్యులు
శ్రీ వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి గారికి
అభినందనలు మరియు జన్మదిన శుభాకాంక్షలు...
శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి
వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి
రాజ్యసభ సభ్యులు, నెల్లూరు జిల్లా వైఎస్ఆర్‌సిపి అధ్యక్షులు
జగనన్న అమ్మఒడి - బతుకులు మార్చే గుడి

గురువారం 21-12-2023

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 6.50

సంపుటి: 16
సంచిక: 96



SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సమష్టిగా రాణిస్తేనే... నేడు దక్షిణాఫ్రికాతో భారత్ మూడో వన్డే

పార్ల్: సఫారీ గడ్డపై రెండోసారి వన్డే సిరీస్ సాధించాలనే లక్ష్యంతో... నేడు దక్షిణాఫ్రికాతో జరిగే చివరిదైన మూడో మ్యాచ్‌లో భారత్ బరిలోకి దిగనుంది. కేఎల్ రాహుల్ నాయకత్వంలోని టీమిండియా తొలి వన్డేలో ఘనవిజయం సాధించినా... రెండో వన్డేలో మాత్రం తడబడింది. మూడో మ్యాచ్‌లో భారత్ గెలవాలంటే సమష్టిగా రాణించాల్సిన అవసరం ఉంది. మరోవైపు రెండో వన్డేలో సాధించిన విజయంతో దక్షిణాఫ్రికా ఆత్మ విశ్వాసంతో ఉంది. ఓపెనర్ టోనీ జోర్జి సెంచరీ సాధించి ఫామ్‌లోకి వచ్చాడు. మార్క్‌రమ్, రీజా హెన్‌డ్రిక్స్, క్లాసెన్, మిల్లర్ కూడా రాణిస్తే ఆ జట్టు మరో విజయంపై ఆశలు పెట్టుకోవచ్చు.

'ఖేల్ రత్నా'లు సాత్విక్, చిరాగ్


చిరాగ్ శెట్టి సాత్విక్ సాయిరాజ్

భారత బ్యాడ్మింటన్ జోడీకి దేశ అత్యున్నత క్రీడా పురస్కారం

- హుసాముద్దీన్, ఇషా సింగ్, అజయ్ కుమార్‌లకు 'అర్జున'
- 2023 జాతీయ క్రీడా అవార్డుల ప్రకటన
- జనవరి 9న రాష్ట్రపతి భవన్‌లో అవార్డుల ప్రదానోత్సవం

న్యూఢిల్లీ: కొన్నేళ్లుగా అంతర్జాతీయస్థాయిలో నిలకడగా రాణిస్తున్న భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్స్ సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టిలకు దేశ అత్యున్నత క్రీడా పురస్కారం 'ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న' లభించింది. 2023 సంవత్సరానికిగాను కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ బుధవారం జాతీయ క్రీడా పురస్కారాలను ప్రకటించింది. ఉత్తమ క్రీడాకారులకు ఇచ్చే 'అర్జున' అవార్డు 26 మందిని వరించింది. ఉత్తమ కోచ్‌లకు అందించే 'ద్రోణాచార్య' అవార్డును రెగ్యులర్ విభాగంలో ఐదుగురికి... లైఫ్‌టైమ్ విభాగంలో ముగ్గురికి ప్రకటించారు. ఈసారి తెలుగు రాష్ట్రాల నుంచి నలుగురికి క్రీడా పురస్కారాలు దక్కాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 23 ఏళ్ల రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ 'ఖేల్ రత్న' అందుకోనుండగా... ఆంధ్రప్రదేశ్‌కే చెందిన అజయ్ కుమార్ రెడ్డి (అంధుల క్రికెట్) 'అర్జున' పురస్కారం పొందాడు. తెలంగాణకు చెందిన బాక్సర్ హుసాముద్దీన్, మహిళా షూటర్ ఇషా సింగ్‌లకు కూడా 'అర్జున' అవార్డు దక్కింది. జనవరి 9న రాష్ట్రపతి భవన్‌లో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ పురస్కారాలు అందజేస్తారు.

- 'ఖేల్ రత్న' అవార్డీలకు మెడల్, ప్రశంస పత్రంతోపాటు రూ. 25 లక్షలు... 'అర్జున' విజేతలకు రూ. 15 లక్షలు... 'ద్రోణాచార్య' అవార్డీలకు రూ. 15 లక్షలు... ధ్యాన్‌చంద్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డీలకు రూ. 10 లక్షల చొప్పున నగదు పురస్కారం లభిస్తుంది.


అజయ్

- గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన 33 ఏళ్ల అజయ్ 2010 నుంచి భారత అంధుల క్రికెట్ జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. 2016లో టీమిండియాకు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. అజయ్ సారథ్యంలోనే భారత్ 2017 టి20 వరల్డ్ కప్, 2018 వన్డే వరల్డ్‌కప్, 2022 టి20 వరల్డ్‌కప్ టైటిల్స్ గెలిచింది.


హుసాముద్దీన్

- నిజామాబాద్ జిల్లాకు చెందిన 29 ఏళ్ల హుసాముద్దీన్ ఈ ఏడాది తాష్కెంట్‌లో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం గెలిచాడు. ఇండియన్ ఆర్మీలో సుబేదార్‌గా విధులు నిర్వహిస్తున్న హుసాముద్దీన్ 2022 ఆసియా చాంపియన్‌షిప్‌లో... 2018, 2022 కామన్వెల్త్ గేమ్స్‌లో కాంస్య పతకాలు నెగ్గాడు.


ఇషాసింగ్

- హైదరాబాద్‌కు చెందిన 18 ఏళ్ల పిస్టల్ షూటర్ ఇషా సింగ్ ఈ ఏడాది అజర్‌బైజాన్‌లో జరిగిన ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో, 25 మీటర్ల పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో స్వర్ణ పతకాలు గెలిచింది. హాంగ్జౌ ఆసియా క్రీడల్లో ఒక స్వర్ణం, మూడు రజత పతకాలు నెగ్గింది. గత ఏడాది జరిగిన ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్‌లో మూడు స్వర్ణాలు, ఒక కాంస్యం సాధించింది.

నిలకడగా...

మహారాష్ట్రకు చెందిన 26 ఏళ్ల చిరాగ్ శెట్టితో కలిసి సాత్విక్ సాయిరాజ్ గత ఐదేళ్లలో పలు అంతర్జాతీయ టోర్నీల్లో అద్భుత ప్రదర్శన చేశాడు. ఈ ఏడాది మొత్తం సాత్విక్-చిరాగ్ జోడీ సూపర్ ఫామ్‌లో ఉంది. దుబాయ్ వేదికగా జరిగిన ఆసియా చాంపియన్‌షిప్‌లో... చైనాలోని హాంగ్జౌ నగరంలో జరిగిన ఆసియా క్రీడల్లోనూ ఈ జంట స్వర్ణ పతకాలు సాధించింది. స్విస్ ఓపెన్ సూపర్-300, ఇండోనేసియా ఓపెన్ సూపర్-1000, కొరియా ఓపెన్ సూపర్-500 టోర్నీల్లోనూ విజేతగా నిలిచింది. చైనా మాస్టర్స్ ఓపెన్ సూపర్-750 టోర్నీలో రన్నరప్ ట్రోఫీ దక్కించుకుంది. దాంతోపాటు డబుల్స్ ర్యాంకింగ్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచి కొత్త చరిత్ర సృష్టించింది. ఇక 2022లో జరిగిన ప్రతిష్టాత్మక థామస్ కప్ టోర్నీలో తొలిసారి భారత్ విజేతగా నిలువడంలో సాత్విక్-చిరాగ్ శెట్టి కీలకపాత్ర పోషించారు. 2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో సాత్విక్-చిరాగ్ ద్వయం పసిడి పతకాన్ని దక్కించుకుంది. అంతేకాకుండా ఇండియా ఓపెన్ సూపర్-500, ఫ్రెంచ్ ఓపెన్ సూపర్-750 టోర్నీల్లోనూ టైటిల్స్ కైవసం చేసుకుంది. 2018లో హైదరాబాద్ ఓపెన్, 2019లో థాయ్‌లాండ్ ఓపెన్ టోర్నీల్లోనూ సాత్విక్-చిరాగ్ జంట విజేతగా నిలిచింది. 2018 గోల్డ్‌కోస్ట్ కామన్వెల్త్ గేమ్స్‌లో భారత జట్టుకు మిక్స్‌డ్ టీమ్‌లో స్వర్ణం రావడానికి సాత్విక్-చిరాగ్ ముఖ్యపాత్ర పోషించారు.

అవార్డు గ్రహీతలు...

'ఖేల్ రత్న' (2): సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి (బ్యాడ్మింటన్).

అర్జున అవార్డీలు (26): ఒజస్ ప్రవీణ్ దేవ్‌తలే, అదితి స్వామి (ఆర్చరీ), శ్రీశంకర్, పారుల్ చౌధరీ (అథ్లెటిక్స్), హుసాముద్దీన్ (బాక్సింగ్), వైశాలి (చెస్), షమీ (క్రికెట్), అనూష్ అగర్వల్లా, దివ్యాకృతి సింగ్ (ఈక్వెస్ట్రియన్), దీక్షా డాగర్ (గోల్ఫ్), క్రిషన్ బహదూర్ పాఠక్, సుశీలా చాను (హాకీ), పవన్ కుమార్, రీతూ నేగి (కబడ్డీ), నస్రీన్ (ఖో-ఖో), పింకీ (లాన్ బాల్స్), ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్, ఇషా సింగ్ (షూటింగ్), హరీందర్ పాల్ (స్క్వాష్), అహిక ముఖర్జీ (టేబుల్ టెన్నిస్), సునీల్, అంతిమ్ పంఘాల్ (రెజ్లింగ్), రోషిబీనా (వుషు), అజయ్ కుమార్ రెడ్డి (అంధుల క్రికెట్), ప్రాచీ యాదవ్ (పారా కనోయింగ్).

ద్రోణాచార్య అవార్డీలు (రెగ్యులర్ కేటగిరీ-5): లలిత్ కుమార్ (రెజ్లింగ్), ఆర్‌బీ రమేశ్ (చెస్), మహావీర్ ప్రసాద్ (పారా అథ్లెటిక్స్), శివేంద్ర సింగ్ (హాకీ), గణేశ్ ప్రభాకర్ (మల్లఖంబ్).

ద్రోణాచర్య అవార్డీలు (లైఫ్‌టైమ్-3): జస్కీరత్ సింగ్ గ్రెవాల్ (గోల్ఫ్), భాస్కరన్ (కబడ్డీ), జయంత కుమార్ (టేబుల్ టెన్నిస్).

ధ్యాన్‌చంద్ అవార్డీలు (లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్-3): మంజూషా కన్వర్ (బ్యాడ్మింటన్), వినీత్ శర్మ (హాకీ), కవితా సెల్వరాజ్ (కబడ్డీ).

మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ ట్రోఫీ (అత్యుత్తమ యూనివర్సిటీలు-3): 1. గురునానక్ దేవ్ యూనివర్సిటీ (అమృత్‌సర్), 2. లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ (పంజాబ్), 3. కురుక్షేత్ర యూనివర్సిటీ (కురుక్షేత్ర, హరియాణా).

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
931	303
70,506	21,150

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	15,041	▲	38
డోజోన్స్	37,631	▲	72
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,716	▲	78
డాక్స్	16,733	▽	11
షాంఘై	2,902	▽	30
నికాయ్	33,675	▲	457

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
62,302	▲	218
బంగారం (99.5 స్వచ్ఛత)		
62,052	▲	216
వెండి (కేజీ)		
73,742	▽	90

కార్వీ కేసులో బ్యాంకులకు ఊరట

- ఎన్‌ఎస్‌డీఎల్, ఎన్‌ఎస్‌ఈ, సెబీల నుంచి రూ.1,400 కోట్లు రాబట్టుకునే వెసులుబాటు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కార్వీ స్టాక్ బ్రోకింగ్ కేసులో బ్యాంకింగ్‌కు అనుకూలంగా సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్ (శాట్) బుధవారం కీలక ఉత్తర్వులు వెలువరించింది. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ), నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్‌ఎస్‌డీఎల్)లు సంయుక్తంగా బ్యాంకులకు కార్వీ తాకట్టు పెట్టిన షేర్‌లను తిరిగి ఇవ్వాలని లేదా బ్యాంకులకు పరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో కార్వీ రుణదాతలకు (బ్యాంకులకు) ఎన్‌ఎస్‌డీఎల్, ఎన్‌ఎస్‌ఈ, సెబీలు వార్షికంగా 10 శాతం వడ్డీసహా షేర్ల విలువ రూ. 1,400 కోట్ల పరిహారం చెల్లించాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది.

కేసు వివరాల్లోకి వెళితే...: క్లయింట్ సెక్యూరిటీలను కార్వీ స్టాక్ బ్రోకింగ్ దుర్వినియోగం చేసినట్లు సెక్యూరిటీస్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) 2019లో ధ్రువీకరించింది. బ్యాంకుల వద్ద రూ.2,300 కోట్లకుపైగా విలువైన ఖాతాదారుల సెక్యూరిటీలను స్టాక్ బ్రోకర్ తాకట్టు పెట్టినట్లు పేర్కొంది. అయితే తాము బ్రోకరేజ్ సంస్థకు ఇచ్చిన రుణాలకుగాను (ప్లెడ్జ్ ఆధారంగా) ఈ తనఖా షేర్లను సర్దుబాటు చేసుకుంటామని యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ సెబీని అభ్యర్థించాయి. అయితే దీనిని సెబీ తిరస్కరించింది. తాకట్టు పెట్టిన సెక్యూరిటీలను బ్యాంకులకు బదిలీ చేయవద్దని రెగ్యులేటర్ డిపాజిటరీని ఆదేశించిన సెబీ, ఈ షేర్లను తిరిగి క్లయింట్ ఇన్వెస్టర్లకు బదిలీ చేయాలని డిపాజిటరీని ఆదేశించింది. దీనితో రుణదాతలు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాయి. ట్రిబ్యునల్‌లో తాజాగా రెండు వేర్వేరు రూలింగ్ ఇస్తూ, సెబీ ఆదేశాలను తప్పుపట్టింది.

ఎంబసీ రీట్ నుంచి బ్లాక్‌స్టోన్ ఔట్

- 23.5 శాతం వాటా విక్రయం
- డీల్ విలువ రూ. 7,100 కోట్లు

న్యూఢిల్లీ: లిస్టెడ్ సంస్థ ఎంబసీ ఆఫీస్ పార్క్స్ రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్(రీట్) నుంచి గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం బ్లాక్‌స్టోన్ వైదొలగినట్లు సంబంధిత వర్గాలు తెలియజేశాయి. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా ఎంబసీ ఆఫీస్ పార్క్స్ రీట్‌లో తమకుగల మొత్తం 23.5 శాతం వాటాను విక్రయించినట్లు వెల్లడించాయి. ఒక్కో షేరుకి రూ. 316 సగటు ధరలో వాటా విక్రయాన్ని చేపట్టినట్లు తెలిపాయి. బుధవారం ముగింపు ధర రూ. 331తో పోలిస్తే ఇది 5 శాతం డిస్కౌంట్‌కాగా.. తద్వారా బ్లాక్‌స్టోన్ రూ. 7,100 కోట్లు సమకూర్చుకున్నట్లు అంచనా. ఈ బ్లాక్‌డీల్స్‌లో ఏడీఐఏసహా ప్రస్తుత యూనిట్ హోల్డర్లు, ఎస్‌బీఐ ఎంఎఫ్ తదితర కొత్త ఇన్వెస్టర్లు షేర్లు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. బ్లాక్‌స్టోన్, ఎంబసీ గ్రూప్ సంయుక్తంగా ప్రమోట్ చేసిన ఎంబసీ ఆఫీస్ పార్క్స్ దేశీయంగా స్టాక్ ఎక్స్చేంజీలలో లిస్టయిన తొలి రీట్‌గా నిలుస్తున్న సంగతి తెలిసిందే. 2019లో చేపట్టిన ఐపీవోలో భాగంగా రూ. 5,000 కోట్ల సమీకరణ ద్వారా లిస్టయ్యింది. సంస్థలో దేశీ ఎంబసీ గ్రూప్‌నకు సుమారు 8 శాతం వాటా ఉంది.

పేమెంట్ అగ్రిగేటర్‌గా ఎన్‌క్యాష్‌కు అనుమతి

న్యూఢిల్లీ: పేమెంట్ అగ్రిగేటర్‌గా వ్యవహరించేందుకు రిజర్వ్ బ్యాంక్ నుంచి అనుమతి లభించినట్లు ఎన్‌క్యాష్ సంస్థ తెలిపింది. బిజినెస్-2-బిజినెస్ వ్యవస్థలో ఒలింపస్ బ్రాండ్ పేరిట కార్యకలాపాలు నిర్వహించనున్నట్లు సంస్థ తెలిపింది. నిరంతరాయంగా, వినూత్నమైన, విశ్వసనీయమైన పేమెంట్ సొల్యూషన్స్‌ను అందించేందుకు తాము కట్టుబడి ఉన్నామని ఈ సందర్భంగా సంస్థ సహ-వ్యవస్థాపకుడు యద్వేంద్ర త్యాగి తెలిపారు. కార్పొరేట్ పేమెంట్స్ సొల్యూషన్స్ సంస్థగా ఎన్‌క్యాష్ 2018లో కార్యకలాపాలు ప్రారంభించింది. అప్పటి నుంచి దాదాపు 2,50,000 పైచిలుకు వ్యాపారాలు తమ కార్పొరేట్ పేమెంట్స్ వ్యవస్థను డిజిటలీకరించుకోవడంలో తోడ్పాటు అందించింది.

నిస్సహాయుల పట్ల కరుణ చూపాలి

ఆకాశమంత సహనం ఉండాలి..

- అప్పుడే దేవుడికి నచ్చిన బిడ్డలుగా ఉంటాం
- రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో సీఎం వైఎస్ జగన్
- కేక్ కట్‌చేసి తెలుగు రాష్ట్రాల ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి



సెమీ క్రిస్మస్ వేడుకల్లో క్రైస్తవ మతపెద్దలతో సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: నిస్సహాయుల పట్ల కరుణ చూపించడం, ఆకాశమంత సహనంతో మెలగడం.. ప్రతి మనిషి అలవాటు చేసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. అప్పుడే మనం దేవుడికి నచ్చిన బిడ్డలుగా ఉంటామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఘనంగా నిర్వహించిన సెమీక్రిస్మస్ వేడుకల్లో సీఎం జగన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. క్రైస్తవ మతపెద్దలతో కలిసి కేక్ కట్‌చేసి, క్యాండిల్స్ వెలిగించి తెలుగు రాష్ట్రాల ప్రజలకు ముందస్తుగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 'క్రిస్మస్ పండుగ వస్తున్న శుభసందర్భంలో ఈ సాయంత్రం పూట అడ్వాన్స్‌గా క్రిస్మస్‌ను జరుపుకొంటున్నాం. ఇక్కడికి వచ్చిన అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మలే కాకుండా తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ప్రతి ఒక్కరికి మీ అన్నగా, తమ్ముడిగా మెర్రీ క్రిస్‌మస్ ఇన్ అడ్వాన్స్ తెలియజేస్తున్నాను. దేవుని విషయంలో మనందరికీ తెలిసిన ఒక్కటే ఒక్క విషయం .. మనుషుల పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ చూపించడం. ఆకాశమంత సహనం ప్రతి మనిషిలోనూ అలవాటు చేసుకోవడం. అవధులు లేని త్యాగం, మరీ ముఖ్యంగా శత్రువుల పట్ల కూడా క్షమాగుణం. ఇవన్నీ కష్టమైన విషయాలు అయినప్పటికీ ఆ ప్రతి విషయాన్ని మనం ఎప్పుడు గ్రహిస్తామో, ఎప్పుడైతే వాటిని మనసారా పాటించాలని తాపత్రయపడతామో.. అప్పుడు మనం కూడా దేవుడు నచ్చిన బిడ్డలుగా ఉంటాం. దేవుడు ఆ మనసు మనందరికీ ఇవ్వాలని, రాష్ట్రాన్ని, ప్రజలను దేవుడు ఆశీర్వదించాలని మనసారా కోరుకుంటున్నా..' అని చెప్పారు.

క్రైస్తవ మత పెద్దలు, దైవసేవకులతో కలిసి సీఎం విందు

క్రిస్మస్‌ను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన విందులో క్రైస్తవ మతపెద్దలు, దైవసేవకులతో కలిసి సీఎం వైఎస్ జగన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రులు అంజాద్‌బాషా, కె.నారాయణస్వామి, మంత్రులు మేరుగు నాగార్జున, కె.వి. ఉషశ్రీ చరణ్, తానేటి వనిత, ఆదిమూలపు సురేష్, జోగి రమేష్, ఎంపీలు నందిగం సురేష్, వల్లభనేని బాలశౌరి, ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్, ఏపీ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ, మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, క్రైస్తవ మతపెద్దలు, దైవసేవకులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవకులకు అవార్డులు ప్రదానం చేసిన సీఎం జగన్

రాష్ట్రంలో పలు రంగాల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న వారిని సీఎం వైఎస్ జగన్ సన్మానించి, అవార్డులు అందజేశారు. అరుణ్‌కుమార్, మొగులూరి ఏలీషా, మేరీకుమారి, పి.మనోహర్‌బాబు, జ్యోతి కమలకుమారి, కె.కిరణ్ బాబు, బింధు ఫిలిప్, యు.ఆశీర్వాదం, దైవవరప్రసన్నబాబు, మైరాల క్రాంతికిరణ్, పాల్ దినకర్, సాగర్‌రాజు, సుభాషిణి, ప్రభాకర్, జోసఫ్ ప్రకాశ్‌లను సత్కరించి అవార్డులు అందించారు.

దళితులపై కేసుల ఉపసంహరణ

- మొత్తం 19 కేసులు ఉపసంహరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన ఆయా సామాజికవర్గాల ప్రతినిధులు

సాక్షి, అమరావతి : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో దళితుల పట్ల తన సానుకూల విధానాన్ని మరోసారి సుస్పష్టం చేసింది. తమది దళిత పక్షపాత ప్రభుత్వమని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరోసారి చేతల్లో చూపించారు. రాష్ట్రంలో వివిధ ఆందోళనల సందర్భంగా మాల, మాదిగ సామాజిక వర్గాలకు చెందిన వారిపై నమోదు చేసిన కేసులను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకుంది. విచారణ దశలో ఉన్న మొత్తం 19 కేసులను ఉపసంహరిస్తూ హోమ్ శాఖ బుధవారం ఉత్తర్వులిచ్చింది. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎంఆర్‌పీఎస్) నిర్వహించిన 'కురుక్షేత్ర' ఆందోళన సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు చేసిన ఆరు కేసులను ప్రభుత్వం ఉపంహరించింది. ఇక వివిధ ఆందోళన కార్యక్రమాల సందర్భంగా మాల సామాజిక వర్గానికి చెందినవారిపై నమోదు చేసిన కేసులనూ ప్రభుత్వం ఉపసంహరించింది. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి, పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడూరు, బాపట్ల జిల్లా పర్చూరు, ఎస్పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా రాపూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదు చేసిన 13 కేసులు వాటిలో ఉన్నాయి. కేసులను ఉపంహరించినందుకుగాను వివిధ దళిత సంఘాల ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం సీఎం వైఎస్ జగన్‌ను డిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి, హోంశాఖ మంత్రి తానేటి వనిత, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, సాంఘిక్ష సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కైలే అనిల్‌కుమార్, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులు మీడియాతో మాట్లాడారు. ఎస్సీలపై చంద్రబాబు కేసులు పెట్టించి, తీవ్రంగా వేధించారని గుర్తు చేశారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక ఎస్సీలకు అన్ని విధాలా అండగా నిలబడుతూ తమ వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్నారని కొనియాడారు.

ఎస్సీల ఆత్మగౌరవాన్ని మరింత పెంచిన సీఎం జగన్ : మంత్రి మేరుగు నాగార్జున



టీడీపీ సర్కార్ హయాంలో ఎస్సీలపై చంద్రబాబు కేసులు పెట్టి వేధించారు. ఎస్సీలను చంద్రబాబు తీవ్రంగా దెబ్బతీశారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక దళితులకు ప్రభుత్వం అండగా నిలబడుతోంది. ఎన్నడూ చూడని విధంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ వారి అభ్యున్నతికి పాటుబడుతోంది. విజయవాడలో అంబేడ్కర్ స్మృతి వనాన్ని ఏర్పాటు చేసి దళితుల ఆత్మగౌరవాన్ని సీఎం జగన్ మరింతగా పెంచారు.

సీఎం జగన్‌కు బాసటగా దళిత సమాజం : మంత్రి ఆదిమూలపు సురేష్



అంబేడ్కర్ ఆలోచనలను ఈ ప్రభుత్వం అమలు చేస్తోంది. ఏ సమస్య ఉన్నా నేరుగా చెప్పుకునే అవకాశాన్ని సీఎం జగన్ కల్పించారు. దళితుల బాధలు, కష్టాలు తెలిసిన సీఎం వైఎస్ జగన్. వారి అభ్యున్నతికి పాటుపడుతున్నారు. తమకు మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు దళిత సమాజమంతా బాసటగా నిలుస్తుంది.

సీఎం జగన్ అధికారంలో ఉంటేనే అణగారిన వర్గాలకు మేలు

వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌ను దెబ్బతీయడానికి ప్రత్యర్థులంతా ఏకమవుతున్న సమయంలో ఆయనకు కుడిభుజంగా దళితులు నిలబడి పనిచేస్తారు. వైఎస్ జగన్ అధికారంలో ఉంటేనే పేదరిక నిర్మూలన జరుగుతుంది. అణగారిన వర్గాలకు మేలు జరుగుతుంది.

–ప్రభుత్వ సలహాదారు (సామాజిక న్యాయం) జూపూడి ప్రభాకరరావు

ప్రభుత్వ విద్యార్థులకు.. నేడు ట్యాబ్స్ పంపిణీ

- చింతపల్లిలో సీఎం జగన్ చేతుల మీదుగా ప్రారంభం
- 9,426 పాఠశాలల్లో 4,34,185 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు అందజేత

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ఎనిమిదో తరగతి విద్యార్థులకు వరుసగా రెండో ఏడాది కూడా రాష్ట్ర ప్రభుత్వం ట్యాబ్స్ పంపిణీ చేయనుంది. పేదింటి పిల్లలు అంతర్జాతీయ వేదికపై తమ సత్తాచాటాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం మేరకు రూ.620 కోట్ల వ్యయంతో బైజూస్ ప్రీలోడెడ్ కంటెంట్ గల 4,34,185 ట్యాబ్స్‌ను 9,424 పాఠశాలల్లోని విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేయనుంది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గురువారం ఈ పంపిణీని ప్రారంభించనున్నారు. దాదాపు రూ.17,500కు పైగా మార్కెట్ విలువ గల ఒక్కో ట్యాబ్.. రూ.15,500 విలువ గల బైజూస్ కంటెంట్‌తో కలిపి ప్రతి విద్యార్థికీ రూ.33వేల మేర లబ్ధి చేకూరనుంది. ఇప్పుడిచ్చే ట్యాబ్స్‌తో కలిపి రెండేళ్లలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కలిపి రూ.1,305.74 కోట్ల విలువైన 9,52,925 ట్యాబ్‌లను ప్రభుత్వం అందించింది. వీటిల్లో ఎనిమిదో తరగతితో పాటు, 9, 10 తరగతుల బైజూస్ కంటెంట్‌ను కూడా లోడ్ చేయడంతో పాటు ఇంటర్మీడియట్ కంటెంట్ కూడా అప్‌లోడ్ చేసేందుకు వీలుగా ట్యాబ్ సామర్థ్యాన్ని 256 జీబీకి పెంచి అందిస్తున్నారు. ఇక గత ఏడాది విద్యార్థులు, ఉపాధ్యాయులకు 5,18,740 ట్యాబ్స్‌ను పంపిణీ చేశారు.

ఉచిత ట్యాబ్‌లో ఉన్నత కంటెంట్..

- ప్రతి ట్యాబ్‌లోను ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, మ్యాథ్స్, ఇంగ్లిష్, టోఫెల్ ప్రిపరేషన్‌లో విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పనిచేసే 'డౌట్ క్లియరెన్స్' అప్లికేషన్ ఉంది.
- విద్యార్థులు సులభంగా విదేశీ భాషలు నేర్చుకునేందుకు వీలుగా 'డ్యులింగో' యాప్‌ను సైతం ఇన్‌స్టాల్ చేసి, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో సైతం పనిచేసేలా ఏర్పాటుచేశారు.
- ప్రస్తుతం 4 నుంచి 10వ తరగతి వరకు ఉచితంగా అందిస్తున్న రూ.15,500 విలువైన బైజూస్ కంటెంట్‌ను ఇకపై ఇంటర్మీడియట్ విద్యార్థులకు సైతం అందించనున్నారు.
- తద్వారా 34.3 లక్షల మంది విద్యార్థులకు మేలు జరుగుతుంది.
- ఈ ట్యాబ్‌ల మెమరీ సామర్థ్యం పెంచడంతో పాటు ట్యాబ్ సంరక్షణకు రగ్డ్ కేస్, టెంపర్డ్ గ్లాస్ వంటి హంగులు సైతం సమకూర్చారు.
- అవాంఛనీయ సైట్లు, యాప్స్‌ను నిరోధించే ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రక్షణతో పాటు మూడేళ్ల వారంటీతో వీటిని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసింది.

పతంజలి శాస్త్రికి సాహిత్య అకాడమీ పురస్కారం

▶ మొదటి పేజీ తరువాయి

ఆ తర్వాత 'ఎన్విరాన్‌మెంట్ సెంటర్'స్థాపించి పర్యావరణ రంగంలో కృషి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో మడ అడవుల రక్షణ కోసం చాలా పోరాడారు. అమెరికా, ఇజ్రాయిల్ దేశాలలో పర్యావరణ కార్యకర్తగా సదస్సులకు హాజరయ్యారు. దక్షిణ భారతదేశ చరిత్ర మీద, దేవాలయాల వాస్తు మీద పతంజలి శాస్త్రికి విశేష పరిజ్ఞానం ఉంది. భార్య విజయలక్ష్మితో రాజమండ్రిలో చిరకాలంగా జీవనం గడుపుతున్నారు. కుమారుడు శశి, కుమార్తె గాయత్రి.

అర్ధ శతాబ్దానికి పైగా కథారచయితగా.. ప్రత్యేక కథాశైలితో ప్రతిష్ట

1960ల నుంచి కథలు రాస్తున్న పతంజలి శాస్త్రిది తెలుగులో ప్రత్యేక శైలి. తేటతెల్లంగా కథావస్తువును బయల్పరచకుండా పాఠకుడి మేధ కొద్దీ అర్థం చేసుకునే విషయాలను ఇముడ్చుతారు ఆయన. నిర్దిష్టమైన సాంస్కృతిక నేపథ్యంతో కాకుండా సార్వజనీనమైన మానవ ప్రవర్తనలతో కథను చెప్పడం ఆయన ధోరణిలో కనిపిస్తుంది. జేబు దొంగలు, హోటల్ క్లీనర్లు, ఐటీ ఉద్యోగాల కట్టు బానిసలు, రంగు రాళ్ల వెతుకులాటలో ప్రాణాలు కోల్పోయే వాళ్లు, వేశ్యలు, గారడీల వాళ్లు పాత్రలుగా ఆయన కథల్లో కనిపిస్తారు. 'వడ్ల చిలుకలు', 'పతంజలి శాస్త్రి కథలు', 'నలుపెరుపు', 'రామేశ్వరం కాకులు' పతంజలి శాస్త్రి కథాసంపుటాలు కాగా 'హోరు', 'దేవర కోటేశు', 'గేద మీద పిట్ట'నవలలు. వీటిలో 'గేద మీద పిట్ట'ముఖ్య వస్తువు 'మగ వేశ్యలు'కావడం ఒక ప్రత్యేకత. 'మాధవి'అనే నాటకం రాశారు. గాథాసప్తశతిలోని వంద కథల్ని తెలుగులోకి అనువదించారు. 'నేను నడుస్తున్నా, బస్సులో ఉన్నా, ఏం చేస్తున్నా మనసులో ఏదో కథ రాస్తూనే ఉంటాను'అని చెప్పే పతంజలి శాస్త్రి అలుపెరగక రాస్తూనే ఉన్నారు. పతంజలి శాస్త్రికి సాహిత్య అకాడమీ పురస్కారం రావడం పట్ల పలువురు సాహితీవేత్తలు హర్షం వ్యక్తం చేశారు.

సాహిత్యం నా జీవితం

నా సాహిత్య వ్యాసంగం గుర్తింపు కోసమో, పురస్కారాల కోసమో కాదు. పర్యావరణం, సాహిత్యం నా జీవితం.. నా రచన. 'రామేశ్వరం కాకులు' దేశంలోనే గౌరవప్రదమైన కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకోవడం సంతోషం. అధ్యయనం, అనుశీలనం నా ధ్యేయాలు.. ఇంకా రాస్తూనే ఉంటాను.

–తల్లావఝుల పతంజలి శాస్త్రి, రాజమహేంద్రవరం

పారదర్శకంగా సామాజిక తనిఖీ

- సమగ్ర శిక్ష ఏఎస్పీడీ శ్రీనివాసులురెడ్డి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న వివిధ పథకాల అమలు తీరును పారదర్శకంగా తనిఖీ చేయాలని సమగ్ర శిక్ష ఏఎస్పీడీ డాక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి సూచించారు. మధ్యాహ్న భోజనం, సమగ్ర శిక్ష చేపడుతున్న విద్యాభివృద్ధి కార్యక్రమాలు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, బోధనాభివృద్ధి పనులు, ఉపాధ్యాయ సేవలు, లింగ సమానత్వ అంశాలు, పాఠశాలల్లో విద్యార్థుల భద్రత-సంరక్షణ, ఆటలు, తదితర అంశాలపై సామాజిక తనిఖీ చేయనున్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విజయవాడలోని సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయంలో సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్, అకౌంటబిలిటీ అండ్ ట్రాన్స్‌పరెన్సీ (ఏపీఎస్‌ఎస్‌ఏటీ) రిసోర్సు పర్సన్లకు సమగ్ర శిక్ష, ఎండీఎం, అంగన్వాడీ కేంద్రాల సామాజిక తనిఖీపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ అంశాలపై పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పేరెంట్స్ కమిటీ, స్థానికుల నుంచి వివరాలు సేకరించి సోషల్ ఆడిట్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఏపీఎస్ఎస్ఏటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.జగదీష్ కుమార్, సమగ్ర శిక్ష ప్లానింగ్ కోఆర్డినేటర్ సీహెచ్ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.


'రాష్ట్రాన్ని దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 6.50

సంపుటి: 16
సంచిక: 96

గురువారం 21-12-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



సమష్టిగా రాణిస్తేనే...

నేడు దక్షిణాఫ్రికాతో జరిగే మూడో మ్యాచ్‌లో బరిలోకి భారత్ - స్పోర్ట్స్‌లో

ఆ షేర్లు తిరిగివ్వాలి..

లేదా పరిహారం చెల్లించాలి.. కార్వీ కేసులో బ్యాంకింగ్‌కు శాట్ శుభవార్త - బిజినెస్‌లో



ఢిల్లీ నుంచి అయోధ్యకు విమానం

అయోధ్యలో రామ మందిరం ప్రారంభం కానుండటంతో ఢిల్లీ-అయోధ్యకు విమాన సర్వీసులను ఎయిర్ ఇండియా నడపనుంది.


వివరాలు 6లో ▸



ప్రతిపక్షాల తీరు బాధాకరం

రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ పట్ల విపక్ష సభ్యులు ప్రవర్తించిన తీరు బాధాకరమని ప్రధాని మోదీ విచారం వ్యక్తం చేశారు.

వివరాలు 6లో ▸



మరో ఇద్దరి సస్పెన్షన్

భద్రతా వైఫల్యంపై ప్లకార్డులు ప్రదర్శించడంతో లోక్‌సభలో ఇద్దరు విపక్ష ఎంపీలపై సస్పెన్షన్ వేటు పడింది.

వివరాలు 6లో ▸



ట్రంప్‌కు షాక్

2024లో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో పోటీ పడేందుకు ట్రంప్ అనర్హుడంటూ అమెరికాలోని కొలరాడో రాష్ట్ర సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

ప్రభుత్వ విద్యార్థులకు.. నేడు ట్యాబ్స్ పంపిణీ



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ఎనిమిదో తరగతి విద్యార్థులకు వరుసగా రెండో ఏడాది కూడా రాష్ట్ర ప్రభుత్వం ట్యాబ్స్ పంపిణీ చేయనుంది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి నుంచి సీఎం జగన్ ఈ పంపిణీని ప్రారంభించనున్నారు.

వివరాలు IVలో ▸

దళితులపై కేసుల ఉపసంహరణ



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలో దళితుల పట్ల తన సానుకూల విధానాన్ని మరోసారి సుస్పష్టం చేసింది. రాష్ట్రంలో ఆందోళనల సందర్భంగా మాల, మాదిగ సామాజిక వర్గాలకు చెందిన వారిపై నమోదు చేసిన కేసులను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకుంది.

వివరాలు IVలో ▸

బాబు ముందస్తు బెయిల్‌పై ముగిసిన వాదనలు



ఉచిత ఇసుక విధానంలో సీఐడీ నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ టీడీపీ అధినేత చంద్రబాబు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. తీర్పును కోర్టు రిజర్వ్‌లో ఉంచింది.

వివరాలు 2లో ▸


మూడు క్రిమినల్ బిల్లులకు లోక్‌సభ ఆమోదం



క్రిమినల్ చట్టాల స్థానంలో కేంద్రం తీసుకొస్తున్న 3 కీలక బిల్లులను లోక్‌సభలో బుధవారం ఆమోదించారు. భారతీయ న్యాయ (రెండో) సంహిత బిల్లు, భారతీయ నాగరిక్ సురక్షా(రెండో) సంహిత బిల్లు, భారతీయ సాక్ష్య(రెండో) బిల్లును కేంద్ర హోం మంత్రి ఇటీవల సభలో ప్రవేశపెట్టారు.

వివరాలు 6లో ▸

ఇదండీ జగత్



రాష్ట్రం సంగతి దేవుడెరుగు! మనకు భవిష్యత్తు ఉంటుందంటారా?

ఆరోగ్యానికి ఆట బాట

రెండు ప్రధాన లక్ష్యాలతో బెంచ్‌మార్క్‌లా 'ఆడుదాం ఆంధ్ర'

గ్రామీణుల్లో ఆరోగ్యకర జీవనానికి వ్యాయామం, క్రీడల వైపు ప్రోత్సాహం

- మట్టిలో మాణిక్యాలను జాతీయ, అంతర్జాతీయ వేదికలపై నిలబెట్టడమే లక్ష్యం
- 26 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 47 రోజుల పాటు క్రీడా సందడి
- వలంటీర్లు ఇంటింటా అవగాహన కల్పించాలి.. సచివాలయాల్లో పోస్టర్లు
- 15 వేల సచివాలయాల్లో పోటీలకు సన్నద్ధం.. ప్రత్యేక ఎస్‌వోపీలు
- ఇప్పటికే 1.23 కోట్ల రిజిస్ట్రేషన్లతో 34.19 లక్షల మంది క్రీడాకారుల నమోదు
- 5 క్రీడాంశాల్లోనూ ప్రొఫెషనల్స్‌ను గుర్తించేలా కార్యాచరణ
- సీఎస్‌కే, ఏసీఏ, ప్రైమ్ వాలీబాల్, ప్రో కబడ్డీ, అంతర్జాతీయ క్రీడాకారుల భాగస్వామ్యం
- ప్రతి దశలోనూ తొలి మూడు స్థానాలకు నగదు బహుమతులు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో మంత్రి ఆర్కే రోజా, అంతర్జాతీయ క్రీడాకారులు అంబటి రాయుడు, పీవీ సింధు, సాకేత్ మైనేని, వి.జ్యోతి సురేఖ, ఎస్‌కె జఫ్రీన్

సాక్షి, అమరావతి: క్రీడా రంగంలో 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాన్ని బెంచ్ మార్క్‌లా ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. దీనిద్వారా గ్రామాల్లో ఆరోగ్యకర జీవనాన్ని పెంపొందించడంలో భాగంగా వ్యాయామం, క్రీడలను ప్రోత్సహించడం ఒక ప్రధాన కారణమైతే.. మట్టిలోని మాణిక్యాల ప్రతిభను వెలికితీసి ప్రపంచ వేదికలపై నిలబెట్టే మహోన్నత ఉద్దేశంతో ఐదు రకాల క్రీడలను ప్రమోట్ చేస్తున్నామన్నారు. ఈ రెండు ప్రధానాంశాలే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మెగా క్రీడాటోర్నీకి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఏటా డిసెంబరులో 'ఆడుదాం ఆంధ్ర'ను నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఈనెల 26వ తేదీ నుంచి ఫిబ్రవరి 10 వరకు 47 రోజుల పాటు పండుగ వాతావరణంలో క్రీడా పోటీలు చేపట్టాలని నిర్దేశించారు. 15 వేల గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రకు అన్ని రకాలుగా సన్నద్ధమవ్వాలని సూచించారు. ఈమేరకు సచివాలయం, మండలం, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు

మిగతా 12వ పేజీలో ▶



సాత్విక్



అజయ్



ఇషా సింగ్

జాతీయ క్రీడా పురస్కారాల్లో తెలుగు వెలుగులు

సాత్విక్ సాయిరాజ్‌కు 'ఖేల్ రత్న'

అజయ్, హుసాముద్దీన్, ఇషా సింగ్‌లకు 'అర్జున'

IV లో



హుసాముద్దీన్

అంతర్జాతీయస్థాయిలో విశేష ప్రతిభ కనబరుస్తున్న భారత క్రీడాకారులకు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ బుధవారం జాతీయ క్రీడా పురస్కారాలను ప్రకటించింది. ఈ అవార్డుల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన నలుగురు క్రీడాకారులు సాత్విక్ సాయిరాజ్ (ఏపీ; బ్యాడ్మింటన్), అజయ్ కుమార్ రెడ్డి (ఏపీ; అంధుల క్రికెట్), హుసాముద్దీన్ (తెలంగాణ; బాక్సింగ్), ఇషా సింగ్ (తెలంగాణ; షూటింగ్) ఉన్నారు. దేశ అత్యున్నత క్రీడా పురస్కారమైన 'ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న' భారత బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్స్ రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి (మహారాష్ట్ర)లకు లభించింది. అజయ్, హుసాముద్దీన్, ఇషా సింగ్ 'అర్జున' అవార్డులు పొందారు. జనవరి 9న రాష్ట్రపతి భవన్‌లో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విజేతలకు ఈ అవార్డులు అందజేస్తారు. బ్యాడ్మింటన్‌లో సాత్విక్, చిరాగ్ గత ఐదేళ్లుగా నిలకడగా రాణిస్తున్నారు. ఈ ఏడాది మాత్రం వీరు అద్భుతమైన ఫామ్‌లో ఉన్నారు.

పతంజలి శాస్త్రికి సాహిత్య అకాడమీ పురస్కారం

'రామేశ్వరం కాకులు' కథా సంపుటికి ప్రకటన

న్యూఢిల్లీలో 24 భాషలలో అవార్డులు ప్రకటించిన అకాడమీ

కథ, నవల, పర్యావరణ రంగాల్లో పతంజలి శాస్త్రి విశిష్ట కృషి



సాక్షి, హైదరాబాద్/పిఠాపురం: సుప్రసిద్ధ తెలుగు రచయిత తల్లావఝుల పతంజలి శాస్త్రికి 2023 సంవత్సరానికిగాను సాహిత్య అకాడమీ పురస్కారం దక్కింది. ఆయన రాసిన 'రామేశ్వరం కాకులు' కథా సంపుటికి ఈ పురస్కారం ప్రకటించారు. బేతవోలు రామబ్రహ్మం, పాపినేని శివశంకర్, దార్ల వెంకటేశ్వరరావు జ్యూరీగా వ్యవహరించారు. బుధవారం న్యూఢిల్లీలో జరిగిన పత్రికా సమావేశంలో 24 భారతీయ భాషల పురస్కార గ్రహీతలను ప్రకటించారు. ఈసారి కేవలం 5 భాషల్లో కథా సంపుటాలు అవార్డులు గెలుచుకోగా వాటిలో ఒకటి తెలుగు సంపుటి కావడం గమనార్హం. ఎక్కువ భాషల్లో కవిత్వానికే అకాడమీ పురస్కారం మొగ్గు చూపింది.

పిఠాపురంలో జననం..
రాజమహేంద్రవరంలో చిరకాలంగా జీవనం

1945 మే 14న పిఠాపురంలో జన్మించిన తల్లావఝుల పతంజలి శాస్త్రి బాల్యం, కాలేజీ జీవితం అంతా ఒంగోలులోనే గడిచింది. తల్లి మహాలక్ష్మి, తండ్రి కృత్తివాస తీర్థులు. పతంజలి శాస్త్రి ఇరువైపుల తాతగార్లు తల్లావఝుల శివశంకర శాస్త్రి, మొక్కపాటి నరసింహశాస్త్రి సాహిత్య రంగంలో లబ్ధ ప్రతిష్టులు. ఎస్.వి.యూనివర్సిటీలో ఎం.ఏ చేసిన పతంజలి శాస్త్రి పూణె నుంచి ఆర్కియాలజీలో పీహెచ్‌డీ చేశారు. అమలాపురం కాలేజీలో హిస్టరీ లెక్చరర్‌గా పని చేసి..

మిగతా IVవ పేజీలో ▶

మార్చేద్దాం మన రాతలు

అప్పుల అగత్యం లేకుండా 'జగనన్న విదేశీ విద్యా దీవెన'

- పేద విద్యార్థులకు తోడుగా జగనన్న ఉన్నాడనే భరోసా..
- విద్యార్థుల్లో స్ఫూర్తి రగిల్చేలా పథకం అమలు.. కెరీర్‌లో గొప్పగా ఎదిగాక మేలు చేసిన ప్రభుత్వాన్ని గుర్తుంచుకోవాలి
- మీరు సీఈవోలుగా మంచి పేరు సాధించాక ఏపీకి మంచి చేయాలి
- మన పిల్లలకు మీరంతా మంచి చేయాలన్నదే నా తాపత్రయం



- విదేశీ విద్యా దీవెన, సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక సాయం విడుదలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

6 లో

నిస్సహాయుల పట్ల కరుణ చూపాలి

- ఆకాశమంత సహనం ఉండాలి
- అప్పుడే దేవుడికి నచ్చిన బిడ్డలుగా ఉంటాం
- రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సెమీక్రిస్మస్ వేడుకల్లో సీఎం వైఎస్ జగన్
- కేక్ కట్‌చేసి తెలుగు రాష్ట్రాల ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి
- పలు రంగాల్లో విశేషసేవలు చేస్తున్నవారికి అవార్డులు అందించిన సీఎం జగన్

IV లో

రాష్ట్ర విద్యుత్ రంగంలో మరో మైలురాయి

ఎన్‌టీటీపీఎస్‌లో 8వ యూనిట్ ప్రారంభం.. 800 మె.వా వాణిజ్య ఉత్పత్తికి శ్రీకారం

సీవోడీపై ఏపీజెన్‌కో, డిస్కంలు, ట్రాన్స్‌కో, ఏపీపీసీసీ ప్రతినిధుల సంతకాలు

రాష్ట్ర గ్రిడ్ డిమాండ్‌లో 55 నుంచి 60 శాతం ఇచ్చేస్థాయికి జెన్‌కో

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉత్పాదన సంస్థ (ఏపీజెన్‌కో) మరో మైలురాయిని అధిగమించింది. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని డాక్టర్ ఎన్‌టీటీపీఎస్‌లోని 8వ యూనిట్ వాణిజ్య ఉత్పత్తికి విజయవంతంగా శ్రీకారం చుట్టింది. కొత్తగా నిర్మించిన 800 మెగావాట్ల ఎనిమిదో యూనిట్ 72 గంటలపాటు నిర్విరామంగా వందశాతానికిపైగా సామర్థ్యంతో పనిచేయడంతో.. బుధవారం ఉదయం 10.45 గంటలకు విద్యుత్ వాణిజ్య ఉత్పత్తి (కమర్షియల్ ఆపరేషన్ డేట్- సీవోడీ) ప్రారంభమైంది. ఏపీజెన్‌కో ఎండీ , ఏపీ ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.ఎన్. చక్రధర్‌బాబు సమక్షంలో సంస్థ డైరెక్టర్లు, ఉన్నతాధికారులు, సిబ్బంది హర్షధ్వానాల మధ్య

మిగతా 2వ పేజీలో ▶



యువగళం విజయోత్సవ సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు



హైకమాండ్‌కు కట్టుబడి ఉండాల్సిందే

- టీడీపీ–జనసేన కార్యకర్తలకు స్పష్టం చేసిన చంద్రబాబు
- ఉద్యోగులు ప్రభుత్వానికి సరెండరయ్యారు
- యువగళం విజయోత్సవ సభలో చంద్రబాబు
- మార్పు కోసమే పొత్తు: పవన్
- పాదయాత్ర సమయంలో మరణించిన తారకరత్నను కనీసం స్మరించని బాబు, చినబాబు

12 లో

సాంకేతికత.. డిజిటల్ బాట

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ట్యాబ్‌లు

సాంకేతిక విద్యవైపు మార్గనిర్దేశనం

ఇప్పటికే డిజిటల్ తరగతుల నిర్వహణ

సీఎం జగన్ పుట్టినరోజు కానుకగా అందజేత

ఉమ్మడి జిల్లాలో 31,200 ట్యాబ్‌ల పంపిణీ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగానికి పెద్దపీట వేస్తూ పేద విద్యార్థుల ఉన్నత చదువులే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక చర్యలు చేపట్టారు. ఇప్పటికే మనబడి-నాడు నేడు కార్యక్రమంలో కార్పొరేట్‌కు దీటుగా సర్కారీ బడులను తీర్చిదిద్దుతున్నారు. అలాగే అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, జగనన్న గోరుముద్ద వంటి పథకాలతో ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తున్నారు. దీంతోపాటు పేద పిల్లలకు సాంకేతిక విద్యను చేరువ చేసేలా గతేడాది నుంచి 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసి బైజూస్ కంటెంట్‌తో పాఠాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. అలాగే డిజిటల్ తరగతులను నిర్వహిస్తోంది. స్మార్ట్ టీవీ, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ ద్వారా బోధన, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, వర్చువల్ క్లాస్ రూమ్‌లు, పెర్‌ఫెక్టివ్ అడాప్టివ్ లెర్నింగ్ ట్యాబ్‌లు ఇలా ఒక్కొక్కటిగా సాంకేతికతను చొప్పిస్తూ ప్రభుత్వ విద్యను శిఖరాలకు తీసుకువెళుతోంది. దీంతో విద్యార్థుల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపడుతున్నాయి.

గతేడాది నుంచి..

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీకి గతేడాది శ్రీకారం చుట్టిన ప్రభుత్వం రెండో ఏడాది కూడా అందించాలని నిర్ణయించింది. ఏలూరు జిల్లాలో 398 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 17,410 మందిని ఈ ఏడాది అర్హులుగా గుర్తించారు. గతేడాది 18,370 మంది విద్యార్థులకు, 2,613 మంది ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. అలాగే పశ్చిమగోదావరి జిల్లాలో 276 పాఠశాలల్లో 13,790 మంది విద్యార్థులకు ఈ ఏడాది ట్యాబ్‌లు అందించనున్నారు. గతేడాది 14,353 మంది విద్యార్థులకు, 2373 మంది ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు అందజేశారు. గతేడాది ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులు ఈ ఏడాదితో పాటు వచ్చే ఏడాది (10వ తరగతి పూర్తి చేసే) వరకూ ట్యాబ్‌లు వారి వద్దనే ఉంచుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది.

సామర్థ్యం పెంచి..

విద్యార్థుల అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని ట్యాబ్‌ల సామర్థ్యాన్ని పెంచారు. 8.7 అంగుళాల స్క్రీన్, 4 జీబీ ర్యామ్, 64 జీబీ రోమ్, 256 జీబీ ఎస్డీ కార్డు సామర్థ్యం గల ట్యాబ్‌లు అందించనున్నారు. ట్యాబ్‌ల కోసం గతేడాది ప్రభుత్వం రూ.101.64 కోట్లు వెచ్చించగా ఈ ఏడాది రూ.99.84 కోట్లు ఖర్చు చేసింది. అలాగే ట్యాబ్‌ల పర్యవేక్షణకు ప్రభుత్వం పర్యవేక్షక బృందాన్ని నియమించింది. మండలానికి ఇద్దరు ఉపాధ్యాయులకు ట్యాబ్ సాఫ్ట్‌వేర్ సమస్యలపై జిల్లా నోడల్ పర్సన్‌తో శిక్షణ ఇప్పించింది. విద్యార్థి అభ్యసనకు సంబంధించి వైఫై మేనేజర్, బైజూస్ కంటెంట్, డిక్షనరీ మాత్రమే ట్యాబ్‌లో అందుబాటులో ఉండేలా సాఫ్ట్‌వేర్‌లను ఇన్‌స్టాల్ చేస్తారు. ఇతర ఎటువంటి యాప్‌లను డౌన్‌లోడ్ చేసినా, ఇన్‌స్టాల్ చేసినా సంబంధిత ఉపాధ్యాయుడికి ఓటీపీ వచ్చేలా ట్యాబ్‌ల రూపకల్పన జరిగింది.

విద్యుత్ భద్రత అందరి బాధ్యత

ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డుల వేడుకలో ఏపీ జెన్ కో ఎండీ చక్రధర్ బాబు



మాట్లాడుతున్న ఏపీ జెన్ కో ఎండీ చక్రధర్ బాబు

సాక్షి, అమరావతి: రాష్ట్ర విద్యుత్ రంగాన్ని బలోపేతం చేయడానికి, భవిష్యత్ తరాలకు మెరుగైన విద్యుత్‌ను అందించడానికి ఇంధన భద్రతను అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఏపీజెన్‌కో ఎండీ, ఏపీట్రాన్స్‌కో జేఎండీ కేవీఎస్ చక్రధర్ బాబు అన్నారు. ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ (ఏపీఎస్ఈసీఎం) ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాతీయ ఇంధన పరిరక్షణ వారోత్సవాలు–2023 వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ నెల 14–20 వరకు జాతీయ ఇంధన సంరక్షణ వారోత్సవాల్లో రాష్ట్రంలో ఇంధన పొదుపు, ఇంధన సామర్థ్యంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఏపీఎస్ఈసీఎం రాష్ట్ర ఇంధన సంరక్షణ అవార్డులతో సత్కరించింది. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, ఇంధన పొదుపుపై షార్ట్ వీడియో పోటీలో విజేతలైన విద్యార్థులకు అవార్డులను చక్రధర్ బాబు అందజేశారు. ఇంధన సామర్థ్యంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు రాష్ట్ర ఇంధన పరిరక్షణ(సెకా)–2023 అవార్డులను ఏపీట్రాన్స్‌కో విజిలెన్స్, సెక్యూరిటీ జేఎండీ బి.మల్లారెడ్డి, మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ జె.పద్మాజనార్దనరెడ్డి అందించారు. గుంటూరు, విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, విశాఖ, డీఆర్ఎం ఆఫీస్, గుంతకల్, సౌత్ సెంట్రల్ రైల్వే, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్, అజినోమోటో బయో ఫార్మా సర్వీసెస్, విశాఖ, సింహాద్రి సూపర్ థర్మల్ పవర్ స్టేషన్, శ్రీ జయ జో పర్వాడా ద్వారా వెల్‌కమ్ హోటల్, బనగానపల్లిలోని సిమెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ బంగారు అవార్డులు గెలుచుకున్నాయి. నోవాటెల్ వరుణ్ బీచ్ విశాఖ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఏపీ, తాడేపల్లిగూడెం, రైల్ వికాస్ భవన్ కార్యాలయం, సౌత్ సెంట్రల్ రైల్వే డీఆర్ఎం కార్యాలయం, గుంటూరు, తెనాలి మునిసిపాలిటీ, అరబిందో ఫార్మా లిమిటెడ్, యూనిట్–15, విశాఖపట్నం, డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్, విజయవాడ, కేసీపీ లిమిటెడ్ సిమెంట్ ఉత్పత్తి యూనిట్–2, జగ్గయ్యపేట, ఎన్టీఆర్ జిల్లా రజత విభాగంలో అవార్డులను గెలుచుకున్నాయి. ఏపీఎస్ఈసీఎం సీఈవో బీఏవీపీ కుమార రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పప్పు లోకేశ్ వ్యాఖ్యలు విడ్డూరం

1,179వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: యువగళం సభలో అమరావతిపై పప్పు లోకేశ్ చేసిన వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,179వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. అమరావతి పేరుతో నిలువు దోపిడీ చేసిన చంద్రబాబు మళ్లీ అదే తీరులో దుష్ట రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. ఏపీలో కానీ, 29 గ్రామాల్లో కానీ కనీసం సొంతిల్లు నిర్మించుకోని బాబు, ఇప్పుడు అమరావతిపై కపటప్రేమ ప్రదర్శిస్తున్నాడని విమర్శించారు. కులం, మతం పిచ్చిలో రైతులు, 29 గ్రామాల ప్రజల పొట్టగొట్టిన బాబును న్యాయస్థానాలు విచారిస్తే బండారం బట్టబయలవుతుందన్నారు. యువగళం పాదయాత్ర ప్రజల కోసం కాదని, కేవలం లోకేశ్ ప్రాక్టీస్ యాత్రగా మిగిలిపోతుందని, అసమర్థుడైన లోకేశ్‌ను ప్రజల్లో తిప్పితే వీసమంత ప్రయోజనం ఉండదని ఎద్దేవా చేశారు. ఎవరెన్ని కుటిల యత్నాలు చేసినా రాష్ట్రంలో మళ్లీ విజయం సాధించేది వైఎస్సార్‌సీపీనే అని స్పష్టం చేశారు. నాయకులు ఈపూరి ఆదాం, పులి దాసు, మాదిగాని గురునాథం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులకు అండగా నిలిచింది జగనే


- చంద్రబాబు ఎగ్గొట్టిన బకాయిలను జగన్ ప్రభుత్వమే చెల్లించింది
- యూనిట్ విద్యుత్ రూపాయిన్నరకే ఇస్తున్న ఘనత ఈ సర్కారుదే
- నాలుగున్నరేళ్లలో రూ.3,496 కోట్లకు విద్యుత్ సబ్సిడీ ఇచ్చింది
- రామోజీరావు పచ్చపైత్యంతో విషప్రచారం తగదు
- అప్సడా కో–వైస్ చైర్మన్ రఘురామ్



సాక్షి, అమరావతి: చంద్రబాబు హయాంలో చితికిపోయిన ఆక్వారంగాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుందని ఏపీ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) కో–వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ తెలిపారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఈనాడు రామోజీరావు తన పచ్చపైత్యంతో ప్రభుత్వంపైన, సీఎం వైఎస్ జగన్‌పైన విషప్రచారం చేయడం తగదని హితవు పలికారు. ఆయన బుధవారం విజయవాడలో విడుదల చేసిన ఒక ప్రకటనలో ఈనాడులో వచ్చిన కథనంలో చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఆక్వా జోన్ విధానం తెచ్చింది చంద్రబాబు హయాంలోనే అనే విషయం ఈనాడు రామోజీకి తెలియకపోవడం విడ్డూరమని పేర్కొన్నారు. 2018లో ప్రారంభించిన ఆక్వా జోన్ విధానాన్ని చంద్రబాబు మధ్యలో గాలికొదిలేస్తే.. వైఎస్ జగన్ సీఎం అయ్యాక సర్వే ద్వారా జోన్, నాన్ జోన్ పరిధిని నిర్ధారించారని తెలిపారు. రాష్ట్రంలో ఆక్వా చెరువులకు ఉన్న 63 వేల విద్యుత్ కనెక్షన్లలో 50,800 కనెక్షన్లకు విద్యుత్ సబ్సిడీ ఇస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ఎన్నికలకు ఆరునెలల ముందు యూనిట్ విద్యుత్ రూ.2కే ఇస్తానని ఆక్వా రైతులకు నమ్మబలికి, డిస్కంలకు చెల్లించాల్సిన సబ్సిడీ ఎగ్గొట్టిన చరిత్ర చంద్రబాబుది కాదా అని ప్రశ్నించారు. చంద్రబాబు ఎగ్గొట్టిన రూ.309.95 కోట్ల విద్యుత్ సబ్సిడీ బకాయిలు చెల్లించడంతోపాటు రైతుల తరఫున డిస్కంలకు ఏటా క్రమం తప్పకుండా విద్యుత్ సబ్సిడీ మొత్తాన్ని ఈ ప్రభుత్వం జమచేస్తోందని తెలిపారు. ఇలా ఇప్పటివరకు రూ.3,496 కోట్లకుపైగా ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ రూపంలో ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు. అప్సడా చట్టం ద్వారా ఆక్వారంగ కార్యకలాపాలన్నింటిని చట్టపరిధిలోకి తీసుకురావడమే గాక సీడ్, ఫీడ్ చట్టాలను తీసుకొచ్చి రైతులకు రక్షణగా నిలిచిందని పేర్కొన్నారు. మూడుసార్లు పెంచిన ఫీడ్ ధరలను వెనక్కి తీసుకునేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. చివరకు మందుల ధరలను సైతం నియంత్రణలో ఉంచినట్లు తెలిపారు. అప్సడా ద్వారా ఎగుమతిదారులు, ప్రాసెసింగ్ కంపెనీలు, రొయ్యల రైతులతో సమావేశాలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు రొయ్యల ధరలను క్రమబద్ధీకరిస్తూ రైతులకు గిట్టుబాటు ధర దక్కేలా చేస్తున్నట్లు తెలిపారు. కరోనా విపత్తు వేళ రొయ్యల రవాణాకు అడ్డంకి లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవడమే గాక ఒక్క రైతు కూడా నష్టపోకుండా అండగా నిలిచిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. రొయ్యలధరలు పతనమైనప్పుడు వాళ్ల పాపాన వాళ్లు పోతారని వదిలేశారే తప్ప ఏనాడైనా ఒక్క రైతుకు అండగా నిలిచిన దాఖలాలు చంద్రబాబు హయాంలో లేవని ఆయన గుర్తుచేశారు.

బాబు ముందస్తు బెయిల్‌పై ముగిసిన వాదనలు

తీర్పు వాయిదా



సాక్షి, అమరావతి: ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలకు నేరస్వభావాన్ని ఆపాదించడానికి వీల్లేదని చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ అగర్వాల్ హైకోర్టుకు నివేదించారు. ఉచిత ఇసుక విధానంలో తప్పులు జరిగి ఉంటే కేసు నమోదుకు మూడేళ్లు ఎందుకు ఆగారని ప్రశ్నించారు. ఇన్నేళ్ల తరువాత కేసు ఎందుకు నమోదు చేశారన్న దానికి కారణాలు చెప్పడం లేదన్నారు. ఇసుక విధానం ద్వారా చంద్రబాబుకు లబ్ధి చేకూరినట్లు సీఐడీ ఎలాంటి ఆధారాలను చూపలేదని చెప్పారు. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు విధానపరమైన నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. అందువల్ల అవినీతి నిరోధక చట్టం కింద చంద్రబాబును ప్రాసిక్యూట్ చేయాలంటే సెక్షన్ 17(ఏ) కింద గవర్నర్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పిటిషనర్ చంద్రబాబు వయసు, అనారోగ్య సమస్యలను పరిగణనలోకి తీసుకుని ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. ఇరుపక్షాల వాదనలను పూర్తిచేయడంతో హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జునరావు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఉచిత ఇసుక పథకం పేరుతో కోట్ల రూపాయల మేర ఖజానాకు నష్టం కలిగించినందుకు సీఐడీ పలువురిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ చంద్రబాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. బుధవారం జస్టిస్ మల్లికార్జునరావు మరోసారి విచారించారు.

వ్యవసాయ విద్యుత్‌లో ఏపీ ముందంజ

- వ్యవసాయానికి పగలే 9 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌కు భరోసా
- ఇంధనశాఖ అధికారులతో సమీక్షలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సాక్షి, అమరావతి: రైతులకు వ్యవసాయం కోసం ఉచిత విద్యుత్‌ను అందించడంలో మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉందని రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పారు. పగటిపూట తొమ్మిదిగంటలపాటు ఉచితంగా నాణ్యమైన విద్యుత్‌ను అందించడం ద్వారా ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందన్నారు. ఆయన బుధవారం సచివాలయంలో ఇంధనశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పాలనలో ఇంధనశాఖను బలోపేతం చేశామన్నారు. ఈ ఏడాది 1,600 మెగావాట్ల అదనపు విద్యుత్ ఉత్పత్తి అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. పీక్ లోడ్ అవసరాల కోసం పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుల ద్వారా అదనపు విద్యుత్ ఉత్పత్తికి కృషిచేస్తున్నామన్నారు. ఇవి వినియోగంలోకి వస్తే రాష్ట్ర అవసరాలు తీరడంతోపాటు విద్యుత్‌ను విక్రయించే స్థాయికి వెళతామని తెలిపారు. వ్యవసాయానికి పగటిపూట తొమ్మిదిగంటలు నాణ్యమైన విద్యుత్ అందించాలన్న సీఎం జగన్ సంకల్పంలో భాగంగా 7,200 మెగావాట్ల విద్యుత్‌ను.. యూనిట్ రూ.2.49 ధరకు సెకీ నుంచి కొనుగోలు చేసి సరఫరా చేయనున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాది నుంచి పోలవరంలో ఒక యూనిట్ ద్వారా హైడల్ విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. జగనన్న కాలనీల విద్యుద్దీకరణ, వ్యవసాయ కనెక్షన్ దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఫిబ్రవరి నాటికి వ్యవసాయ విద్యుత్ దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా కనెక్షన్లు ఇవ్వాలని చెప్పారు. మెరుగైన విద్యుత్ సరఫరా కోసం స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపైన కూడా రైతుల్లో సానుకూలత వ్యక్తమవుతోందని తెలిపారు. దీన్ని రాజకీయం చేయాలని ప్రతిపక్షాలు చూస్తున్నా, రైతులు మాత్రం వాస్తవాలను గ్రహించి అర్థం చేసుకుంటున్నారని చెప్పారు. కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం రెండునెలల్లో పూర్తిచేయాలని సూచించారు. వినియోగదారులకు సేవలను గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో జెన్‌కో ఎండీ, ట్రాన్స్ కో జేఎండీ కె.వి.ఎస్.చక్రధర్ బాబు, డిస్కంల సీఎండీలు ఐ.పృథ్వీతేజ్, కె.సంతోష్‌రావు, జె.పద్మాజనార్దన్‌రెడ్డి, ఇంధనశాఖ సంయుక్త కార్యదర్శి బి.ఎ.వి.పి.కుమార్‌రెడ్డి, ట్రాన్స్‌కో, జెన్‌కో డైరెక్టర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర విద్యుత్ రంగంలో మరో మైలురాయి

▶ మొదటి పేజీ తరువాయి

ఏపీజెన్‌కో, ఏపీట్రాన్స్‌కో, ఏపీపీసీసీ, ఏపీ డిస్కంల ప్రతినిధులు బుధవారం ఉదయం సీవోడీ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఉత్పత్తి సామర్థ్యాన్ని 1,760 నుంచి 2,560 మెగావాట్లకు పెంచుకుని ఏపీజెన్‌కోలో డాక్టర్ ఎన్టీటీపీఎస్ అతి పెద్ద ఉత్పత్తి కేంద్రంగా ఆవిర్భవించింది. డాక్టర్ ఎన్టీటీపీఎస్‌లో స్టేజ్–5 కింద 800 మెగావాట్ల సామర్థ్యంతో సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో నిర్మించిన ఎనిమిదో యూనిట్ కోవిడ్ లాంటి కష్టకాలాన్ని, అనేక సవాళ్లను అధిగమించి వాణిజ్య ఉత్పత్తి సాధించింది. ఈ సందర్భంగా సంస్థ ఎండీ కేక్ కట్‌చేసి, కొత్త యూనిట్ నిర్మాణంలో భాగస్వాములై సేవలందించిన పలువురిని జ్ఞాపికలతో సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నిరకాలుగా సంపూర్ణ సహాయ సహకారాలు అందించడంవల్లే ఎనిమిదో యూనిట్ నిర్మాణపనులు పూర్తిచేసి సీవోడీ చేసుకోగలిగామని ఏపీజెన్‌కో ఎండీ చక్రధర్‌బాబు చెప్పారు. సీఎం వైఎస్ జగన్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రోత్సహించడంవల్లే ఇది సాధ్యమైందన్నారు. ఈ రంగంలో సుదీర్ఘ అనుభవం ఉన్న ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అడుగడుగునా మార్గదర్శకం చేశారన్నారు. ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి అందించిన సహకారానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఏపీజెన్‌కో ఉద్యోగులు, భాగస్వామ్య సంస్థలైన బీహెచ్ఈఎల్, బీజీఆర్, ఆర్ఈసీ ప్రతినిధులకు కృతజ్ఞతలు చెప్పారు.

8,789 మెగావాట్లకు పెరిగిన జెన్‌కో సామర్థ్యం

డాక్టర్ ఎన్టీటీపీఎస్‌లో 800 మెగావాట్ల ఎనిమిదో యూనిట్ సీవోడీతో జెన్‌కో థర్మల్ విద్యుత్ ఉత్పాదన సామర్థ్యం 6,610 మెగావాట్లకు పెరిగింది. జెన్‌కో మొత్తం ఉత్పాదన సామర్థ్యం 8,789 మెగావాట్లకు పెరిగింది. ప్రస్తుతం జెన్‌కోకి 6,610 మెగావాట్ల థర్మల్, 1,773.600 మెగావాట్ల హైడల్, 405.426 మెగావాట్ల సోలార్ (మొత్తం 8,789.026 మెగావాట్లు) విద్యుదుత్పాదన సామర్థ్యం ఉంది. మొత్తం రాష్ట్ర గ్రిడ్ డిమాండ్‌లో 55 నుంచి 60 శాతం విద్యుత్ అందించే సామర్థ్యం ఏపీ జెన్‌కోకు వచ్చింది.

రైరైమంటూ రేషన్..



- వృద్ధులకు రేషన్ మోసే భారం నుంచి సాంత్వన
- ఆహారభద్రత అమలులో కీలక ముందడుగు
- 90 శాతానికిపైగా పెరిగిన రేషన్ వినియోగం
- పేదల కడుపు నింపుతున్న సార్టెక్స్ బియ్యం పంపిణీ
- సొంత ఊళ్లోనే 9,260 మంది యువతకు జీవనోపాధి కల్పన
- హాస్టళ్లు, అంగన్‌వాడీలకు నిత్యావసరాల సరఫరా ద్వారా అదనపు ఆర్జన
- 17 వేలమందికిపైగా నిరుద్యోగులకు ఉపాధి

దేశానికే ఆదర్శంగా ఏపీ రేషన్ డోర్ డెలివరీ

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. దేశంలో తొలిసారిగా 'ఇంటివద్దకే రేషన్' వ్యవస్థను ప్రవేశపెట్టి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చరిత్ర సృష్టించారు. ఇంటివద్దే రేషన్ అందించే వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఎనిమిది రాష్ట్రాలు ఈ విధానంపై ఆసక్తి చూపుతున్నాయి. వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో బాధపడేవారు, రోజువారీ కూలీలు, గిరిజనప్రాంత ప్రజలు రేషన్ సరుకులు తెచ్చుకునేందుకు పడుతున్న ఇబ్బందుల్ని ప్రతిపక్ష నేతగా ప్రజాసంకల్ప యాత్రలో స్వయంగా చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత వారి కష్టాలను తీర్చారు. రూ.530 కోట్లకుపైగా వ్యయంతో మొబైల్ వాహనాలు సమకూర్చి వాటిద్వారా రేషన్ డోర్ డెలివరీ విధానాన్ని అమలు చేస్తున్నారు. 2021 ఫిబ్రవరి ఒకటో తేదీన.. రోజుకు 90 కార్డులకు తగ్గకుండా నెలలో 18 రోజుల పాటు ఇంటింటికి రేషన్ పంపిణీ చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా 9,260 మొబైల్ వాహనాలను ప్రారంభించారు. ప్రజల సమక్షంలోనే కల్తీకి ఆస్కారం లేకుండా, కచ్చితమైన తూకంతో బియ్యాన్ని ఇంటి ముంగిట్లో అందజేస్తున్నారు. అది కూడా దేశంలో ఎక్కడా లేనివిధంగా సార్టెక్స్ చేసిన బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. రాష్ట్రంలో మొత్తం 1.45 కోట్లమంది కార్డుదారులకు నెలలో 18 రోజుల పాటు ఇంటివద్దే రేషన్ అందిస్తున్నారు. దీని ద్వారా ప్రభుత్వం అదనంగా రూ.25 కోట్ల భారం మోస్తుండగా, రేషన్ వినియోగం 90 శాతానికిపైగా పెరిగింది. ఐసీడీఎస్ (అంగన్‌వాడీలు), మధ్యాహ్న భోజన పథకం కింద పాఠశాలలకు, సంక్షేమ హాస్టళ్లకు కూడా ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ప్రభుత్వం నేరుగా రవాణా చేస్తోంది. తద్వారా ఎండీయూ ఆపరేటర్లకు అదనపు ఆదాయాన్ని కూడా సమకూరుస్తోంది.

రాష్ట్రంలో మొత్తం 1.45 కోట్లమంది కార్డుదారులకు నెలలో 18 రోజుల పాటు ఇంటివద్దే రేషన్.. వర్గాల వారీగా ఎండీయూ వాహనాల లబ్ధిదారుల సంఖ్య

వర్గం	వాహనాల లబ్ధిదారుల సంఖ్య
బీసీ	3,945
ఎస్సీ	2,411
ఈబీసీ	1,509
ఎస్టీ	701
మైనార్టీ	604
క్రిస్టియన్	90



90 శాతం రాయితీతో వాహనాలు

రేషన్ డోర్ డెలివరీ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వాహనదారుడితో పాటు హెల్పర్ల కింద 17 వేలమందికి పైగా ఉపాధి పొందుతున్నారు. 9,260 ఎండీయూల పంపిణీలో అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యం ఇస్తూ యువతకు ఉపాధి కల్పించిన ప్రభుత్వం.. ఈ వాహనాలను కూడా భారీ రాయితీతో సమకూర్చింది. వాహనం విలువ రూ.5.81 లక్షలు కాగా, ప్రభుత్వం బ్యాంకు రుణసాయంతో 90 శాతం రాయితీ ఇచ్చింది. లబ్ధిదారుడు రూ.58 వేలు చెల్లించి వాహనాన్ని తీసుకున్నారు. అలాగే ఎండీయూ ఆపరేటర్లకు వాహనమిత్ర పథకంలో భాగంగా ఏడాదికి రూ.10 వేలు ఇస్తోంది. నాణ్యమైన రేషన్ బియ్యం, లబ్ధిదారుడి ఇంటివద్దే అందించటం వంటివాటికి ఏటా ప్రభుత్వం సుమారు రూ.830 కోట్లకుపైగా వెచ్చిస్తోంది.

డ్రైవర్లకు 'వైఎస్సార్ వాహనమిత్ర' అండ

ఐదేళ్లలో రూ.1,305.89 కోట్లు సహాయం	13.01 లక్షలమంది డ్రైవర్లకు ప్రయోజనం



సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	అందిన ఆర్థికసాయం (రూ.కోట్లలో)
2019-20	2,36,343	236.34
2020-21	2,73,476	273.47
2021-22	2,54,646	254.64
2022-23	2,61,516	261.51
2023-24	2,75,931	279.93
మొత్తం	13,01,912	1,305.89

అడవిలో అభివృద్ధి విప్లవం

వైఎస్సార్‌సీపీ పాలనతో మారిన గిరిజన బతుకు చిత్రం

ఎన్నడూ లేనివిధంగా ఆదివాసీలకు సంక్షేమ ఫలాలు

గిరిజనులకు చేరువగా వైద్య సేవలు



పాడేరు మెడికల్ కళాశాల బ్లాక్ భవన నిర్మాణ పనులు

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో అడవిలో అభివృద్ధి విప్లవం వెల్లువెత్తుతోంది. ఆదివాసీలకు నవరత్నాలతో పాటు అనేక సంక్షేమ ఫలాలు అందివచ్చాయి. గిరిజనోద్ధరణకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన కృషితో వారి బతుకు చిత్రం మారింది. రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 34 తెగలకు చెందిన 27.39 లక్షల గిరిజనులున్నారు. 26 జిల్లాలకు గాను 9 సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ)ల పరిధిలో 16,068 గిరిజన ఆవాసాలున్నాయి. 2019-20 నుంచి 2023-24 వరకు ఎస్టీల కోసం రూ.19,617.85 కోట్లు ఖర్చుచేయడం గమనార్హం. ఆదివాసీలకు ఇంత భారీ స్థాయిలో ఆర్థిక ప్రయోజనం చేకూరడం రాష్ట్ర చరిత్రలోనే ఒక రికార్డు.

మన్యంలో అభివృద్ధి ఇలా..

- గిరిజన ప్రాంతాల్లో వైద్య సదుపాయాలను మెరుగుకు రూ.746.30కోట్లతో ప్రత్యేక వైద్య కళాశాల, మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణం. అల్లూరి జిల్లా పాడేరులో వంద ఎంబీబీఎస్ సీట్లతో వైద్య కళాశాలకు రూ.500కోట్లు, ఏజెన్సీలో ఐదు మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్‌కు రూ.246.30 కోట్లు కేటాయింపు.
- బాలింతలు, శిశువుల్లో రక్తహీనత నివారణకు గిరి గోరుముద్ద, బాల సంజీవని, పోషకాహార బుట్ట వంటి ప్రత్యేక వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాల అమలు.
- ఏజెన్సీలో 2,652 మంది గిరిజన కమ్యూనిటీ హెల్త్ వర్కర్(సీహెచ్‌డబ్ల్యూ)ల గౌరవ వేతనం రూ.400 నుంచి రూ.4వేలకు పెంపు.
- 2,506 గిరిజన సంక్షేమ విద్యా సంస్థల నిర్వహణ, వాటిలో చదువుతున్న 1,55,599 మంది విద్యార్థులకు ఈ ఏడాది రూ.920.31 కోట్లు కేటాయింపు.
- నాడు-నేడు మొదటి దశలో రూ.140కోట్లతో పలు గిరిజన విద్యా సంస్థల్లో సదుపాయాలు.
- రూ.153.853 కోట్లతో కురుపాంలో ఇంజినీరింగ్ కళాశాల మంజూరు. ట్రైబల్ యూనివర్సిటీకి విజయనగరం జిల్లా మెంటాడ, దత్తిరాజేరు మండలాల్లో 561.88 ఎకరాల భూమి కేటాయింపు.
- విశాఖ జిల్లా తాజంగిలో రూ.35 కోట్లతో గిరిజన సమరయోధుల మ్యూజియం నిర్మాణం.
- కాపులుప్పాడలో రూ.45 కోట్లతో అల్లూరి సీతారామరాజు స్మారక మ్యూజియం.
- విశాఖలో రూ.10కోట్లతో ట్రైబల్ రిసెర్చ్ మిషన్(టీఆర్ఎం)కు భవన నిర్మాణం పూర్తి
- అల్లూరి జిల్లా పాడేరు సమగ్ర ప్రాజెక్టుకు.526.16 కోట్లు మంజూరు. అరకు కాఫీకి ఆర్గానిక్ సర్టిఫికేషన్.. జాతీయ స్థాయిలో అవార్డులు.
- అటవీ ఫలసాయం సేకరణ, మార్కెటింగ్ ద్వారా ఈ ఏడాది ఫిబ్రవరి వరకు రూ.562.90 కోట్ల మేర జీసీసీ కార్యకలాపాలు.
- 4,76,206 గిరిజన కుటుంబాల గృహావసరాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్.
- 140 గోకులాల ఏర్పాటుతో 1400 మందికి లబ్ధి. పెరటి కోళ్ల పెంపకం కోసం రూ.28.34 కోట్లు కేటాయింపు.
- గిరిజన యువతకు స్వయం ఉపాధి కోసం రూ.44.44 కోట్లతో రేషన్ సరుకుల కోసం వాహనాల పంపిణీ. ఆర్థిక అభివృద్ధి కోసం రాష్ట్రంలో రూ.61.63కోట్లతో 415 వన్ ధన్ వికాస్ కేంద్రాలు.
- 2020 డిసెంబర్ 25న ప్రత్యేకంగా ఎస్టీ కమీషన్ ఏర్పాటుతో గిరిజనులకు మేలు.
- బాక్సైట్ తవ్వకాలకు గత ప్రభుత్వం ఇచ్చిన అనుమతి రద్దు
- రాష్ట్రంలో 2008 నుంచి 2023 వరకు 15 ఏళ్ల కాలంలో గిరిజనులకు మొత్తం 2,49,315 లక్షల పట్టాలు (4,88,822 ఎకరాలు) పంపిణీ. అందులో కేవలం ఈ నాలుగున్నరేళ్ల కాలంలోనే ఏకంగా 2,54,544 ఎకరాలకు 1,53,284 పట్టాలు పంపిణీ చేయడం రికార్డు. ఈ భూముల సాగు కోసం రూ.రూ.3796.39 కోట్లు కేటాయింపు. మూడు వేలకుపైగా బోర్లు. 2.27 లక్షల ఎకరాల్లో హార్టికల్చర్ ప్లాంటేషన్, కాఫీ, మిరియాల సాగు.

ఉజ్వలంగా విద్యుత్



సీఎం జగన్ నేతృత్వంలో విస్తరిస్తున్న పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు

పవన, సౌర, జల, ఇతర విద్యుత్ ప్రాజెక్టులు

- భవిష్యత్ తరాల కోసం రూ.9.57 లక్షల కోట్ల పెట్టుబడి ఒప్పందాలు
- 44,240 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ హైడ్రోపవర్ ప్లాంట్ల ఏర్పాటుకు రంగం సిద్ధం
- సీఎం ప్రత్యేక చొరవతో జాతీయ స్థాయి అవార్డులు, ప్రశంసలు
- ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఏపీ

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో విద్యుత్ రంగం వెలుగులీనుతోంది. దేశంలోనే నంబర్ వన్‌గా నిలుస్తోంది. ప్రస్తుత, భవిష్యత్ తరాలకు కూడా తక్కువ ఖర్చుతో విద్యుత్ అందించేలా సీఎం వైఎస్ జగన్ ప్రణాళికలు అమలు చేస్తున్నారు. ముఖ్యంగా పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించారు. విండ్, సోలార్ హైబ్రిడ్ ప్రాజెక్టులను స్థాపించడానికి పునరుత్పాదక ఇంధన ఎగుమతి విధానం 2020ని ప్రకటించారు. గత నాలుగున్నరేళ్లలో పవన, సౌర, చిన్న జల, పారిశ్రామిక వ్యర్థాలు, వేస్టు ఎనర్జీ ప్రాజెక్టులను నెలకొల్పారు. మార్చిలో జరిగిన వైజాగ్ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ప్రభుత్వం దాదాపు రూ.9.57 లక్షల కోట్ల విలువైన ఇంధన రంగ ప్రాజెక్టులకు ప్రముఖ పెట్టుబడిదారులతో 42 అవగాహన ఒప్పందాలను కుదుర్చుకుంది. వీటి ద్వారా దాదాపు 1.80 లక్షల ఉద్యోగాలను సృష్టించే అవకాశం ఉంది.

పెరిగిన సౌర విద్యుత్

సౌర విద్యుత్ ఉత్పత్తిలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ఐదో స్థానంలో నిలిచింది. 2019లో 241.50 మెగావాట్లు, 2020లో 337.02 మెగావాట్లు, 2021లో 335.375 మెగావాట్లు, 2022లో 113.685 మెగావాట్లు, 2023లో ఇప్పటివరకూ 13.8 మెగావాట్ల సౌర విద్యుత్ సామర్థ్యం పెరిగింది. గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి, ఇంధన సామర్థ్యం, థర్మల్ విద్యుత్ ఉత్పత్తి రంగాలలో దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా ఏపీని ప్రభుత్వం నిలిపింది. రాష్ట్రంలో ఇంధన పొదుపు, ఇంధన సామర్థ్య కార్యక్రమాల ద్వారా దాదాపు రూ.3,800 కోట్లు విలువైన 5,600 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఆదా అయ్యింది. తద్వారా 4.76 మిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలను తగ్గించింది.

నాలుగున్నరేళ్లలో సాధించిన విద్యుత్ రంగ ప్రగతి

- నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలోని శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ పవర్ స్టేషన్ (ఎస్‌డీఎస్‌టీపీఎస్)లో 800 మెగావాట్ల యూనిట్ ప్రారంభం
- ప్రపంచంలోనే అతిపెద్ద 5,230 మెగావాట్ల ఇంటిగ్రేటెడ్ పునరుత్పాదక శక్తి నిల్వ ప్రాజెక్ట్‌కు ఉమ్మడి కర్నూలు జిల్లా పిన్నాపురంలో శంఖుస్థాపన
- 44,240 మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజ్ హైడ్రోపవర్ ప్లాంట్ల ఏర్పాటుకు రంగం సిద్ధం
- వ్యవసాయానికి 30 ఏళ్ల పాటు 9 గంటల పగటిపూట ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు 7 వేల మెగావాట్ల సౌర విద్యుత్ కొనుగోలుకు కేంద్ర ప్రభుత్వ సంస్థ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈసీఐ) తో ప్రభుత్వం ఒప్పందం
- 8,025 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులు ఇప్పటికే ప్రైవేట్ పెట్టుబడిదారులకు కేటాయింపు. గ్రీన్‌కో గ్రూప్ ద్వారా నంద్యాల, కర్నూలు జిల్లాల్లో 2300 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. ఏఎం గ్రీన్ ఎనర్జీ (ఆర్సెలర్ మిట్టల్ గ్రూప్) 700 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టు పనులు పురోగతిలో ఉన్నాయి.
- నంద్యాల జిల్లాలో రూ.25,850 కోట్ల విలువైన మూడు పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు ఇటీవల సీఎం వైఎస్ జగన్‌చే భూమి పూజ. వీటి ద్వారా 5300 మందికి ఉద్యోగాలు రానున్నాయి. మరో 2 వేల మందికి ఎన్‌హెచ్‌పీసీతో కలిసి ఏపీజెన్‌కో నెలకొల్పనున్న పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ల వల్ల ఉపాధి లభించనుంది.
- చిన్న జల శక్తి ప్రాజెక్టులు 2021లో 3 మెగావాట్లు, 2023లో 1.20 మెగావాట్లు కొత్తగా వచ్చాయి.
- సాలిడ్ వేస్ట్ పవర్ ప్రాజెక్టులు 2021లో గుంటూరులో 15 మెగావాట్లు, 2022లో విశాఖలో 15 మెగావాట్లు సామర్థ్యంతో ప్రారంభమయ్యాయి.

అవార్డుల వెల్లువ

ఇంధన భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి రాష్ట్రానికి ప్రతిష్టాత్మక 'జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డు' లభించింది.

- ఏపీ ట్రాన్స్‌కో, నెడ్‌కాప్ ఏపీకి 3 ఎనర్షియా పురస్కారాలు
- ఏపీఎస్పీడీసీఎల్‌కు 2 జాతీయ అవార్డులు
- దేశంలోని విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)ల్లో మన రాష్ట్రంలోని తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత డిస్కంలు అత్యుత్తమమని కేంద్ర రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ ప్రశంసలు
- 'కన్స్యూమర్ సర్వీస్ రేటింగ్ ఆఫ్ డిస్కమ్స్' నివేదికలో ఏపీలోని మూడు డిస్కంలకు 'ఏ' గ్రేడ్ లభించింది. వీటన్నిటి సాధన వెనుక సీఎం జగన్ ముద్ర స్పష్టంగా ఉంది.

ఆతిథ్యంలో ఆంధ్రా అగ్రగామి



ఆతిథ్య రంగంలో రూ.8వేల కోట్ల నుంచి రూ.10వేల కోట్ల పెట్టుబడులు

- రూ.2094 కోట్ల విలువైన లగ్జరీ విల్లాలు, హోటళ్లకు మార్గం సుగమం
- సీఎం జగన్ బ్రాండ్ ఇమేజ్‌తోనే ఆతిథ్య రంగానికి 7 స్టార్ లుక్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఆతిథ్య రంగంలో అగ్రగామిగా నిలుస్తోంది. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం ఫలితంగా విస్తృతంగా లగ్జరీ విల్లాలు, స్టార్ హోటళ్ల ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతున్నాయి. సీఎం వైఎస్ జగన్ బ్రాండ్ ఇమేజ్ ఏపీలో ఆతిథ్య పర్యాటక రంగాలు పరుగులు పెట్టిస్తోంది. ప్రపంచ స్థాయి లగ్జరీ హోటల్ రంగ సంస్థలైన ఒబెరాయ్, హయత్, తాజ్ గ్రూప్‌తో పాటు దేశీయ సంస్థలైన గాట్రిసన్ కన్‌స్ట్రక్షన్, మైఫెయిర్ హోటళ్ల రాకతో రాష్ట్రం పురోగమన దిశలో పయనిస్తోంది. ఇటీవల విశాఖ వేదికగా సాగిన జీఐఎస్‌లో పర్యాటక రంగానికి పెట్టుబడులు వెల్లువెత్తాయి. మొత్తం రూ.19,345 కోట్ల పెట్టుబడులతో 117 ఎంవోయూలు కుదిరాయి. వీటి ద్వారా సుమారు 51వేల మందికి ఉపాధి లభించనుంది. ఇందులో ఇప్పటికే 50 ప్రాజెక్టులకు డీపీఆర్‌లు ఏపీటీడీసీకి రాగా.. వాటిని పరిశీలిస్తున్నారు. ఇందులో సుమారు రూ.8వేల కోట్ల నుంచి రూ.10వేల కోట్ల వరకు ఒక్క ఆతిథ్య రంగానికి చెందినవే. ఇందులో సుమారు రూ.2094 కోట్లకుపైగా పెట్టుబడులతో భారీ హోటళ్ల నిర్మాణానికి రంగం సిద్ధమైంది. ఇందుకు అనుగుణంగా విశాఖపట్నంలోని అన్నవరం, పేరూరు, గండికోట గ్రామాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు సుమారు రూ.69.37 కోట్లతో పెద్ద రహదారులను కలుపుతూ రోడ్ల నిర్మాణం, నీటి సౌకర్యాల మెరుగుదల, ప్రత్యేక విద్యుత్ లైన్లు, నాణ్యమైన విద్యుత్ సరఫరా, అత్యాధునిక మురుగు పారుదల వ్యవస్థ కల్పిస్తోంది.

విరివిగా హోటళ్లు, రిసార్టుల నిర్మాణాలు

- రాష్ట్రంలోని ఐదు ప్రదేశాల్లో రూ.1,350 కోట్ల అంచనాతో 7 స్టార్ సౌకర్యాలతో లగ్జరీ రిసార్ట్స్ నిర్మాణానికి ఒబెరాయ్ ముందుకొచ్చింది. ఇప్పటికే విశాఖ(అన్నవరం), తిరుపతి(పేరూరు), గండికోటలో నిర్మాణానికి అగ్రిమెంట్లు పూర్తయ్యాయి. ఇంకా రాజమండ్రి(పిచ్చుకలంక), హార్సిలీహిల్స్ ప్రాంతాల్లో రిసార్ట్స్, కన్వెన్షన్ సెంటర్లు అభివృద్ధి చేయనుంది. వీటి ద్వారా 10,900 మందికి ఉపాధి లభించనుంది.
- విశాఖలో మైఫెయిర్, తిరుపతిలో ఎంఆర్‌కేఆర్ (హయత్) సంస్థల ప్రాజెక్టులకు ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ స్థలాలు కేటాయించింది. తిరుపతిలోని పేరూరులో రూ. 218కోట్లతో 5స్టార్ లగ్జరీ హోటల్ నిర్మాణానికి ఎంఆర్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్స్ (హయత్ గ్రూప్) ముందుకొచ్చింది. దీని వల్ల సుమారు 1550 మందికిపైగా ఉపాధి లభించనుంది. రాష్ట్రానికి రాబోయే పాతికేళ్లలో రూ.230.08 కోట్ల ఆదాయం లభించనుంది. నోవోటెల్‌కు చెందిన వీవీపీఎల్ సంస్థ 126.48 కోట్లతో ఫైవ్‌స్టార్ హోటల్ నిర్మించనుంది. దీని ద్వారా మరో 3వేల మందికి ఉపాధి దక్కనుంది.

విశాఖలో రూ.400 కోట్లతో విల్లాలు

విశాఖపట్నానికి సమీపంలోని అన్నవరం ప్రాంతంలో పర్యాటక రంగానికి ఊతమిచ్చేలా మైఫెయిర్ సంస్థ(భువనేశ్వర్) అత్యాధునిక లగ్జరీ రిసార్ట్‌ను అభివృద్ధి చేయనుంది. ఒబెరాయ్ తరహాలోనే సుమారు 40 ఎకరాల్లో సుమారు రూ.400 కోట్ల పెట్టుబడితో 250 రిసార్టులను(ఇండిపెండెంట్ విల్లాలు) నిర్మించనుంది. దీని ద్వారా 1750 మందికి ఉపాధి లభించనుంది. దీని ద్వారా రాబోయే పాతికేళ్లలో ఏపీకి రూ.852.40 కోట్ల ఆదాయం సమకూరనుంది. ఇప్పటికే గుంటూరులో ఐటీసీ హోటళ్లను ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించారు.

- తాజ్ సంస్థ విశాఖపట్నంలో రూ.1050 కోట్లతో 60 ఎకరాల్లో లగ్జరీ రిసార్టులు నిర్మించనుంది.
- హయత్ సంస్థ విశాఖప్నటం శిల్పారామంలో రూ.200 కోట్లతో మూడు ఎకరాల్లో, తిరుపతి శిల్పారామంలో రూ.204 కోట్లతో 2.66 ఎకరాల్లో ఫైవ్‌స్టార్ హోటళ్ల నిర్మాణానికి ముందుకొచ్చింది. వీటి ద్వారా 5100 మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి. ఇప్పటికే విజయవాడలో రూ.92.61 కోట్లతో నాలుగు నక్షత్రాల హోటల్ ప్రారంభించారు.
- ఇస్కాన్ చారిటీస్ (బెంగళూరు) ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా పెనుకొండ జ్ఞానగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద రూ.100 కోట్లతో 69.75 ఎకరాల విస్తీర్ణంలో స్పిరుచ్యువల్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది.

అరకు, గండికోట అభివృద్ధి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో గండికోట ప్రాంతంలో 4336 ఎకరాల్లో పర్యాటక సిటీని అభివృద్ధి చేయనున్నారు. గండికోటలో రూ.100 కోట్లతో ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్ సిద్ధం చేస్తుండగా.. మరో రూ.100 కోట్లతో అరకు లోయలో సుందర హోటళ్లు, అడ్వెంచర్, ఎకో పర్యాటకానికి ప్రణాళిక సిద్ధమవుతోంది.



జీఐఎస్‌లో పెట్టుబడులు ఇలా..

ప్రాజెక్టు	సంఖ్య	విలువ (రూ.కోట్లలో)	వచ్చిన డీపీఆర్లు	రావాల్సినవి
మెగా ప్రాజెక్టులు	11	9008	6	5
పీపీపీ-ఏ(75-400 కోట్లు)	43	6798.5	17	26
పీపీపీ-బీ(75 కోట్ల లోపు)	48	950.66	18	30
ప్రైవేటు	15	2488	4	11

ఒబెరాయ్ రూ.1,350 కోట్ల పెట్టుబడి

ఇప్పటికే మూడు చోట్ల లగ్జరీ విల్లాల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రాంతం	పెట్టుబడి (రూ.కోట్లు)	స్థలం (ఎకరాల్లో)	విల్లాల అభివృద్ధి	ఉద్యోగాలు
అన్నవరం, కాకినాడ జిల్లా	350	40	300	5500
పేరూరు, తిరుపతి	250	20	100	1500
గండికోట, వైఎస్సార్ జిల్లా	250	50	120	1500
హార్సిలీ హిల్స్, చిత్తూరు జిల్లా	250	21	120	1200
పిచ్చుకలంక, తూర్పుగోదావరి జిల్లా	250	30	150	1200



నీ లోపల తవ్వు. లోపల మంచితనపు ఊట ఉంది;
నువ్వు తవ్వితే అది ఎప్పుడూ పైకి రావడానికి సిద్ధంగా ఉంది.
– మార్కస్ అరేలియస్

సాక్షి
గురువారం, 21 డిసెంబర్ 2023

భద్రం... బీ కేర్‌ఫుల్!

ప్రమాదఘంటిక... పారాహుషార్ గంట మరోసారి మోగింది. దేశంలో కోవిడ్ కేసులు మళ్ళీ పెరుగుతున్నాయి. మే 21 తర్వాత ఎన్నడూ లేనంత అత్యధిక స్థాయిలో 614 కొత్త కరోనా ఇన్ఫెక్షన్ కేసులు వచ్చాయి. కరోనా వైరస్ కొత్త వేరియంట్ జెఎన్.1 కేసు తొలిసారిగా కేరళలో బయటపడిన కొద్దిరోజుల్లోనే ఆ రాష్ట్రంలో నలుగురు బలయ్యారు. ఒక్క బుధవారమే దేశవ్యాప్తంగా 341 కొత్త కోవిడ్ ఇన్ఫెక్షన్ కేసులు నమోదు కావడం, అందులో 292 కేసులు కేరళ నుంచి వచ్చినవే కావడంతో తక్షణమే అప్రమత్తత అవసరమైంది. ఈ నేపథ్యంలోనే వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రతినిధులతో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి బుధవారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించాల్సి వచ్చింది. భయాందోళనలకు గురి కానక్కర్లేదు కానీ, జాగ్రత్తలు మాత్రం తప్పవనేది ఇప్పుడు మన ఆరోగ్య మంత్రం.

సరిగ్గా మూడేళ్ళ క్రితం మొదలైన కరోనా ఇప్పటికీ ఏదో ఒక రూపంలో మానవాళిని వేధిస్తూనే ఉంది. చిన్నాచితకా అలల్ని పక్కనపెడితే, రెండు ప్రధాన కరోనావేవ్‌లు మన దేశంలో జన జీవితాన్ని ఎంతగా అతలాకుతలం చేశాయో అందరికీ అనుభవైకవేద్యం. అప్పుడు నేర్చిన పాఠాలే ఇప్పుడు మార్గదర్శకాలు. ఈ మూడేళ్ళ కాలంలో అనేక కరోనా వైరస్ వేరియంట్లు వచ్చాయి. ఆ వరుసలోదే భారత్‌లో తాజాగా కనిపించిన జెఎన్.1 వేరియంట్. బీఏ.2.86 కుటుంబానికి చెందిన ఈ వైరస్ ఉత్పరివర్తనం ఏడాది పైచిలుకుగా రూపుదిద్దుకొంటూ వచ్చిందట. ఇది ఇప్పటికే సుపరిచితమైన ఒమిక్రాన్‌లో బలవత్తరమైన వేరియంట్ అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వివిధ దేశాల్లో ఇప్పటికే ఇది తన విజృంభణ చూపుతోంది. డిసెంబర్ 3 ముందు వారంలో 32 వేల మందికి కరోనా సోకితే, ఆ తరువాతి వారంలో 56 వేల మందికి ఇన్ఫెక్షన్ వచ్చిందని సింగపూర్ ఆరోగ్య శాఖ వెల్లడించింది.

మన దేశంలోని కేరళలో ర్యాండమ్ శాంపిళ్ళకు ఆర్టీ–పీసీఆర్ టెస్టులు చేస్తుండగా ఈ జెఎన్.1 వేరియంట్‌ను గుర్తించారు. మన దగ్గర ఈ వేరియంట్ తొలిసారిగా బయటపడి, కేసులు పెరుగుతుండగానే రాష్ట్రాలన్నిటికీ కేంద్రం తాజాగా మార్గదర్శకావళిని జారీ చేయడం గమనార్హం. పలు రాష్ట్రాలు అప్రమత్తమై ఇప్పటికే సమీక్షా సమావేశాలు జరిపి, మార్గదర్శ కాలను ప్రకటించాయి. కేరళలో పరిస్థితులు, కొత్త జెఎన్.1 వేరియంట్ కేసుల భయంతో కర్ణాటక సర్కార్ 60 ఏళ్ళు పైబడిన వారికి, అనారోగ్య సమస్యలున్నవారికి మాస్కు ధరించడం తప్పని సరి చేసింది. కేరళ సరిహద్దు జిల్లాలను అప్రమత్తం చేసింది. ప్రజల రాకపోకలు, సమావేశాలపై నియంత్రణలు విధించ లేదన్న మాటే కానీ, కోవిడ్ లక్షణాలున్న వారికి పరీక్షలు చేయించడం పెంచింది.

వివిధ దేశాల్లో ఈ వేరియంట్ కనిపిస్తుండడంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ తాజా పరిస్థితులపై దృష్టి సారించింది. దీన్ని ఆసక్తికరమైన వేరియంట్‌గా పేర్కొంది. ఒమిక్రాన్ తరగతికి చెందినప్పటికీ ఈ వేరియంట్ మరీ ప్రాణాంతకమైనదేమీ కాదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కోవిడ్ టీకా వేసుకోని వారికి సైతం ఈ వేరియంట్ వల్ల ప్రాణహాని ఉండదనీ భరోసా ఇస్తున్నారు. అది కొంత ఊరటనిచ్చే అంశం. అలాగని అశ్రద్ధచూపలేం, అజాగ్రత్త వహించలేం. ఎవరెన్ని చెప్పినా ఆరోగ్యం, ప్రాణరక్షణకు సంబంధించిన విషయం గనక సహజంగానే ఈ వేరియంట్ పట్ల మన దేశంలో ఆరోగ్య నిపుణుల్లో, ప్రజల్లో ఆందోళన నెలకొనడం సహజమే. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాలు తొందరపడి, కఠిన నియంత్రణలు పెట్టనక్కరలేదు కానీ, మాస్కు ధారణ, చేతుల పరిశుభ్రత, సామాజిక దూరం పాటించడం లాంటి కనీస జాగ్రత్తలు పాటించడమే ప్రజారోగ్యానికి శ్రీరామరక్ష.

అసలే వ్యాధినిరోధక శక్తి తగ్గే చలికాలం. దానికి తోడు శబరిమల యాత్ర, క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి సెలవులతో ప్రయాణాల సీజన్. పైగా వచ్చేది సార్వత్రిక ఎన్నికల సీజన్. ర్యాలీలు, బహిరంగ సభల హంగామా. కరోనా వ్యాప్తికి కలిసొచ్చే ఇన్ని అంశాల మధ్య జాగ్రత్తలను విస్మరించడం ఎలాచూసినా రిస్కే. కట్టుదిట్టమైన ఆరోగ్యవ్యవస్థ, పరీక్షల వల్ల కేరళలో ఎప్పటికప్పుడు భారీగా కరోనా కేసులు బయటపడుతున్నాయి కానీ, అంతటి పరీక్షలు, నిఘా లేని చోట పరిస్థితులు చాప కింద నీరులా ఉండివుండవచ్చు. దురదృష్టమేమంటే, మన దేశంలోనే కాక అనేక ప్రపంచ దేశాల్లో సైతం ఆ మధ్య కోవిడ్ కేసులు తగ్గాక, అధికారికంగా మహమ్మారి ముగిసినట్టు ప్రకటించారే తప్ప తర్వాతి జాగ్రత్తలు తీసుకోవట్లేదు. జీనోమిక్ ప్రాసెసింగ్ టెస్ట్‌లు సహా వివిధ రూపాల్లో నిఘాను విస్మరించారు. భారత్‌లో లేబరేటరీ నెట్‌వర్క్ 'ఇన్సాకాగ్' (ఇండియన్ సార్స్–కోవ్–2 జీనోమిక్స్ కన్సార్టియమ్) తగిన స్థాయిలో పనిచేయకపోవడమే అందుకు ఉదాహరణ.

గత మూడేళ్ళలో దేశంలో 4.5 కోట్ల మంది కరోనా బారినపడ్డారనీ, 5.33 లక్షల మంది మరణించారనీ సర్కారు వారి తాజా లెక్క. ఈ అధికారిక లెక్కలకు అందని, సామాన్య బాధితుల సంఖ్య ఇంతకు అనేక రెట్లు ఎక్కువే. ఈ పరిస్థితుల్లో టెస్ట్‌లు ఎంత ఎక్కువగా చేస్తే, కరోనా విజృంభణను అంత త్వరగా పసిగట్టి, చర్యలు చేపట్టవచ్చు. అలాగే, కొత్త వేరియంట్లకు ఇప్పుడున్న టీకాలు ఏ మేరకు పనిచేస్తాయో పరీక్షించాలి. వివిధ దేశాలు ఇప్పటికే కొత్తవాటికి తగ్గట్టు టీకాలను మెరుగు చేస్తున్నాయి. మన దేశానికీ వాటి అవసరం ఉందేమో శాస్త్రీయ సలహా స్వీకరించాలి. ముంచుకొచ్చే దాకా ఆగకుండా మూడు నెలలకోసారి ఆసుపత్రుల్లో మాక్ డ్రిల్‌లు చేయడం మంచిది. అలసత్వం దూరమవుతుంది. అలాగే, కరోనాపై నిరంతర నిఘా సరేసరి. ప్రజానీకానికి సమాచారం చేరవేస్తూ, పొంచివున్న ముప్పుపై అవగాహన పెంచడం ముఖ్యం. ప్రజారోగ్యంపై అన్ని రాష్ట్రాలూ, ప్రభుత్వాలు ఏకతాటిపైకి రావాలి. రాజకీయాలకు అతీతంగా, సమన్వయంతో ఏకోన్ముఖ వైఖరిని అవలంబించాలి. ప్రయాణాలు, జనసమ్మర్దం పెరిగే రానున్న వారాలు కీలకం గనక సన్నద్ధతే సగం మందు!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, హేమంత ఋతువు, మార్గశిర మాసం , **తిథి:** శు.నవమి ఉ.11.37 వరకు తదుపరి దశమి, **నక్షత్రం:** రేవతి రా.12.17 వరకు, తదుపరి అశ్వని, **వర్జ్యం:** ప.12.59 నుండి 2.30 వరకు, **దుర్ముహూర్తం:** ప.10.06 నుండి 10.52 వరకు, **అమృత ఘడియలు:** రా.10.01 నుండి 11.31 వరకు.

సూర్యోదయం: 6.29
సూర్యాస్తమయం: 5.26
రాహుకాలం: ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం: ఉ.6.00 నుండి 7.30 వరకు

సమర్థ పాలకుడు - సంక్షేమ నాయకుడు

ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడున్నది అచ్చమైన సంక్షేమ రాజ్యం. గతంలోనూ సంక్షేమ పథకాలు ఉన్నా... లబ్ధిదారులకు ఆ ఫలాలు చేరడానికి దళారీ వ్యవస్థ ఉండేది. జగన్ ప్రభుత్వం తెచ్చిన కొత్త వ్యవస్థల దెబ్బకు దళారీలు మాయమయ్యారు. 'కులం చూడం, మతం చూడం, పార్టీలు అసలే చూడం... పేదరికం ఒక్కటే అర్హతకు ప్రామాణికం' అన్నదే నేడు ప్రభుత్వ ఎజెండా! ఇప్పటికే విద్య, వైద్యం, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, గృహాల నిర్మాణం వంటి ఎన్నో సంస్కరణలు అమలవుతున్నాయి. ఇప్పుడు జగన్ నడుపుతున్నది సంప్రదాయేతర రాజకీయం. రాజకీయం అంటే కొద్దిపాటి వర్గాల సొత్తు అనీ, పాలన అంటే కొన్ని వర్గాలు మాత్రమే తరతరాలకు సరిపోను సంపద కూడబెట్టుకోవడం అనీ, పాలకులు వేరు – పాలితులు వేరు అనే ఫ్యూడల్ రాజకీయాలకు చెక్ చెప్పిన జగన్ దేశ రాజకీయాల్లోనే సమర్థ పాలకుడు, సంక్షేమ నాయకుడు.

ప్రజా సంక్షేమ రథ సారథి!

సందర్భం



డా॥ మేరుగు నాగార్జున

ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అప్పటికే ఉన్న వ్యవస్థలను అత్యంత ప్రభావవంతం చేయడంతో పాటు, ప్రజల కోసం నూతన వ్యవస్థలను ప్రవేశపెట్టారు. ముఖ్యంగా సంక్షేమ రంగంలో ఆయన తీసుకొచ్చిన సంస్కరణలూ, ప్రజలకు సంక్షేమ ఫలాలను చేరవేస్తున్న తీరూ విప్లవాత్మకం. అందుకే సంక్షేమ రంగానికి సంబంధించినంత వరకూ ప్రగతి గురించి చెప్పుకోవాలంటే జగన్‌కు ముందు, జగన్ తర్వాత అని చెప్పుకోవాలి. ఈ కారణంగానే యావత్ భారత దేశం ఈరోజున ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తోంది.

జగన్ తన నాలుగేళ్ల పదవీ కాలంలోనే ఎవరూ పూర్తిగా గుర్తు పెట్టుకోలేనన్ని ఎక్కువ సంక్షేమ పథకాలను అమల్లోకి తీసుకొచ్చారని చెప్పడంలో అతిశయోక్తి లేదు. అప్పటి వరకూ ఉన్న వ్యవస్థల పని తీరును ప్రభావితం చేస్తూ వాటిని ప్రజలకు మరింత చేరువ చేయగలిగారు. ఉదాహరణకు వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు పెన్షన్లు ఇచ్చే పథకాలు గత ప్రభుత్వాల హయాంలోనూ ఉన్నాయి. అయితే అప్పట్లో పెన్షన్ మంజూరు కావడం, పెన్షన్ మొత్తాలు చేతికి అందడం పెద్ద ప్రహసనంగా ఉండేది. అయితే జగన్ అధికారంలోకి వచ్చాక ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. అర్హత కలిగిన వారికి పెన్షన్ల మంజూరు చాలా సులభతరంగా మారింది. కచ్చితంగా ఒకటవ తేదీన సూర్యోదయానికి ముందే ఇంటి కొచ్చి తలుపుతట్టి పెన్షన్ మొత్తాలను అందించే సరికొత్త వ్యవస్థ రాష్ట్రంలో ఏర్పడింది. పెన్షన్లను మాత్రమే కాదు రాష్ట్రంలో రేషన్ షాపుల ద్వారా పేదలకు అందించే బియ్యం తదితర చౌక వస్తువుల కోసం దుకాణాల వరకూ వెళ్లాల్సిన పని లేకుండా ఇంటి ముంగిటకే రేషన్ వాహనాలను తెచ్చి పెట్టారు. అలాగే ఆపదలో ఉన్న మహిళలను ఆదుకోవడానికి 'దిశ యాప్'ను జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టి అందరి మన్ననలూ పొందుతోంది.

గతంలోనూ సంక్షేమ పథకాలు ఉన్నా... లబ్ధిదారులకు ఆ ఫలాలు చేరడానికి దళారీ వ్యవస్థ వాహకంగా ఉండేది. 'కులం చూడం, మతం చూడం, పార్టీలు అసలే చూడం.. పేదరికం ఒక్కటే అర్హతకు ప్రామాణికం' అన్నదే సంక్షేమ పథకాల అజెండాగా జగన్ పెట్టుకున్నారు. ఒక్క బటన్ నొక్కడం ద్వారా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేస్తున్న 'డీబీటీ' (డైరెక్ట్ బెనిఫిషరీ ట్రాన్స్ ఫర్) విధానం సీఎంగా జగన్ రాకతోనే వచ్చింది. ఈ సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేయడంలో ఎక్కడైనా పొరపాట్లు దొర్లి దాని కారణంగా ఎవరైనా అర్హులు నష్టపోయే పరిస్థితి ఏర్పడితే అలాంటివారు ఎప్పుడైనా ఆ పథకాల కోసం దరఖాస్తు చేసుకొని లబ్ధి పొందే వెసులుబాటు కలిగించారు.



నేడు... రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదినం

గతంలో కుల, ఆదాయ సర్టిఫికెట్లు లాంటివి తీసుకోవాలంటే పెద్ద తతంగమే ఉండేది. లంచాలు ఇవ్వాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలోనే సీఎం జగన్ గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థకు రూపకల్పన చేశారు. క్యాస్ట్ సర్టిఫికెట్, ఇన్‌కం సర్టిఫికెట్, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, రెసిడెన్స్ సర్టిఫికెట్, మ్యారేజ్ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ లాంటి ముఖ్యమైన సర్టిఫికెట్లను ఈ రోజున ప్రజలు ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా, ఎవరినీ కలవాల్సిన అవసరం లేకుండా సచివాలయాల ద్వారా సులభంగా అందుకోగలుగుతున్నారు. రాష్ట్రంలో 30 లక్షల మంది నిరుపేదలకు ఎలాంటి వివాదాల్లేకుండా ఇళ్ల స్థలాలను అందించడం కూడా సచివాలయాల ద్వారా మత్రమే సాధ్యమైంది. సచివాలయాలకు అనుబంధంగా సీఎం జగన్ సృష్టించిన 2.56 లక్షల మంది 'వాలంటీర్ల' వ్యవస్థ... సిఫార్సులు, పైరవీలను పాతరేసింది. వ్యవసాయానికి వెన్నుదన్నుగా రైతుకు విత్తనాలు అందించడం దగ్గర నుంచి వ్యవసాయోత్పత్తుల అమ్మకాల దాకా ఆసరాగా నిలిచే 'రైతు భరోసా కేంద్రాలు' (ఆర్‌బీకే) కూడా ఈ రోజున దేశ, విదేశీ ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

సామాజిక న్యాయం కోసం బాబాసాహెబ్ అంబేడ్కర్, జ్యోతిబా పూలే, బాబూ జగ్జీవన్ రామ్, మౌలానా ఆజాద్, కొమురం భీం, అల్లూరి సీతారామరాజు కోరుకున్న సమాజం దిశగా ప్రభుత్వ ఫలాలు అట్టడుగువర్గాల వారికి చేరాలంటే పరిపాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నది జగన్ ప్రభుత్వం నమ్మిన సిద్ధాంతం. తాను నమ్మిన సిద్ధాంతాన్ని మాటల్లో చెప్పకుండా చేతల్లో చేసి చూపిస్తున్న ఘనత ముఖ్యమంత్రిది. ఏ వర్గాలైతే ఇంత కాలం అణచి వేయబడ్డాయో, ఏ వర్గాలైతే ఇంత కాలం రాజకీయ పదవులకు దూరంగా ఉన్నాయో ఆ వర్గాలకు రాజ్యాధికారం దక్కుతోంది. శాసనసభ స్పీకర్‌గా బీసీ వర్గానికి చెందిన తమ్మినేని సీతారాం, శాసనమండలి చైర్మన్‌గా ఎస్సీ వర్గానికి చెందిన కొయ్యే మోషేన్ రాజు, మండలి డిప్యూటీ చైర్ పర్సన్‌గా మైనార్టీ వర్గానికి చెందిన జకియా ఖానమ్‌కు అవకాశం ఇచ్చారు. ఇది కాకుండా శాశ్వత ప్రాతిపదికన 'బీసీ కమిషన్'తో పాటుగా ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరు కమిషన్లు ఏర్పాటు చేశారు. నామినేటెడ్ పదవులు, నామినేటెడ్ పనుల్లో 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారికి రిజర్వేషన్ కల్పిస్తూ చట్టం చేసి, దాన్ని అమలు చేసిన తొలి ప్రభుత్వం జగన్‌దే. అందులోనూ 50 శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పించిన ఘనతా జగన్ సర్కార్‌దే.

గత మూడేళ్ల కాలంలోనే రెగ్యులర్, ఔట్ సోర్సింగ్‌లతో కలిపి ఇప్పటి వరకూ 2.61 లక్షల ఉద్యోగాలను బీసీ వర్గాల వారికి ఇవ్వడం, గ్రామ వార్డు సచివాలయాల్లో ఇచ్చిన 1.30 లక్షల శాశ్వత ఉద్యోగాలలో 83 శాతం ఉద్యోగాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారికే ఇవ్వడం రాష్ట్ర చరిత్రలో సరికొత్త అధ్యాయమే. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, వర్గాల వారికి జగనన్న ప్రభుత్వం అందిస్తున్న చేయూతను చూసి 'మేము కూడా ఈ సామాజిక వర్గాల్లో పుట్టి ఉంటే బాగుండేద'నే భావన ఈ రోజున అగ్రవర్ణాల వారిలో కలుగుతోందంటే అతిశయోక్తి కాదు. ఈ విధంగా నవ్యాంధ్ర రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న జగన్ కలకాలం ఆయురారోగ్యాలతో విలసిల్లాలి!

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి

ఓర్పుకీ... ఓదార్పుకీ చిరునామా!

సందర్భం



పి. విజయబాబు

ఆయన పేరు... లక్షల గుండెల్లో ఒక లయ. కోటి తలల నాలుక. జయ జయ ఘోషల పల్లవి. కడలి హోరు లాంటి కరతాళ ధ్వనుల గీతిక!

కష్టజీవికి ఇరువైపులా నిలిచిన వాడు. కర్మ జీవికై పాలన మలచిన వాడు. ఫ్యూడల్ శక్తుల కుహనా ఎత్తుగడలను ఎదిరించి గెలిచినవాడు. పాతికేళ్లకే ప్రతిభావంతుడు. సంపదల మధ్య పుట్టిన జగన్ మోహనుడు. కుట్ర రాజకీయాల 'బంధం'లో బాధల గరళం మింగిన బాధాసర్ప దష్టుడు. కసిని అసిగా మార్చుకుని అసిధారావ్రతం చేసి, జయకేతనం ఎగురవేశాడు. అయితే ఈ విజయం ఆయన్ని తేలిగ్గా వరించలేదు. ఒకవైపు విషశక్తుల కుయుక్తులు ఎదుర్కొంటూనే జనసాగర తరగలపై తేలియాడిన నావికుడు. బాటలు నడిచి పేటలు కడచి వేలమైళ్ళ దుమ్ములో, మధ్యాహ్నపు సూర్య ధూళిలో స్నానమాడిన నిత్య పథగాముడు. అధో జగత్ సహోదరుల కష్టాలను కన్నాడు. గోడు విన్నాడు. అబలల కంటి తడి వీణ మీటాడు. అందుకే ఓర్పుకీ, ఓదార్పుకీ 'జగన్' అనే మూడు అక్షరాలు చిరునామా అయ్యాయి! సగటు ప్రజల మనో భావన భవన ప్రాంగణాల కట్టిన తోరణాలే 'నవరత్నా'లై నిలిచాయి.

సహజంగానే ప్రతిభావంతులకు ఒక ప్రత్యేక శైలి ఉంటుంది. ముద్ర ఉంటుంది. తండ్రిని స్ఫూర్తిగా తీసుకున్నా తండ్రి చాటు బిడ్డగా రాజకీయం నడపలేదు. జనంతో కలిసి, జనంతో మమేకమై, జన ఘన జన నేతగా జగన్ ఆవిష్కృతమయ్యాడు. కుహనా శక్తులకు సింహ స్వప్నమయ్యాడు. సమ సమాజ చైతన్యానికి తెరలేపి, సామాజిక చైతన్యం అంటే ఏమిటో చాటి చెప్పాడు.

ఈ చైతన్యం ఫ్యూడల్ శక్తులకు సహజంగానే కంటగింపుగా ఉంటుంది. దశాబ్దాల తమ పెత్తందారీ తనానికి ఎదురు నిలవడం సహించలేని శక్తులు అన్నీ ఒక్కటయ్యాయి. బుస కొట్టే భుజంగాలూ, ఘుర్ఘరించే 'వరాహాలూ', నక్కలూ, భల్లూకాలూ, ఉలూకాలూ ఒక్కటయ్యాయి. రాజ్యం తమ భోజ్యం కావాలని పద్మ వ్యూహాలను పన్నుతున్నాయి. కానీ వారికి తెలియదు జనార్దనుడికి పద్మవ్యూహం పటా పంచలు చేయడం వెన్నతో పెట్టిన విద్య అని!

అయితే సగటు ప్రజలు కూడా ఈ కుట్రలు గ్రహించాలి. స్వేదంతో నిర్మించుకున్న ఈ ప్రజా ప్రభుత్వాన్ని కాపాడుకోవడం అందరి విధి. పరిపాలన అంటే 'ఆకాశ హర్మ్యాల నిర్మాణం, విదేశీ శక్తులకు ఆహ్వానం, లక్షల కోట్లు దోచేయడం' అనే సంస్కృతికి వీడ్కోలు చెప్పి, అట్టడుగు వర్గాల సాధికారతే లక్ష్యంగా సాగిపోతున్నాడు జగన్ మోహన్ రెడ్డి. అయితే ఈ ప్రయాణం పూల పాన్పు కాదు. ఎన్నో అవరోధాలూ, సవాళ్లూ ఉన్నాయి. అయినా ఆత్మవిశ్వాసమే ఆలంబనగా సాగుతున్నాడు. మరి ఆ సంక్షేమ ఫలాలు అందని అసంతృప్తుల పరిస్థితి ఏమిటి? ఇక్కడే అసంతృప్తులు వివేకంతో ఆలోచించాలి. పరిపాలన అంటే సంపన్న వర్గాలు కోటానుకోట్లు దోచుకుంటూ పేదలను ద్వితీయ శ్రేణి పౌరులుగా చూస్తూ, వాళ్లకు ఎంగిలి మెతుకులు విసరడం న్యాయమా? అసలు అంటూ సంక్షేమ ప్రభుత్వం వచ్చాక, ఆ ఫలాలు తమ సాటివారికి అందుతున్నప్పుడు, తమ వంతు కూడా వస్తుందనే విశాల దృక్పథంతో ఆలోచించాలి.

ఎందుకంటే అర్హులందరికీ లబ్ధి చేకూర్చాలనే లక్ష్యం జగన్‌కి ఉండవచ్చు. కానీ అందుకు ఆయన చేతిలో మంత్రదండం ఏమీ లేదు. అందుకే సాధ్యాసాధ్యాలను బేరీజు వేసుకుంటూ దశలవారీగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. ఈ కొనసాగింపు తమ వరకు వచ్చేదాకా ఫలాలు అందని వారు ఓపిక పట్టడం ఎంతో అవసరం. ఇప్పటికే విద్య, వైద్యం, ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం, గృహాల నిర్మాణం వంటి ఎన్నో సంస్కరణలు అమలవుతున్నాయి. ఇవి మరింత విస్తృతం కావాలి అంటే 'మళ్లీ జగన్ రావాలి!' ఈ నేపథ్యంలో ఛద్మ వేషధారులు బయలుదేరి, కవి ఆలూరి బైరాగి చెప్పినట్టు, 'నాకు కొంచెం నమ్మకమివ్వు కొండలు పిండి కొట్టేస్తాను, చితికిన టమేటో లాంటి సూర్యుణ్ణి, ఆరిన అప్పడం లాంటి చంద్రుని ఆకాశపు ఎంగిలి పళ్లెంలో నుంచి నెట్టేస్తాను' అంటూ వీరంగాలు వేస్తున్నారు.

'ఎర్ర పుస్తకాలతో', 'ఎర్రి' ప్రసంగాలతో వెర్రి మొర్రి వేషాలు వేస్తున్నారు. ఇంకోవైపు వీరికి చెందిన కార్పొరేట్ శక్తులు ఒకటయ్యాయి. దశాబ్దాలుగా తాము నంజుకు తింటున్న ప్రజా సంపద పేదలకు వెళ్లడం జీర్ణించుకోలేక పోతున్నాయి. గోబెల్స్ ప్రచారంతో జగన్‌పై చీకటి యుద్ధం ప్రారంభించాయి.

ఇది జగన్ చెప్పినట్లు అచ్చంగా 'క్లాస్ వార్'. పేదల ప్రభుత్వంపై పెద్దలు ప్రకటించిన యుద్ధం. ఒకవైపు పీడిత, తాడిత జన అక్షౌహిణుల ప్రతినిధిగా జగన్ నిలబడగా ఆయనతో కలబడుతున్న శక్తులు అత్యంత బలమైన కుహనా శక్తులు. ఒకే తానుకి చెందిన ఈ శక్తులు జ్యుడీషియరీ, మీడియా, ఎగ్జిక్యూటివ్, బిజినెస్, సినిమా... ఇలా ఒకటనేమిటీ? అన్ని రంగాలనుంచి మూకుమ్మడి దాడి ప్రారంభించాయి. అయితే ఈ కుట్ర రాజకీయాలకు అదిరే బెదిరే వ్యక్తి కాదు జగన్.

ఇప్పుడు జగన్ నడుపుతున్నది సంప్రదాయేతర రాజకీయం. ఇది అర్థం కావడానికి కొంత సమయం పట్టవచ్చు. రాజకీయం అంటే కొద్దిపాటి వర్గాల సొత్తు అనీ, పాలన అంటే కొన్ని వర్గాలు మాత్రమే తరతరాలకు సరిపోను సంపద కూడబెట్టుకోవడం అనీ, పాలకులు వేరు, పాలితులు వేరు అనే ఫ్యూడల్ సంప్రదాయ రాజకీయాలకు చెక్ చెప్పి, 'సంక్షేమ రాజ్యం' దిశగా తన ప్రస్థానాన్ని సాగిస్తున్న జగన్ మోహన్ రెడ్డి ఈ దేశ రాజకీయాల్లోనే ఒక విలక్షణ పాలకుడు, సలక్షణ నాయకుడు. ఆయన జన్మ దినోత్సవ సందర్భంగా, పెద్దలు 'జీవేమ శ్శరదమ్ శతమ్...' అని దీవిస్తున్న వేళ, ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు!!

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులు

ఇన్ బాక్స్

వర్ధిల్లు నాయకా!

గుడికంటే గొప్పగా తయారైన
మా ఊరి బడిని చూసినపుడు
అక్షరాలు నేర్వడానికి ముస్తాబైన
అమ్మ ఒడి నవ్వుల్ని చూసినపుడు
ఫీజుల భయం లేకుండా పిల్లలు
పెద్దచదువులకు వెళుతున్నపుడు
రేపటి తరాన్ని తయారు చేయాలన్న
నీ తపన కనిపిస్తోంది.

వైద్యం కోసం అమ్మను ధీమాగా
ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్తున్నపుడు
మందులు పంపాల్సిన పనిలేదురా అబ్బాయ్
అంటూ నాన్న రాసిన ఉత్తరం చదివినపుడు
పక్కింటి బంగారమ్మను చూడ్డానికి
డాక్టరే ఇంటికొచ్చారని తెలిసినపుడు
ప్రజల ఆరోగ్యానికి...
నీ ఆలోచనే శ్రీరామరక్ష అనిపిస్తోంది.

సూర్యోదయానికి ముందే
గుమ్మంలో పెన్షన్ కానుక పలకరిస్తే
వ్యవసాయ రంగానికి
భరోసాయే కేంద్రం అయితే
గ్రామ సచివాలయాలు చిగురించి
ప్రజల సేవకు చిరునామాలైతే
ప్రతి గడపా తమకోసం
ఒక ప్రతినిధి ఉన్నారని నమ్మితే
పాలన ప్రజల మధ్యనే ఉండాలనే...
నీ ఆదర్శం కనపడుతోంది.

ఇల్లులేని పేదల కోసం వెలసిన ఊళ్లను
సువిశాలంగా కదుతోన్న కళాశాలలను
పోర్టుల నిర్మాణంలో వేగాన్ని చూసినపుడు
రాష్ట్ర ఆర్థిక పురోగతికి
నీ ముందుచూపు కనపడుతోంది.

దశాబ్దాలుగా ఊపిరాడని
ఉద్దానం గొంతులో తడి..
గుండెల్లో ధీమా నింపినపుడు
కడుపులో పేగు కదిలినట్టనిపించింది
నాయకుడిని కనేది ప్రజలే కదా మరి!
వర్ధిల్లు నాయకా...

– పూడి శ్రీనివాసరావు
సీనియర్ జర్నలిస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఈసారీ మిశ్రమ ఫలితాలేనా?

విశ్లేషణ



దినేష్ సి. శర్మ

రెండు వారాలపాటు చర్చలు సాగిన తర్వాత, ఈ వార్షిక సమావేశాన్ని ఆనవాయితీగా జరుగుతున్నట్లే అదనపు రోజుకి పొడిగించారు. వాతావరణ మార్పుల విపత్తు ప్రభావం నుండి భూగ్రహాన్ని రక్షించడానికి దౌత్యవేత్తలు మరో 'ఒప్పందం' కుదుర్చుకున్నారు. దుబాయ్‌లో జరిగిన కాప్28 చర్చలు అక్షరాలా బడా చమురు కంపెనీల నీడలో జరిగాయి. శిలాజ ఇంధనాల ద్వారా సంపాదించిన సంపదను చూసి గర్వించే నగరంలో, కర్బన ఉద్గారాలను తగ్గించే మార్గాల గురించి వాతావరణ అధికారులు, ప్రపంచ నాయకులు చర్చించడం ఒక వక్రోక్తి.

ఈ ఏడాది కాప్28 చర్చలకు అధ్యక్షత వహించింది, సుల్తాన్ అల్–జబేర్. ఈయన యూఏఈ పరిశ్రమల మంత్రి మాత్రమే కాదు, ప్రపంచంలోని ప్రముఖ చమురు కంపెనీలలో ఒకటైన అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీకి చీఫ్ ఎగ్జిక్యూటివ్ కూడా. వాతావరణ మార్పుపై యూఎన్ ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్ 'కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్' (సీఓపీ28) అధ్యక్షుడిగా అల్–జబేర్ రాబోయే వాతావరణ విపత్తు నుండి ప్రపంచాన్ని రక్షించడానికి, ఏకాభిప్రాయాన్ని రూపొందించే తిరుగులేని లక్ష్యాన్ని కలిగి ఉన్నారు. చివరికి, దుబాయ్ సదస్సు కూడా మిశ్రమ ఫలితాలనే అందించింది.

పారిస్ ఒప్పంద లక్ష్యాలను అమలు చేయడంలో సాధించిన పురోగతిని ఈ సదస్సు సమీక్షించాల్సింది. అవి: 'ప్రపంచ సగటు ఉష్ణోగ్రత పెరుగుదలను పారిశ్రామిక పూర్వ స్థాయి ఉష్ణోగ్రత కంటే 2 డిగ్రీల సెంటీగ్రేడ్ తక్కువగా ఉంచడం.' అలాగే, 'సగటు ఉష్ణోగ్రత పెరుగుదలను పారిశ్రామిక పూర్వ స్థాయికంటే 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు మించకుండా పెరిగేట్టు చూడటం.' ఈ లక్ష్యాలను సాధించడానికి, వాతావరణ మార్పులపై ఇంటర్‌గవర్నమెంటల్ ప్యానెల్ చేసిన లెక్కల ప్రకారం, గ్రీన్ హౌస్ వాయు ఉద్గారాలు 2025 కంటే ముందు గరిష్ఠ స్థాయికి చేరుకోవాలి. ఇక 2030 నాటికి అవి 43 శాతం తగ్గాలి. అప్పుడే మనం వాతావరణ మార్పుల ఘోర ప్రభావాన్ని నివారించగలుగుతాము. కానీ పారిస్ లక్ష్యాల వైపు వెళ్లే మార్గానికి ప్రపంచం దూరంగా ఉంది.

'గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాల విషయంలో లోతైన, వేగవంతమైన, నిరంతర తగ్గింపుల ఆవశ్యకతను' సదస్సు గుర్తించింది. కానీ ఇలా తగ్గించే విషయంలో ఒక మార్గాన్ని సూచించేటప్పుడు మాత్రం ఆ పాఠ్యం తడబడుతోంది. ప్రపంచ చర్య కోసం సూచించిన మార్గాలు ఏవంటే... ప్రపంచవ్యాప్తంగా పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని 3 రెట్లు పెంచడం, 2030 నాటికి ప్రపంచ సగటు వార్షిక ఇంధన సామర్థ్యం మెరుగుదల రేటును రెట్టింపు చేయడం; బొగ్గు శక్తికి సంబంధించి 'ఫేజ్–డౌన్' దిశగా ప్రయత్నాలను వేగవంతం చేయడం; నెట్–జీరో ఉద్గార ఇంధన వ్యవస్థల వైపు ప్రపంచ వ్యాప్తంగా ప్రయత్నా లను వేగవంతం చేయడం; శతాబ్దానికి ముందు లేదా మధ్యలో సున్నా లేదా తక్కువ స్థాయిలో కర్బన ఇంధ నాలను ఉపయోగించడం.

కాప్ 28 సూచించిన మార్గాలలో అత్యంత ముఖ్యమైనది, 'ఇంధన వ్యవస్థలలో శిలాజ ఇంధనాలకు దూరంగా, న్యాయమైన, క్రమబద్ధమైన, సమానమైన పద్ధతిలో, శాస్త్రానికి అనుగుణంగా 2050 నాటికి నెట్–జీరోని సాధించడానికి ఈ క్లిష్టమైన దశాబ్దంలో చర్యను వేగవంతం చేయడం'. బొగ్గు కోసం ఉపయోగించిన పదం 'ఫేజ్–డౌన్' (క్రమంగా తగ్గించడం). చమురు, గ్యాస్ కోసం ఉపయోగించిన పదం 'పరివర్తించడం'. చాలా దేశాలు 'ఫేజ్–అవుట్' వాడాలని కోరుకున్నాయి. ఆతిథ్య దేశం, ఒపెక్ దేశాలు 'పరివర్తించడం' అనే తేలికపాటి పదబంధంతో ముందుకు వచ్చాయి.

దుబాయ్‌లో శిలాజ ఇంధన పరిశ్రమకు లభించిన మరో రాయితీ ఏమిటంటే, పరివర్తన ఇంధనాల పాత్ర. 'పరివర్తన ఇంధనాలు ఇంధన భద్రతకు భరోసానిస్తూ



శక్తి పరివర్తనను సులభతరం చేయడంలో తమ పాత్ర పోషిస్తాయి' అని కాప్28 పాఠ్యం గుర్తించింది. అంతర్జాతీయ ఇంధన సంస్థ సహజ వాయువును 'పరివర్తన ఇంధనం'గా పరిగణించినందున ఇది సహజ వాయువుకు ప్రాణదాత. మొత్తంమీద, చమురు, గ్యాస్ విషయంలో కాప్28 పాఠ్యం దయాపూరితంగా వ్యవహరించింది. బొగ్గు విషయంలో అలా జరగలేదు. అయినప్పటికీ కొందరు వ్యక్తులు ఈ ఒప్పందాన్ని 'చారిత్రకం' అంటున్నారు. మొదటిసారిగా కాప్ పాఠ్యంలో శిలాజ ఇంధనాల గురించి నేరుగా ప్రస్తావించారు మరి.

ఊహించినట్లుగా, మీథేన్ గురించిన సూచన కాప్28 పాఠ్యంలోకి చొప్పించారు. '2030 నాటికి ప్రత్యేకించి మిథేన్ ఉద్గారాలతో సహా ప్రపంచవ్యాప్తంగా కార్బనేతర ఉద్గారాల తగ్గింపును వేగవంతం చేయడం, గణనీయంగా తగ్గించడం' కోసం చర్య తీసుకోవాలని సదస్సు ఆయా దేశాలకు పిలుపునిచ్చింది. ఇది భారత దేశంతోపాటు అనేక ఇతర దేశాలకు సమస్యాత్మకమైనది. కార్బన్ డయాక్సైడ్ వలె, మీథేన్ కూడా వాతావరణ మార్పులకు దోహదం చేస్తుంది. కాకపోతే వందల సంవత్సరాలపాటు ప్రభావం చూపే కార్బన్ డయాక్సైడ్‌తో పోలిస్తే, వాతావరణంలో మీథేన్ చాలా తక్కువ జీవితాన్ని (12 సంవత్సరాలు) కలిగి ఉంటుంది. అయితే, రేడియేషన్‌ను గ్రహించడంలో మీథేన్ సమర్థవంతంగా పని చేస్తుంది కాబట్టి, దాని వేడెక్కించే ప్రభావం కార్బన్ డయాక్సైడ్ కంటే చాలా రెట్లు ఎక్కువ. అందువల్ల, మీథేన్ ఉద్గారాలలో భారీ తగ్గింపులు అనేవి వాతావరణం వేడెక్కడాన్ని పరిమితం చేయడంలో సహాయపడగలవని వాదన. వరి పొలాలు, పశువులతో సహా బొగ్గు గనులు, సహజ వాయువు, చమురు ఉత్పత్తి, పంపిణీ సమయంలో లీకేజీలు కూడా మీథేన్ ఉద్గారాలకు కారణమవుతాయి. దుబాయ్‌లో అంగీకరించిన విధంగా మీథేన్ ఉద్గారాలను తగ్గించవలసి వస్తే ఈ అన్ని రంగాలలో చర్యలు తీసుకోవలసి ఉంటుంది.

వాతావరణ మార్పు అనేది ప్రజలు, వారి జీవనోపాధి, శక్తి, ఆహార భద్రతకు సంబంధించినది. వాతావరణ చర్చల సమయంలో తీసుకున్న దౌత్యపరమైన నిర్ణయాలు క్షేత్ర స్థాయిలో అరుదుగా మాత్రమే మార్పును తీసుకొస్తాయి. ఈలోగా, వాతావరణ మార్పునకు చెందిన వినాశకరమైన ప్రభావం కొనసాగుతుంది. నిజంగానే దౌత్యవేత్తలు భూగోళాన్ని రక్షించగలిగితే, దుబాయ్ చర్చలను సంబరాలు చేసుకోవచ్చు.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

క్లుప్తంగా...

సీఎం జన్మదినం సందర్భంగా పాట విడుదల



పాటను విడుదల చేస్తున్న అంబటి రాయుడు తదితరులు

శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా): సీఎం జన్మదినం పురస్కరించుకుని బుధవారం తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో పాటను విడుదల చేశారు. టీమిండియా మాజీ క్రికెటర్ అంబటి రాయుడు, బ్యాడ్మింటన్ క్రీడాకారులు పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్, ఆర్చర్లు జ్యోతి సురేఖ, టెన్నిస్ ఆటగాళ్లు జఫ్రిన్ షేక, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి చేతుల మీదుగా ఈ పాటను ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి విడుదల చేయించారు.

మరో ఇద్దరు చైర్‌పర్సన్‌ల పదవీకాలం పొడిగింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 48 కార్పొరేషన్‌ల చైర్మన్‌ల పదవీకాలాన్ని పొడిగిస్తూ రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం. బుధవారం మరో రెండు కార్పొరేషన్ల చైర్మన్ల పదవీకాలం పొడిగించింది. ఏపీ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా ముంతాజ్ పఠాన్, ఏపీ మహిళా కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్‌పర్సన్‌గా బల్లాడ హేమమాలిని పదవీకాలాన్ని ప్రభుత్వం పొడిగించింది. వీరిద్దరు రెండేళ్లపాటు పదవీకాలంలో కొనసాగుతారు. ఈ మేరకు మహిళా శిశు, విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేశారు.

సాత్విక్ సాయిరాజ్, అజయ్ రెడ్డికి గవర్నర్, సీఎం అభినందన

సాక్షి, అమరావతి: జాతీయ క్రీడా అవార్డులకు ఎంపికైన రాష్ట్ర క్రీడాకారులను గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. 2023కు గాను ప్రతిష్టాత్మకమైన ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డు సాధించిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్‌ను, అర్జున అవార్డుకు ఎంపికైన భారత అంధుల క్రికెట్ జట్టు సభ్యుడు ఇల్లూరి అజయ్ కుమార్ రెడ్డిని వారు ప్రశంసించారు. ఈ ఇద్దరు క్రీడాకారులు రాష్ట్ర ప్రతిష్టను ఇనుమడింపజేశారని పేర్కొన్నారు. భవిష్యత్‌లో వారు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

జగనన్న ఆయురారోగ్యాలతో ఉండాలి

కాశీలో హరీష్‌కుమార్ యాదవ్ పూజలు



అనంతపురం కార్పొరేషన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు (గురువారం)ను పురస్కరించుకుని బుధవారం కాశీలోని కాశీ విశ్వేశ్వరుడికి యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్ కుమార్‌యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రజలకు మంచి చేస్తున్న సీఎం వైఎస్ జగనన్న నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని హరీష్‌కుమార్ యాదవ్ ఆకాంక్షించారు. మరోసారి ఏపీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ బస్సు సహా నాలుగు వాహనాల దహనం

ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో మావోయిస్టుల విధ్వంసం



మావోయిస్టులు తగులబెట్టిన కారు

సాక్షి, అమరావతి/చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో బుధవారం రాత్రి మావోయిస్టులు విధ్వంసకర ఘటనలకు పాల్పడ్డారు. ఆర్టీసీ బస్సు సహా నాలుగు వాహనాలను తగులబెట్టారు. గన్నవరం డిపోకి చెందిన ఆ బస్సులోని ప్రయాణికులు క్షేమంగా ఉన్నారు. ఈ విషయమై బస్సుడ్రైవర్లు కె.సీతారాం, ఎం.ఎస్.బాబు డిపో అధికారులకు సమాచారం ఇచ్చారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం వీరాపురం, చిడుమూరు నడుమ జాతీయ రహదారి–30పై మావోయిస్టులు ఒక కారును తగులబెట్టారు. 35 మంది ప్రయాణికులతో జగ్దల్‌పూర్ నుంచి విజయవాడ వెళుతున్న గన్నవరం డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు (ఏపీ03 జెడ్ 0142)ను, రెండు లారీలను ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా ఆసిరిగూడెం వద్ద కుంట ప్రాంతంలో దాదాపు 20 మంది మావోయిస్టులు అడ్డుకున్నారు. ప్రయాణికుల్ని కిందికి దించాలని మావోయిస్టులు బస్సు డ్రైవర్లను ఆదేశించారు. అందరూ దిగిన తరువాత బస్సు మీద, లారీల మీద పెట్రోల్ పోసి నిప్పంటించారు. బస్సు, లారీలు కాలిపోయాయి. డ్రైవర్లు, ప్రయాణికులు ఆ స్థలం నుంచి కుంట వైపు దాదాపు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పోలీసు క్యాంపు వైపు పరుగులు తీశారు. వారంతా సురక్షితంగా ఉన్నట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. శుక్రవారం భారత్ బంద్‌కు పిలుపునిచ్చిన మావోయిస్టులు ఉనికిని చాటుకునేందుకు ఈ ఘటనలకు పాల్పడినట్లుగా పోలీసులు భావిస్తున్నారు.

రూ.46 లక్షలు కొట్టేసేందుకే స్కెచ్

- కేసును 12 గంటల్లో ఛేదించిన అనంతపురం పోలీసులు
- సీఎంఎస్ కస్టోడియన్, ఏజెంట్ పోతురాజు, అతని స్నేహితులు అరెస్టు
- నగదు, మోటార్ బైకులు, మొబైల్ ఫోన్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదును పరిశీలిస్తున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: అనంతపురంలో మంగళవారం సంచలనం రేపిన రూ.46 లక్షల చోరీ కేసులో బాధితుడే నిందితుడని తేలింది. జీవితంలో స్థిరపడాలని మిత్రులతో కలసి ప్రణాళిక అమలు చేసినట్లు నిర్ధారణ అయ్యింది. పోలీసులు గంటల వ్యవధిలోనే చోరీ కేసును ఛేదించి..నలుగురు నిందితులను కటకటాల వెనక్కి పంపారు. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ బుధవారం స్థానిక పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో విలేకరులకు వెల్లడించారు. అనంతపురంలోని క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీసు(సీఎంఎస్)లో కస్టోడియన్, ఏజెంట్‌గా పని చేస్తున్న సాకే పోతులరాజు అలియాస్ పోతురాజును నిర్బంధించి.. కళ్లలో కారం కొట్టి, కాళ్లు చేతులు కట్టేసి రూ.46,55,723 నగదు ఎత్తుకెళ్లారని సదరు కంపెనీ ప్రతినిధి శ్రీనివాసులు మంగళవారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నగరంలోని శ్రీకంఠంసర్కిల్‌లో ఉన్న ఐడీబీఐ బ్యాంకు శాఖ నాల్గవ అంతస్తులో ఈ ఘటన జరిగినట్లు పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని సమగ్ర దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. బాధితుడిగా భావించిన నగరంలోని ఎర్రనేలకొట్టాలకు చెందిన సాకే పోతురాజుతో పాటు ఇందిరానగర్‌లో నివాసముంటున్న అయ్యవారిపల్లి ఖలీల్ బాషా, జనశక్తినగర్ సమీపంలోని ఎంజీ కాలనీకి చెందిన సయ్యద్ జబీవుల్లా, కర్నూలు జిల్లా తుగ్గలి మండలం గుత్తి ఎర్రగుడి గ్రామానికి చెందిన బొల్లమ్ వెంకట రామారావును నిందితులుగా గుర్తించి అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.46,55,723 నగదుతో పాటు రెండు మోటార్ బైక్‌లు, ఆరు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

దోపిడీకి స్కెచ్ ఇలా..

పోతురాజు అనంతపురం కేంద్రంగా సీఎంఎస్ కంపెనీలో మూడేళ్లుగా కస్టోడియన్, ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. సదరు కంపెనీ కాంట్రాక్ట్ ప్రకారం నగరంలోని చోళ మండలం, ఆధార్ హౌసింగ్, ఆదిత్య బిర్లా, ఎల్‌ఐసీ తదితర బ్యాంకింగ్, ఫైనాన్స్ సంస్థల నుంచి నగదును తీసుకుని.. వారి అకౌంట్ ఉన్న బ్యాంకులలో జమ చేసేవాడు. అలాగే వివిధ బ్యాంకుల నుంచి కూడా నగదు తీసుకుని సదరు బ్యాంకుల ఏటీఎంలలో లోడ్ చేసేవాడు. అతని ద్వారా పెద్దమొత్తంలో నగదు వెళ్తున్న విషయాన్ని గుర్తించిన స్నేహితులు అయ్యవారిపల్లి ఖలీల్ బాషా, సయ్యద్ జబీవుల్లా ఓ ప్లాన్ ప్రకారం దాన్ని కాజేసి జీవితంలో స్థిరపడిపోదామని అతన్ని ఒప్పించారు. ఈ మేరకు కళ్లలో కారం చల్లి, మూతికి ప్లాస్టర్ వేసి, చేతులు కట్టేసినట్లు సీన్ క్రియేట్ చేసి నగదు ఎత్తుకెళతామని, దోపిడీ జరిగినట్లు మీ ఆఫీసు వారికి చెబితే ఇన్సూరెన్స్ వస్తుంది కాబట్టి ఘటన గురించి వారేమీ పెద్దగా పట్టించుకోరని చెప్పారు. ఇందుకు పోతురాజు అంగీకరించాడు.

ప్లాన్ అమలు చేశారిలా..

పోతురాజు మంగళవారం ఉదయం 11.30 గంటల సమయంలో స్థానిక సుభాష్ రోడ్డులోని ఎల్ఐసీ ఆఫీసులో రూ.46,55,723 నగదు తీసుకున్నాడు. ఎల్ఐసీ అకౌంట్ ఉన్న ఐడీబీఐ బ్యాంకుకు వెళుతూ తన స్నేహితులకు సమాచారం ఇచ్చాడు. అలాగే తన వద్ద ఉన్న నగదు నుంచి రూ.23 లక్షలు తీసుకుని స్థానిక బోయగేరిలోని మిత్రుడు బొల్లమ్ వెంకట రామారావుకు అప్పగించాడు. అందులో రూ.3 లక్షలు ఫ్రీగా తీసుకుని మిగిలిన రూ.20 లక్షలు తిరిగివ్వాలని చెప్పాడు. అనంతరం పథకంలో భాగంగా అయ్యవారిపల్లి ఖలీల్ బాషా, సయ్యద్ జబీవుల్లా ఐడీబీఐ బ్యాంకు వద్దకు చేరుకున్నారు. ఐడీబీఐ బ్యాంకు మూడో అంతస్తులో ఉండగా..పోతురాజును మాత్రం నాల్గవ అంతస్తులో నిర్మాణంలో ఉన్న ప్రాంతానికి తీసుకెళ్లారు. కళ్లలో కారం పొడి చల్లి.. మూతికి ప్లాస్టర్ వేసి, చేతులు కట్టేసి అతని దగ్గర ఉన్న మిగతా నగదును తీసుకుని పరారయ్యారు. ఆ తర్వాత తనను బంధించి డబ్బును దొంగలు ఎత్తుకెళ్లారని పోతురాజు వీడియో కాల్ ద్వారా పైఅధికారులకు తెలిపి నాటకం ఆడాడు. కానీ పోలీసులకు అనుమానం వచ్చి పోతురాజును అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టడంలో అసలు నిజం బట్టబయలైంది.

కేసును సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ

జిల్లా కేంద్రంలో పట్టపగలు జరిగిన ఈ ఘటనను జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ సీరియస్‌గా పరిగణించారు. ఎస్పీ ఆదేశాల మేరకు అనంతపురం అర్బన్ డీఎస్పీ జి.ప్రసాద రెడ్డి పర్యవేక్షణలో వన్‌టౌన్ సీఐ రెడ్డెప్ప, సీసీఎస్ సీఐ జీటీ నాయుడు, ఎస్ఐ సుధాకర్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ఈ బృందాలు బుధవారం ఉదయం 11.30 గంటలకు స్థానిక గుత్తి రోడ్డులోని కేటీఆర్ ఫంక్షన్ హాల్ వద్ద నిందితులను అరెస్టు చేశాయి. దోపిడీ కేసును 12 గంటల్లోనే ఛేదించడంలో కీలకంగా పనిచేసిన పోలీసులకు ఎస్పీ ప్రశంసా పత్రాలతో పాటు రివార్డులను అందజేశారు.

మిలాన్-2024ను విజయవంతం చేయాలి

తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్



ఫైనల్ ప్లానింగ్ సమావేశానికి హాజరైన నౌకాదళ ప్రతినిధులు

సాక్షి, విశాఖపట్నం: తూర్పు నౌకాదళం ప్రధాన కేంద్రమైన విశాఖ వేదికగా వచ్చే ఏడాది ఫిబ్రవరి 19 నుంచి 27వ తేదీ వరకూ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న మిలాన్–2024ను విజయవంతం చేస్తామని తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్ తెలిపారు. మిలాన్ నిర్వహణకు సంబంధించి తుది ప్రణాళిక సమావేశాన్ని బుధవారం మధ్యాహ్నం ఈఎన్‌సీ ప్రధాన కార్యాలయంలోని మేరీటైమ్ వార్‌ఫేర్ సెంటర్‌లో నిర్వహించారు. హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహించనున్న మిలాన్-2024కు 50 దేశాలకు చెందిన ప్రతినిధులు వస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లు, భద్రత, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై చర్చించారు. 2022లో 11వ ఎడిషన్ నిర్వహించిన మాదిరిగా.. అంతకుమించి విజయవంతం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని వైస్ అడ్మిరల్ పెందార్కర్ సూచించారు.

దేశాభివృద్ధిలో రైతుల పాత్ర ప్రశంసనీయం

భారత మాజీ క్రికెటర్ అంబటి రాయుడు



మిర్చి నాణ్యతను పరిశీలిస్తున్న అంబటి రాయుడు

కొరిటిపాడు (గుంటూరు): ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరం కష్టపడే రైతన్నలు దేశాభివృద్ధిలోనూ ప్రశంసనీయమైన పాత్ర పోషిస్తున్నారని ప్రముఖ అంతర్జాతీయ క్రికెటర్ అంబటి రాయుడు అన్నారు. గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్‌తో కలిసి బుధవారం ఆయన మిర్చి యార్డును సందర్శించారు. రైతులు, మిర్చి దిగుమతి, ఎగుమతి వ్యాపారులు, ముఠా కార్మికులను కలిసి మిర్చి పంటకు సంబంధించి దిగుబడులు, ఆదాయ, వ్యయాలు, నాణ్యతలను అడిగి తెలుసుకున్నారు. ఏ ఏ ప్రాంతాల నుంచి మిర్చి వస్తుంది.. పంట విక్రయించిన రైతులకు డబ్బులు ఏ విధంగా ఎప్పటిలోగా చెల్లిస్తారు.. యార్డుకు వచ్చే రైతులకు ఏ విధమైన సౌకర్యాలు కల్పిస్తున్నారు.. పంట దిగుబడులు ఎలా ఉన్నాయి.. ధరలు ఎలా ఉన్నాయి.. ఏఏ రకాలకు ఎంత ధర లభిస్తుంది.. రైతులకు గిట్టుబాటు అవుతుందా? లేదా?.. సీజన్‌లో రోజుకు ఎన్ని బస్తాలు వస్తాయి.. మార్కెట్ ఫీజు ద్వారా మార్కెట్ కమిటీకి ఏడాదికి ఎంత రాబడి వస్తుంది.. గతంలో మిర్చి ధరలు ఎలా ఉన్నాయి.. ఈ నాలుగున్నర ఏళ్లలో ధరలు ఎలా ఉన్నాయి.. అని యార్డు అధికారులు, రైతులను అడిగి తెలుసుకున్నారు. అంబటి రాయుడు మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన గుంటూరు మార్కెట్ యార్డును సందర్శించడం చాలా ఆనందంగా ఉందన్నారు. యార్డులో రైతులకు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు.

మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో క్వింటా మిర్చికి రూ.3 వేల నుంచి రూ.7 వేలు మాత్రమే ధర లభించిందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత గత నాలుగున్నరేళ్లుగా క్వింటాకు రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు ధర లభిస్తోందని స్పష్టం చేశారు. అంతర్జాతీయ క్రికెట్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించిన అంబటి రాయుడు మన గుంటూరు జిల్లా వాసి కావడం గర్వకారణమన్నారు. భవిష్యత్తులో అంబటి రాయుడుకు అవసరమైన అన్ని సహాయ సహకారాలను అందిస్తామని చెప్పారు. యార్డు వైస్ చైర్మన్ షేక్ మాబు సుభానీ, దిగుమతి వ్యాపారుల సంఘం అధ్యక్షుడు లేళ్ల పెద అప్పిరెడ్డి, నారాయణరావు, సాంబిరెడ్డి, ఇంద్ర, శ్రీనివాసరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సూపరింటెండెంట్‌కు రిమాండ్

భీమవరం (ప్రకాశంచౌక్): పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం డివిజనల్ పోస్టల్ సీనియర్ సూపరింటెండెంట్ పి.బాలసుబ్రహ్మణ్యంకు విజయవాడలోని సీబీఐ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఈ మేరకు విశాఖలోని సీబీఐ, యాంటీ కరప్షన్ బ్రాంచ్ (ఏసీబీ) కార్యాలయం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. క్రిమినల్ కేసు ఎదుర్కొంటున్న ఓ పోస్టుమేన్‌ను గతనెల 30వ తేదీన బాలసుబ్రహ్మణ్యం విధుల నుంచి సస్పెండ్ చేశారు. అతడిపై సస్పెన్షన్ ఎత్తివేసి తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు రూ.10 లక్షల లంచం డిమాండ్ చేయగా చర్చల అనంతరం ఈ మొత్తాన్ని రూ.2.50 లక్షలకు తగ్గించారు. లంచం ఇచ్చేందుకు పోస్టుమేన్‌కు ఇష్టం లేక విశాఖలోని సీబీఐ, యాంటీ కరప్షన్ బ్రాంచ్ (ఏసీబీ)కి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న అధికారులు బాలసుబ్రహ్మణ్యం లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మంగళవారం రాత్రి అతని నివాసం, కార్యాలయంలో సోదాలు నిర్వహించి ఆధారాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని బుధవారం విజయవాడ సీబీఐ కోర్టులో హాజరుపరచగా, 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ కోర్టు తీర్పునిచ్చినట్టు సీబీఐ అధికారులు వివరించారు.

సమాచార దోపిడీలో టీడీపీ, జనసేన

- ఉమ్మడి పశ్చిమ గోదావరిలో ఇళ్లకు వచ్చి బెదిరింపులు
- ఆధార్ కార్డు ఇవ్వాలని, ఓటీపీ చెప్పాలని బలవంతం
- ఇళ్లల్లోకి చొరబడుతూ మహిళలపై దురుసు ప్రవర్తన
- టీడీపీ, జనసేన కార్యకర్తలపై తిరగబడుతున్న ప్రజానీకం
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు
- అపరిచితులకు సమాచారం ఇవ్వొద్దని పోలీసుల హెచ్చరిక



ప్రజలు ఓటీపీలు చెప్పవద్దంటూ తణుకులో పోలీసుల ప్రచారం

సాక్షి ప్రతినిధి, ఏలూరు/తణుకు అర్బన్: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో టీడీపీ, జనసేన పార్టీలు ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని దోపిడీ చేస్తున్నాయి. ఆ పార్టీలకు చెందిన కొందరు వ్యక్తులు ఇళ్లకు వచ్చి, వ్యక్తిగత సమాచారం కోరుతున్నారు. ముఖ్యంగా మహిళలు ఒంటరిగా ఉన్న సమయంలో ఇళ్లలోకి చొరబడి దౌర్జన్యం చేస్తున్నారు. ఆధార్ కార్డులు చూపాలని డిమాండ్ చేస్తున్నారు. ఆ తర్వాత ఓటీపీ వస్తుందని, వెంటనే చెప్పాలని ఒత్తిడి తెస్తున్నారు. వారు చెప్పినట్లు చేయని వారిపై దాడులకు తెగబడుతున్నారు. ముఖ్యంగా ఏలూరు, తణుకు నగరాల్లో వీరు ఇంటింటికీ వెళ్లి బెదిరింపులకు పాల్పడుతున్నారు. దీంతో జిల్లావాసులు భయభ్రాంతులకు గురవుతున్నారు. గతంలో అమరావతి భూముల కుంభకోణంలో పలువురి ఆధార్ కార్డులతో భూములను రిజిస్ట్రేషన్ చేసిన టీడీపీ.. ఇప్పుడు తమ ఆధార్ కార్డు, ఫోన్ నంబర్లతో ఏం చేయబోతుందనే భయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. కొందరు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఇటీవల ఏలూరు పత్తేబాదలోని ఓ ఇంటికి వెళ్లిన కొందరు వ్యక్తులు ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళను ఆధార్ కార్డు కావాలంటూ అడిగారు. మీరెవరని ప్రశ్నించగా టీడీపీ నుంచి వచ్చామని, ఆధార్ కార్డు ఇస్తే యాప్‌లో వివరాలను నమోదు చేస్తామని చెప్పారు. ఫోన్ నంబర్‌కు వచ్చే ఓటీపీ చెప్పాలంటూ దురుసుగా అడిగారు. మీకెందుకివ్వాలంటూ ఆ మహిళ గట్టిగా నిలదీయడంతో ఆమెను బెదిరిస్తూ వెళ్లిపోయారు. ఏలూరు కొత్తపేటలోనూ ఇదే విధంగా పలు ఇళ్లలో ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ చెప్పాలని టీడీపీ, జనసేనకు చెందిన కొందరు వ్యక్తులు డిమాండ్ చేశారు. స్థానికులు గట్టిగా ఎదురు తిరగడంతో అక్కడి నుండి వెళ్లిపోయారు. ఇలా దెందులూరు, ఉంగుటూరు, తణుకులో కూడా టీడీపీ, జనసేనకు చెందిన పలువురు స్థానిక నాయకులు కొందరు యువకులను ఇళ్లకు పంపి బెదిరింపులకు పాల్పడుతున్నారు. తణుకులోనూ ఓటరు లిస్టుతో ఇంటింటికీ వచ్చి వివరాలు అడుగుతూ బాబు గ్యారంటీ కార్డులు అందజేస్తున్నారు. మొబైల్ ఫోన్‌కు వచ్చే ఓటీపీ వెంటనే చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. బుధవారం 8, 17 వార్డుల్లో ఇలాగే బెదిరించిన టీడీపీ కార్యకర్తలపై మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వారిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించి, హెచ్చరించి పంపించారు.

వలంటీర్లపై దుష్ప్రచారం చేసిన పవన్.. ఇప్పుడిదేం పని?

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, వారికి అండదండగా ఉంటూ, సంక్షేమ పథకాలను అందిస్తున్న వాలంటీర్లపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్, టీడీపీ నేతలు దుష్ప్రచారం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరును తెలుసుకొనేందుకు వెళ్లిన వాలంటీర్లపై నానా రకాల ప్రచారం చేశారు. వాలంటీర్లు ప్రభుత్వం నియమించిన వారు. అదే ప్రాంతానికి చెంది, నిత్యం ప్రజల మధ్య ఉండి, వారికి సుపరిచితులైన వారు. అలాంటి వాలంటీర్లు ప్రభుత్వ పథకాలు మరింత సమర్థంగా అందేలా ప్రజల నుంచి సమాచారాన్ని సేకరిస్తే తప్పంటూ నానా యాగీ చేశారు. ఇప్పుడు అదే జనసేన, టీడీపీ వారు ఆ ప్రాంతానికి సంబంధం లేని వారిని, అపరిచితులను ఇంటింటికీ పంపి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించడం, ఇవ్వని వారిపై బెదిరింపులు, దాడులకు పాల్పడటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వ్యక్తిగత సమాచారం చెప్పొద్దని పోలీసుల హెచ్చరిక

ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలు పెరిగిపోతున్న ప్రస్తుత తరుణంలో అపరిచితులు ఎవరికీ వ్యక్తిగత సమాచారం, ఆధార్ కార్డులు, ఓటీపీ నంబర్లు ఇవ్వవద్దని పోలీసులు సూచిస్తున్నారు. అపరిచిత వ్యక్తులకు ఓటీపీలు చెప్పవద్దంటూ తణుకులో మైక్ ద్వారా ప్రచారం చేస్తున్నారు. ప్రజలు వారి వివరాలను గోప్యంగా ఉంచుకోవాలని, ఎవరికీ చెప్పవద్దని వాటి కోసం బలవంతం చేసిన వారిపై ఫిర్యాదు చేయాలని కోరుతున్నారు.

అపరిచిత వ్యక్తులు వస్తున్నారు



అపరిచిత వ్యక్తులు ఇళ్లకు వచ్చి ఆధార్ కార్డు కావాలని అడుగుతున్నారు. ఫోన్ నంబర్లకు ఓటీపీలు వస్తాయని అవి చెప్పాలని అడుగుతున్నారు. మీకెందుకని అడిగితే టీడీపీ యాప్‌లో నమోదు చేయాలని అంటున్నారు. వారి తీరుతో మాకు భయంగా ఉంది. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

–బి.మణి, వన్‌టౌన్, ఏలూరు

వన్యమృగం దహనంపై విచారణ!



వెల్దుర్తి మండలం పిచ్చయ్యబావితండా నల్లమల అటవీప్రాంతంలో వన్యప్రాణిని కాల్చిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అటవీ అధికారులు

సాక్షి, నరసరావుపేట, వెల్దుర్తి: పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం నల్లమల అటవీప్రాంతంలో వన్యమృగాన్ని దహనం చేయడంపై అధికారులు విచారణ చేపట్టారు. వివరాల్లోకి వెళితే... వెల్దుర్తి మండల పరిధిలోని పిచ్చయ్యబావితండా సమీపంలోని గిరిజన రైతులు తమ కంది పొలానికి అడవి పందులు రాకుండా కరెంట్ తీగలను ఏర్పాటు చేశారు. రెండు రోజుల కిందట వాటికి ఓ వన్యమృగం తగిలి మృతి చెందింది. విషయం అటవీశాఖ అధికారులకు తెలిస్తే ఇబ్బందవుతుందని దాన్ని నల్లమల అటవీ ప్రాంతంలో దహనం చేశారు. తర్వాత విషయం బయటకు రావడంతో అటవీశాఖాధికారులు డాగ్ స్క్వాడ్‌తో ఘటనా స్థలానికి చేరుకొని బుధవారం విచారణ జరిపారు. వన్యప్రాణి బూడిద, ఎముకలు, వెంట్రుకలు సేకరించారు. హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించారు. డాగ్ స్క్వాడ్ గ్రామంలోని ఐదుగురు రైతుల ఇళ్లకు వెళ్లింది. అయితే అప్పటికే ఆ రైతులు ఇళ్లకు తాళాలు వేసి ఉండటంతో వీరే నిందితులై ఉంటారని అనుమానిస్తున్నారు. ఈ విషయంపై పల్నాడు జిల్లా డీఎఫ్‌వో రామచంద్రరావును వివరణ కోరగా...వన్యప్రాణి అవశేషాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపామని, రెండు రోజుల్లో నివేదిక వస్తుందని చెప్పారు. అది ఏ వన్యప్రాణో తెలుసుకున్న తర్వాత చట్టపరంగా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆర్యవైశ్యులకు రాజకీయ అవకాశాలు కల్పించాలి

ఖైరతాబాద్(హైదరాబాద్): ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం ఓటర్లలో పదోవంతు ఆర్యవైశ్యులు ఉన్నారని, వారికి జనాభా దామాషా ప్రకారం రాజకీయపార్టీలు అవకాశాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్నిరాము సత్యనారాయణ అన్నారు. బుధవారం ఖైరతాబాద్‌లోని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యాలయంలో నూతన కార్యవర్గం ఎన్నికైంది. గతనెలలో అధ్యక్ష ఎన్నిక జరగగా తాజాగా ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల నాయకులు హాజరై పూర్తి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అంతకుముందు ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యనిర్వాహక అధ్యక్షుడిగా తిరువీధి ప్రకాశ్ రావు, ప్రధానకార్యదర్శిగా శేబు షణ్ముఖరావు, కోశాధికారిగా నుడురుమాటి శ్రీనివాసరావు, రాజకీయ కమిటీ చైర్మన్‌గా కోట సత్యనారాయణ, వాసవి సేవాదళ్ చైర్మన్‌గా పెనుగొండ శ్రీనివాసరావు, అదనపు కోశాధికారిగా నారాయణ విశ్వేశ్వరరావు, అదనపు ప్రధాన కార్యదర్శిగా జి.రామ్మోహన్‌ను సమావేశం ఎన్నుకుంది.

తూత్తుకుడి అతలాకుతలం..!

విస్తృతంగా సహాయక చర్యలు



తూత్తుకుడిలో వరద నీటిలో తాడును పట్టుకుని గ్రామాల్లోకి వెళుతున్న ప్రజలు

సాక్షి, చెన్నై: తమిళనాడులోని తూత్తుకుడిలో వరద సహాయక చర్యలు విస్తృతం చేశారు. వందలాది గ్రామాలు నీట మునిగి ఉండటంతో 10 హెలికాప్టర్ల ద్వారా బాధితులకు ఆహారం, తాగునీరు అందిస్తున్నారు. తమిళనాడులో ఒకే నెలలో వరుసగా ఎదుర్కొన్న రెండు వరదలను జాతీయ విపత్తుగా పరిగణించాలని సీఎం స్టాలిన్, ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. తమిళనాడులోని తిరునల్వేలి, తెన్‌కాశి, కన్యాకుమారి జిల్లాలను చుట్టుముట్టిన వరద క్రమంగా తగ్గుముఖం పట్టింది. అయితే, గ్రామీణ ప్రాంతాలతో పాటు తూత్తుకుడి నగరం, శివారుల్లోని వందలాది గ్రామాలు జలదిగ్బంధంలోనే ఉన్నాయి. తూత్తుకుడికి వెళ్లే రోడ్డు, రైలు మార్గాలు దెబ్బ తినడంతో సహాయక చర్యలకు ఆటంకాలు తప్పలేదు. దీంతో పది హెలికాప్టర్లతో ఆర్మీ, నేవీ, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు బాధితులను ఆదుకునే పనిలో నిమగ్నమయ్యాయి. ఈ వరదల్లో చిక్కుకుని మూడు రోజులు ఆచూకీ లేకుండా పోయిన మత్స్య శాఖమంత్రి అనిత ఆర్ రాధాకృష్ణన్ జాడను గుర్తించి, హెలికాప్టర్ ద్వారా బుధవారం రక్షించారు. శ్రీ వైకుంఠం రైల్వే స్టేషన్‌లో 48 గంటల పాటు అవస్థలు పడ్డ వందలాది మంది ప్రయాణికులు బుధవారం ప్రత్యేక రైలులో చెన్నై చేరుకున్నారు. ఈ వర్షాలకు సుమారు 20 మందికి పైగా మరణించారు. బుధవారం ఉదయం ఢిల్లీ నుంచి చెన్నై చేరుకున్న సీఎం స్టాలిన్ వరద ముంపునకు గురైన జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశమయ్యారు. సహాయక చర్యలు విస్తృతం చేయాలని ఆదేశించారు. గురువారం బాధిత ప్రాంతాల్లో సీఎం పర్యటించనున్నారు.

22న 'టైంస్లాట్ టోకెన్లు' రద్దు

అదే రోజు మధ్యాహ్నం నుంచి తిరుపతిలోని 9 ప్రాంతాల్లో 'వైకుంఠ' టోకెన్ల జారీ

తిరుమల: శ్రీవారి ఆలయంలో డిసెంబర్ 23–జనవరి 1 వరకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించేందుకు టీటీడీ ఏర్పాట్లు పూర్తి చేసింది. 22న అదేరోజు శ్రీవారి దర్శనానికి సంబంధించి తిరుపతిలో మంజూరు చేసే సర్వదర్శనం టైంస్లాట్ టోకెన్లను రద్దు చేసింది. భక్తులు తిరుమలలో వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా సర్వదర్శనంలో ఆరోజు శ్రీవారిని దర్శించుకోవచ్చు. 22న మధ్యాహ్నం 2 గంటల నుంచి తిరుపతిలోని 9 ప్రాంతాల్లో వైకుంఠ ద్వార దర్శన టోకెన్లను జారీ చేయనుంది. 23న ఉదయం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామివారు స్వర్ణరథంపై ఆలయ మాడ వీధుల్లో దర్శనమిస్తారు. నాదనీరాజనం వేదికపై సంపూర్ణ భగవద్గీత అఖండ పారాయణం, శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహిస్తారు. 24న తెల్లవారుజామున శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్ల చక్రస్నాన మహోత్సవం జరుగనుంది. డిసెంబర్ 22–24 వరకు, డిసెంబర్ 31, జనవరి 1వ తేదీల్లో శ్రీవారి ఆలయంలో ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. స్వయంగా వచ్చే ప్రోటోకాల్ వీఐపీలకు, కుటుంబ సభ్యులకు మాత్రమే పరిమిత సంఖ్యలో బ్రేక్ దర్శనం ఇవ్వనుంది. 10 రోజులపాటు ఎటువంటి సిఫారసు లేఖలు స్వీకరించబోమని టీటీడీ తెలిపింది.

1,500 మందితో భద్రత: ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి

వైకుంఠ ఏకాదశి నాడు 1,500 మందితో భద్రత ఏర్పాట్లు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. బుధవారం పోలీస్ అతిథిగృహంలో జరిగిన సమీక్షకు టీటీడీ సీవీఎస్వో నరసింహ కిషోర్, జిల్లా సిబ్బంది హాజరయ్యారు. తిరుపతిలోని 9 ప్రాంతాల్లో ఏకాదశి దర్శన టోకెన్లను జారీ చేస్తున్నారని ఎస్పీ తెలిపారు. క్యూలైన్ల వద్ద భక్తులు తోపులాటలు లేకుండా సహనం పాటిస్తూ టికెట్లు పొందాలన్నారు.

ఇస్రోకు ఐస్‌లాండ్ 'అన్వేషణ' అవార్డ్

న్యూఢిల్లీ: చంద్రుడిపై జీవం జాడ కోసం అన్వేషిస్తున్న ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో)కు ఐస్‌ల్యాండ్‌కు చెందిన సంస్థ నుంచి అవార్డ్ దక్కింది. చంద్రయాన్–3 మిషన్ ద్వారా చంద్రుడిపై సాఫ్ట్‌ల్యాండింగ్‌ను విజయవంతంగా పూర్తిచేసినందుకుగాను 2023 ఏడాదికి లీఫ్ ఎరిక్సన్ లూనార్ ప్రైజ్‌ను ఇస్తున్నట్లు హుసావిక్ నగరంలోని ఎక్స్‌ప్లోరేషన్ మ్యూజియం తెలిపింది. క్రిస్టోఫర్ కొలంబస్ కంటే 400 సంవత్సరాల ముందే అమెరికా గడ్డపై కాలుమోపిన తొలి యూరోపియన్ లీఫ్ ఎరిక్సన్‌కు గుర్తుగా ఈ అవార్డును ఎక్స్‌ప్లోరేషన్ మ్యూజియం ఇస్తోంది. నూతన అన్వేషణలతో చేస్తున్న కృషికిగాను ఈ అవార్డ్‌ను ప్రదానంచేస్తోంది. ఇస్రో తరఫున భారత రాయబారి బి.శ్యామ్ ఈ అవార్డ్‌ను అందుకున్నారు. అవార్డ్ ఇచ్చినందుకు ఇస్రో చైర్మన్ సోమనాథ్ ధన్యవాదాలు తెలిపారు.

24 మందికి సాహిత్య అకాడమీ పురస్కారాలు

న్యూఢిల్లీ: ఆంగ్ల రచయిత్రి నీలం సరణ్ గౌర్, హిందీ నవలా రచయిత సంజీవ్‌సహా 25 మంది రచయితలు 2023 సంవత్సరానికి సాహిత్య అకాడమీ అవార్డులు అందుకున్నారు. మాధవ్ కౌశిక్ అధ్యక్షతన బుధవారం ఢిల్లీలో భేటీ అయిన అకాడమీ ఎగ్జిక్యూటివ్ బోర్డు 24 భారతీయ భాషలకుగాను జ్యూరీ సభ్యులు సూచించిన పేర్లకు ఆమోదం తెలిపిందని సాహిత్య అకాడమీ ఒక ప్రకటనలో పేర్కొంది. తొమ్మిది కవితా సంపుటాలు, ఆరు నవలలు, ఐదు చిన్న కథల సంపుటాలు, మూడు వ్యాసాలు, ఒక సాహిత్య అధ్యయనానికి ఈ అవార్డులు దక్కాయి. ముఝే పెహ్‌చానో నవలకుగాను సంజీవ్‌కు, రెకియమ్ ఇన్ రాగా జానకి పుస్తకానికిగాను నీలం సరణ్ గౌర్‌కు అవార్డు దక్కింది. టి.పతంజలి శాస్త్రి(తెలుగు), విజయ్ వర్మ(డోగ్రీ), వినోద్ జోషి(గుజరాతీ), బన్సూర్ బనిహరి(కశ్మీరీ), అరుణ్ రంజన్ మిశ్రా(సంస్కృతం) తదితరులు అవార్డులు పొందిన వారిలో ఉన్నారు.

విచారణకు కేజ్రీ డుమ్మా!


ఒక రోజు ముందే ధ్యానం కోసం పయనం

న్యూఢిల్లీ: ఢిల్లీలో మద్యం విధానంలో అవకతవకల కేసులో గురువారం విచారణకు రావాలన్న ఈడీ సమన్లను ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మరోసారి బేఖాతరు చేసినట్టు సమాచారం. బుధవారమే ఆయన పంజాబ్‌లోని హోషియార్‌పూర్‌లో విపాసన ధ్యానం కోర్సులో చేరేందుకు వెళ్లినట్లు వార్తలొచ్చాయి. ''ఆయన ఏటా చలికాలంలో విపాసనకు వెళ్తారని అందరికీ తెలుసు. అయినా ఈడీ కావాలనే ఇప్పుడు సమన్లు ఇచ్చింది'' అని ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా అన్నారు. దీనిపై ఈడీ తదుపరి చర్యలేమిటనేది తెలియాల్సి ఉంది. నవంబర్ 2న కేజ్రీవాల్‌ను ఈడీ విచారణకు పిలవగా ఎన్నికల ప్రచారంలో పాల్గొనాల్సి ఉందంటూ హాజరు కాలేదు.

ట్రంప్‌కు షాక్

కొలరాడో కోర్టు సంచలన తీర్పు కొలరాడో రిపబ్లికన్ ప్రైమరీలో పాల్గొనకుండ నిషేధం

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు గట్టి షాక్ తగిలింది. 2024 నవంబర్‌లో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో పోటీ పడేందుకు ఆయన అనర్హుడంటూ కొలరాడో రాష్ట్ర సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. 2021లో కాపిటల్ హిల్‌పై జరిగిన దాడి ఉదంతంలో ఆయన పాత్ర ఉందని తేల్చింది. అమెరికా రాజ్యాంగంలోని 14వ సవరణ (సెక్షన్ 3) ప్రకారం ట్రంప్‌ను దోషిగా నిర్ధారించింది. దీని ప్రకారం ప్రభుత్వంపై, ప్రభుత్వ సంస్థలు, భవనాలపై దాడిలో పాల్గొనే అధికారులు భవిష్యత్తులో ప్రభుత్వ పదవులు చేపట్టడానికి అనర్హులు. కాకపోతే అధ్యక్ష అభ్యర్థిని ఈ సెక్షన్ కింద పోటీకి అనర్హుడిగా ప్రకటించడం అమెరికా చరిత్రలో ఇదే తొలిసారి! ఈ తీర్పు కొలరాడో రాష్ట్రం వరకే వర్తిస్తుంది. తీర్పు నేపథ్యంలో కొలరాడోలో రిపబ్లిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి ఎన్నిక (ప్రైమరీ)లో ట్రంప్ పోటీ చేయకుండా కోర్టు అనర్హత వేటు వేసింది. ప్రైమరీ బ్యాలెట్ పేపర్ల నుంచి ఆయన పేరును తొలగించాలని ఆదేశించింది. ''కాపిటల్ భవనంపై దాడికి తన మద్దతుదారులను ట్రంప్ స్వయంగా పురిగొల్పారు. అక్రమ పద్ధతుల్లో, హింసాత్మకంగా అధికార మార్పిడిని అడ్డుకోజూశారు. తద్వారా దేశ ప్రజల తీర్పునే అపహాస్యం చేశారు. కనుక సెక్షన్ 3 ప్రకారం దేశాధ్యక్ష పదవి చేపట్టేందుకు ఆయన అనర్హుడు'' అంటూ ఏడుగురు జడ్జిల ధర్మాసనం 4–3 మెజారిటీతో తీర్పు చెప్పింది.



ఆశలపై నీళ్లు!: మరోసారి అధ్యక్షుడు కావాలన్న 77 ఏళ్ల ట్రంప్ కలలకు కొలరాడో కోర్టు తీర్పు గట్టి ఎదురు దెబ్బేనని భావిస్తున్నారు. రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వ రేసులో ఇప్పటికే ఆయన అందరి కంటే ముందున్నారు. కొలరాడో కోర్టుది తప్పుడు తీర్పంటూ ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. తనను ఏదోలా అడ్డుకునేందుకు న్యాయవ్యవస్థను కూడా అడ్డగోలుగా వాడుకునేందుకు అధ్యక్షుడు జో బైడెన్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్లనున్నట్టు ట్రంప్ లాయర్లు ప్రకటించారు. కొలరాడో కోర్టు కూడా తన తీర్పుపై సుప్రీంకోర్టులో అప్పీలుకు జనవరి 4 దాకా గడువిచ్చింది. అప్పటిదాకా తీర్పు అమలుపై స్టే విధించింది. ఈ నేపథ్యంలో ట్రంప్ రాజకీయ భవితవ్యాన్ని సుప్రీంకోర్టులోనే తేలనుంది. అయితే, ఒకట్రెండు నెలల్లో రాష్ట్రాలవారీగా ప్రైమరీలు మొదలవుతున్న నేపథ్యంలో ఆలోగా సుప్రీంకోర్టు విచారణ పూర్తి చేసి తీర్పు వెలువరించకపోతే ట్రంప్ పరిస్థితి ఏమిటన్నది కూడా ఆసక్తికరంగా మారింది. కొలరాడోలో మార్చి 5న జరగనున్న ప్రైమరీకి అధ్యక్ష అభ్యర్థుల బ్యాలెట్ పత్రాల ఖరారుకు జనవరి ఐదో తేదే తుది గడువు! అంతేగాక కాపిటల్ భవనంపై దాడి ఉదంతానికి సంబంధించి ఇంకా పలు రాష్ట్రాల్లో ట్రంప్ కేసులు ఎదుర్కొంటున్నారు. అక్కడా ఇలాంటి తీర్పే వస్తే అధ్యక్ష ఎన్నికల్లో ఆయన పోటీ మరింతగా చిక్కుల్లో పడనుంది. ఈ పరిణామాలపై స్పందించేందుకు డెమొక్రటిక్ పార్టీ నిరాకరించింది.

వివేక్ రామస్వామి అండ

రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిత్వానికి ట్రంప్‌తో పోటీ పడుతున్న భారతీయ అమెరికన్ వివేక్ రామస్వామి కూడా కొలరాడో సుప్రీంకోర్టు తీర్పును తీవ్రంగా తప్పుబట్టడం విశేషం. ఈ విషయంలో ట్రంప్‌కు అండగా నిలవాల్సిన అవసరముందని ఆయన అన్నారు. ఈ తీర్పు కారణంగా కొలరాడో రిపబ్లికన్ ప్రైమరీలో ట్రంప్ పోటీ పడలేకపోతే తాను కూడా అక్కడ పోటీ చేయబోనని ప్రకటించారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థులెవరూ కూడా కొలరాడో ప్రైమరీలో బరిలో దిగొద్దని 38 ఏళ్ల వివేక్ ఎక్స్ వేదికగా పిలుపునిచ్చారు.

కరోనా కేసుల ఉధృతి

కొత్తగా 614 కేసులు నమోదు **ఆందోళన అక్కర్లేదు, అప్రమత్తంగా ఉండండి: మంత్రి మాండవీయ**

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కరోనా కేసుల సంఖ్య మళ్లీ పెరుగుతోంది. గత 24 గంటల వ్యవధిలో ఏకంగా 614 కొత్త కేసులు నమోదయ్యాయి. మే 21వ తేదీ తర్వాత ఒక్క రోజులో ఇంతగా కొత్త కేసులు నమోదవడం ఇదే తొలిసారికావడం గమనార్హం. గత 24 గంటల్లో కేరళలో ముగ్గురు కోవిడ్‌తో కన్నుమూశారు. భారత్‌లో కొత్తగా వెలుగుచూసిన జేఎన్1 ఉపరకం వైరస్ కేసులు ప్రస్తుతం మూడు రాష్ట్రాల్లో 21 నమోదయ్యాయని నీతి ఆయోగ్ సభ్యుడు(ఆరోగ్యం) డాక్టర్ వీకే పాల్ చెప్పారు. ఈ వైరస్ సోకినవారు 92 శాతం వరకు ఇంటివద్దే చికిత్స పొందుతున్నారని ఆయన వెల్లడించారు.ప్రస్తుతం దేశవ్యాప్తంగా యాక్టివ్ కేసుల సంఖ్య 2,311కు పెరిగిందని కేంద్ర ఆరోగ్య శాఖ బుధవారం ఉదయం వెల్లడించింది. కేరళ, మహారాష్ట్ర, జార్ఖండ్, కర్ణాటకల్లో రోజువారీ కేసుల సంఖ్యలో మరింత పెరుగుదల కనిపించింది.

ఆరోగ్య మంత్రి ఉన్నతస్థాయి సమావేశం

కేసుల ఉధృతి నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలంటూ రాష్ట్రాల ఉన్నతాధికారులతో కేంద్ర ఆరోగ్య మంత్రి మన్సుఖ్ మాండవీయ సమీక్ష సమావేశం నిర్వహించారు. '' పెరుగుతున్న కేసులతో ఆందోళన అక్కర్లేదు. కానీ అప్రమత్తంగా ఉండండి. కరోనా వైరస్ వ్యాప్తిని అడ్డుకోవడం, కరోనా కేసుల నిర్ధారణ పరీక్షల పెంపు, ఆస్పత్రుల్లో చికిత్స సన్నద్ధత అంశాలపై సూచనలు చేశారు. కొత్తరకం వేరియంట్‌గా భావించే అనుమానిత కేసుల శాంపిళ్లను వెంటనే ఇన్సాకాగ్ జన్యుక్రమ విశ్లేషణ ల్యాబ్‌లకు పంపండి. కేసుల నిర్ధారణ, నిఘా, చికిత్స విధానాలను పటిష్టంచేయండి. ఆస్పత్రుల్లో మెడికల్ ఆక్సిజన్, పడకలు, వెంటిలేటర్లు, వైద్య ఉపకరణాలు, ఆక్సిజన్ ప్లాంట్లు తదితరాల లభ్యతను ఎప్పటికప్పుడు సరిచూసుకోండి. ఈ సన్నద్ధతపై ప్రతి మూడు నెలలకు ఒకసారి మాక్ డ్రిల్ నిర్వహించండి. వైరస్ విస్తృతిపై ప్రజల్లో అవగాహన పెంచండి'' అని మంత్రి ఉన్నతాధికారులకు సూచించారు. దేశంలో ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి వివరాలతో కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి సుధాన్ష్ పంత్ మంత్రికి ఒక ప్రజెంటేషన్ చూపించారు. కొత్త జేఎన్1 సబ్‌వేరియంట్‌ను 'వేరియంట్ ఆఫ్ ఇంట్రస్ట్' పరిగణిస్తున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. వ్యాప్తి వేగం ఎక్కువగా ఉన్నా రిస్క్ తక్కువేనంది. అమెరికా, చైనా, సింగపూర్, భారత్‌లలో ఈ వైరస్ వెలుగు చూసింది.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లా కొత్తపల్లి అటవీప్రాంతంలో మావోయిస్టులకు, పోలీసులకు బుధవారం ఎదురుకాల్పులు జరిగాయి. ఆరుగురు మావోయిస్టులు తీవ్రంగా గాయపడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. కొత్తపల్లి అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఏర్పాటు చేసుకున్న శిబిరంపై పోలీసులు మెరుపుదాడి చేశారు. వెంటనే తేరుకున్న మావోయిస్టులు ఎదురుకాల్పులు జరుపుతూ సమీప అటవీప్రాంతంలోకి పారిపోయినట్టు సమాచారం. పోలీసులు మావోల క్యాంప్‌ను ధ్వంసం చేశారు. ఘటనాస్థలిలో భారీగా పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ''మావోల జాడ కోసం గాలింపు చేపట్టగా సమీప ప్రాంతాల్లో రక్తపు మరకలు ఎక్కువగా కనిపించాయి. ఎన్‌కౌంటర్ సందర్భంగా దాదాపు ఆరుగురు మావోలు తీవ్రంగా గాయపడి ఉండొచ్చు లేదా మరణించి ఉండొచ్చు ఉండొచ్చు'' అని పోలీసులు అనుమానం వ్యక్తంచేశారు.

'మిమిక్రీ'పై ఆగ్రహ జ్వాలలు

ఉపరాష్ట్రపతి పట్ల విపక్షాల ప్రవర్తనను ఖండించిన రాష్ట్రపతి, ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌ను అనుకరిస్తూ పార్లమెంట్ ప్రాంగణంలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ మిమిక్రీ చేయడాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు తీవ్రంగా ఖండించారు. ధన్‌ఖడ్‌కు మద్దతు ప్రకటిస్తూ ముర్ము బుధవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఎంపీల ప్రవర్తనను చూసి కలత చెందానని పేర్కొన్నారు. పార్లమెంటరీ సంప్రదాయాలను ఎంపీలంతా కాపాడాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారని వివరించారు. రాష్ట్రపతికి ధన్‌ఖడ్ కృతజ్ఞతలు తెలిపారు. అవమానాలు, హేళనలు తన మార్గం తనను నుంచి తప్పించలేవన్నారు.

ధన్‌ఖడ్‌కు మోదీ ఫోన్

ధన్‌ఖడ్‌తో మోదీ ఫోన్‌లో మాట్లాడారు. విపక్ష సభ్యుల ప్రవర్తన చాలా బాధ కలిగించిందన్నారు. విపక్ష సభ్యులు మిమిక్రీ చేయడాన్ని మోదీ ఆక్షేపించారు. ఎవరు ఎన్ని విధాలుగా హేళన చేసినా తన విధులు తాను నిర్వర్తిస్తూనే ఉంటానని, ఎవరూ తనను అడ్డుకోలేరని మోదీతో ధన్‌ఖడ్ చెప్పారు. తాను 20 ఏళ్లుగా ఇలాంటి హేళనలు, అవమానాలు ఎదుర్కొంటున్నానని మోదీ చెప్పారంటూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్, నితిన్ గడ్కరీ, ఎన్డీయే ఎంపీలు కూయాయనకు మద్దతు ప్రకటించారు. సంఘీభావంగా బుధవారం లోకసభలో 10 నిమిషాలపాటు లేచి నిల్చున్నారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కూడా ధన్‌ఖడ్‌ను కలిసి సంఘీభావం ప్రకటించారు. ధన్‌ఖడ్ బుధవారం రాజ్యసభలో మాట్లాడారు. పార్లమెంట్‌ను, ఉప రాష్ట్రపతి పదవిని అవమానిస్తే సహించబోనని హెచ్చరించారు. మిమిక్రీ చేసిన తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ మాట్లాడుతూ ఎవరినీ కించపర్చాలన్న ఉద్దేశం తనకు లేదని అన్నారు. ఉప రాష్ట్రపతిని అవమానించలేదని చెప్పారు.

బీజేపీ ఎంపీపై చర్యలేవి: కాంగ్రెస్

జాట్ కులాన్ని ప్రతిపక్షాలు అవమానించాయన్న ఆరోపణలను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఖండించారు. పార్లమెంట్‌లో తనను ఎన్నోసార్లు మాట్లాడనివ్వలేదని, దళితుడిని కాబట్టే మాట్లాడే అవకాశం ఇవ్వలేదని తాను అనొచ్చా అని ప్రశ్నించారు. మోదీ గతంలో అప్పటి ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీని మిమిక్రీ చేశారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ గుర్తు చేశారు.

మరో ఇద్దరు ఎంపీల సస్పెన్షన్

న్యూఢిల్లీ: భద్రతా వైఫల్యంపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ ప్లకార్డులు ప్రదర్శించడం, నినాదాలు చేయడంతో బుధవారం లోక్‌సభలో ఇద్దరు విపక్ష ఎంపీలపై సస్పెన్షన్ వేటు పడింది. కేరళ కాంగ్రెస్(మణి) సభ్యుడు థామస్ చెళికాదన్, సీపీఎం సభ్యుడు ఎ.ఎం.అరీఫ్‌ను సభ నుంచి ఈ సెషన్‌లో మిగిలిన కాలమంతా సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. దీంతో ప్రస్తుత శీతాకాల సమావేశాల్లో పార్లమెంట్ నుంచి సస్పెండైన విపక్ష ఎంపీల సంఖ్య 143కు చేరుకుంది. లోక్‌సభ నుంచి 97 మంది, రాజ్యసభ నుంచి 46 మంది సస్పెండయ్యారు.

ఢిల్లీ నుంచి అయోధ్యకు విమానం

న్యూఢిల్లీ: అయోధ్యలో రామ మందిరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఢిల్లీ నుంచి అక్కడికి విమాన సర్వీసులు మొదలుపెడుతున్నట్లు ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ బుధవారం ప్రకటించింది. తొలి విమానం డిసెంబర్ 30న ప్రయాణించనుంది. జనవరి 16వ తేదీ నుంచి రోజువారీ సర్వీసులను అందుబాటులోకి తెస్తామని సంస్థ ఎండీ అలోక్ సింగ్ చెప్పారు. ఇండిగో కూడా జనవరి 6 నుంచి అయోధ్యకు రోజువారీ విమాన సర్వీసులను మొదలు పెట్టనుంది. అయోధ్య ఎయిర్‌పోర్ట్ నిర్మాణం నెలాఖరులోగా పూర్తవనుంది. దాన్ని ప్రధాని మోదీ ప్రారంభిస్తారు.

మూడు క్రిమినల్ బిల్లులకు ఆమోదం

న్యూఢిల్లీ: బ్రిటిష్ వలస పాలకుల హయాం నాటి క్రిమినల్ చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న మూడు కీలక బిల్లులను లోక్‌సభలో బుధవారం మూజువాణి ఓటుతో ఆమోదించారు. భారతీయ న్యాయ(రెండో) సంహిత బిల్లు, భారతీయ నాగరిక్ సురక్షా(రెండో) సంహిత బిల్లు, భారతీయ సాక్ష్య(రెండో) బిల్లును కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా గతవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఇండియన్ పీనల్ కోడ్–1860, కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ యాక్ట్–1898, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్–1872 స్థానంలో ఈ మూడు బిల్లులను తీసుకొచ్చారు. లోక్‌సభలో ఈ బిల్లులపై బుధవారం చర్చ జరిగింది. సమగ్రమైన సంప్రదింపులు, భాగస్వామ్య పక్షాల నుంచి అభిప్రాయ సేకరణ తర్వాతే మూడు బిల్లులను సిద్ధం చేసినట్లు అమిత్ షా చెప్పారు. ముసాయిదా బిల్లుల్లో ప్రతి కామా, ఫుల్‌స్టాప్‌ను కూడా క్షుణ్నంగా పరిశీలించినట్లు తెలిపారు. మన దేశంలో ప్రస్తుతం అమల్లో ఉన్న క్రిమినల్ చట్టాలు బ్రిటిష్ వలస పాలకుల ఆలోచనా ధోరణిని ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. అవి ప్రజలకు శిక్షలు, జరిమానాలు తప్ప న్యాయం చేకూర్చేలా లేవని చెప్పారు. భారతీయ ఆలోచనా ధోరణికి అనుగుణంగా న్యాయం చేకూర్చే వ్యవస్థను నెలకొల్పడానికి మూడు కొత్త బిల్లులకు రూపకల్పన చేసినట్లు అమిత్ షా ఉద్ఘాటించారు. ప్రతిపాదిత మూడు నూతన క్రిమినల్ చట్టాలు వలస పాలన మైండ్‌సెట్ నుంచి, బ్రిటిషర్ల చిహ్నాల నుంచి ప్రజలకు విముక్తి కల్పిస్తాయని తెలిపారు. ఈ చట్టాలతో నేర న్యాయ వ్యవస్థలో సమూల మార్పులు వస్తాయన్నారు. నేర న్యాయ వ్యవస్థకు తొలిసారిగా మానవత్వాన్ని జోడించబోతున్నామని హర్షం వ్యక్తం చేశారు. మూడు కొత్త చట్టాలకు న్యాయం, పారదర్శకత, నిష్పక్షపాతమే ఆధారమని వివరించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న మొట్టమొదటి ప్రభుత్వం మోదీ ప్రభుత్వమేనని అమిత్ షా తేల్చిచెప్పారు.

బురదలో పడుకుని సర్పంచ్ నిరసన

పంచాయతీ స్థలం కబ్జాకు గురైనా చర్యలు లేవని ఆరోపణమంత్రి దుద్దిళ్ల హామీతో ఆందోళన విరమణ

ముత్తారం (మంథని): శ్మశానవాటిక, హరితహారం కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని కబ్జాచేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవడం లేదంటూ పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం సీతంపేట సర్పంచ్ పులిపాక నరేశ్ పొలంలోని బురదలో పడుకుని నిరసన తెలిపారు. సీతంపేటలో పల్లెప్రకృతి వనం కోసం ఎకరం, శ్మశానవాటిక కోసం పది గుంటలు, హరితహారానికి అవసరమైన నర్సరీ కోసం ఐదు గుంటలను అధికారులు గ్రామపంచాయతీకి గతంలో కేటాయించారు. దీంతోపాటు మరికొంత స్థలం అక్కడే ఖాళీగా ఉంది. ఈ స్థలానికి సమీపంలోనే గ్రామానికి చెందిన అన్నం రాయమల్లు పొలం ఉంది. శ్మశానవాటిక, నర్సరీ, పల్లె ప్రకృతి వనం కోసం కేటాయించిన భూమి తనదేనంటూ రాయమల్లు దానిని ఇటీవల కబ్జా చేశాడు. మొక్కలు ధ్వంసం చేసి ఈ యాసంగిలో పొలం దున్నడం ప్రారంభించాడు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులు, తహసీల్దార్‌కు సర్పంచ్ ఫిర్యాదుచేశారు. అయినప్పటికీ వారు స్పందించలేదు. దీంతో ప్రభుత్వం కేటాయించిన భూమిని గ్రామపంచాయతీకి అప్పగించాలని, కబ్జాదారుపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌తో బుధవారం నగేశ్ కబ్జాకు గురైన పొలంలోని బురదలో పడుకుని నిరసన తెలిపాడు. భూమి స్వాధీనం చేసుకోకుంటే ఇక్కడే చనిపోతానని భీష్మించుకు కూర్చున్నాడు. సమాచారం అందుకున్న ఎస్సై మధుసూదన్‌రావు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. సీఐ సతీశ్, రెవెన్యూ అధికారులతో మాట్లాడించినా నగేశ్ ఆందోళన విరమించలేదు. నాయబ్ తహసీల్దార్ ఉదయ్, ఆర్ఐ శ్రీధర్ అక్కడకు చేరుకోగా.. ×మీ అండతోనే భూమి కబ్జా అవుతోంది, రాయమల్లుకు చెందిన భూమి అయితే ప్రభుత్వం గ్రామ పంచాయతీకి ఎందుకు కేటాయించింది¶ అని వారిని నిలదీశారు. తగిన న్యాయం చేస్తామని చెప్పిన నాయక్ తహసీల్దార్.. నగేశ్‌ను బురదలోంచి పొలం గట్టుపైకి తీసుకొచ్చారు. సుమారు మూడు గంటలకుపైగా ఆందోళన కొనసాగింది. చివరకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అదనపు కలెక్టర్ అరుణశ్రీ సర్పంచ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఆ భూమిని గ్రామపంచాయతీకి అప్పగిస్తామని, కబ్జాదారుపై చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. దీంతో సర్పంచ్ ఆందోళన విరమించారు.

బాబోయ్ దొంగలు!

మక్తల్‌లో వరుస చోరీలు

మక్తల్: కర్ణాటక రాష్ట్ర సరిహద్దులోని నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో దొంగలు హడలెత్తిస్తున్నారు. పట్టణంలోని అయ్యప్పస్వామి కాలనీ, పాత సినిమా టాకీస్, సాయినగర్, మైనార్టీ కాలనీ, సంగంబండ రోడ్డు, రహమానీయ కాలనీ, యల్లమ్మకుంట, జగ్జీవన్‌రాం కాలనీ, ఆజాద్‌నగర్ కాలనీల్లో రోజురోజుకూ దొంగల బెడద అధికం కావడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పది రోజుల్లో దాదాపు 15 దొంగతనాలు జరగగా.. మూడు కేసులు నమోదయ్యాయి. కొందరు అద్దె ఇళ్లను ఖాళీచేసి స్వగ్రామాలకు వెళ్లిపోవడం తీవ్రతకు నిదర్శనం. ఈనెల 17న రాత్రి 7 గంటలకు మాగనూర్ మండలం ఉజ్జెల్లికి చెందిన కార్తీక్ రూ.30 వేలతో బైక్‌పై వెళ్తుండగా.. నారాయణపేట క్రాస్‌రోడ్డు సమీపంలో దారికాసి దోపిడీకి పాల్పడ్డారు. ఓ ఇంటి తాళాన్ని పగులగొట్టి రూ.10 వేల నగదు, తులం బంగారం ఎత్తుకెళ్లారు.

పోలీసుల గస్తీ ముమ్మరం..

వరుస చోరీల నేపథ్యంలో పోలీసులు గస్తీని ముమ్మరం చేశారు. దొంగతనాలను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. మాగనూర్, కృష్ణా, ఊట్కూర్ మండలాల ఎస్ఐలతో పాటు పోలీస్ సిబ్బంది ప్రతి కాలనీని జల్లెడ పడుతున్నారు.


రంగంలోకి ఎమ్మెల్యే..

వరుస చోరీలతో భయాందోళనకు గురవుతున్న పట్టణ ప్రజల్లో ధైర్యం నింపేందుకు స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పోలీసులతో పాటు గస్తీ తిరుగుతున్నారు. బుధవారం అర్ధరాత్రి తర్వాత 2 గంటలకు పలు కాలనీల్లో పర్యటించారు. ఉదయం, సాయంత్రం కాలనీవాసులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఎస్పీ యోగేష్ గౌతమ్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. మరో ఐదు రోజుల్లో పడమటి ఆంజనేయస్వామి జాతర ఉత్సవాలు ప్రారంభమవుతాయని, పోలీసుల గస్తీ పెంచాలని కోరారు.

మార్చేద్దాం మన రాతలు

విదేశీ విద్యా దీవెన, సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక సాయం విడుదలలో సీఎం వైఎస్ జగన్

"మన పిల్లలు పోటీ ప్రపంచంలో లీడర్లుగా ఎదగాలి. రాష్ట్రానికి ఏదో ఒక రోజు.. ఎప్పుడో ఒక రోజు మంచి చేసే అవకాశం వారికి రావాలని ఆకాంక్షిస్తున్నా. మీ ప్రస్థానం ఇతర విద్యార్థులకు స్ఫూర్తి కలిగించాలని మనసారా కోరుకుంటున్నా"
– ముఖ్యమంత్రి వైఎస్ జగన్



జగనన్న విదేశీ విద్యా దీవెన చెక్‌ను విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: పేద విద్యార్థు తల రాతలు మార్చడమే లక్ష్యంగా జగనన్న విదేశీ విద్యా దీవెన పథకాన్ని అమలు చేస్తున్నామని సీఎం వైఎస్ జగన్ తెలిపారు. ఉన్నత చదువుల కోసం ఎవరూ అప్పులు చేయాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం, జగనన్న తోడుగా ఉంటారనే భరోసాను దీని ద్వారా కల్పిస్తున్నట్లు చెప్పారు. పేద విద్యార్థులకు విదేశాల్లోని టాప్ యూనివర్సిటీల్లో ఉన్నత చదువులు అభ్యసించే అవకాశం కల్పించే జగనన్న విదేశీ విద్యా దీవెన, అత్యున్నత విధాన నిర్ణయాల్లో భాగస్వామ్యాన్ని కోరుకునే వారికి ఆర్థిక తోడ్పాటు కల్పించే సివిల్ సర్వీసెస్ పరీక్షల ఉత్తీర్ణులకు ప్రోత్సాహకాలను సీఎం జగన్ బుధవారం విడుదల చేశారు. విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసిస్తున్న 390 మందికి రూ.41.60 కోట్లతో పాటు సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన 95 మంది అభ్యర్థులకు, వారిలో మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించిన 11 మందికి ప్రోత్సాహకంగా రూ.100.50 లక్షలు కలిపి మొత్తం రూ.42.60 కోట్లను క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి నేరుగా ఖాతాల్లో జమ చేశారు. విదేశాల్లో చదువుకుంటున్న లబ్ధిదారులైన విద్యార్థులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమంలో పాల్గొన్నారు. సీఎం జగన్ ఏమన్నారంటే..

భరోసా కల్పిస్తూ..

ఇవాళ రెండు మంచి కార్యక్రమాలు జరగడం, నాకు ఆ ఆనందాన్ని కల్పించడం దేవుడిచ్చిన అదృష్టం. ఈ రెండు కార్యక్రమాల్లోనూ ఓ ప్రత్యేకత ఉంది. వీటి ద్వారా మన విద్యార్థుల్లో ఒక ఆకాంక్షను రేకెత్తించగలుగుతున్నాం. మంచి యూనివర్సిటీల్లో సీటు సాధిస్తే ఫీజులు ఎంతైనా మన రాష్ట్రంలో ఇబ్బంది పడాల్సిన పనిలేదు. తల్లిదండ్రులు అప్పులు చేయాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం, జగనన్న తోడుగా ఉంటాడనే భరోసాను విదేశీ విద్యాదీవెన కార్యక్రమం ద్వారా కల్పిస్తున్నాం. టైమ్స్ రేటింగ్స్, టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్, క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో టాప్ 50 కాలేజీలకు సంబంధించి 21 ఫ్యాకల్టీలలో ఉన్న దాదాపు 350 కాలేజీలలో ఏపీ నుంచి ఎవరికి సీటొచ్చినా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పేద వర్గాల పిల్లలకు మొత్తం ఫీజు రూ.1.25 కోట్లు వరకు అందించే కార్యక్రమం చేపట్టాం. మిగిలిన వారికి రూ.కోటి వరకు.. దాదాపుగా మొత్తం ఫీజు అందించేలా సాచ్యురేషన్ విధానంలో, పారదర్శకంగా పథకాన్ని తెచ్చాం. గత పది నెలల్లో జగనన్న విదేశీ విద్యాదీవెన కింద 408 మందికి రూ.107.08 కోట్ల మేర సాయం అందించాం.

గొప్ప సంతృప్తి

ఈ పథకం చాలా సంతృప్తినిచ్చే కార్యక్రమం. కారణం.. మిమ్మల్ని చూసి మిగిలిన వారు కూడా స్ఫూర్తి పొంది ఇదే మాదిరిగా టాప్ కాలేజీల్లో సీట్లు పొందేలా కృషి చేస్తారు. మీ తలరాతలను మార్చుకోవడమే కాకుండా మీరు బాగా ఎదిగిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం తరఫున అందిన సాయాన్ని గుర్తుంచుకోవాలి. సీఈవోలుగా పెద్ద పెద్ద సంస్థల్లో మీరు పేరు సంపాదించుకున్న తర్వాత కూడా రాష్ట్రాన్ని గుర్తు పెట్టుకోవాలి. మన పిల్లలకు మీరు ఇంకా ఎక్కువ మంచి చేయాలన్నదే నా తాపత్రయం, కోరిక. వార్షికాదాయం రూ.8 లక్షల్లోపు ఉన్న వారంతా పథకంలో కవర్ అవుతారు. దీనివల్ల అట్టడగువర్గాలు అత్యధికంగా బాగుపడాలని మనసారా కోరుకుంటున్నా. లబ్ధిదారుల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల నుంచి దాదాపు 45 శాతం ఉండగా మిగిలిన 55 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారున్నారు. రాబోయే రోజుల్లో అట్టడుగు వర్గాల నుంచి ఇంకా ఎక్కువ మంది ఉత్తీర్ణులై మన రాష్ట్రం పేరును, వారి కుటుంబాలను మరో స్థాయికి తీసుకెళ్లేలా దేవుడు ఆశీర్వదించాలని కోరుకుంటున్నా.

కొండంత ఫీజులున్నా..

ఆయా యూనివర్సిటీల్లో సీట్లు సాధించిన వారిని చూస్తే.. కార్నిగీ మిలాన్ యూనివర్సిటీలో దాదాపు రూ.90 లక్షలు ఫీజు ఉంది. చెల్లెమ్మ రూపకు ఈ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ చదివేందుకు రూ.89 లక్షలు చెల్లించాం. తమ్ముడు సాంబశివకు న్యూయార్క్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ అభ్యసించేందుకు రూ.89 లక్షలు ఫీజు చెల్లించాం. కొలంబియా యూనివర్సిటీలో ప్రకీర్త్ ఇంజనీరింగ్ విద్య కోసం రూ.75.87 లక్షలు అందించాం. వాషింగ్టన్ యూనివర్సిటీ, సెయింట్ లూయిస్‌లో శ్రేయ చదువుకునేందుకు రూ.75 లక్షలు చెల్లించాం. యూనివర్సిటీ ఆఫ్ మిచ్‌గాన్ యానాబర్‌లో మరియం కోసం రూ.67.50 లక్షల ఫీజులు చెల్లించాం. ఇలా మొత్తం 51 మంది ఉన్నారు.

ఏ స్థాయిలో ఉన్నాయంటే..

అక్కడ విదేశీ వర్సిటీల్లో ఫీజులు ఏ స్థాయిలో ఉన్నాయంటే.. సీటు వచ్చినా కూడా అక్కడకు వెళ్లి చదవాలంటే స్తోమత సరిపోదు. ఎన్ని అప్పులు చేయాలి? ఎక్కడ అప్పు చేయాలి? ఒకవేళ అప్పులు చేస్తే తిరిగి చెల్లించడం ఎలా? అన్నది ప్రతి తల్లిదండ్రికీ సంశయం కలిగిస్తుంది. అలాంటి పరిస్థితుల్లో ఉన్నవారికి టాప్ కాలేజీలలో సీటు వస్తే ప్రభుత్వం మీకు తోడుగా ఉంటుందనే భరోసానిస్తూ శాచ్యురేషన్ విధానంలో లబ్ధి చేకూరుస్తున్నాం.

ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు మన రాష్ట్రం నుంచే..

మన విద్యార్థులు ఎవరైనా ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణులైతే రూ.లక్ష ప్రోత్సాహకంగా అందించడంతోపాటు మెయిన్స్‌లో కూడా ఉత్తీర్ణత సాధిస్తే మరో రూ.50 వేలు అందిస్తూ మొత్తంగా రూ.1.50 లక్షల వరకు ప్రయోజనం చేకూరేలా పథకాన్ని తెచ్చాం. వారు ఎన్నిసార్లు సివిల్స్ రాసినా ఈ ఆర్థిక సాయం కొనసాగుతుంది. దీనివల్ల ఇంకా ఎక్కువ మంది స్ఫూర్తి పొందుతారు. మరింత మంది ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు మన రాష్ట్రం నుంచి రావాలనే ఆకాంక్షతో దీన్ని తలపెట్టాం. ఈ కార్యక్రమం ద్వారా 95 మంది తమ్ముళ్లు ప్రిలిమ్స్ క్లియర్ చేశారు. వారికి రూ.లక్ష చొప్పున అందచేస్తున్నాం. మరో 11 మంది సివిల్స్ ఇంటర్వ్యూ వరకు వెళ్లారు. వారికి మరో రూ.50 వేలు చొప్పున ప్రోత్సాహకం అందించటాన్ని ఈ రోజు ప్రారంభిస్తున్నాం.

నాడు అలా..

గత ప్రభుత్వాలు విదేశీ విద్యా దీవెనను కొద్దో గొప్పో చేయాలని ప్రారంభించాయి. కానీ ఆ కార్యక్రమం గత సర్కారు హయాంలో ఒక మోసంగా మిగిలిపోయింది. ఒకవైపు ఫీజులు రూ.70 లక్షలు, రూ.60 లక్షలు, రూ.50 లక్షలు కనిపిస్తుంటే.. నాడు రూ.10 లక్షలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. ఇలా చేయడం వల్ల ఏ ఒక్కరికీ మంచి జరగదు. అప్పుల పాలయ్యే పరిస్థితి ఎప్పటికీ మారదు. ఎప్పటికీ బతుకులు మారవు. నాడు ఏదో చేశామంటే చేశామన్న పరిస్థితి. దాన్ని కూడా సక్రమంగా మనసు పెట్టి చేయలేదు. ఎక్కడా చిత్తశుద్ధి లేదు. దాదాపు 3,326 మందికి 2016–17 సంవత్సరానికి సంబంధించి రూ.318 కోట్ల మేర ఎగ్గొట్టి బకాయిలు కింద వదిలేశారు. యూనివర్సిటీలకు సంబంధించిన కాలేజీల్లోనూ పారదర్శకత లేదు. ఏదో ఊరూపేరూ లేని కాలేజీల్లో సీట్లు వచ్చినా రికమెండేషన్లతో కొంతమంది మాత్రమే అర్హత పొందేవారు. అవన్నీ ఇప్పుడు సమూలంగా మార్పు చేశాం.

పారదర్శకతకు పెద్దపీట

ఈ ప్రభుత్వం శాచ్యురేషన్, ట్రాన్స్‌ఫరెన్సీ అనే విధానాలతో ముందుకు సాగుతోంది. అర్హత ఉంటే చాలు.. ఈ ప్రభుత్వం ఎవరికైనా సరే మంచి చేస్తుంది. ఎక్కడా, ఎవరికీ రికమండేషన్లు పని చేయవు. సిఫార్సులు అవసరం లేదు. ఎవరు చుట్టూ తిరగాల్సిన పనిలేదు.

నేడు అర్హతే ప్రామాణికంగా

ఇవాళ అర్హత మాత్రమే ప్రామాణికంగా తీసుకున్నాం. సిఫార్సులు, రాజకీయ జోక్యం, అవినీతి, లంచాలు లేవు. 21 ఫ్యాకల్టీలలో, టాప్ 50 కాలేజీలలో ఎవరికి సీటు వచ్చినా రూ.1.25 కోట్ల వరకు గరిష్టంగా పరిమితి పెట్టి లబ్ధి చేకూరుస్తున్నాం. మన పిల్లలు పోటీ ప్రపంచంలో ఎదగాలని ఇవన్నీ చేస్తున్నాం. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, సీఎస్ డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి, సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి, మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి ఇంతియాజ్, సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ విజయకృష్ణన్, ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జీవితాన్ని మార్చేసింది..




నేను జాన్ హాప్కిన్స్ యూనివర్శిటీలో మాస్టర్స్ చదువుతున్నా. జగనన్న విదేశీ విద్యా దీవెన ద్వారా లబ్ధి పొందా. విద్యారంగంలో మీరు ఏదో ఒక రోజు సమాజానికి సేవ చేస్తానని మాట ఇస్తున్నా.
– షేక్ సనా, విద్యార్థిని, విజయవాడ
(అమెరికా నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో)

విద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారు..

విదేశాలలో చదువుకోవాలన్నది నా చిన్ననాటి కలను మీరు సాకారం చేశారు. మీరు నగరిలో విద్యాదీవెన కార్యక్రమానికి వచ్చినప్పుడు ఆ సభలో పాల్గొన్నా. ఆ స్ఫూర్తితో దరఖాస్తు చేయడంతో ఆస్ట్రేలియా యూనివర్సిటీలో సీట్ పొందా. జగనన్న విదేశీ విద్యాదీవెన ద్వారా రూ.55 లక్షలు ఫీజులు చెల్లించారు. – చంద్రసాయికృష్ణ, చిత్తూరు జిల్లా (మొనాష్ యూనివర్సిటీ, ఆస్ట్రేలియాలో ఎంఎస్‌లో అడ్మిషన్ పొందారు)

స్ఫూర్తి పొందా...



నానమ్మ గుంటూరు కలెక్టరేట్‌లో వంట మనిషిగా పని చేస్తూ నన్ను డాక్టర్‌ను చేశారు సార్. సివిల్స్‌కు ప్రయత్నించా. మెయిన్స్ సాధించలేకపోయా. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నా. మీరు తెచ్చిన పథకం గురించి తెలుసుకుని స్ఫూర్తి పొందా. ఇప్పుడు మెయిన్స్‌లో విజయం సాధించి ఫిబ్రవరి 16న ఇంటర్వ్యూకు వెళుతున్నా.
– పెండెం ప్రత్యూష్, సత్తెనపల్లి, పల్నాడు జిల్లా (ఇంటర్వ్యూకు ఎంపికైన జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం లబ్ధిదారు)

లోక్‌సభ — ఏపీ ఇన్ పార్లమెంట్

న్యాయప్రక్రియే శిక్షలా ఉంటోంది

వైఎస్సార్‌సీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో న్యాయం అందుతున్న తీరు చూస్తుంటే ఆ ప్రక్రియే ఓ శిక్షలా ఉంటోందని వైఎస్సార్‌సీపీ ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు ఆవేదన వ్యక్తం చేశారు. నోయిడా వరుస హత్యల కేసు చూస్తుంటే.. 17 ఏళ్ల తర్వాత న్యాయం దక్కడం ఈ విషయాన్ని అవగతం చేస్తోందన్నారు. ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్, ఇండియన్ పీనల్ కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌ల స్థానంలో లోక్‌సభలో కేంద్ర హోంశాఖ ప్రవేశపెట్టిన భారతీయ సాక్ష్య–2023, భారతీయ న్యాయ సంహిత–2023, భారతీయ నాగరిక సురక్ష సంహిత–2023 బిల్లులకు మద్దతిస్తూ ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడారు. దేశంలో అందరికీ సమానంగా చట్టం, న్యాయం అందుబాటులో ఉండటం లేదన్నారు. పాత చట్టాలు రద్దు చేస్తూ తీసుకొచ్చిన కొత్త చట్టాలు అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తాయని ఆశిస్తున్నామన్నారు. సివిల్, పరువు నష్టం కేసులను క్రిమినల్ కేసులుగా నమోదు చేస్తుండటంతో బాధితులు వేధింపులకు గురవుతున్నట్టు సభ దృష్టికి తెచ్చారు. కొన్ని సందర్భాల్లో నేరం రుజువు కాకుండానే సంకెళ్లు వేస్తున్నారన్నారు. తీవ్రవాదం అంశంలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు వేర్వేరు చట్టాలు కలిగి ఉన్నాయని, ఆ చట్టాలన్నీ ఒకే తాటిపైకి వచ్చేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని శ్రీకృష్ణదేవరాయలు కోరారు.

స్పెక్ట్రమ్ కేటాయింపుల్లో రాష్ట్రాలకు రిజర్వు కేటగిరీ ఉండాలి



గ్రామీణ ప్రాంతాల్లో డిజిటలైజేషన్‌ను ప్రోత్సహించడానికి రాష్ట్రాలకూ స్పెక్ట్రమ్ కేటాయింపులు ఉండాలని కేంద్రానికి వైఎస్సార్‌సీపీ ఎంపీ సంజీవ్‌కుమార్ సూచించారు. ఏపీలో 80 శాతం మంది ప్రజలు గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో ఉంటారని.. ఆయా ప్రాంతాల్లో డిజిటల్ అభివృద్ధి చెందాలంటే కేంద్రం వేలం వేసే స్పెక్ట్రమ్‌లో రాష్ట్రాలకూ రిజర్వు కేటగిరీ ప్రవేశపెట్టాలన్నారు. బుధవారం లోక్‌సభలో టెలీ కమ్యూనికేషన్ బిల్లుపై ఎంపీ సంజీవ్‌కుమార్ మాట్లాడారు. ఈ–గవర్నెన్స్ కార్యకలాపాలు, స్థానిక విపత్తు నిర్వహణ వ్యవస్థలకు సంబంధించి రాష్ట్రాలకు కేటాయించిన కొంత స్పెక్ట్రమ్ వినియోగించుకునే సౌలభ్యం కలిగించాలన్నారు. బిల్లులో అంశాలు సమర్థంగా అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వాలకు కొన్ని అధికారాలు ఇవ్వాలన్నారు. టెలీ కమ్యూనికేషన్ బిల్లులో కీలకమైన అంశాల్లో తెలుగు సహా ప్రాంతీయ భాషలు చేర్చాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కస్టమర్ సర్వీస్ ఇంటర్‌ఫేస్, మొబైల్ అప్లికేషన్ బిల్లులకు సంబంధించిన అధికారిక కమ్యూనికేషన్‌లో ప్రాంతీయ భాషలు ఉంటే మెజారిటీ ప్రజలకు మరింత సులభతరం అవుతుందన్నారు.

మోసపూరిత చైనీస్ లోన్ యాప్‌లతో ఏపీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యలు పరిష్కారానికి తక్షణ నియంత్రణ చర్యలు ఎంతో అవసరమన్నారు. ఈ బిల్లు విప్లవాత్మక మార్పులు తీసుకొస్తుందని విశ్వసిస్తున్నామని, డిజిటల్ సాధికారత విషయంలో ప్రజలు వెనకబాటు తగ్గుతుందని ఈ నేపథ్యంలో బిల్లుకు వైఎస్సార్‌సీపీ మద్దతు ఇస్తోందని ఎంపీ సంజీవ్‌కుమార్ తెలిపారు.

ఏపీలో 49,668 చేనేత లబ్ధిదారులు

ఆంధ్రప్రదేశ్‌లో 49,668 మంది చేనేత లబ్ధిదారులు ఉన్నట్టు కేంద్ర జౌళి శాఖ సహాయ మంత్రి దర్శన జర్దోష్ తెలిపారు. లోక్‌సభలో బుధవారం వైఎస్సార్‌సీపీ సభ్యుడు సంజీవ్‌కుమార్ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. దేశవ్యాప్తంగా చేనేత కార్మికుల సంక్షేమాన్ని ప్రోత్సహించడానికి జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమం (ఎన్‌హెచ్‌డీపీ), ముడిసరుకు సరఫరా పథకం (ఆర్‌ఎంఎస్‌ఎస్) వంటివి కేంద్రం అమలు చేస్తోందన్నారు. ఈ రెండింటిలో భాగస్వాములైన చేనేత కార్మికులకు ముడి సరుకులు, అప్‌గ్రేడ్ చేసిన మగ్గాలు, ఉపకరణాల సేకరణ, సోలార్ లైటింగ్ యూనిట్లు, వర్క్‌షెడ్ల నిర్మాణం, శిక్షణ, నైపుణ్యం, డిజైన్ ఉత్పత్తి, అర్హులైన చేనేత ఏజెన్సీలు, కార్మికులకు ఆర్థిక సహాయం అందచేస్తున్నట్టు వివరించారు. 2019–20 లెక్కల ప్రకారం దేశవ్యాప్తంగా 35,22,512 మంది లబ్ధిదారులు ఉంటే.. ఎన్‌హెచ్‌డీపీలో భాగంగా ఏపీలో 49,668 మంది లబ్ధిదారులు ఉన్నారని, అదేవిధంగా ఆర్‌ఎంఎస్‌ఎస్‌లో 68,593 లబ్ధిదారులు ఉన్నారని వివరించారు.

టీఐఈఎస్ పథకానికి రూ.60.45కోట్లు



ట్రేడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫర్ ఎక్స్‌పోర్ట్స్ (టీఐఈఎస్) పథకం కింద ఏపీకి రూ.60.45 కోట్లు విడుదల చేసినట్టు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల సహాయ మంత్రి అనుప్రియ పాటిల్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు ఎంవీవీ సత్యనారాయణ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. ఏపీలో 5 ప్రాజెక్టులకు గానూ రూ.76.07 కోట్లు అనుమతించగా.. ఇప్పటికే రూ.60.45 కోట్లు విడుదల చేసినట్టు వివరించారు.

ఏపీలో 2.68 కోట్ల మందికి పీఎంజీకేఏవై లబ్ధి



ఏపీలో ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై) పథకంలో 2.68 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నట్టు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి సాధ్వీ నిరంజన్ జ్యోతి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ అవినాష్‌రెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. దేశవ్యాప్తంగా 80 కోట్ల మందికి ఈ పథకం ద్వారా ఉచిత పంపిణీలు జరగ్గా.. డిసెంబర్ 14, 2023 వరకూ ఏపీలో 2.68 కోట్ల మందికి లబ్ధి చేకూరిందన్నారు.

రాజ్యసభ

పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు సాయం

వైఎస్సార్‌సీపీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్‌జీఎస్‌ఏ) పథకం కింద కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు భవనాలు, కంప్యూటర్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ఆర్థిక సాయం చేస్తోందని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ సహాయ మంత్రి కపిల్ మోరేశ్వర్ పాటిల్ తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానమిస్తూ.. పంచాయతీల్లో మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే అయినప్పటికీ.. ఈ పథకంలో భాగంగా పంచాయతీల పని తీరును ప్రోత్సహించే లక్ష్యంతో రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు వార్షిక కార్యాచరణ ప్రణాళికలో ప్రతిపాదించిన విధంగా సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ పరిమిత స్థాయిలో ఆమోదించిన మేరకు పంచాయతీలకు మౌలిక వసతులు కల్పించనున్నట్టు వివరించారు. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 1,893 పంచాయతీలకు సొంత భవనాలు, 3,858 పంచాయతీల్లో కంప్యూటర్లు లేవని తెలిపారు.

ఎస్సీలపై దాడులు తగ్గుతున్నాయి



ఎస్సీలపై దాడుల కేసులు తగ్గుముఖం పడుతున్నాయని కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత శాఖ సహాయ మంత్రి రాందాస్ అథవాలే తెలిపారు. ఏపీలో ఎస్సీలపై దాడులకు సంబంధించి 2020లో 179, 2021లో 140, 2022లో 125 కేసులు నమోదయ్యాయని వైఎస్సార్‌సీపీ సభ్యుడు పరిమళ్ నత్వానీ ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

మూడేళ్లలో 1,149 కిలోమీటర్ల రోడ్లు పూర్తి


ఏపీలో గడచిన మూడేళ్లలో 2,380 కిలోమీటర్ల రహదారుల నిర్మాణానికి అనుమతించగా.. 1,149 కిలోమీటర్ల మేర పూర్తయ్యాయని.. 1,231 రహదారుల పనులు పురోగతిలో ఉన్నాయని కేంద్ర జాతీయ రహదారులు, రహదారి రవాణా శాఖ సహాయ మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి తెలిపారు. 2020–21 నుంచి డిసెంబరు 14, 2023 వరకూ ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద రూ.771.77 కోట్లు కేంద్ర వాటాగా విడుదల చేసినట్టు వైఎస్సార్‌సీపీ సభ్యుడు బీద మస్తాన్‌రావు ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

జీఎస్టీ ఏటీ ఏర్పాటు గొప్ప ముందడుగు



గూడ్స్, సర్వీస్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ (జీఎస్టీ ఏటీ) ఏర్పాటు అనేది జీఎస్టీ వ్యవస్థలో గొప్ప ముందడుగు అని వైఎస్సార్‌సీపీ ఎంపీ బీద మస్తానరావు తెలిపారు. పన్ను చెల్లింపుదారుల వివాద పరిష్కారాలు క్రమబద్ధీకరణకు, న్యాయవ్యవస్థపై భారం తగ్గించడానికి ఎంతో ఉపకరిస్తుందన్నారు. సెంట్రల్ గూడ్స్, సర్వీస్ ట్యాక్స్ (రెండో సవరణ) బిల్లు–2023కు మద్దతు ఇస్తూ బుధవారం రాజ్యసభలో మస్తానరావు మాట్లాడారు.

మధ్య తరగతిపై పన్నుల భారం తగ్గించాలి



మధ్యతరగతి ప్రజలపై అధిక పన్నుల భారం తగ్గించాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం రాజ్యసభలో ప్రొవిజనల్ కలెక్షన్ ఆఫ్ టాక్సెస్–2023 బిల్లుకు మద్దతు ఇస్తూ ఆయన మాట్లాడారు. నూతన వ్యవస్థ వల్ల పిల్లల కోసం, పదవీ విరమణ తర్వాత భవిష్యత్ కోసం ఆదా చేయడం వారికి కష్టమవుతోందన్నారు. వారు అందిస్తున్న సహకారంతో పోలిస్తే పొందే ప్రయోజనాలు చాలా తక్కువగా ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో మధ్యతరగతి వేగంగా అభివృద్ధి చెందుతోందని దేశ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందని, పన్ను భారం తగ్గించే మార్గాలు అన్వేషించాలని కేంద్రానికి సూచించారు.

'విదేశీ విద్యా దీవెన'తో కలలు నెరవేరుతున్నాయి

వైఎస్సార్‌సీపీ నేత విజయసాయిరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: విదేశాల్లోని టాప్ యూనివర్సిటీల్లో విద్యను అభ్యసించాలనే పేద విద్యార్థుల కలలు 'జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం' ద్వారా నెరవేరుతున్నాయని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి బుధవారం ఇక్కడ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా ప్రపంచంలోని టాప్–50 యూనివర్సిటీల్లో చదవాలనుకునే పేద విద్యార్థులకు రూ.1.25 కోట్లు వరకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ కల్పిస్తున్నట్టు తెలిపారు. పేద విద్యార్థులకు 'జగనన్న విదేశీ విద్యా దీవెన' ఒక వరమని ఆయన పేర్కొన్నారు.

రూ.40 వేల ఖర్చు.. గంటకు 40 కి.మీ. వేగం

ఎలక్ట్రిక్ బైక్ తయారు చేసిన డ్రైవర్



నూజివీడు: ఆశావర్కర్‌గా పనిచేస్తోన్న తన భార్య రోజూ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లేందుకు ఆటో ఖర్చు ఎక్కువవుతుండటంతో సొంతంగా ఎలక్ట్రిక్ బైక్ తయారు చేశాడు ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన గుమ్మవరపు సురేష్. దీని బ్యాటరీని ఫుల్ చార్జింగ్ చేస్తే 30 కి.మీ దూరం వెళ్లేలా ఈ వాహనాన్ని తయారు చేశాడు. పట్టణంలోని అమ్మవారితోటలో నివాసముండే సురేష్.. ఆర్క్ వెల్డింగ్ పనులతో పాటు డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. తన భార్యకు ఎలక్ట్రిక్ బైక్ కొనాలని షోరూంల్లో సంప్రదించగా రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చవుతుందని తెలుసుకున్నాడు. అంత భరించే స్తోమత లేకపోవడంతో తానే ఎలక్ట్రిక్ బైక్ తయారీకి పూనుకున్నాడు. 48 ఓల్ట్స్ మోటర్‌ను, 350 వాట్స్ లిథియన్ అయాన్ బ్యాటరీని, బీఎల్‌డీసీ మోటార్‌ను, డీసీ కంట్రోలర్‌ను, ఎల్‌ఈడీ డిస్‌ప్లేను ఢిల్లీ, కోల్‌కత, గుర్‌గావ్‌ల్లో కొనుగోలు చేశాడు. ఫ్రేమ్ తయారు చేసి సీటు కింద బ్యాటరీని పెట్టాడు. బ్యాటరీ ఫుల్ చార్జ్ అయ్యేందుకు 3 గంటలు పడుతుండగా గంటకు 40 కిలోమీటర్ల వేగంతో వాహనం ప్రయాణిస్తుంది. రూ.40 వేలు విలువజేసే వాహనం తయారీకి 15 రోజులు పట్టింది.

గొల్లపూడిలో ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు

600 కేజీల కేక్‌ను కట్ చేసిన ప్రజాప్రతినిధులు



కేక్ కట్ చేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున తదితరులు

భవానీపురం (విజయవాడ పశ్చిమ): సుదీర్ఘ పాదయాత్ర చేపట్టి అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ మరో 3 దశాబ్దాలపాటు సీఎంగానే ఉండాలని పలువురు ప్రజాప్రతినిధులు ఆకాంక్షించారు. గురువారం సీఎం పుట్టిన రోజును పురస్కరించుకుని ఎమ్మెల్సీ, సీఎం కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురాం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో బుధవారం నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రత్యేకంగా తయారు చేయించిన 600 కిలోల కేక్‌ను ట్రాలీపై ఉంచి..గొల్లపూడి మైలురాయి సెంటర్ నుంచి వేలాదిగా ప్రజలు వెంటరాగా మేళతాళాల నడుమ బయలుదేరిన భారీ ఊరేగింపు గొల్లపూడి పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకుంది. అక్కడ తలశిల రఘురాం, మంత్రి మేరుగ నాగార్జున, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ గౌతంరెడ్డి, ఏపీ ఈడబ్ల్యూడీసీ చైర్మన్ నాగార్జున యాదవ్, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ తదితరులు కేక్ కట్ చేసి సీఎం జగన్‌కు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం జన్మదినం సందర్భంగా పాట విడుదల



పాటను విడుదల చేస్తున్న అంబటి రాయుడు తదితరులు

శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా): సీఎం జన్మదినం పురస్కరించుకుని బుధవారం తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో పాటను విడుదల చేశారు. టీమిండియా మాజీ క్రికెటర్ అంబటి రాయుడు, బ్యాడ్మింటన్ క్రీడాకారులు పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్, ఆర్చర్లు జ్యోతి సురేఖ, టెన్నిస్ ఆటగాళ్లు జఫ్రిన్ షేక్, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి చేతుల మీదుగా ఈ పాటను ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి విడుదల చేయించారు.

నాగలదిన్నె వంతెన ప్రారంభం



వంతెన ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

నందవరం: కర్నూలు జిల్లా, నందవరం మండలంలోని నాగలదిన్నె గ్రామం వద్ద తుంగభద్ర నదిపై నిర్మించిన హైలెవల్ బ్రిడ్జిని బుధవారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ప్రారంభించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సృజన, తెలంగాణ రాష్ట్రం అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి పాల్గొన్నారు. నందవరం మండలం నాగలదిన్నె, తెలంగాణలోని అయిజ మండలం పులికల్ గ్రామాల మధ్య తుంగభద్రపై నిర్మించిన వంతెన 2009 అక్టోబర్ 2న భారీ వరదల కారణంగా కుప్పకూలింది. అప్పటి టీడీపీ ప్రభుత్వం బ్రిడ్జి పునర్నిర్మాణానికి రూ.41కోట్లు కేటాయించినా, నిధులు మంజూరు చేయలేదు. దీంతో బ్రిడ్జి నిర్మాణం ఆగిపోయింది. అనంతరం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భూ సేకరణ సమస్యను పరిష్కరించడంతోపాటు వంతెన నిర్మాణానికి కావాల్సిన నిధులు మంజూరు చేసి, నిర్మాణం పూర్తి చేయించింది. బుధవారం నుంచి బ్రిడ్జిపై రాకపోకలు ప్రారంభమవడంతో రెండు రాష్ట్రాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం జగన్‌కు అక్షరమాల!



సీఎం జగన్ పుట్టిన రోజును పురస్కరించుకొని నంద్యాలకి చెందిన చిత్రకారుడు చింతలపల్లె కోటేష్.. అక్షరాలతో జగనన్న జీవిత చరిత్రను వేశారు. ఏ 3 డ్రాయింగ్ షీట్‌పై మైక్రో పెన్నుతో సీఎం జగన్ పుట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు ఉన్న విషయాలను చిత్రంలో రాశారు. వైఎస్సార్ మృతి, ఓదార్పు యాత్ర, ప్రజాసంకల్ప యాత్ర, సీఎంగా ప్రమాణస్వీకారం, నవరత్నాలు తదితరాలను చిత్రంలో చూపించారు.

– నంద్యాల(అర్బన్)

సీఎంకు మంత్రి రోజా ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు



సీఎం వైఎస్ జగన్‌కు రాష్ట్ర శాఖ మంత్రి ఆర్కే రోజా ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం వెలగపూడిలోని సీఎం ఆఫీసుకు వెళ్లిన ఆమె ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు.

– నగరి(చిత్తూరు జిల్లా)

బిగ్‌బాస్ సీజన్–7 విజేత పల్లవి ప్రశాంత్ అరెస్టు

ప్రభుత్వ ఆస్తుల దాడి కేసులో అదుపులోకి తీసుకున్న పోలీసులు

బంజారాహిల్స్ (హైదరాబాద్)/గజ్వేల్: అన్నపూర్ణ స్టూడియో వద్ద ప్రభుత్వ ఆస్తులపై జరిగిన దాడి ఘటనలో ఏ–1, ఏ–2 నిందితులుగా ఉన్న బిగ్‌బాస్ సీజన్–7 విజేత పల్లవి ప్రశాంత్, అతని సోదరుడు మనోహర్‌ను బుధవారం రాత్రి వారి స్వగ్రామం సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కొల్గూరులో పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు జూబ్లీహిల్స్ ఎస్‌ఎస్‌ఐ మెహర్ రాకేశ్ ఫిర్యాదు మేరకు దాడి ఘటనలో ప్రమేయమున్న నరేందర్, అతని స్నేహితుడు వినయ్, కారు డ్రైవర్లు సాయికిరణ్, ఎ.రాజుపై కేసు నమోదు చేశారు. అందులో సాయికిరణ్, రాజులను ఈనెల 19న అరెస్టు చేసి బుధవారం కోర్టులో హాజరుపరచగా..వారికి 14 రోజుల రిమాండ్ విధించింది. అంతకుముందు జూబ్లీహిల్స్ పోలీసులు స్థానిక పోలీసుల సహకారంతో ప్రశాంత్ ఇంటివద్దకు చేరుకుని తమతో పాటు రావాలని అడిగారు. దీంతో ప్రశాంత్ తల్లిదండ్రులు గొడుగు సత్యనారాయణ, విజయమ్మ, బంధువులు ఆందోళనకు గురయ్యారు. ఈనెల 17న బిగ్‌బాస్ సీజన్ –7 ఫైనల్స్‌లో భాగంగా జూబ్లీహిల్స్ అన్నపూర్ణ స్టూడియోలో షూటింగ్ వద్దకు పల్లవి ప్రశాంత్, రన్నరప్ అమర్‌దీప్ అభిమానులు చేరుకోగా అందులోని కొంతమంది ఆకతాయిలు రాళ్లను తీసుకుని బిగ్‌బాస్ సీజన్ 6లో పాల్గొన్న గీతూ రాయల్, ప్రస్తుత సీజన్ కంటెస్టెంట్ అశ్వినీ కార్లను, ఆరు ఆర్టీసీ బస్సులను ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే.

'నేడు సచివాలయాల్లో సీఎం జన్మదిన వేడుకలు'

సాక్షి, అమరావతి: నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపిన ఉద్యోగ ప్రదాత సీఎం వైఎస్ జగన్ అని గ్రామ/వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కొనియాడింది. సచివాలయ వ్యవస్థ స్థాపించి 1.34 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిన సీఎం జగన్ జన్మదినం సందర్భంగా ప్రతి సచివాలయం పరిధిలో సీఎం జన్మదినం సందర్భంగా కనీసం ఒకరికి చేయూతనందించి మానవత్వం చాటుకుంటున్నట్లు ఫెడరేషన్ తెలిపింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.జాని పాషా, ప్రధాన కార్యదర్శి జి.హరీంద్ర, ఉపాధ్యక్షులు కె.రామకృష్ణా రెడ్డి, పీవీ.కిరణ్ కుమార్, కోశాధికారి బి.పుల్లారావు, కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్‌కే.సుభాని, రాష్ట్ర సమన్వయకర్త ఎం.శశిధర్, మహిళా విభాగం కన్వీనర్, కో–కన్వీనర్ బి.శ్వేతా, ఎల్.అర్చన పేర్కొన్నారు. 1.34 లక్షల మంది యువత జీవితాలకు శాశ్వత భరోసా కల్పించిన ముఖ్యమంత్రికి సచివాలయ ఉద్యోగులు, వారి కుటుంబాలు జీవితాంతం రుణపడి ఉంటాయన్నారు. సీఎం జన్మదినం సందర్భంగా సచివాలయాల్లో ఘనంగా వేడుకలు నిర్వహించి సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

చేనేత సాంస్కృతిక వారసత్వం గొప్పది

- భూదాన్‌పోచంపల్లిలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- చేనేత పరిశ్రమకు ఫ్యాషన్ డిజైనర్లు సహకరించాలని సూచన

సాక్షి, యాదాద్రి: మన చేనేత సాంస్కృతిక వారసత్వం, దేశ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించి ముందుకు తీసుకుపోవడంలో చేనేత కళాకారుల సహకారం గొప్పదని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. చేనేత రంగంలో గురు, శిష్య సంప్రదాయం ప్రకారం వృత్తి నైపుణ్యాలు తరతరాలుగా అందించడం మంచి సాంప్రదాయమని ప్రశంసించారు. ఆధునిక సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కొత్త డిజైన్‌లు, ఉత్పత్తులను అభివృద్ధి చేయడంలో చేనేత పరిశ్రమకు ఫ్యాషన్ డిజైనర్లు సహకరించాలని కోరారు. ఇందులో శిక్షణ ఒక ముఖ్యమైన అంశమని ఆమె అన్నారు. శీతాకాల విడిదిలో భాగంగా హైదరాబాద్‌కు వచ్చిన రాష్ట్రపతి బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా భూధాన్‌పోచంపల్లిని సందర్శించారు. ఇక్కత్ వస్త్రాలు తయారు చేసే చేనేత కళాకారులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారతదేశ వారసత్వంలో ఒక భాగమైన చేనేత వృత్తి గురించి తెలుసుకోవడానికి పోచంపల్లి గ్రామానికి వచ్చి పట్టు చీరలు ఎలా తయారు చేస్తారో చూడడం సంతోషం కలిగిస్తోందని రాష్ట్రపతి చెప్పారు. యూఎన్‌డబ్ల్యూటీవో (యునైటెడ్ నేషన్స్ వరల్డ్ టూరిజం ఆర్గనైజేషన్) 2021లో పోచంపల్లి గ్రామాన్ని ప్రపంచ ఉత్తమ పర్యాటక గ్రామాలలో ఒకటిగా ప్రకటించడం చాలా సంతోషకరమన్నారు.

రేపటి నుంచి మాచ్‌ఖండ్ కార్మికుల సమ్మె



ముంచంగిపుట్టు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఆంధ్రా,ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు ఈ నెల 22వ తేదీ నుంచి సమ్మెకు దిగుతున్నారు. పర్మినెంట్ చేయాలని, వేతనాలు నేరుగా ఏపీ జెన్‌కో చెల్లించాలనే డిమాండ్లతో సమ్మె చేస్తున్నట్లు మాచ్‌ఖండ్ విద్యుత్ కేంద్రం సెక్యూరిటీ గార్డు, కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ అధ్యక్షుడు భువనేశ్వర్ పాండా ఒక ప్రకటనలో తెలిపారు. గత 12 ఏళ్లుగా మాచ్‌ఖండ్ విద్యుత్ కేంద్రంలో కార్మికులుగా పని చేస్తున్నామని పేర్కొన్నారు. తమకు ఏపీ జెన్‌కో ద్వారానే వేతనాలు చెల్లించాలని, కార్మికులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రతతో పాటు కుటుంబ సభ్యులకు విద్య, వైద్యం, వసతి కల్పించాలని కోరారు. ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని తెలిపారు. కార్మికుల సమ్మెతో మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం విద్యుత్ ఉత్పాదనతో పాటు డుడుమ, జోలాపుట్టు జలాశయాల నిర్వహణపై ప్రభావం చూపనుంది. విద్యుత్ ఉత్పాదన నిలిచిపోయే ప్రమాదం ఏర్పడనుంది.

బ్యాంకాక్ చేరుకున్న ఐఎన్‌ఎస్ కడ్‌మాట్



బ్యాంకాక్‌కు చేరుకున్న ఐఎన్‌ఎస్ కడ్‌మాట్‌లో నేవీ సిబ్బంది

సింధియా: ఉత్తర పసిఫిక్ మహాసముద్రం, దక్షిణ చైనా సముద్రంలో సుదూర కార్యచరణ విస్తరణలో భాగంగా భారత నౌకాదళానికి చెందిన ఐఎన్‌ఎస్ కడ్‌మాట్ థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌కు చేరుకుంది. రెండు నౌకాదళాల మధ్య పరస్పర సహకార చర్యలను మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ పర్యటన జరిగింది. బ్యాంకాక్ నుంచి బయలుదేరిన తరువాత ఓడ రాయల్ థాయ్ నేవీకి చెందిన కార్వెట్ అయిన హెచ్‌టీఎంఎస్ రత్తనాకోసిన్‌తో సముద్ర భాగస్వామ్య వ్యాయామం చేపడుతుంది. డిసెంబర్ 21వ తేదీన నావల్ స్టాఫ్ చీఫ్ ఆడ్మిరల్ ఎమ్‌ఆర్ హరికుమార్ ఐఎన్‌ఎస్ కడ్‌మాట్‌ను సందర్శిస్తారు. ఈ మేరకు డిసెంబర్ 19వ తేదీ నుంచి 22 వరకు బ్యాంకాక్‌లో రాయల్‌థాయ్ నేవీ నిర్వహించే కాన్‌క్లేవ్ ఆఫ్ చీఫ్ వద్ద భారత నావికాదళ ప్రతినిధి సీఎన్‌ఎస్ బృందానికి నేతృత్వం వహిస్తుంది. ఐఎన్‌ఎస్ కాడ్‌మాట్ భారత నౌకాదళానికి చెందిన నాలుగు స్వదేశీ కార్వెట్‌లలో రెండోది.

కామాంధుడికి జీవిత ఖైదు



అత్యాచారానికి పాల్పడిన తలారి సంజీవ

కర్నూలు (లీగల్): మతి స్థిమితం లేని ఓ అభాగ్యురాలిపై (19) అత్యాచారం చేసిన కామాంధుడికి జీవిత కాల కఠిన కారాగారశిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ కర్నూలు జిల్లా మహిళా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి జి.భూపాల్‌రెడ్డి బుధవారం తీర్పు చెప్పారు. వివరాలు... నంద్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని క్రాంతినగర్‌కు చెందిన ఓ మహిళకు కుమార్తె, ఇద్దరు కుమారులు. ముగ్గురూ మతిస్థిమితం లేనివారే. ఆమె భర్త అనారోగ్యంతో మృతిచెందగా, కూలి పనులు చేసుకుంటూ పిల్లలను పోషించేది. 2017 డిసెంబర్ 13న పిల్లలను ఇంట్లోనే ఉంచి కూలి పనులకు వెళ్లింది. ఆమె ఇంటి పక్కనే నివాసం ఉంటున్న, వరుసకు మరిది అయిన తలారి సంజీవ.. ఉదయం 11:30 గంటల సమయంలో ఇంట్లో టీవీ రిమోట్ తీసుకురమ్మని మతిస్థిమితం లేని యువతికి చెప్పాడు. ఆమె ఇంట్లోకి వెళ్లిన వెంటనే తాను వెళ్లి తలుపులు మూసి అత్యాచారం చేశాడు. ఏడ్చుకుంటూ యువతి బయటకు రాగా సమీపంలో ఉన్న ఆమె నానమ్మ గమనించి.. సంజీవను నిలదీసింది. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లి ఏం జరిగిందని యువతిని విచారించింది. కొద్దిరోజులుగా సంజీవ తనపై అత్యాచారం చేస్తున్నట్లు చెప్పింది. దీంతో ఆమె నంద్యాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. నిందితుడు తలారి సంజీవపై నంద్యాల రూరల్ సీఐ అభియోగపత్రాలు దాఖలు చేశారు. కేసు విచారణలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో జీవిత కాల కఠిన కారాగారశిక్ష, రూ.2 వేలు జరిమానా చెల్లించాలని న్యాయమూర్తి తీర్పు చెప్పారు. బాధితురాలికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు ఆదేశాలు జారీ చేశారు.

14మంది 'ఎర్ర' దొంగలు అరెస్ట్

రూ.50 లక్షల విలువ చేసే ఎర్రచందనం, మినీ లారీ, రెండు కార్లు స్వాధీనం



నిందితులను చూపుతున్న పోలీసులు

సత్యవేడు(తిరుపతి జిల్లా): ఎర్రచందనం ప్రైవేటు గోడౌన్‌లో కాపలాదారులను బంధించి, ఎర్రచందనం దుంగలు దోపిడీ చేసిన కేసులో 14 మందిని అరెస్టు చేసి, మినీలారీ (ఈచర్), రెండు కార్లు,14 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పుత్తూరు డీఎస్పీ వై. శ్రీనివాసరావు తెలిపారు. నిందితులను బుధవారం ఫారెస్ట్ రేంజర్ జయప్రసాద్ రావు సమక్షంలో, పోలీసులు మీడియా ముందు ప్రవేశపెట్టారు. పుత్తూరు డీఎస్పీ తెలిపిన వివరాల మేరకు.. కొత్తమారికుప్పం పంచాయతీ ఇంద్రాపురం సమీపంలో తమిళనాడుకు చెందిన రామచంద్రన్ మామిడి తోటలో ప్రభుత్వ అనుమతి పొందిన ప్రైవేటు గోడౌన్ ఉంది. డిసెంబరు 17వ తేదీ రాత్రి కొందరు దుండగులు కాపలాదారులైన అరకయ్య, ఆనందయ్య, చెల్లమ్మను బెదిరించి తాళ్లతో బంధించి ఎర్రచందనం గోడౌన్‌లోకి వెళ్లి రూ.50 లక్షలు విలువ చేసే 45 ఎర్రచందనం దుంగలను మినీ లారీలో తరలించుకుని వెళ్లారు. మామిడితోట యజమాని రామచంద్రన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు తమిళనాడుకు చెందిన 14మందిని అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు.



శక్తి లేదనిపిస్తుంది.
ప్రయత్నించాలి.
కాళ్లలో బలం లేదనిపిస్తుంది.
కదలాలి.
ఎవరూ తోడు నిలవడం లేదనిపిస్తుంది.
ఒంటరిగా పోరాడాలి.
లేదని ఓడేది మనిషే.
ఉందని గెలిచేది మనిషే.
మేనుకా పాడెల్‌కు చూపు లేదు.
నేపాల్ నుంచి ఇండియాకు
పాటను నమ్ముకుని వచ్చింది.
తన పాటతో ఎందరినో కదిలించింది.
ఇండియన్ ఐడెల్ కంటెస్టెంట్‌గా ఎంపికై
ఇప్పుడు 'సలార్'లో పాడి దేశం మొత్తానికి
వినపడుతోంది.
స్ఫూర్తిదాయకమైన
ఈ గాయని గురించి...

పాడాలి... వినపడుతుంది

*'ఓ పాలన్ హారే నిర్గుణ్ ఔర్ న్యారే
తుమ్‌ బిన్ హమ్రా కోనా నహీ'...*


'సలార్' చిత్రంలోని ఓ దృశ్యం

'లగాన్'లోని ఈ పాటను మేనుకా పాడెల్ (25) పాడుతున్నప్పుడు, ఆ పాటలోని ఆర్తికి, అర్పణకి, ఆరాధనకి న్యాయ నిర్ణేతల్లో ఒకరైన శ్రేయా ఘోషల్ ఏడుస్తూనే ఉంది. మరో జడ్జి విశాల్ దద్లానీ పరిస్థితీ అంతే. ఇంకో జడ్జయిన ప్రముఖ గాయకుడు కుమార్ షాను 'వహ్వా'లు కొడుతూనే ఉండిపోయాడు.

కన్ను తెరిచినా, కన్ను మూసినా చీకటి తప్ప, గాఢాంధకారం తప్ప, ఓడించాలని చూసే నలుపు తప్ప మరేమీ ఎరగని ఆమె తన పాటతో దివ్వె వెలిగించింది. వెలుతురు చూస్తోంది. వెలుతురు చూపిస్తోంది.

నేపాల్‌కు చెందిన అంధురాలు మేనుకా పాడెల్‌కు ఆడిషన్స్ రౌండ్‌లో గోల్డెన్ మైక్ దొరికింది. ఇండియన్ ఐడెల్ సీజన్ 14లో ఇంకా ఆమె టాప్ కంటెస్టెంట్‌గా కొనసాగుతూ ఉంది. ముఖేష్ స్పెషల్‌లో ముఖేష్ తనయుడు నితిన్ ముఖేష్ సమక్షాన 'ఏ ప్యార్ కా నగ్మా హై' పాడితే ఆయన ఎంతో సంతోషించాడు. దర్శకుడు మహేశ్ భట్ సమక్షంలో 'జఖ్మ్' సినిమాలోని 'గలి మే ఆజ్ చాంద్ నిక్‌లా' పాటను పాడితే ఆయన స్పందిస్తూ 'హృదయం దగ్గర ఒక కన్ను ఉంటుందని నువ్వు నిరూపించావు' అన్నాడు.

వాద్యాలు చూడకుండా, పాటను అక్షరాల్లో చూడకుండా, అంత పెద్ద సెట్‌ను చూడకుండా, తన ఎదుట ఉన్న జడ్జిలు ఎలా ఉంటారో చూడకుండా మేనుకా పాడెల్ ఎంతో నిబ్బరంతో పాటలు పాడటం వల్ల కోట్లమంది అభిమానులను సంపాదించుకుంది. ఇంతకుముందు రియాల్టీ షోలలో కొంతమంది అంధులు పాడటానికి ప్రయత్నించారు కానీ ఇలా నిలువలేదు. మేనుకా పాడెల్ గొంతులోని మాధుర్యం చివరకు ఆమెను'సలార్' లో పాడే వరకూ తీసుకెళ్లింది.

'సలార్' హిందీ వెర్షన్‌లోని 'సూరజ్ హీ ఆజ్ తన్‌కే' పాటను మేనుకా పాడెల్ పాడింది. దీని వల్ల ఆమె బాలీవుడ్ ఎంట్రీ ఒక భారీ సినిమాతో జరిగిందని చెప్పాలి. ఇదంతా ఆమె పాడాలి అనుకోవడం వల్ల. ఓడాలి అని అనుకోకపోవడం వల్ల.

నేపాల్ అమ్మాయి

మేనుకా పాడెల్‌ది నేపాల్‌లోని జాపా. పుట్టుకతో చూపు లేకపోయినా తల్లిదండ్రులు ఆ లోటు తెలియనీకుండా పెంచారు. బాల్యం నుంచి గానం పట్ల ఆమె ఆసక్తిని ప్రోత్సహించారు. తండ్రి మలేసియాలో ఉపాధిని వెతుక్కుంటూ వెళ్లగా ఇంటి బాధ్యత ఇప్పుడు మేనుక మీదే ఉంది. ముంబైలోని సురేష్ వాడ్‌కర్ అకాడెమీలో కొన్నాళ్లు పాడటం నేర్చుకున్న మేనుక గాయనిగా తన ప్రతిభను చాటేందుకు ప్రయత్నిస్తూనే వచ్చింది. సాయిబాబా భజనలు పాడుతూ ఉపాధి పొందింది. 'సాయిబాబా నా కుటుంబ సభ్యుడు' అని చెప్పుకుంటుంది. బహుశా ఆ సాయి దయ వల్లే ఆమెకు ఇప్పుడు గొప్ప గుర్తింపు లభించింది. ఆమె పాటను మీరు ఇండియన్ ఐడల్‌లో వినచ్చు.

బ్యూటిప్



రెండుగంటలు నానిన నాలుగు టీస్పూన్ల పొట్టు పెసరపప్పుని పేస్టు చేయాలి. ఈ పేస్టులో టీస్పూను ఆరెంజ్ పీల్ పొడి, టీస్పూను గంధం పొడి వేసి కలపాలి. ఈ పేస్టుని ముఖానికి పూతలా వేసి పదినిమిషాలు ఆరనివ్వాలి. తరవాత కొద్దిగా నీటితో తడిచేసి మర్దన చేసి కడిగేయాలి. వారానికి మూడుసార్లు ఈ ప్యాక్ వేసుకుంటే ముఖం కాంతిమంతంగా, అందంగా కనిపిస్తుంది.

హెయిర్ కేర్

టీస్పూను అలోవెరా జెల్, రెండు టేబుల్ స్పూన్ల ఉల్లి రసం, మూడు టీస్పూన్ల కొబ్బరి నూనెవేసి అన్నిటినీ చక్కగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మాడుకు రాసి మర్దన చేయాలి. మరుసటిరోజు తలస్నానం చేయాలి. వారానికి రెండుసార్లు ఇలా చేయడం వల్ల పలుచబడిన మాడు ఒత్తుగా, నల్లగా నిగనిగలాడుతుంది.



● ముగ్గు-ముచ్చట




రాపోలు మమత
కరీంనగర్

17 చుక్కలు
17 వరుసలు
సరిచుక్కలు


గాదిరెడ్డి సుభాషిణి
గుడివాడ



21 చుక్కలు
9 వరసలు
9 వచ్చేవరకు




ఎస్.ఉష
కడప

17 చుక్కలు
9 వచ్చేవరకు

మీరు ముగ్గులు వేస్తారా? అలా అయితే ముచ్చటైన మీ ముగ్గులను అందమైన రంగులతో కాగితం మీద పెట్టండి. చుక్కల వివరాలు, ఊరు పేరుతో సహా వాటిని మాకు పంపండి. వాటిలో మంచి ముగ్గును మీ ఫొటోతో సహా మేము ప్రచురిస్తాం.



ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1,
బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

అదర్ సైడ్

'ఒక వ్యక్తిని
బాగా అర్థం చేసుకోవడానికి
తీరిక సమయాన్ని మించిన
విలువైన సమయం లేదు'
అంటుంది సురభి యాదవ్.
పని ఒత్తిడి లేని
తీరిక సమయం
మహిళలకు ఎలాంటిది?
పాట నుంచి ఆట వరకు
ప్రతి విన్యాసం, ప్రతి క్షణం
అపురూపం.
అలాంటి అపురూప
కాలాన్ని 'బసంతి:
ఉమెన్ ఎట్ లీజర్ టైమ్'
అందంగా అద్దం పడుతుంది....




సురభి యాదవ్

తీరిక వేళలో.. తీయటి జ్ఞాపకాలలో...

మధ్యప్రదేశ్‌లోని ఖర్గోన్ ప్రాంతంలోని ఒక గ్రామంలో పుట్టి పెరిగిన సురభి యాదవ్ ఐఐటీ–ఢిల్లీలో బయో కెమికల్ ఇంజనీరింగ్ చేసింది. పెద్ద చదువు చదువుకున్న తొలి మహిళగా తనకు గ్రామంలో ప్రత్యేక గుర్తింపు ఉండేది. ఊరు దాటి ఐఐటీ-క్యాంపస్‌లోకి అడుగుపెట్టిన సురభికి పెద్ద ప్రపంచంలోకి అడుగు పెట్టినట్లుగా అనిపించింది. ఎంతోమంది వ్యక్తులు, వందలాది పుస్తకాలు, కళలు... తన ఆలోచనలను విశాలం చేశాయి.. 'థింకింగ్... రీడింగ్... రైటింగ్' అనేది తన ప్రధాన వ్యాపకంగా మారింది.

పై చదువుల కోసం కాలిఫోర్నియాకు వెళ్లిన సురభి అక్కడి నుంచి తిరిగి వచ్చిన తరువాత ఒక ఎన్జీవోలో కొంతకాలం పనిచేసింది. ఆ తరువాత 'సర్ఝే సప్నే' అనే స్వచ్ఛంద సంస్థను ప్రారంభించింది.

'సామాజిక సేవ అనేది ప్రయోజనాన్ని ఆశించి చేసేది కాదు. అది మన జీవనవిధానంలో భాగం' అని తండ్రి చెప్పిన మాటలు సురభి సామాజిక సేవా రంగంలోకి రావడానికి కారణం అయ్యాయి.

స్వచ్ఛందసేవా కార్యక్రమాల్లో తలమునకలయ్యే సురభి యాదవ్‌లో మంచి ఫోటోగ్రాఫర్ ఉంది. ఆమె తాజా ప్రాజెక్ట్ 'బసంతి: ఉమెన్ ఎట్ లీజర్ టైమ్' తన తల్లి జ్ఞాపకాల స్ఫూర్తితో చేసింది. కొన్ని సంవత్సరాల క్రితం తల్లి చనిపోయింది. తల్లి గురించి బంధువులు, పరిచయస్తులతో మాట్లాడుతున్న క్రమంలో తల్లికి సంబంధించి తనకు తెలియని కొత్త విషయాలు ఎన్నో తెలిసి ఆశ్చర్యానికి గురి చేశాయి. ఎప్పుడూ గంభీరంగా కనిపించే తల్లిలో ఒక సరదా మనిషి ఉన్నట్లు తెలియదు. ఆమెకు ఈత వచ్చు అనే విషయం తెలియదు. 'ఇలాంటి తల్లులు ఇంకా ఎంతమంది ఉన్నారో?' అని ఆలోచిస్తున్నప్పుడు 'ఉమెన్ ఎట్ లీజర్ టైమ్' ప్రాజెక్ట్ ఆలోచన వచ్చింది. తీరికవేళలలో సురభి తల్లి తన పేరు 'బసంతి'ని పేపర్ మీద రాస్తూ ప్రాక్టీస్ చేస్తూ ఉండేది. ఆమె చదువుకోలేదు. పిల్లల ప్రోగ్రెస్ కార్డులపై సంతకం పెడుతున్నప్పుడు ఆమె కళ్లలో గొప్ప వెలుగు కనిపించేది.


మధ్యప్రదేశ్‌లోని ఖార్గోన్‌లో ఎండాకాలంలో ఒక తీయటిరోజు


తీరికవేళ హిమాచల్‌ప్రదేశ్‌లోని సుక్హాడ్ గ్రామంలో మహిళల గానప్రతిభ

'ఒక వ్యక్తిని బాగా అర్థం చేసుకోవాలంటే ఆ వ్యక్తిని తీరిక సమయంలో పరిశీలించాలి. అయితే పని ఒత్తిడి వల్ల ఆ తీరిక సమయాన్ని పట్టుకోవడం కష్టం. ఒకవేళ పట్టుకుంటే అరుదైన సందర్భాలను రికార్డ్ చేయవచ్చు. బసంతి: ఉమెన్ ఎట్ లీజర్ టైమ్ అలాంటి ప్రయత్నమే' అంటుంది సురభి.

'ఉమెన్ ఎట్ లీజర్'లో ఉన్న వెయ్యికిపైగా చిత్రాలు దేశంలోని వివిధ ప్రాంతాలలో తీసినవి.



స్పెషల్ సర్‌ప్రైజ్ ఫర్ క్రిస్మస్

మరికొద్దిరోజుల్లో జరుపుకోనున్న క్రిస్మస్‌కు దాదాపు ప్రపంచమంతా ఆత్రుతగా రెడీ అయిపోతోంది. షాపింగ్ మాల్స్ నుంచి క్రిస్టియన్ లోగిళ్లు, చర్చ్‌లు.. క్రిస్మస్ స్టార్‌లు, ట్రీల అలంకరణతో మిరుమిట్లు గొలుపుతున్నాయి. వీటితోపాటు తప్పనిసరిగా సందడి చేసేవి శాంతాక్లాజ్ ఇచ్చే బహుమతులు. శాంతాక్లాజ్ సర్‌ప్రైజ్ గిఫ్ట్స్ కోసం పిల్లలు చాలా ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు. పిల్లలేగాక, కొన్ని కంపెనీలు సైతం ఉద్యోగులకు, కొంతమంది బంధువులకు, స్నేహితులకు, సహోద్యోగులకు సర్‌ప్రైజ్‌గిఫ్ట్స్‌ను ఇచ్చిపుచ్చుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈసారి క్రిస్మస్‌కు తక్కువ బడ్జెట్‌లో ప్రత్యేకంగా, ఆకర్షణీయంగా నిలిచే బహుమతులు ఇవ్వాలనుకుంటున్నారా? అయితే ఇలా ప్రయత్నించి చూడండి...



మొక్కలు

పర్యావరణం పచ్చగా ఉంటేనే అందరూ సంతోషంగా ఉంటారు. అందుకే పర్యావరణ స్నేహితం అయిన పచ్చని మొక్కలను క్రిస్మస్‌కు బహుమతిగా ఇవ్వొచ్చు. ఇప్పుడున్న ఇరుకు ఇళ్లకు ఇండోర్ ప్లాంట్స్ అయితే మరింత మంచి గిఫ్ట్ అవుతాయి.

గిఫ్ట్‌కార్డ్స్, స్పా వోచర్స్

మార్కెట్లో రకరకాల ఫ్యాషన్ బ్రాండ్స్ అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఏవైనా గిఫ్ట్‌గా ఇవ్వొచ్చు. స్పా వోచర్స్ కూడా మంచి గిఫ్ట్సే.

మ్యాచింగ్ పీజేఎస్

పిల్లల నుంచి పెద్దల వరకు అందరికి నప్పేలా మ్యాచింగ్ క్రిస్మస్ పైజమాలను గిఫ్ట్‌గా ఇవ్వొచ్చు. ఇవి ప్రత్యేకంగానూ, ఫన్నీగా ఉండి పండుగ సందడిని మరింత పెంచుతాయి.



బుక్స్

మార్కెట్లో పాపులర్‌గానూ, బాగా సేల్ అవుతున్న నవలలు, క్లాసిక్ సాహిత్యం, ప్రేరణ కలిగించే పుస్తకాలు, ఆర్ట్, ఫొటోగ్రఫీ, ట్రావెల్‌కు సంబంధించిన కాఫీ టేబుల్ బుక్స్‌కూడా మంచి బహుమతులు. ఈ గిఫ్ట్ ఎక్కువకాలం నిలిచి ఉంటుంది.

పర్సనలైజ్డ్ గిఫ్ట్స్

ఇమిటేషన్ జ్యూవెలరీ, ట్రెండీ అండ్ స్టైలిష్ ఫ్యాషన్ యాక్సరీస్ (వాచ్‌లు, సన్‌గ్లాసెస్, హ్యాండ్ బ్యాగ్స్), ఫొటో ఆల్బమ్స్, ఫ్రేమ్స్ కూడా క్రిస్మస్ గిఫ్ట్‌గా పనికొస్తాయి. ఇవి పండుగ సంతోషాన్ని రెట్టింపు చేస్తాయి.

సెల్ఫ్‌కేర్

చలికాలంలో చర్మ సంరక్షణ చాలా అవసరం. ఎక్కువమంది వింటర్‌లో చర్మాన్ని కోమలంగా ఉంచుకునేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. కాబట్టి వింటర్ స్కిన్ కేర్ ఉత్పత్తుల సెట్స్‌ను బహుమతిగా ఇవ్వొచ్చు. ఇవేగాక..సెంటెడ్ క్యాండిల్స్, ఫేస్ మాస్క్‌లు, స్లీపింగ్ మాస్కులు, బాతింగ్ కిట్స్ మంచి గిఫ్ట్స్.

పెర్‌ఫ్యూమ్స్

పెర్‌ఫ్యూమ్స్ క్లాసిక్‌గానూ, అందుబాటు ధరలో దొరికే గిఫ్ట్ ఐటమ్స్. పెర్‌ఫ్యూమ్ వాడిన ప్రతిసారి .. ఆ సువాసన భరిత పరిమళాలు మీ గిఫ్ట్‌తోపాటు మిమ్మల్ని, మీ అభిమానాన్ని గుర్తుచేస్తాయి.

మ్యూజిక్ బాక్స్

చార్మింగ్ లిటిల్ మ్యూజిక్ బాక్స్ కూడా ప్రత్యేకంగానూ ఫన్నీగా ఉంటుంది. ఇది కూడా క్రిస్మస్‌కు మంచి గిఫ్ట్. దీనినుంచి వచ్చే సంగీతం మనసుని ఆహ్లాద పరుస్తుంది.

అందమైన మగ్స్

ఉద్యోగులకు లేదా కొలీగ్స్‌కు అందంగా ఉండే మగ్స్ మంచి గిఫ్ట్ ఐడియా. ఈ మగ్స్‌లో స్టేషనరీ ఐటమ్స్ పెట్టుకోవడం లేదా, ఇష్టమైన కాఫీ తాగడం లేదా తరచూ వాడే ఐటమ్స్, అందమైన వస్తువులను పెట్టుకుంటారు. ఇవి తక్కువ ధరలో మంచి మంచి డిజైన్స్‌లో కూడా దొరుకుతాయి.

ఎయిర్ ప్యూరిఫైర్

ఎంతవేగంగా అభివృద్ధి చెందుతున్నామో అంతే స్పీడుగా గాలి కలుషితమైపోతున్న ఈ రోజుల్లో.. ఎయిర్ ప్యూరిఫయర్స్, ఫిల్టర్స్ అవసరంగా మారిపోతున్నాయి. అందుకే మినీ ప్యూరిఫయర్స్‌ను గిఫ్ట్‌గా ఇవ్వచ్చు. వీటిద్వారా మీ సన్నిహితులకు మంచి ఆక్సిజెన్‌ను అందించిన వారవుతారు.

డెకరేషన్ ఐటమ్స్

అలంకరించేకొద్దీ ఇంటి అందం పెరగడంతోపాటు.. కుటుంబ సభ్యుల మానసిక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. కాఫీ, టీసెట్స్, కుకింగ్ గాడ్జెట్స్, కిచెన్ టూల్స్, సెంటెడ్ క్యాండిల్స్ ఆర్ట్ వర్క్ హోం డెకరేటివ్ ఐటమ్స్ కూడా మంచి గిఫ్ట్స్. చిన్న పరిమాణం నుంచి పెద్దసైజులో ఎంతో ఆకర్షణీయమైన, ఉపయోగకరమైనవి అందుబాటు ధరల్లో దొరుకుతున్నాయి.

క్రాఫ్ట్స్ మేకింగ్ కిట్స్

జ్యూవెలరీ తయారీ, క్యాండిల్ తయారీ, సబ్బుల తయారీ కిట్స్, వెరైటీ దియా మేకింగ్ కిట్స్, ప్లాంట్ టెర్రారియం, గార్డెనింగ్ సెట్స్ కూడా మంచి బహుమతులే.

వీటిలో ఏది బహుమతిగా ఇచ్చినా మీరు మీ ఆత్మీయుల సంతోషాన్ని చూరగొంటారు.



సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
గురువారం : 21 : డిసెంబర్ : 2023



బుధవారం ఉదయం ధార్వాడ శివార్లలో ఆవరించిన పొగమంచు



బెంగళూరు మెజెస్టిక్ రైల్వేస్టేషన్ వద్ద ఈ బోగీని రెస్టారెంటుగా మార్చనున్నారు

న్యూస్‌రీల్

కుక్కెలో మంత్రి పొంగులేటి పూజలు



విరాళమిస్తున్న మంత్రి, కుటుంబ సభ్యులు

యశవంతపుర: దక్షిణ కన్నడ జిల్లా కుక్కే సుబ్రమణ్య దేవస్థానంలో తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అన్నదానం కోసం కోటి రూపాయిల చెక్కును దేవస్థానం అధికారులకు అందజేశారు. ఆలయంలో జరుగుతున్న చంపా షష్టి వేడుకల్లో మంత్రి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. వారికి దేవస్థానం అధికారులు, వేద పండితులు లాంఛనాలతో స్వాగతం పలికారు. అనుకున్న కోరికలు నెరవేరడంతో సుబ్రమణ్యస్వామిని దర్శించుకున్నట్లు మంత్రి తెలిపారు.

ఊపిరితీసిన పొగమంచు

- లారీని కారు ఢీ.. ప్రైవేటు ఉద్యోగి మృతి





ప్రమాద దృశ్యం (ఇన్‌సెట్‌లో) మృతుడు సంతోష్

బనశంకరి: రోడ్డుపై నిలబడిన లారీని వెనుక నుంచి కారు ఢీకొట్టిన ప్రమాదంలో సంతోష్ (35) అనే అమెజాన్ కంపెనీ మేనేజర్ మృతిచెందాడు. ఈ ఘటన నగరంలో కామాక్షిపాళ్య ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెచ్ఎస్ఆర్.లేఔట్ నివాసి సంతోష్ బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు కారులో బయలుదేరాడు. నైస్‌రోడ్డు జంక్షన్ వద్ద వెళుతుండగా దట్టమైన పొగమంచు ఉండడంతో దారి సరిగా కనిపించలేదు. దీంతో రోడ్డుపక్కన నిలిచి ఉన్న లారీని కారు ఢీకొట్టింది. కారు పూర్తిగా ధ్వంసం కాగా సంతోష్ అక్కడికక్కడే మరణించాడు. కామాక్షీపాళ్య ట్రాఫిక్‌పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని విక్టోరియా ఆసుపత్రికి తరలించారు.

మైనర్ల అతి తెలివి

- నకిలీ నోట్ల మార్పిడికి యత్నం



తుమకూరు: ముగ్గురు మైనర్ బాలలు నకిలీ నోట్ల చలామణికి యత్నించారు. మొబైల్‌ఫోన్ దుకాణం యజమాని సమయస్ఫూర్తితో వారి మోసం నుంచి బయటపడ్డాడు. మధుగిరి పట్టణం వీఆర్ఎస్‌టీ రోడ్డులో ఉన్న ఒక మొబైల్ షాపులో మంగళవారం సాయంత్రం ముగ్గురు అబ్బాయిలు మొబైల్‌ఫోన్ కొనాలని వచ్చారు. తక్కువ ధరలో మొబైల్ చూపించాలని కోరారు. ఆ తర్వాత రూ. 10,500 విలువైన మొబైల్ తీసుకుంటామని చెప్పి 21 రూ.500 నోట్లను ఇచ్చారు. ఆ నోట్లను తీసుకుని లెక్కిస్తుండగా అనుమానం రావడంతో ఇవి మీ దగ్గరికి ఎలా వచ్చాయని వారిని ప్రశ్నించారు. దీంతో ఆ పిల్లలు భయపడి పారిపోయారు. వెంటనే దుకాణం యజమానికి నకిలీ నోట్లను మధుగిరి పోలీసు స్టేషన్‌లో అప్పగించి ఫిర్యాదు చేశాడు. పిల్లల కోసం గాలింపు చేపట్టారు.

కోవిడ్‌పై గాబరా వద్దు





బుధవారం బెంగళూరు కేఆర్ మార్కెట్‌లో మాస్కు కొంటున్న బాలిక



నగరంలో ఎంజీ రోడ్డులో మాస్కులు ధరించి వెళ్తున్న ఓ జంట

- క్రిస్మస్, కొత్త ఏడాది వేడుకలపై ఆంక్షలు లేవు
- రాష్ట్రంలో కరోనా టెస్టుల్ని పెంచుతాం
- ఆరోగ్య మంత్రి దినేశ్ వెల్లడి

శివాజీనగర: కోవిడ్ కేసులు పెరుగుతున్నా కూడా ప్రస్తుతానికి క్రిస్మస్, నూతన ఏడాది వేడుకలపై ఎలాంటి షరతులను విధించే యోచన లేదని ఆరోగ్య మంత్రి దినేశ్ గుండూరావు తెలిపారు. బెంగళూరు అంతర్జాతీయ ప్రయాణికులపై కూడా ఆంక్షలు లేవన్నారు. దేశంలో కరోనా కొత్త వేరియంట్ జేఎన్ 1 బయటపడి వైరస్ కేసులు పెరుగుతున్నందున కేంద్ర ఆరోగ్య మంత్రి మన్సుక్ మాండవీయ అన్ని రాష్ట్రాల ఆరోగ్య మంత్రులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. అందులో పాల్గొన్న మంత్రి ఆపై విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్త వైరస్ జాడ లేదు. ప్రస్తుతం కరోనా గురించి ఆందోళన అవసరం లేదు అని అన్నారు.

రద్దీ ప్రాంతాల్లో మాస్క్ మంచిది

60 ఏళ్లు పైబడిన వారికి, ఆరోగ్య కార్యకర్తలకు మాస్క్ తప్పనిసరి, అలాగే రద్దీ ప్రాంతాల్లో ప్రజలు మాస్క్ వేసుకోవడం మంచిదని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో కరోనా టెస్టులను పెంచి, గత 24 గంటల్లో 1,020 టెస్టులు చేసినట్లు చెప్పారు. శనివారం నాటికి 5 వేలకు పెంచుతామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆర్‌టీపీసీఆర్ పరీక్షలను ఉచితంగా చేస్తున్నారు, ప్రైవేట్ ఆసుపత్రుల్లో దీనికి ధరను గురువారం నిర్ధారిస్తామన్నారు.

నేడు సీఎం సమీక్ష

సీఎం సిద్దరామయ్య గురువారం కరోనాపై సమీక్ష నిర్వహిస్తారు. అధిక కేసులు వస్తే క్వారంటైన్ అమలుపై ఆలోచిస్తామని మంత్రి చెప్పారు. ప్రస్తుతం కోవిడ్ కేసుల్లో 90 శాతం మంది హోమ్ క్వారంటైన్‌లో ఉన్నారని, ఆక్సిజన్, ఐసీయూలను సిద్ధంగా ఉంచుకోవాలని కేంద్రమంత్రి సూచించారని చెప్పారు. కరోనా వల్ల బెంగళూరు చామరాజపేటలో ఒక వృద్ధుడు మరణించాడని తెలిపారు. ఆయనకు అప్పటికే పలు రకాల జబ్బులు ఉన్నాయని అన్నారు.



బ్రిగేడ్ రోడ్‌లో కొత్త ఏడాది వేడుకల్లో రద్దీ (ఫైల్)

రాష్ట్రంలో 22 కేసుల నమోదు

సాక్షి, బెంగళూరు: కన్నడనాట కరోనా కేసుల తాకిడి మొదలైంది. వివిధ జిల్లాల్లో బుధవారం 22 పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. బాధితుల్లో ఇద్దరు మరణించడం గమనార్హం.

- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఇచ్చిన సమాచారం మేరకు బెంగళూరు నగరంలో మొత్తం 359 మందికి పరీక్షలు చేయగా అందులో 19 మందికి పాజిటివ్ అని నిర్ధారణ అయింది.
- చిక్కబళ్లాపురలో 94 మందికి, ధారవాడలో ఐదుగురికి పరీక్షలు నిర్వహించగా పాజిటివ్‌లు లేవు.
- దక్షిణ కన్నడ, జిల్లాలో ఇద్దరికి పరీక్షలు చేస్తే ఒకరికి పాజిటివ్ అని తేలింది. బళ్లారిలో మరో ఇద్దరికి కోవిడ్ పాజిటివ్ అని గుర్తించారు.
- ప్రస్తుతం రాష్ట్రంలో 92 యాక్టివ్ కోవిడ్ కేసులు ఉన్నాయి. వీరిలో 72 మంది హోం ఐసోలేషన్‌లో ఉండగా, 20 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఏడుమంది ఐసీయూలో ఉన్నారు.
- గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలో 808 టెస్టులు చేశారు. ఇప్పటివరకు పాజిటివిటీ రేటు 1 శాతం కన్న తక్కువగా ఉండేది. తాజాగా అది 2.47 శాతానికి పెరిగింది.

రామనగరలో యువతికి కోవిడ్

దొడ్డబళ్లాపురం: రామనగరలో రెండో కరోనా కేసు నమోదయింది. పట్టణ నివాసి అయిన యువతి (21)కి కోవిడ్ పాజిటివ్ వచ్చింది. జిల్లా ఆస్పత్రిలోని కోవిడ్ వార్డులో ఆమెకు చికిత్స అందిస్తున్నారు. పక్క వార్డులో కరోనా సోకిన యువకునికి కూడా చికిత్స ఇస్తున్నారు. బాధిత యువతి తల్లికి కూడా సోకినట్లు అనుమానాలున్నాయి.

గుండెపోటుతో విద్యార్థిని మృతి



విద్యార్థిని సృష్టి (ఫైల్)

యశవంతపుర: ఆడిపాడే చిన్న వయసులోనే బాలికను గుండెపోటు పొట్టనపెట్టుకుంది. ఈ సంఘటన చిక్కమగళూరు జిల్లా మూడిగెరె తాలూకా జోగణ్ణనకెరె గ్రామంలో జరిగింది. విద్యార్థిని సృష్టి (13) 8వ తరగతి చదువుతోంది. బుధవారం పొద్దున్నే పాఠశాలకు వెళ్లడానికి సిద్ధమవుతుండగా గుండెపోటు రావటంతో కుప్పకూలిపోయింది. కుటుంబసభ్యులు మూడిగెరె ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలో కన్నుమూసింది. బిడ్డను కోల్పోయిన కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

నిన్నే పెళ్లాడుతా

- బాలికపై ఉపాధ్యాయుడి వేధింపులు

తుమకూరు: వసతి పాఠశాల విద్యార్థినితో ఒక ఉపాధ్యాయుడు అనుచితంగా ప్రవర్తించాడు. ఈ ఘటన తుమకూరు తాలూకా హెబ్బూరులోని నరసాపుర మొరార్జీ వసతి పాఠశాలలో జరిగింది. ఇటీవల జరిగిన ఒక స్వాగత వేడుకలో ఆరో తరగతి చదువుతున్న బాలికతో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు రవీంద్ర అసభ్యంగా ప్రవర్తించాడు. నువ్వు చీరలో చాలా అందంగా ఉన్నావు, వచ్చే జన్మలో పెళ్లి చేసుకుంటే నిన్నే చేసుకుంటానంటూ రవీంద్ర వేధించాడు. పదే పదే వెంటబడి వేధిస్తున్న రవీంద్ర పోరు తట్టుకోలేక బాలిక ప్రిన్సిపాల్‌కు సమాచారం అందించింది. తరువాత తన సోదరుడు, మామతో పాటు మహిళా పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. పోలీసులు సదరు కీచకున్ని అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

వాట్సాప్ స్టేటస్.. ఇద్దర్ని బలిగొంది



శృతి, మురళి (ఫైల్)

మైసూరు: సోషల్ మీడియా వల్ల ఎన్ని ఉపయోగాలు ఉన్నా, జాగ్రత్తగా ఉండకపోతే ప్రాణాలే పోతాయని అనేకసార్లు రుజువైంది. సామాజిక మాధ్యమాల్లో తమ ఇద్దరి ఫోటో వైరల్‌గా మారడంతో ఇరు కుటుంబాల ఘర్షణ పడగా, మనస్తాపానికి గురైై గృహిణి, మరో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన జిల్లాలోని హుణసూరులో జరిగింది. హుణసూరులోని కల్కుణి నివాసి వివాహిత శృతి (28), మురళి (20) ఆత్మహత్య చేసుకున్నవారు. వీరిద్దరి మధ్య స్నేహం కుదిరింది. ఇద్దరు కలసి ఉన్న ఫోటోను మురళి వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకోగా ఊళ్లో చాలామంది అది చూశారు. దీంతో ఇరు కుటుంబాల మధ్య గొడవ జరిగింది. దీంతో భయపడిపోయిన శృతి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇది తెలిసి మురళి కూడా భయంతో ప్రాణాలు తీసుకున్నాడు.

మరో పొంజి స్కీం.. బడా మోసం

- పెట్టుబడి పెడితే అధిక లాభాలని ప్రచారం
- రూ. 25 కోట్లకు పైగా వసూలు
- బెంగళూరులో బాగోతం
- యజమాని, మేనేజర్ అరెస్టు



పోలీసులకు పట్టుబడిన వసంత్, ప్రదీప్



చిల్లర ఆశ చూపి లక్షలు దోపిడీ

బనశంకరి: పెట్టుబడి పెట్టండి, ఆకర్షణీయ లాభంతో పాటు చివరికి అసలు కూడా పొందండి అనే మోసపూరిత మాటలు నమ్మి వందలాది మంది లక్షల రూపాయలు నష్టపోయారు. ఈ ఆర్థిక కుంభకోణం ఐటీ సిటీలో వెలుగుచూసింది. వివరాలు.. రామనగర జిల్లా హారోహళ్లి తాలూకా గుండనగొల్లహళ్లి గ్రామానికి చెందిన ప్రదీప్ 2021లో బెంగళూరు దొడ్డకల్లసంద్ర సమీపంలోని నారాయణనగరలో భార్య సౌమ్యా పేరుతో ప్రమ్య ఇంటర్నేషనల్ అనే ఒక కంపెనీని తెరిచాడు. దీనికి ఏ అనుమతులు లేవు. ఈ కంపెనీలో వసంత్‌కుమార్ అనే వ్యక్తి మేనేజర్‌గా, అతనికి సహాయకారిగా ఉన్నాడు. తమ కంపెనీలో రుణం రూపంలో పెట్టుబడి పెడితే 15 నుంచి 20 శాతం లాభం ఇస్తామని ప్రదీప్ ప్రచారం చేశాడు. ఇతని మాటలు నమ్మిన ప్రజలు పెద్దసంఖ్యలో పెట్టుబడి పెట్టారు. మొదటి ఒకటి రెండు కంతులు లాభం ఇచ్చి, ఇంకా పెద్ద మొత్తంలో పెట్టుబడి పెడితే మరింత లాభం వస్తుందని ఖాతాదారులను మభ్యపెట్టాడు.

లక్షకు నెలకు రూ.15 వేలు ఇస్తామని

లక్ష రూపాయలు పెట్టుబడి పెడితే ప్రతి నెల రూ.15 వేలు తిరిగి ఇస్తామని, ఇక చాలనుకున్నప్పుడు లక్షను తిరిగి ఇచ్చేస్తామని ప్రదీప్ ఆశచూపాడు. కొన్నినెలల్లోనే పెట్టుబడి తిరిగి వస్తుంది కదా అని అమాయకులు బుట్టలో పడ్డారు. కొత్త సభ్యులను చేర్పిస్తే పాత కస్టమర్లకు ప్రోత్సాహకాలు ఇస్తామని చెప్పడంతో వారు స్నేహితులను, బంధువులను కూడా చేర్పించారు. ఇలా ఈ మోసపూరిత పొంజీ స్కీంలో రెండేళ్లలో సుమారు 700 మంది రూ.25 కోట్ల వరకూ ధారపోశారు.

రూ. 70 కోట్ల లావాదేవీలు?

ప్రతి ఒక్కరికీ మొదటి రెండు నెలలు చెప్పినంత సొమ్ముతిరిగి ఇచ్చి ఆపై మొండిచేయి చూపారు. దీంతో కొందరు బాధితులు సీసీబీ ఆర్థిక నేర విభాగం సీఐ ప్రవీణ్ సీ.యలిగార్, కోణనకుంటె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రదీప్ సుమారు రూ.70 కోట్ల కార్యకలాపాలు నిర్వహించినట్లు దర్యాప్తులో వెలుగుచూసింది. విచారణ చేపడుతున్నామని వంచన ఇంకా పెద్ద ఎత్తున ఉండవచ్చునని అధికారులు తెలిపారు. నిందితులు కోణనకుంటె జేఎస్.ప్రదీప్, నాగవార వసంత్ కుమార్ అనే ఇద్దరినీ అరెస్టు చేశామని సీసీబీ అధికారులు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.7 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. కంపెనీలోనూ సోదాలు చేపట్టారు. తమ సొమ్ము తిరిగి వస్తుందా, నీళ్లొదులుకోవాలా? అని ఖాతాదారులకు నిద్ర కరువైంది.



ప్రమ్య ఇంటర్నేషనల్ కంపెనీ వెబ్‌సైట్

కన్నకొడుకునే నదిలోకి విసిరేసి..

- కిరాతక తల్లి అకృత్యం



చిన్నారి మృతదేహం

దొడ్డబళ్లాపురం: అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ఒక కసాయి తల్లి కన్నకొడుకును నదిలో విసిరేసి హత్య చేసిన సంఘటన చెన్నపట్టణలో వెలుగు చూసింది. తాలూకాలోని బానగల్లి గ్రామంలో భాగ్య అనే వివాహిత తన కుమారుడు దేవరాజ్ (13 నెలలు)ను కణ్వ నదిలోకి విసిరేసింది.

చెడు అలవాట్లకు లోనై..

భర్తను వదిలి పుట్టింట్లో ఉంటున్న భాగ్య స్థానికంగా ఒక వ్యక్తితో భాగ్య అక్రమ సంబంధం ఏర్పడింది. పగలంతా ప్రియునితో తిరుగుతుండడంతో భాగ్య తల్లి కొడుకును పట్టించుకోవా? అని చీవాట్లు పెడుతుండేది. మరోవైపు ప్రియుడు కూడా మన సంతోషానికి నీ కొడుకు అడ్డుగా ఉన్నాడని, నేను కావాలో నీ కొడుకు కావాలో తేల్చుకోవాలనేవాడు. దీంతో భాగ్య క్రూరంగా ఆలోచించి.. మంగళవారం రాత్రి కొడుకును ఎత్తుకెళ్లి నదిలోకి పడేసింది. ఆపై కాలికెరె దేవాలయం వద్దకు వచ్చి తన కుమారుడు నదిలో పడిపోయాడని ఏడవసాగింది. బుధవారం ఉదయం బాలుని మృతదేహం లభించింది. స్థానికుల సమాచారంతో భాగ్యను పోలీసులు తమదైన శైలిలో విచారించగా తానే పడేసినట్లు ఒప్పుకుంది. అక్కూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

కట్నం కోసం ప్రియుని ఒత్తిడి

- న్యాయ విద్యార్థిని ఆత్మహత్య

మైసూరు: ప్రేమికుడే వరకట్నం కోసం ఒత్తిడి చేయడంతో కాబోయే వధువు బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మైసూరు కువెంపునగర పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. తమిళనాడు నీలగిరీస్‌కు చెందిన యువతి కవీశ (21) నగరంలోని జేఎస్ఎస్ న్యాయ కళాశాలలో ఏడో సెమిస్టర్ చదువుతోంది. కవీశ కొన్ని రోజులుగా ఊటీకి చెందిన కిరణ్ అనే యువకుడిని ప్రేమిస్తోంది. ఇద్దరి ప్రేమ విషయం ఇంట్లో పెద్దలకు తెలిసింది. కిరణ్ కుటుంబ సభ్యులు కవీశ తల్లిదండ్రులను పెళ్లికి ఒప్పించారు. ఇద్దరికీ నిశ్చితార్థం కూడా జరిగింది. అప్పటినుంచి తనకు దండిగా కట్నకానుకల కూడా ఇవ్వాలని ప్రియుడు, కుటుంబీకులు ఒత్తిడి చేయసాగారు. కారు, బంగారం కావాలని లేదంటే పెళ్లిని ఆపేస్తామని వేధించ సాగారు. దీంతో ఆవేదన చెందిన కవీశ తాను ఉంటున్న హాస్టల్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె తల్లిదండ్రులు.. కిరణ్, అతని తల్లిదండ్రులు సేతుమాధవ, లతా పై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

కీచక హెచ్‌ఎం పరారు

మైసూరు: గౌరవనీయమైన గురువు స్థానంలో ఉండి విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన హుణసూరు తాలూకా హొసవారంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్.కృష్ణమూర్తి (58) సస్పెండ్ అయ్యాడు. కొన్ని రోజులుగా పాఠశాలలో ఆడపిల్లలతో అనుచితంగా ప్రవర్తిస్తూ, ఎవరికీ చెప్పవద్దని బెదిరించేవాడు. గత శనివారం పాఠశాలకు ఇతడు గైర్హాజరవడం చూసి విద్యార్థినులు ఇతర టీచర్ల ముందు గోడును వెళ్లబోసుకున్నారు. వారు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. కృష్ణమూర్తిపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేస్తూ ఆందోళన చేశారు. దీంతో అధికారులు అతనిని సస్పెండ్ చేశారు. కొందరు తల్లిదండ్రులు అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. దీంతో అతడు పరారయ్యాడు.



నిందితుడు కృష్ణమూర్తి

అమిత్ షాతో సీఎం భేటీ

శివాజీనగర: రాష్ట్రంలో కరువు నివారణకు పరిహార నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, బుధవారం ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా కు విన్నవించారు. పార్లమెంటులో ఆయనను కలిసి రాష్ట్రంలో తీవ్ర కరువు సమస్య తలెత్తిందని, 236 తాలూకాలలో 223 తాలూకాలు కరువుకు గురయ్యాయని, 48.19 లక్షల హెక్టార్లలో పంట నష్టం జరిగిందని వివరించారు. తక్షణం రూ.18,000 కోట్లు కేటాయించాలని విన్నవించారు.

మాడాళ్‌కు పెద్ద ఊరట

- టెండర్– లంచం కేసు కొట్టివేత

బనశంకరి: చెన్నగిరి బీజేపీ మాజీ ఎమ్మెల్యే మాడాళ్ విరూపాక్షప్పకు పెద్ద ఉపశమనం లభించింది. కర్ణాటక సోప్స్ సంస్థ టెండర్ లంచం కేసును హైకోర్టు రద్దు చేసింది. లోకాయుక్త దాఖలు చేసిన ఈ కేసును రద్దుచేయాలని మాడాళ్ హైకోర్టును ఆశ్రయించారు. బుధవారం విచారణ చేపట్టిన ఏకసభ్య పీఠం వాదనలు ఆలకించి ఈ కేసును కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. కేసు నమోదులో నిబంధనలను పాటించలేదని మాడాళ్ వకీళ్లు వాదించారు. సోప్స్ సంస్థలో మాడాళ్ తనయుడు ఉన్నతాధికారిగా పని చేస్తుండగా, ఒక టెండర్ ఇవ్వడానికి కోట్లాది రూపాయలు లంచం తీసుకుంటూ లోకాయుక్తకు దొరికిపోయారు. ఈ కేసులో తండ్రీ కొడుకులను అరెస్టు చేయగా, కొన్నిరోజులు జైల్లో ఉన్నారు. వారి ఇళ్లలో సోదాలు జరపగా రూ.4 కోట్ల వరకూ నగదు లభించింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు జరిగిన ఈ ఘటనతో బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది.

ఎమ్మెల్సీ సూరజ్‌కు ఊరట

యశవంతపుర: మాజీ మంత్రి హెచ్‌డీ రేవణ్ణ కొడుకు, ఎమ్మెల్సీ సూరజ్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని హైకోర్టులో దాఖలైన పిటిషన్‌ను కొట్టేసింది. ఎన్నికలలో అక్రమాలకు పాల్పడినందున చట్టసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని దేవరాజేగౌడ అనే న్యాయవాది పిటిషన్‌ను దాఖాలు చేశారు. విచారించిన న్యాయమూర్తి నాగప్రసన్న ధర్మాసనం బుధవారం పిటిషన్‌ను కొట్టివేయడంతో సూరజ్‌కు ఉపశమనం దక్కింది.



క్లుప్తంగా

డిమాండ్ల సాధనకు కాగడాల ప్రదర్శన



కాగడాలను ప్రదర్శిస్తున్న అతిథి ఉపన్యాసకులు

చిక్కబళ్లాపురం: డిమాండ్ల సాధనకు అతిథి ఉపన్యాసకులు ఉద్యమించారు. మంగళవారం రాత్రి జిల్లా కేంద్రంలో విలేరుల భవనం నుంచి బీబీ రోడ్డు మీదుగా ప్రభుత్వ జూనియర్ కాలేజు వరకు కాగడాలతో ప్రదర్శన నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మునిరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో 11,500 మంది గెస్ట్ లెక్చరర్లు 20 సంవత్సరాలుగా అరకొర వేతనాలతో పనిచేస్తున్నారన్నారు. వేతనాలు పెంచి పర్మినెంట్ చేయాలని 26 రోజులుగా ఆందోళన నిర్వహిస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

నాట్యంలో ప్రతిభ



నాట్యం చేస్తున్న హరిప్రియ

గౌరిబిదనూరు: భరతనాట్యంలో పట్టణంలోని దిక్సూచి నాట్యాలయ సీనియర్ విద్యార్థిని హరిప్రియ ప్రతిభచాటింది. బెంగళూరు ఉత్తర విశ్వవిద్యాలయం నిర్వహించిన ఉత్తరోత్సాహ 2023 కార్యక్రమంలో వివిధ కళాశాలల విద్యార్థులకు నృత్యపోటీలు నిర్వహించారు. దివ్యాశివనారాయణ్ శిష్యురాలు హరిప్రియ విశేష ప్రతిభ చాటి రెండో బహుమతి పొందింది.

కర్ణాటక భవన్ పునర్ నిర్మాణ పనులు వేగవంతం

శివాజీనగర: ఢిల్లీలోని కర్ణాటక భవన్ పునర్ నిర్మాణ పనులను ముఖ్యమంత్రి సిద్దరామయ్య బుధవారం పరిశీలించారు. వచ్చే సంవత్సరం జూన్ లోగా పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రూ.80–85 కోట్లతో భవన పునర్ నిర్మాణ పనులు 2020లో ప్రారంభమయ్యాయి. కోవిడ్–19, ఢిల్లీ ప్రభుత్వ కాలుష్య షరతులతో పనులు మందకొడిగా సాగాయి. దీంతో నిర్మాణ వ్యయం రూ.120 కోట్లకు పెరిగిందని అధికారులు తెలిపారు. పనులను పరిశీలించిన వారిలో రెసిడెంట్ కమిషనర్ ఇంకొంగ్లా జమీర్, అదనపు రెసిడెంట్ కమిషనర్ కృతి బన్సాల్, రాష్ట్ర ప్రజోపయోగ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీ.అనంత్, అసిస్టెంట్ ఇంజినీర్ ఎస్ఎల్ శరత్‌కుమార్, వాస్తుశిల్పి ఉదయ్ భట్ పాల్గొన్నారు.

బైక్‌ల దొంగ అరెస్టు



స్వాధీనం చేసుకున్న బైక్‌లు

తుమకూరు: జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో బైక్‌లను దొంగతనం చేసిన ప్రముఖ దొంగను పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి సుమారు 12 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇర్ఫాన్ అలియాస్ ఫాక్స్ (21) అనే యువకుడు బైక్‌ల చోరీలకు పాల్పడేవాడు. హొన్నుడికె సమీపంలో అనుమానాస్పదంగా బైక్‌లో తిరుగుతుంటే హెబ్బూరు పోలీసులు అతన్ని నిలిపి ప్రశ్నించారు. బైక్‌కు సంబంధించిన డాక్యుమెంట్లను చూపాలని అడగగా నీళ్లు నమిలాడు. దీంతో అతన్ని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించగా అసలు విషయం వెలుగు చూసింది. ఇలా దొంగతనం చేసిన బైక్‌లను వీలింగ్ చేసే యువకులకు రూ.5 వేలకే అమ్మేసే వాడని విచారణలో తేలింది.

పంటలపై గజ దాడులు



ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

దొడ్డబళ్లాపురం: కనకపుర తాలూకా ద్యాపేగౌడ నదొడ్డి గ్రామంలో ఏనుగులు బీభత్సం సృష్టించాయి. ఆహారం వెదుక్కుంటూ గ్రామం శివారుకు వచ్చిన ఏనుగులు పంటలపై పడి తొక్కి ధ్వంసం చేశాయి. కోత కోసిన వరిపంటతోపాటు అరటి తోటలపై పడి అరటి చెట్లు విరిచేశాయి. మహదేవ, మహేశ్ అనే రైతులకు చెందిన 25 క్వింటాళ్ల వరి పంట, సావిత్రమ్మ అనే మహిళకు చెందిన ముక్కాలు ఎకరాలో వరి పంటను పాడు చేశాయి. చేతికి రాబోతున్న పంట నేలపాలైందని రైతులు లబోదిబోమన్నారు. అటవీశాఖ అధికారులు నష్టపోయిన పంటలను పరిశీలించారు.



ధ్వంసమైన వరిపంట

రోజా పూల సాగు.. లాభాలు బాగు

- రూ.2 లక్షల పెట్టుబడితో రూ.12 లక్షల ఆదాయం
- కరువు కాలంలోనూ లక్షలాది రూపాయల రాబడి

శ్రీనివాసపురం: మామిడి పంటకు ప్రసిద్ధి చెందిన శ్రీనివాసపుర తాలూకాలో పలువురు రైతులు మామిడితో పాటు కూరగాయలు, పూలు కూడా పండిస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. తాలూకాలోని కమతంపల్లి గ్రామంలో రైతు శివారెడ్డి తన మూడు ఎకరాల పొలంలో రోజా పూలు పండించి అధిక లాభాలు గడిస్తున్నాడు. శివారెడ్డి తన పొలంలో రోజా పూలు పండించి కరువు కాలంలోను లక్షలు సంపాదిస్తున్నాడు. శివారెడ్డి డ్రిప్ ఇరిగేషన్ ద్వారా 1 ఎకరా 10 గుంటల భూమిలో 2200 రోజా మొక్కలను నాటాడు. ఇందుకోసం రూ.2 లక్షలు ఖర్చు చేశాడు. ఇంతవరకు రూ.12 లక్షలను రోజా పూల సాగు ద్వారా సంపాదించాడు. ఇంకా పంట దిగుబడి కొనసాగుతోంది. రోజా పూల ద్వారా మరింత ఆదాయం ఆశిస్తున్నట్లు రైతు శివారెడ్డి తెలిపాడు. రోజా పూలతో లాభాలు వస్తుండడాన్ని చూసిన శివారెడ్డి ప్రస్తుతం తన మూడు ఎకరాల మొత్తం భూమిలో 3500 రోజా మొక్కలను నాటాడు. రోజా మొక్కలకు అంటిన బూడిద, చుక్క రోగాల నివారణ కోసం వ్యవసాయ శాఖ అధికారులు, చుట్టుపక్కల ఆదర్శ రైతుల సలహాలతో తగిన మందులను చల్లి పంట దిగుబడి ఏ మాత్రం తగ్గకుండా జాగ్రత్త పడ్డాడు.

నాటిన మూడు నెలలకే దిగుబడి

రోజా పూల మొక్కలు నాటిన మూడు నెలలకే పూలు పూసి కోతకు వస్తున్నాయని రైతు శివారెడ్డి తెలిపాడు. రోజా పూలను సమీపంలోని ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లి మార్కెట్‌కు తీసుకు వెళ్లి విక్రయిస్తున్నాడు. పూసిన రోజాలను విడిపించడానికి కూలీలు ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు వచ్చి పని చేస్తారు. వారికి రూ.150 కూలీ ఇస్తున్నాడు,. ఉదయం పూట తక్కువ సమయం పని కావడంతో చాలా మంది కూలీలు అందుబాటులో ఉండడంతో ఎలాంటి కూలీల సమస్య తనకు ఎదురు కాలేదని రైతు శివారెడ్డి అంటున్నాడు. తనకు కుటుంబ సభ్యుల సహకారం కూడా చాలా ఉంది. శివారెడ్డి రోజాలతో పాటు టమాటా, చేమంతి, బంతిపూలు పండిస్తున్నా చేమంతి పంట ద్వారా చాలా నష్టపోయానని, ఆ నష్టం రోజాల ద్వారా పూడ్చుకున్నట్లు శివారెడ్డి తెలిపాడు. తాను రసాయనిక ఎరువులను వాడకుండా సేంద్రియ ఎరువులనే ఎక్కువగా పొలానికి వాడుతున్నానన్నాడు. పెంటపోగు, వేప, కానుగ, శెనగపిండి ఎరువులను వేసి భూసారాన్ని కాపాడుకుంటున్నట్లు తెలిపాడు.



పూలను కోస్తున్న కూలీకార్మికులు



మొక్కలకు పూసిన రోజా పూలు



చూడముచ్చటగొలుపుతున్న పూలు

చేమంతి నష్టం, రోజాలతో సమం



గతంలో చేమంతి పంట సాగు ద్వారా నష్టాలు చవి చూశాను. రోజాలతో ఆ నష్టాలు తీరి లాభాలు వస్తున్నాయి. ఇంకా రెండు సంవత్సరాలు రోజా పూల దిగుబడి ఉంటుంది. –రైతు శివారెడ్డి, కమతంపల్లి

విదేశాల్లో ఉద్యోగమంటూ వంచన

మైసూరు: ఆన్‌లైన్ మోసాలకు రాచనగరవాసులను లక్ష్యంగా చేసుకున్నట్లు కనిపిస్తోంది.తాజాగా ఒక వ్యక్తికి ఉద్యోగం ఆఫర్ లెటర్ పంపించి రూ. 2.20 లక్షలు దోచుకున్నారు. మైసూరు కువెంపు నగర రెండో లేఔట్ నివాసి సీకే గణేశ్‌కు డెన్మార్క్ కంపెనీలో ఉద్యోగం వచ్చిందని గుర్తు తెలియని వ్యక్తి ఆఫర్ లెటర్‌ను పంపించారు. వీసా పొందేందుకు రూ. 31,400 చెల్లించాలని సూచించాడు. బయట దేశం కంపెనీలో ఉద్యోగం కావడంతో గణేశ్ ఆసక్తి చూపాడు. సైబర్ మోసగాళ్లు చెప్పినట్లు పలు దఫాలుగా రూ. 2.20 లక్షలు వారి ఖాతాలకు పంపించాడు. ఆ తర్వాత ఎలాంటి ప్రతిస్పందన రాకపోవడంతో మోసపోయాయని గ్రహించి నగరంలోని సైబర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

కోవిడ్ మార్గదర్శకాలు పాటించాలి

శివాజీనగర: కేరళలో కరోనా వైరస్ విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ముందు జాగ్రత్తగా జారీచేసిన కోవిడ్ మార్గదర్శకాలను కట్టుదిట్టగా పాటించాలని మంత్రి రామలింగారెడ్డి విన్నవించారు. బుధవారం ఆయన శాంతినగరలో విలేకరులతో మాట్లాడారు. కేరళకు వెళ్లి వస్తే కోవిడ్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. 60 సంవత్సరాలు పైబడినవారు, జలుబు, దగ్గు, జ్వరం లక్షణాలు ఉన్నవారు తప్పకుండా మాస్క్ వేసుకోవాలని సూచించారు. బస్సులు, మెట్రోల్లో ప్రయాణించే సమయంలో మాస్క్ ధరించాలన్నారు. ఆలయాలకు వెళ్లిన సమయంలో 60 సంవత్సరాలు పైబడినవారు మాస్కులు ధరించాలన్నారు.

ఉచిత వైద్య శిబిరం

గౌరిబిదనూరు: గ్రామీణ ప్రజలు, పేదలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యవంతులు కావాలని బిజెపి నాయకుడు రవినారాయణ రెడ్డి అన్నారు. బజార్ రస్తాలోని వెంకటేశ్వర ఆలయంలో పలు సేవాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆరోగ్య చికిత్సా శిబిరాన్ని ప్రారంభించారు. నేటి కాలంలో మధుమేహం, అధిక బీపీ వంటి వ్యాధులు మామూలైనట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ రవి, డా విశ్వాస్, డా అర్పిత,అనూష, హరిణి ప్రకాశ్,నరేశ్ కుమార్, మోహన్ పాల్గొన్నారు.

జెండా తొలగించాలని దాడి

యశవంతపుర: కన్నడ జెండను ఆవిష్కరించినందుకు మరాఠి యువకులు దాడి చేసిన ఘటన బెళగావి జిల్లా చిక్కోడి తాలూకా అంకలి గ్రామంలో జరిగింది. గ్రామంలోని శివాజీ విగ్రహం వద్ద కన్నడిగులు కన్నడ జెండాను ఆవిష్కరించారు. ఆ జెండాను తొలగించాలని కొందరు మరాఠి యువకులు కన్నడిగులపై ఒత్తిడిచేసి దాడి చేశారు. దీంతో గ్రామంలో పోలీసుబందోబస్తును ఏర్పాటు చేశారు. ఐదు మంది మరాఠి యువకులపై సంకేశ్వర పోలీసులు కేసు నమోదు చేసి ఒకరిని అదుపులోకి తీసుకున్నారు.

ఐసీయూలో నటి హేమా చౌధరి

యశవంతపుర: బ్రెయిన్ హ్యామరేజ్‌తో నటి హేమా చౌధరి బెంగళూరు బ్యాప్టిస్ట్ ఆస్పత్రిలో రెండు రోజుల నుంచి ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. చికిత్సకు ఆమె స్పందించటంలేదని తెలిసింది. హేమా కొడుకు ఐస్‌ల్యాండ్‌లో ఉండగా ఆయన రాక కోసం కుటుంబసభ్యులు ఎదురుచూస్తున్నారు. హేమా తొందరగా కోలుకోవాలని అభిమానులు ప్రార్థిస్తున్నారు.

దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు

- 8 మంది అరెస్ట్

బనశంకరి: పోలీసులమంటూ పారిశ్రామికవేత్త ఇంట్లోకి చొరబడి కుటుంబసభ్యులపై దాడిచేసి రూ.60 లక్షల నగదు, నగలు దోచుకుని ఉడాయించిన 8 మంది దోపిడీదారులను బుధవారం పీణ్యా పోలీసులు అరెస్ట్‌చేశారు. దుండగులు ఈనెల 4న రాత్రి హెచ్ఎంటీ లేఔట్ ఎస్ఎస్ఆర్ పాలిపిలమ్స్ ప్యాకేజింగ్ కంపెనీ యజమాని మనోహర్ ఇంటి తలుపు తట్టారు. మనోహర్ భార్య సుజాత, కుమారుడు రూపేశ్ తలుపుతెరవగానే తాము పోలీసులమని పరిచయం చేసుకుని లోపలికి వచ్చారు. తమకు బంధువులతో వివాదాలు ఉండటంతో విచారణకు వచ్చి ఉంటారని రూపేష్ భావించాడు. కానీ వచ్చిన వారిలో ఐదారుమంది ఒక్కసారిగా మారణాయుధాలతో రూపేష్‌పై దాడి చేసి కుటుంబసభ్యులను అరవకూడదని బెదిరించి దాడికి పాల్పడ్డారు. అనంతరం ఇంటిలో గాలించి 700 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.60 లక్షల నగదు దోచుకున్నారు. సాక్ష్యాలు నాశనం చేయడానికి ఇంట్లో ఉన్న సీసీకెమెరా డీవీఆర్‌ను వెంట తీసుకెళ్లారు. దాడి అనంతరం తేరుకున్న కుటుంబ సభ్యులు పీణ్యా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు మనోహర్ ఇంటి చుట్టుపక్కల సీసీకెమెరాల్లోని ఫుటేజీలను పరిశీలించారు. ముఖచిత్రాల ఆధారంగా దొంగలను గుర్తించి అరెస్ట్ చేశారు.

ఆటోలో ఆస్పత్రికి గర్భిణి తరలింపు

- అందుబాటులో లేని అంబులెన్స్



గర్భిణిని ఆటోలో తరలిస్తున్న దృశ్యం

గంగావతి: కనకగిరి తాలూకాలోని హులిహైదర్‌కు అంబులెన్స్ లేని కారణంగా ఓ గర్భిణిని కాన్పు కోసం ఆటోలో తీసుకురావాల్సిన దుస్థితి ఏర్పడింది. గ్రామస్తులు తమ వద్దనున్న అంబులెన్స్ నెంబర్‌కు ఫోన్ చేయగా అక్కడి నుంచి మీ గ్రామానికి రావడానికి మూడు గంటలు పడుతుందని తెలియజేయడంతో వారు ఆటోలో ఆమెను ఆస్పత్రికి తరలించారు. సకాలంలో ఆస్పత్రికి రావడంతో ఓ ఆడ శిశువుకు ఆమె జన్మనిచ్చింది. ఏదేమైనా తమ గ్రామం చుట్టు పక్కల గ్రామాలకు అంబులెన్స్ సౌకర్యం అందుబాటులో లేకపోవడం వల్ల నానాఇబ్బందులు పడాల్సి వస్తోందని, ప్రాణాపాయ స్థితిలో ఎందరో ప్రాణాలను కోల్పోయిన ఘటనలు జరిగాయని మాజీ జెడ్పీ సభ్యుడు హనుమేష్ నాయక్ ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం అంబులెన్స్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

యశవంతపుర: కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి లోక్‌సభ ఎన్నికలకు పార్టీని బలోపేతం చేయాలని జేజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర పిలుపునిచ్చారు. విశ్వకర్మ శ్రమ సన్మాన యోజన లబ్ధిదారులకు యోజన అందేలా చేయాలని పదాధికారులకు సూచించారు. బుధవారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. కౌశల్యతను కాపాడి, ప్రోత్సాహించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమలు చేసిన విశ్వకర్మ శ్రమ సన్మాన యోజనను అర్హులైనవారందరికీ అందేలా చూడాలని మనవి చేశారు.

సిరిధాన్యాల విశిష్టతను తెలుసుకోవాలి

- మంత్రి చెలువరాయస్వామి

శివాజీనగర: అనారోగ్యాలను దూరం చేసి మనిషికి సంపూర్ణ ఆరోగ్యం అందించే సిరిధాన్యాల ప్రాముఖ్యతపై విద్యార్థులకు జాగృతి కల్పించాల్సిన అవసరముందని వ్యవసాయ శాఖ మంత్రి ఎన్.చెలువరాయస్వామి తెలిపారు. నగరంలో క్రైస్ట్ విశ్వవిద్యాలయ ఆవరణలో వ్యవసాయ సచివాలయం, క్రైస్ట్ కాలేజీ పీస్ ప్రాక్సిస్ అండ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మీడియా స్టడీస్ సహయంతో 'మిల్లెట్ తింతిరా–సిరి ధాన్యం సంస్కృతి ఉత్తేజపరిచేలా' అభియాన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జనవరి 5 నుంచి మూడు రోజుల పాటు ప్యాలెస్ మైదానంలో నిర్వహించే సిరిధాన్య మేళాలో దేశ విదేశాల నిపుణులు పాల్గొని సిరిధాన్యాల ప్రాముఖ్యతపై వివరించనున్నారన్నారు. విద్యార్థులు పాల్గొని సిరిధాన్యాల ప్రాముఖ్యతపై తెలుసుకోవాలన్నారు. క్రైస్ట్ విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ ఫాదర్ జోసెఫ్, వ్యవసాయ కమిషనర్ ఎన్.వై.పాటిల్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ జీ.టీ. పుత్ర పాల్గొన్నారు.

స్కానింగ్ వివరాలను కనీసం రెండేళ్లు భద్రపరచాలి

మండ్య: జిల్లాలోని స్కానింగ్‌సెంటర్లలో గర్భిణులకు స్కానింగ్ చేశాక, ఆ డాక్యుమెంట్లను కనీసం రెండేళ్ల వరకు భద్రపరచాలని జిల్లాధికారి డాక్టర్ కుమార సూచించారు. నగరంలోని మిమ్స్ ఆస్పత్రిలో బుధవారం లింగనిర్ధారణ నియంత్రణ చట్టం 1994పై అవగాహన, భ్రూణలింగ గుర్తింపుపై శిక్షణ తరగతులను జిల్లాధికారి ప్రారంభించి మాట్లాడారు. స్కానింగ్ సెంటర్లు ప్రభుత్వం ఏర్పాటు చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని, గర్భిణుల వివరాలను బాలికా సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. నిరక్షరాస్యత, మూఢనమ్మకాల కారణంగా భ్రూణహత్యలు ఇంకా జరుగుతుండడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు 'హాస్య సంజె'

చిక్కబళ్లాపురం: నగరంలోని హర్షోదయ కల్యాణ మంటపంలో ప్రభుత్వ నౌకర్ల సంఘం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం సైబర్ హాస్య సాయంత్రం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు హరీశ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. నూతన క్యాలెండర్ ఆవిష్కరణ ఉంటుందన్నారు. అనంతరం గంగావతి ప్రాణేశ్ దుండిరాజ్ సుదాబర గూర్ బసవరాజ్ మహమని సైబర్ హాస్య సంజె కార్యక్రమం నిర్వహిస్తారన్నారు.

మనోరంజన్ ఇంట్లో విచారణ

- పాస్‌పోర్టు సీజ్ చేసి ఢిల్లీ పోలీసులు

మైసూరు: దేశంలో సంచలనం కలిగించిన పార్లమెంట్‌లో పొగబాంబు దాడి కేసులో ఏ1 నిందితునిగా ఉన్న మైసూరువాసి మనోరంజన్ పాస్‌పోర్టు, బ్యాంకు పాస్‌బుక్, ఇతర నోట్ పుస్తకాలను ఢిల్లీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గత రెండు రోజుల క్రితమే మైసూరుకు వచ్చిన ఒక మహిళా అధికారి, మరో నలుగురు దర్యాప్తు అధికారుల బృందం మైసూరులో బస చేస్తూ విచారణ చేస్తున్నారు. విజయనగరలోని మనోరంజన్ తల్లిదండ్రులు, సోదరిని సమగ్రంగా విచారించి వాంగ్మూలాలను వీడియో రికార్డు చేశారు. రెండో అంతస్తులో ఉన్న మనోరంజన్ గదిని కూడా క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడ లభించిన పాస్‌పోర్టును స్వాధీనం చేసుకుని, ఏయే దేశాలకు వెళ్లాడనేది పరిశీలించారు. ఢిల్లీ పోలీసుల ఎదుట మనోరంజన్ చెప్పిన మాటలకు, అతని తల్లిదండ్రుల మాటలకు పొంతన లేదని గుర్తించారు.

మనోరంజన్ ఖర్చులకు అప్పుడప్పుడు రూ. 2 వేలు మాత్రమే ఇచ్చేవారమని కుటుంబ సభ్యులు తెలిపారు. అలాగే అదనపు డబ్బుల కోసం మళ్లీ అడిగేవాడు కాదని చెప్పారు. మైసూరు–బెంగళూరు– ఢిల్లీ మధ్య తరచూ తిరిగేవాడని, తరచూ విమాన ప్రయాణాలు చేసేవాడని అధికారులు గుర్తించారు. అతని ఖర్చులకు అంత డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయనే విషయంపై కూడా ఆరా తీశారు. బ్యాంక్ స్టేట్‌మెంట్లను కూడా పరిశీలించారు.

నేడు రాజ్యాంగ హక్కుల కోసం ధర్నా



మాట్లాడుతున్న మేడిహాళ చంద్రశేఖర్

కోలారు: దళితులకు రాజ్యాంగ హక్కుల కోసం గురువారం బెంగళూరులోని ఫ్రీడం పార్కులో భారీ ధర్నా చేస్తున్నట్లు డీఎస్ఎస్ భీమావాద రాష్ట్ర సమన్వయ సంచాలకుడు మేడిహాళ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం నగరంలోని పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ధనవంతులు, రాజకీయ నాయకుల వల్ల పేదలు వివక్షకు గురవుతున్నారన్నారు. తాలూకాలోని నాగనాళ, మేడిహాళ వద్ద అనుమతి లేకుండా నిర్వహిస్తున్న జల్లి క్రషర్లతో దుమ్ము, ధూళి ఇళ్లలోకి చేరి పేదలు నానా వ్యాధులకు గురవుతున్నారు. ప్రాణులు, పక్షులు, వన్యజీవులు ప్రాణాలు కోల్పోతున్నాయన్నారు. క్రషర్లను ఆపాలని పలుమార్లు ధర్నా చేసినా ఫలితం లేదని ఆరోపించారు. ధర్నాలో పెద్ద సంఖ్యలో దళితులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమితి నాయకురాలు లక్ష్మీపుర సావిత్రి, జిల్లా సంచాలకుడు బ్యాడబెలె సాకప్ప, జిల్లా సమన్వయ సంచాలకుడు చిన్నాపుర నారాయణస్వామి పాల్గొన్నారు.

వివక్ష లేకుండా ఆదరించాలి



నూతన సంఘం ప్రారంభమైన దృశ్యం

కోలారు: ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు అందించే బాధ్యతాయుతమైన విధులను నిర్వహిస్తున్న పత్రికలను ఎలాంటి భేదభావం లేకుండా ఆదరించాలని డీసీసీ బ్యాంకు అధ్యక్షుడు బ్యాలహళ్లి గోవిందగౌడ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని గౌరిపేటలో జిల్లా స్థాయి పత్రికా సంపాదకుల సంఘాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. చిన్న పత్రికలు నిర్వహించే వారికి స్వాభిమానంతో పత్రికను వెలువరించడానికి ప్రభుత్వం సహకారం అందించాలన్నారు. రాష్ట్ర, ప్రాంతీయ, చిన్న పత్రికలనే భేదభావం లేకుండా అందరికీ సమానంగా సౌకర్యాలను అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో చిన్న పత్రికలు చాలా చక్కగా వస్తున్నాయి. పత్రికా సంపాదకులు పత్రికలను ప్రతినిత్యం ముద్రించి బయటకు తీసుకు రావడానికి అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీటిని పరిష్కరించుకోవడానికి సంఘాన్ని రచించినట్లు తెలిపారు. సంక్రాంతి అనంతరం సమాచార శాఖ కమిషనర్‌ను ఆహ్వానించి తమ డిమాండ్లను కమిషనర్ ముందు ఉంచుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిత్యం రాష్ట్ర స్థాయి పత్రికలకు విడుదల చేస్తున్న ప్రకటనలు ప్రాంతీయ, జిల్లా స్థాయి పత్రికలకు కూడా విడుదల చేస్తే చిన్న పత్రికల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈసందర్భంగా పాత్రికేయుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి మునిరాజు, సంఘం అధ్యక్షుడు హెచ్ఎన్ మురళీధర్, కెఎస్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

ఓటరు జాబితా సవరణ ప్రక్రియ భేష్



మాట్లాడుతున్న ఏక్‌రూప్ కౌర్

కోలారు: సంక్షిప్త ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో అధికారులు, బీఎల్‌ఓల పనితీరు సంతృప్తినిస్తోందని జిల్లా ఇన్‌చార్జ్ కార్యదర్శి ఏక్‌రూప్ కౌర్ తెలిపారు. బుధవారం నగరంలోని కలెక్టరేట్ కార్యాలయ సభాంగణంలో ఓటరు జాబితా సవరణపై ప్రముఖ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన ప్రగతి పరిశీలన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓటరు జాబితాలో 2–3 చోట్ల ఓట్లు నమోదైనట్లు కనిపిస్తున్న వాటిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం బీఎల్‌ఓలు ఇప్పటికే ఇంటింటి సమీక్ష నిర్వహించి కమిషన్ సూచించిన 69 అంశాల సమీక్ష వివరాలను సేకరించి డిజిటలీకరణ చేసి కమిషన్‌కు నివేదికను సమర్పించాలన్నారు. తప్పులు లేని ఓటరు జాబితా తయారీకి అధికారులు ప్రాధాన్యత నివ్వాలని సూచించారు. ఇంటింటి సమీక్షలో కొత్త ఓటరు నమోదును బీఎల్‌ఓ యాప్‌లో నేరుగా నమోదు చేయడం వల్ల మార్పులకు ఎక్కువ అవకాశం లేకుండా మార్పు కోసం దరఖాస్తు చేసుకునే వారి సంఖ్య తగ్గిందన్నారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ శంకర్ వణిక్యాల్, ఉప విభాగ అధికారి వెంకటలక్ష్మి, అన్ని తాలూకాల తహసీల్దార్లు, ప్రముఖ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అక్రమాలు నిరూపిస్తే రాజీనామా

కోలారు: కోచిముల్‌లో అక్రమాలు జరిగినట్లు నిరూపిస్తే పాలక మండలికి రాజీనామా చేస్తానని కోచిముల్ అధ్యక్షుడు కేవై నంజేగౌడ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోచిముల్ నియామకాల్లో ప్రతి ఉద్యోగానికి లంచం తీసుకున్నట్లు వచ్చిన ఆరోపణలు అవాస్తవమన్నారు. వాటిని నిరూపిస్తే పాలక మండలి మొత్తం సామూహికంగా రాజీనామాకు సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్రంలో కోచిముల్ పేరును అప్రతిష్ట పాలు చేయడానికి కొందరు ఆకతాయిలు సోషల్ మీడియాలో ఎంపిక జాబితాలో తమ పార్టీ నాయకుల పేర్లు చేర్చి దుష్ప్రచారం చేశారని ఆరోపించారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరపడానికి పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కోచిముల్ డైరెక్టర్లు కాడేనహళ్లి నాగరాజ్, జయసింహ కృష్ణప్ప, వడగూరు హరీష్, సునందమ్మ, కాంతమ్మ పాల్గొన్నారు.

చేతికొచ్చిన చెరకు పంట బుగ్గి



మంటలకు కాలిపోయిన చెరకు పంట

కంప్లి: కమలాపురం వద్ద బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి మొత్తం 8.5 ఎకరాల్లో కోతకు వచ్చిన చెరకు పంట కాలిపోయింది. జీ.విశ్వనాథ్‌కు చెందిన 2 ఎకరాలు, ద్యావమ్మకు చెందిన 2 ఎకరాలు, బండి పరమేశ్వరప్ప, రామప్పలకు చెందిన 4.5 ఎకరాలు కాలి పోయాయి. విషయం తెలియగానే ఘటన స్థలానికి పోలీసులు, రైతు సంఘం ప్రముఖులు చేరుకుని పరిశీలించారు.

ఈవీఎం పనితీరుపై జాగృతి

మాలూరు: కేంద్ర ఎన్నికల సంఘం సూచన మేరకు 18 ఏళ్లు పైబడిన యువత తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని లక్కూరు ఫిర్కా సెక్టార్ అధికారి డాక్టర్ మంజునాథ్ తెలిపారు. బుధవారం పుర గ్రామ ప్రభుత్వ పాఠశాలలో లోక్‌సభ ఎన్నికలకు ఈవీఎం, వీవీ ప్యాట్‌ల పనితీరుపై గ్రామస్తులకు జాగృతి కల్పించారు. ఈవీఎం ఏ విధంగా పనిచేస్తుందో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటర్లందరూ వంద శాతం పోలింగ్ నమోదుకు సహకరించాలన్నారు. అనంతరం మాక్ ఓటింగ్‌ను నిర్వహించారు. ఈసందర్భంగా రెవిన్యూ కార్యదర్శి స్వాతి, బీఎల్‌ఓ రమేష్, సీబీసీ అధ్యక్షుడు లోకేష్ పాల్గొన్నారు.



ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానంపై జాగృతి కల్పిస్తున్న దృశ్యం


ఘనంగా పుట్టినరోజు వేడుక



మాజీ మంత్రి వర్తూరు ప్రకాష్‌కు గజమాలతో సత్కారం

కోలారు: నగరంలోని కోగిలహళ్లి నివాసం వద్ద బుధవారం మాజీ మంత్రి వర్తూరు ఆర్.ప్రకాష్ 57వ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. అభిమానులు, కార్యకర్తలు వర్తూరు ప్రకాష్‌కు గజమాలను వేసి కేక్ కత్తిరించి ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. జెడీ్ప మాజీ అధ్యక్షుడు సీఎస్ వెంకటేష్, జెడ్పీ మాజీ సభ్యులు సీఎస్ అరుణ్ ప్రసాద్, రూపశ్రీ మంజునాథ్, పెట్రోల్ బంక్ మంజునాథ్, నగరసభ సభ్యుడు వి.మంజునాథ్, ప్రవీణ్‌గౌడ, కురుబర సంఘం అధ్యక్షుడు తంబళ్లి మునియప్ప పాల్గొన్నారు.

కుట్టు శిక్షణా శిబిరం ప్రారంభం



శిక్షణార్థికి పుస్తకాన్ని అందిస్తున్న అధికారులు

కోలారు: నగరంలోని ఏటీడీసీ కేంద్రంలో బుధవారం ప్రధానమంత్రి కౌశల్య అభివృద్ధి పథకంలో భాగంగా వారం రోజుల కుట్టు(టైలరింగ్) శిక్షణా శిబిరం ప్రారంభమైంది. శిబిరాన్ని ఎస్‌పీడీసీ సీనియర్ అనాలసిస్ ఆఫీసర్ ప్రశాంత్ బరహాల్ ప్రారంభించి మాట్లాడుతూ పథకంలో నమోదు చేసుకున్న వారిలో మొదటి విడతగా 30 మంది అర్హులైన అభ్యర్థులకు వారం రోజుల పాటు రోజుకు 8 గంటల ప్రకారం వివిధ డిజైన్లలో దుస్తులు కుట్టే విధానంపై శిక్షణనిస్తారన్నారు. డిజిటల్ ఆర్థిక వ్యవహారాలు, బ్యాంకింగ్ తదితర అంశాల గురించి కూడా శిక్షణను అందజేస్తారన్నారు. నిత్యం రూ.500 చొప్పున స్టైఫండ్తో పాటు రూ.1000 టీఏతో కలిసి మొత్తం రూ.4 వేలను అభ్యర్థుల బ్యాంక్ ఖాతాకు జమ చేస్తారన్నారు. తప్పనిసరిగా శిక్షణా తరగతులను హాజరైన వారికి మాత్రమే సర్టిఫికెట్లు అందజేస్తారన్నారు. శిక్షణ పొందిన వారికి బ్యాంకులో రూ.లక్ష వరకు రుణం ఇస్తారన్నారు. బెంగళూరు అపెరల్ ట్రైనింగ్ అండ్ డిజైనర్ సెంటర్ రీజినల్ మేనేజర్ ఎస్ పద్మావతి, ఏటీడీసీ సహాయక రీజినల్ మేనేజర్ జి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నలుగురు దొంగల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న నగలతో పోలీసు అధికారులు

శివమొగ్గ: నలుగురు అంతర్‌జిల్లా దొంగలు పట్టుబడ్డారు. మైసూరు జిల్లా పిరియాపట్టణ నివాసి సంతోష్ (36), శివమొగ్గ అశోక్‌నగరకు చెందిన మహమ్మద్ నదీమ్ (30), ఇమ్రాన్ (32), బొమ్మనకట్టె ఆశ్రయ లేఔట్ నివాసి సురేశ్ (43)ను శివమొగ్గ తుంగా నగర పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ. 12.65 లక్షల విలువ చేసే 230 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.72 వేల విలువ చేసే 1.200 కేజీల వెండి ఆభరణాలు, రూ. 25,140 నగదు, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. తుంగా నగర పోలీసు స్టేషన్ల పరిధిలోనే నిందితులపై ఐదు కేసులు ఉన్నాయి.

పక్షివేటగాళ్ల అరెస్ట్

మైసూరు: మైసూరు జిల్లా నంజనగూడు తాలూకా హదినారు చెరువు, కాలువవద్ద పక్షులను వేటాడుతున్న ఆంథోని సేవియర్, ఎ.రోహిత్ అనే ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి గ్రేటర్ కాకల్, రెడ్ నెపియర్ ఐబిస్, ఇతర మొత్తం 7పక్షుల కళేబరాలను, ఒక స్కూటర్, ఒక ఎయిర్ గన్‌ను స్వాధీనం చేసుకున్నారు. గ్రామస్తుల నుంచి వచ్చిన కచ్చితమైన సమాచారం మేరకు అటవీ శాఖాధికారులు ఈ ఇద్దరిని పట్టుకున్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీసీసీ సైదుల్లా

కృష్ణరాజపురం: న్యాయవ్యవస్థ, చట్టాలపై బాల్య దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని బెంగళూరు ఉత్తర విభాగం డీసీసీ సైదుల్లా సూచించారు. నేరాల నియంత్రణ మాసోత్సవం సందర్భంగా చట్టాలు, ఐపీసీ సెక్షన్లపై మహాలక్ష్మి లేఔట్ పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. సుమారు 700 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నేరాల తీరుతెన్నులు, వాటి నియంత్రణపై పోలీసులు అవగాహన కల్పించారు.

సాహితీవేత్త లక్ష్మీశతోళ్పాడికి కేంద్ర పురస్కారం

బనశంకరి: కర్ణాటకలో పేరుపొందిన సాహితీ వేత్త లక్ష్మీశతోళ్పాడి 2023 కేంద్రసాహిత్య అకాడమి పురస్కారానికి ఎంపికయ్యారు. సాహిత్య అకాడమి 24 విభాగాల్లో పలువురిని పురస్కారాలకు ఎంపిక చేసింది. అందులో లక్ష్మీశతోళ్పాడి ఒకరు. ఈయన దక్షిణకన్నడ జిల్లా పుత్తూరు సమీపంలోని శాంతిగోడు గ్రామానికి చెందిన వారు. ఈయన మాతృ భాష తుళు కాగా వైఎస్‌కే.గోపాలకృష్ణ అడిగ లంకేశ పత్రిక నాగరాజుతో పరిచయం ఉంది. అనేక పత్రికల్లో రచనలు ప్రచురితమయ్యాయి.

క్రైస్తవ సమాజం అన్ని ధర్మాలను ఆదరిస్తుంది



మాట్లాడుతున్న ప్రజ్వల్‌స్వామి

మండ్య: క్రైస్తవ సముదాయం అన్ని ధర్మాలను ఆదరిస్తుందని అఖిల భారత క్రైస్తవ మహాసభ వ్యవస్థాపకుడు ప్రజ్వల్ స్వామి అన్నారు. నగరంలోని రైతు సభాంగణంలో అఖిల భారత క్రైస్తవ మహాసభ ఆధ్వర్యంలో బుధవారం స్వతంత్ర్య సభల ఐక్యతా సమావేశం, క్రిస్మస్ వేడుకలు జరిగాయి. ప్రజ్వల్ స్వామి మాట్లాడుతూ క్రైస్తవుల సముదాయానికి శ్మశానవాటిక, క్రైస్తవ భవనం కావాలనే డిమాండ్లను ఎమ్మెల్యేకు విన్నవించగా సానుకూలంగా స్పందించారన్నారు. భారతదేశానికి ఏ ధర్మం కూడా అందించని విధంగా అమూల్యమైన సేవలను క్రైస్తవ్యం చేసిందని గుర్తు చేశారు. ఎమ్మెల్యే పీ.రవికుమార్ గౌడ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కార్మికుల మృతి

మైసూరు: కర్మాగారంలో పనిచేస్తూ కుటుంబాలకు ఆసరాగా ఉన్న ఇద్దరు కార్మికులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈఘటన నంజనగూడు మల్లుపుర గ్రామంలో బుధవారం జరిగింది. తగడూరు గ్రామానికి చెందిన మహేశ్ (24), మహేశ్ (26) అనే ఇద్దరు నంజనగూడు తాలూకా అళగంచిలోని బణ్ణారి అమ్మన షుగర్స్ కర్మాగారంలో రోజువారీ కూలీలుగా పని చేస్తున్నారు. విధులకు బైక్‌లో వెళ్తుండగా మల్లుపుర గ్రామం వద్ద ట్యాంకర్ ఢీ కొట్టింది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. వరుణ ఎమ్మెల్యే డాక్టర్ యతీంద్ర ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. బిళిగెరె పోలీసులు ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకొని పరారైన డ్రైవర్ కోసం గాలింపు చేపట్టారు.

ట్రెక్కింగ్‌కు కేరాఫ్ గాలిబీడు శిఖరం



గొరిల్లా రాక్



ట్రెక్కింగ్ చేస్తున్న యువతీయువకులు



పచ్చదనంతో కూడిన ఎత్తైన గాలిబీడు

బనశంకరి: పర్యాటకానికి, అద్భుతమైన ప్రకృతి సౌందర్యానికి దక్షిణాదిన స్వర్గధామమైన కూర్గ్ ప్రాంతంలో పర్వతారోహణకు గాలిబీడు శిఖరం అత్యంత అనుకూలం. ఇది బెంగళూరు నుంచి 274 కిలోమీటర్ల దూరంలో ఉంది. గాలిబీడు ప్రసిద్ధ ట్రెక్కింగ్ నిషాని బెట్ట సమీపంలో ఉంది. మడికేరి పట్టణం నుంచి 12 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈప్రాంతంలో అంతగా తెలియని ట్రెక్కింగ్ ప్రదేశాల్లో ఇది ఒకటి. పశ్చిమకనుమల్లో ఉన్న ఈ ప్రదేశం ట్రెక్కర్లకు నిజంగా స్వర్గధామం. దట్టమైన అడవి గుండా పయనిస్తూ ట్రెక్కింగ్ చేసేక్రమంలో దారి మధ్యలో అందమైన ప్రవాహాలు కనువిందుచేస్తాయి. విభిన్నరకాల వృక్షాలు, ఎత్తైన పర్వతాలు, ఎత్తైన కొండలనుంచి జాలువారే జలపాతాలు, పక్షుల కిలకిలరావాలు ప్రత్యేక అనుభూతి కలిగిస్తాయి.

గాలిబీడు చరిత్ర

ఈ పర్వతాలు కొడగు పాలకులైన వీరరాజేంద్ర, లింగరాజేంద్రకు చెందినవని స్థానికులు చెబుతారు. కొడవ ల్యాండ్‌లోకి శత్రువుల ప్రవేశాన్ని గుర్తించడానికి గాలిబీడు ఒక మైలురాయిగా పనిచేసిందని చెబుతారు. ట్రెక్కింగ్ నుంచి తిరుగుప్రయాణంలో కాళీదేవికి అంకితం చేయబడిన ఒక పురాతన ఆలయం ఉంది. గాలిబీడులో ట్రెక్కింగ్ కొన్ని సార్లు గమ్మత్తుగా ఉంటుంది. దట్టమైన అడవులు, పచ్చిక భూములు, ప్రవాహాలు తారుతో వేసిన రోడ్ల కలయిక మొదటి స్ట్రెచ్ రెండు కిలోమీటర్లు వరకు ఇరుకైనది. ఎక్కేటప్పుడు ఏటవాలుగా ఉంటుంది. పశ్చిమకనుమల్లోని ఇతర శిఖరాల అద్భుతమైన దృశ్యాలతో అందమైన పచ్చికభూమికి దారితీస్తుంది. కాలిబాట చివరి విస్తీర్ణం కూడా నిటారుగా ఉంటుంది. శిఖరం చేరుకున్న తర్వాత మైదానంలో స్వేచ్ఛగా వెళ్లడం ద్వారా మొత్తం అదిరోహణ అద్భుతమైన అనుభూతిని మిగిలుస్తుంది. పర్వతరోహణ సమయంలో పశ్చిమకనుమలు ఇతర శిఖరాలు వీక్షణ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. చంద్రముఖినదికి అడ్డంగా ఉన్న హ్యాంగింగ్ బ్రిడ్జి కూడా ట్రెక్కింగ్‌లో చూడగలిగే ప్రదేశాల్లో ఒకటి. వర్షాకాలంలో వాగులు పొంగుతుంటాయి. అందువల్ల ఈ సమయంలో ట్రెక్కింగ్ చేయడం కష్టంగా ఉంటుంది.



గాలిబీడు దట్టమైన అడవి



శిఖరానికి కాలబాట



శిఖరంలో జలపాతం

సొరంగ మార్గం నిర్మాణానికి నిధులు ఇవ్వండి

- కేంద్ర ఆర్థిక మంత్రిని కోరిన డిప్యూటీ సీఎం

శివాజీనగర: బెంగళూరులో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ప్రతిపాదించిన సొరంగ మార్గం నిర్మాణం, నగర శివార్లలో నాలుగు దిక్కులను కలిపేలా 129 కి.మీ. మెట్రో మార్గం నిర్మాణానికి ఆర్థిక సహాయం చేయాలని ఉప ముఖ్యమంత్రి డీ.కే.శివకుమార్ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు విన్నవించారు. బుధవారం ఆయన ఢిల్లీలో కేంద్ర మంత్రిని భేటీ చేశారు. బెంగళూరులోని 3 పథకాలకు, ప్రధాని నీటి సరఫరా పథకాలకు ఆర్థిక సహాయం చేయాలని కోరారు. 1.20 కోట్ల జనాభా ఉన్న బెంగళూరులో ప్రజలకు మెరుగైన సదుపాయాలను కల్పించాల్సి ఉందని వివరించారు. పరిశ్రమలకు, భారీ కంపెనీలకు నెలవైన బెంగళూరులో ట్రాఫిక్ పెను సమస్యగా మారిందన్నారు. దీనిని నివారించేందుకు ఉత్తర-దక్షిణ, తూర్పు-పశ్చిమ దిక్కులను కలిపే 60 కి.మీ. సొరంగ మార్గం నిర్మాణానికి ప్రతి కి.మీ.కు రూ.500 కోట్లు చొప్పున మొత్తం రూ.30 వేల కోట్లతో అంచనాలు రూపొందించినట్లు వివరించారు.

గడువు తీరిన బీర్ పారబోత



బీరును పారబోస్తున్న సిబ్బంది

కృష్ణరాజపురం: ప్రభుత్వ మద్యం డిపోలో గడువు తీరిన బీరు బాటిళ్లను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. బుధవారం వైట్‌ఫీల్డ్‌లోని కేఎస్‌బీసీఎల్ డిపో–2లో గడువు తీరిన బీరు బాటిళ్లను అధికారులు గుర్తించారు. మొత్తం 393 బాటిళ్లను జిల్లా ఎక్సైజ్ సబ్ కమిషనర్ ఆధ్వర్యంలో అబ్కారీ శాఖ సిబ్బంది సీజ్ చేసి బీర్‌ను పారబోశారు. ఈ సరుకు విలువ సుమారు రూ. 47 లక్షలు అని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



బల్విందర్(ఫైల్)

విజయపుర: హిమాచల్ ప్రదేశ్ నుంచి బెంగళూరు వస్తున్న ఓ వ్యక్తి ఉన్న ఫళంగా అదృశ్యమయ్యాడు. ఈ ఏడాది ఆగస్టు 29న రంజిత్, బల్విందర్‌లు (హెచ్‌పీ 12కే 9026) గూడ్స్ టెంపోలో బెంగళూరుకు వస్తున్నారు. వెంకటగిరి కోటె బృందావన్ హోటల్ వద్ద ఆగారు. మూత్రవిసర్జనకు అంటూ బల్విందర్ వెళ్లి కనిపించకుండాపోయాడు. ఈ విషయంపై విజయపుర పట్టణ పోలీసు స్టేషన్‌లో బల్విందర్ తండ్రి, హరియాణ పంచకుల జిల్లాకు చెందిన హన్స్‌రాజ్ సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

జనస్పందనతో సత్వర పరిష్కారం



సమస్యలు వింటున్న ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ

గౌరిబిదనూరు: సమస్యల పరిష్కారానికి జనస్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ అన్నారు. తాలూకా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన జన స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలనుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. ఎలాంటి సమస్య ఉన్నా జనస్పందన దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలలో అక్రమంగా నిర్మించిన ఇళ్లను సక్రమం చేస్తున్నామన్నారు.ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ రైతులు పొలాలకు దారి సమస్యలుంటే సంప్రదించాలన్నారు. అనంతరం 30 మందికి హక్కు పత్రాలను వితరణ చేశారు. మాజీ సైనికులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సంఘం మాజీ అధ్యక్షుడు అశ్వత్థనారాయణ కోరారు. కార్యక్రమంలో నగరసభ కమీషనర్ గీత,గ్రేడ్ 2 తహశిల్దార్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి గీతోత్సవం



పోస్టర్ విడుదలచేస్తున్న ఎన్ఆర్.రమేశ్ తదితరులు

బనశంకరి: బసవనగుడి నేషనల్‌కాలేజీ మైదానంలో ఉడుపికి చెందిన ఉడుపి పర్యాయపీఠం, కోటి గీతాలేఖన యజ్ఞ సమితి ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి రెండురోజులపాటు గీతోత్సవాన్ని నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా కోటి మందికి పైగా శ్రీకృష్ణుడి భక్తులు రెండు నెలలుగా స్వహస్తాలతో రాస్తున్న భగవద్గీత ప్రక్రియ పూర్తికావడంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మఠం దివాన్‌గా ఉన్న ప్రసన్న ఆచార్యస్వామి, బెంగళూరు దక్షిణ బీజేపీ అధ్యక్షుడు ఎన్ఆర్.రమేశ్ తెలిపారు. ఈమేరకు బుధవారం పోస్టర్లు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ 23వ తేదీ శనివారం ఉదయం 10.30 గంటలకు పుత్తిగె పీఠాధిపతి సుగుణేంద్ర తీర్థశ్రీపాదస్వామీజీ సాన్నిధ్యంలో జరిగే కార్యక్రమంలో డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్, మంత్రి ఆర్.రామలింగా రెడ్డి, పునీత్‌రాజ్‌కుమార్ సతీమణి అశ్విని పునీత్ రాజ్‌కుమార్, అనేక మంది మంత్రులు, ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. విలేకరుల సమావేశంలో డాక్టర్ హెచ్ఎస్.ప్రేమ, నాగరాజ్‌నక్షత్రి, ఏబీ.కుంజార్, ప్రతిమాసుభాష్, సుమానాగరాజ్, వెంకటేశ్‌జోషి తదితరులు పాల్గొన్నారు.

కాలువలో మహిళ మృతదేహం

మైసూరు: కనిపించకుండా పోయిన ఒక దివ్యాంగురాలు శవంగా కనిపించింది. కేఆర్ నగర పట్టణ సమీపంలోని కాలువలో ఆమె మృతదేహం గుర్తించారు. సాలిగ్రామ తాలూకా హలగేగౌడ కొప్పలు గ్రామానికి చెందిన శశికళ (32) అనే మహిళ డిసెంబర్ 14న ఇంటి నుంచి కనిపించకుండాపోయింది. బంధువులు వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సాలిగ్రామ పోలీసు స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు కూడా చేశారు. అయితే తాజాగా ఆమె శవం ఒక కాలువలో కనపడడం గమనార్హం. ఆత్మహత్య చేసుకుని ఉంటుందని అనుమానిస్తున్నారు.

సిమెంట్ ఇటుకతో కొట్టి హత్య

సిమెంట్ ఇటుకతో వ్యక్తి తలపై కొట్టి దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన హుణసూరు పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. హుణసూరు అరసు విగ్రహం సర్కిల్‌వద్ద సిమెంట్ ఇటుకలు తయారు చేసే ఫ్యాక్టరీలో సుమారు 30 ఏళ్ల వ్యక్తి మృతదేహం కనిపించింది. ఎవరో సిమెంట్ ఇటుకతో తలపై కొట్టి హత్య చేశారు. హుణసూరు పోలీసులు పరిశీలించారు.

మైసూరులో చైన్‌స్నాచింగ్

స్కూటర్‌లో వెళుతున్న మహిళను వెనుక నుంచి వెంబడించి ఆమె మెడపై ఉన్న బంగారు గొలుసును దుండగులు లాక్కెళ్లిపోయారు. మైసూరు హెబ్బాళ నివాసి లింగరాజు సతీమణి భాగ్య ప్రైవేటు కంపెనీలో ఉద్యోగి. ఆమె ఆఫీసులో పనులు ముగించుకుని స్కూటర్‌లో ఇంటికి వెళుతోంది. ఈ సమయంలో భారత క్యాన్సర్ ఆస్పత్రి వద్ద రింగ్‌రోడ్డులో వెళుతుండగా వెనుక నుంచి బైక్‌లో వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లిపోయారు. 35 గ్రాముల ఆ గొలుసు విలువ సుమారు రూ. 1.40 లక్షలు ఉంటుందని ఆమె హెబ్బాళ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కాంగ్రెస్ సర్కార్ ఉదాసీనతతో ఉగ్రజాడలు

- శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయి
- రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం
- విపక్షనేత ఆర్.అశోక్

బనశంకరి: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉగ్ర కార్యకలాపాలు పెచ్చుమీరి శాంతిభద్రతలు క్షీణించాయని విపక్షనేత ఆర్.అశోక్ ఆరోపించారు. బుధవారం ఆయన విధానసౌధలో విలేకరులతో మాట్లాడారు. నిషేధిత పీఎఫ్‌ఐపట్ల సీఎం సిద్దరామయ్య మెతకధోరణి అవలంభిస్తున్నారన్నారు. ఉగ్రకార్యకలాపాలు పెరిగాయనేందుకు రాష్ట్రంలో ఎన్ఐఏ అధికారులు జరిపిన దాడులే నిదర్శనమన్నారు. గతంలో సిద్దరామయ్య ముఖ్యమంత్రిగా ఉన్న అవధిలో పీఎఫ్‌ఐ కార్యకర్తలపై నమోదైన కేసులు వెనక్కి తీసుకున్నారని దుయ్యబట్టారు. బెళగావిలో మహిళను వివస్త్ర చేసి దాడికి పాల్పడిన ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించలేదన్నారు. విపక్షాలు భేటీ అనంతరం పరిహారం ప్రకటించారన్నారు. రాష్ట్రంలో భీకర కరువు ఉన్నప్పటికీ రైతులకు పరిహారం అందించకుండా దివాళా తీసిందన్నారు. కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి అందాల్సిన కరువు పరిహార నిధులు విడుదలచేస్తుందని తెలిపారు. ఆపరేషన్ కమలతో ప్రభుత్వాన్ని కూల్చబోమని, ప్రభుత్వమే కూలిపోనుందన్నారు. కాంగ్రెస్‌లో గందరగోళం నెలకొందని, ఆపార్టీలో అజిత్‌పవార్ లాంటి వారు ఉన్నారని తెలిపారు. మల్లికార్జునఖర్గే ప్రధాని అభ్యర్థిగా ఇండియా కూటమి ప్రస్తావన పై మాట్లాడిన ఆర్.అశోక్.. రాహుల్ గాంధీ జీరో అని అంగీకరించారని ఎద్దేవా చేశారు. మల్లికార్జునఖర్గే పీఎం అభ్యర్థి అయినా దళిత ఓటుబ్యాంక్ విభజనకాదన్నారు.

అనాథ నుంచి అంతర్రాష్ట్ర దొంగగా..

- గుంతకల్లులో గజదొంగ అరెస్టు
- కర్ణాటకలో పలు కేసుల్లో నిందితుడు



నగల రికవరీ చూపుతున్న దృశ్యం, విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ అన్బురాజన్, పోలీసు అధికారులు

అనంతపురం క్రైం: తాళం వేసిన ఇళ్లను చూసి చోరీలకు తెగబడే అంతర్రాష్ట్ర దొంగను అనంతపురం త్రీటౌన్, గుంతకల్లు, సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. దొంగ నుంచి రూ.15 లక్షలు విలువచేసే 23 తులాలు బంగారు నగలతో పాటు రెండు కిలోల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. బుధవారం ఆయన వివరాలను వెల్లడించారు. మహారాష్ట్రలోని షోలాపూర్ జిల్లా, పండరీపూర్‌లోని నౌరంగి ఆశ్రమం నుంచి వచ్చిన లికన్ అశోక్ కులకర్ణి అలియాస్ సచిన్ మానే నిందితుడు. ఇతడు ఎవరూ లేని అనాథగా ఉంటూ చోరీల బాట పట్టాడు. రాత్రి పూట తాళం వేసిన ఇళ్లలో తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతున్నాడు. అనంతపురం, గుంతకల్లు, ఆలూరులలో దొంగతనాలు చేశాడు. ఆంధ్రప్రదేశ్ తో పాటు తెలంగాణ, మహరాష్ట్ర, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాలలో సుమారు 80 కి పైగా దొంగతనాల కేసుల్లో నిందితునిగా ఉన్నాడు. కర్ణాటకలోని మూడు కేసుల్లో శిక్షలు కూడా అనుభవించాడు. ఇతనిపై వారంట్లు కూడా పెండింగులో ఉన్నాయి. ఇటీవలే జైలు నుండీ బయటికొచ్చి మళ్లీ పాత పంథా కొనసాగించాడు. నిఘావేసి గుంతకల్లు రైల్వే స్టేషన్ వద్ద బుధవారం ఉదయం అరెస్ట్ చేశామన్నారు.

హోసూరు వార్తలు..

తారురోడ్డుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న దృశ్యం

క్రిష్ణగిరి: సూళగిరి తాలూకాలోని కానలట్టి పంచాయతీ, సుండట్టి ప్రాంతాల్లో రూ. 21.42 లక్షల అంచనాతో తారురోడ్డు నిర్మాణానికి బుధవారం యూనియన్ చైర్‌పర్సన్ లావణ్యమధు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ హేమనాథ్, బీడీవో విమల్‌రవికుమార్, స్థానిక ప్రజా ప్రతినిధులు నాగేష్, వెంకటేష్, రత్నమ్మక్రిష్ణప్ప పాల్గొన్నారు.

పండ్ల వ్యాన్ బోల్తా



నేలపాలైన పండ్లు

క్రిష్ణగిరి: బెంగళూరు నుంచి సేలంకు పండ్లు తరలిస్తున్న పికప్ వ్యాన్ బోల్తాపడిన ఘటనలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు తగిలాయి. వివరాలు.. సేలం ప్రాంతానికి చెందిన పికప్ వాహన డ్రైవర్ బెంగళూరు నుంచి పండ్లను తీసుకొని హోసూరు–క్రిష్ణగిరి హైవేపై వెళుతుండగా సూళగిరి సమీపంలోని సుండగిరి వద్ద పల్టీ కొట్టింది. స్థానికులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదంలో చిక్కుకొన్న డ్రైవర్‌ను బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. వాహనాన్ని ప్రక్కకు తొలగించి ట్రాఫిక్ సమస్యను క్రమబద్ధీకరించారు.

శివమొగ్గలో రెచ్చిపోయిన చైన్‌స్నాచర్లు

శివమొగ్గ: నగరంలో చైన్‌స్నాచర్లు రెచ్చిపోయారు. ఆలయాలకు వెళ్లి వస్తున్న మహిళలను టార్గెట్ చేశారు. బుధవారం వినోబ నగర పోలీసు స్టేషన్ పరిధిలో ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లి వస్తున్న మహిళను పల్సర్ బైక్‌లో వచ్చిన ఇద్దరు ఆగంతకులు అడ్డుకున్నారు. ఆమె మెడలోని మంగళసూత్రాన్ని లాక్కెళ్లారు. అలాగే దొడ్డపేట పోలీసు స్టేషన్ పరిధిలో శరావతి నగర ఆదిచుంచనగిరి పాఠశాల సమీపంలో ఉన్న కాలభైరేశ్వర దేవాలయానికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో ఓ మహిళను చైన్‌స్నాచర్లు అడ్డుకొని ఆమె మెడలోని గొలుసును లాక్కెళ్లారు. పోలీసులు అప్రమత్తమై సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. నిందితుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

వెంటాడి.. వేటాడి ఇద్దరి హత్య



హతులు బర్కత్, శివ (ఫైల్)

- ఇంటి తలుపులు పగలగొట్టి మరీ ఘాతుకం
- హోసూరులో హత్యాకాండ



హోసూరు: హోసూరు పట్టణంలో పాతకక్షల కారణంగా ఇద్దరు వ్యక్తులు దారుణ హత్యకు గురైన ఘటన బుధవారం వెలుగు చూసింది. వివరాల మేరకు... పట్టణంలోని పార్వతీనగర్‌లో వాజ్పేయి ఇచ్చి పట్టణ అధ్యక్షుడు బర్కత్ (31). కార్యకర్త శివ (27)లపై గుర్తు తెలియని వ్యక్తులు దాడులు జరిపి దారుణంగా హత్య చేశారు. వివరాలు.. బర్కత్, శివ ఇద్దరూ స్నేహితులు కాగా ఒకే పార్టీలో పనిచేస్తున్నారు. గతంలో వీరిపై పలు నేరాలకు సంబంధించిన కేసులు ఉన్నాయి. దీంతో హోసూరు ప్రాంతంలో వీరికి శత్రువులు కూడా చాలా మంది ఉన్నారు. వీరి మిత్రుడు ప్రకాష్ సేలం జైలు నుంచి విడుదల కావడంతో అతన్ని తీసుకొచ్చారు. మంగళవారం సాయంత్రం పార్వతీనగరలో ప్రకాష్ ఇంటి వద్ద మాట్లాడుతూ ఉండగా సినీ ఫక్కీలో సుమారు 15 మంది దుండగుల ముఠా వారిపై కత్తులు, రాడ్లతో దాడి చేసింది. బర్కత్, శివలు ప్రాణభయంతో ప్రకాష్ ఇంట్లోకి వెళ్లి తలుపులు, కిటికీలు వేసుకున్నారు. అయినప్పటికీ దుండగులు తలుపులు పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. ఇద్దరినీ అక్కడికక్కడే నరికి చంపి పరారయ్యారు. ఈ ఘోర సంఘటనతో మొత్తం పట్టణంలో భయాందోళన వ్యాపించింది. స్థానికులు భయంతో తలుపులు మూసుకున్నారు.

పోలీసుల పరిశీలన

విషయం తెలుసుకొన్న పట్టణ పోలీసులు, హోసూరు డీఎస్పీ ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. పాతకక్షల కారణంగా హత్య జరిగినట్లు తేలినట్లు డీఎస్పీ బాబు ప్రశాంత్ తెలిపారు. కాగా, ప్రశాంత హోసూరులో రక్తపాతం తీవ్ర కలకలం సృష్టించింది. హత్యలు, ప్రతీకార దాడులతో ప్రశాంతత లేకుండా పోయే ప్రమాదం ఉందని పట్టణవాసుల్లో ఆందోళన నెలకొంది.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. శానసంద్రం ప్రాంతానికి చెందిన విష్ణు (27) ప్రైవేట్ సంస్థలో కార్మికునిగా పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా కుటుంబంలో మనస్పర్థలుండేవి. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. పోలీసులు శవాన్ని స్వాధీనపరుచుకొని ఆస్పత్రికి తరలించారు.

కాలేజీ విద్యార్థిని ఆత్మహత్య

హోసూరు: సెల్‌ఫోన్‌లో ఎక్కువగా మాట్లాడవద్దని తల్లిదండ్రులు దండించగా, యువతి ఆత్మహత్య చేసుకుంది. వివరాలు.. హోసూరు పట్టణం శానసంద్రం ప్రాంతానికి చెందిన రాజ కూతురు గోపిక (19). తళిలోని ప్రభుత్వ కళాశాలలో బీకాం ఫస్టియర్ చదువుతోంది. ఆమె తరచూ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతోందని తల్లిదండ్రులు మదలించారు. విరక్తి చెందిన ఆమె బయటకెళ్లి చంద్రచూడేశ్వరస్వామి కొండపై ఉన్న పార్కులో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది. పట్టణ పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

యువతి ఇంటిపై ఆటోడ్రైవర్ దాడి

ప్రేమిస్తున్న అమ్మాయిని తనకిచ్చి పెళ్లి చేయలేదని కోపంతో డ్రైవర్ ప్రేయసి ఇంటిపై దాడి చేసిన ఘటన హడ్కో పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. సమత్వపురం ప్రాంతానికి చెందిన డ్రైవర్ సెంథిల్‌కుమార్ (34) ఆవులపల్లి హడ్కో ప్రాంతానికి చెందిన ఓ యువతిని ఐదేళ్లుగా ప్రేమిస్తున్నాడు. తనకిచ్చి పెళ్లి చేయాలని ఆమె తల్లిదండ్రులను కోరగా తిరస్కరించారు. దీంతో మంగళవారం రాత్రి ప్రేయసి ఇంటికెళ్లి కిటికీలను ధ్వంసం చేయడంతో పాటు మహిళ తండ్రిపై దాడి చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు హడ్కో పోలీసులు సెంథిల్ కుమార్‌ను అరెస్ట్ చేశారు.

కొడగరైలో వైద్యశిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సుబ్రమణి

కెలమంగలం: అంచెట్టి తాలూకా దట్టమైన అటవీ ప్రాంతంలో వెలసిన కొడగరై గిరిజన గ్రామానికి బుధవారం ఉదయం ఆరోగ్య శాఖ మంత్రి సుబ్రమణి పది కిలోమీటర్ల దూరం నడచి వెళ్లి గ్రామంలో ప్రజల వద్దకే వైద్యం శిబిరాన్ని ప్రారంభించారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంత గ్రామాల్లో బాల్య వివాహాలను నిర్మూలించాలని, పిల్లలను విద్యావంతులను చేయాలని తెలిపారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు.

క్లుప్తంగా...

ఏపీ ఈఎండీపీకి జాతీయ స్థాయి గుర్తింపు

- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్



సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లోని 9వ తరగతి విద్యార్థుల్లో ఔత్సాహిక పారిశ్రామిక వేత్త ఆలోచనల అభివృద్ధితో పాటు ఆర్థిక నైపుణ్యాలు అందించేందుకు తలపెట్టిన 'ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ మైండ్ సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్' (ఈఎండీపీ)కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేశ్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈఎండీపీ మేనేజర్ సతీష్ దుల్లా, ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ పద్మావతి సంయుక్తంగా 'ఎంపవరింగ్ టుమారో: ఇంప్లిమెంటేషన్ స్ట్రాటజీస్ ఆఫ్ ది ఎంట్రప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఇన్ ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ సిస్టమ్' పరిశోధనాత్మక వ్యాసం జాతీయ సదస్సుకు ఎంపికై ందని పేర్కొన్నారు. దీనిని ఢిల్లీలో ది పవర్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూరియల్ ఎడ్యుకేషన్‌పై జాతీయ సదస్సులో ప్రదర్శించారని చెప్పారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఢిల్లీ విద్యాశాఖ మంత్రి అతిషి మర్లెనా హాజరై, ఏపీలో ఈఎండీపీ అమలు తీరు తెలుసుకునేందుకు ఆసక్తి చూపారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అప్లాటౌన్ ఇంటర్నేషనల్, ఉద్యం లెర్నింగ్ ఫౌండేషన్, రీప్ బెనిఫిట్ సంస్థలు భాగస్వామిగా ఉన్నాయని వివరించారు.

ప్రభుత్వ స్కూల్స్‌లో ఫ్యూచర్ స్కిల్ నిపుణులు

- ఉత్తర్వులు జారీ చేసిన పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలు నేర్పించేందుకు ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్‌ల నియామకానికి పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలోని 6,790 ఉన్నత పాఠశాలల్లో వీరిని నియమించాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కంప్యూటర్ సైన్స్ లేదా ఎల్రక్టానిక్స్‌లో బీటెక్/ఎంటెక్ చివరి సంవత్సరం చదువుతున్న వారిని ఇందుకోసం నియమించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి 3 హైస్కూళ్లకు ఒక్క ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్ ఉంటారని, ఆయా స్కూళ్లలోని ఐఎఫ్‌పీలు, ట్యాబ్స్‌పై శిక్షణ ఇవ్వడంతో పాటు డిజిటల్ టెక్నాలజీకి సంబంధించిన కోర్సులను బోధిస్తారని తెలిపారు. ఇందుకోసం నెలకు రూ.12 వేలు గౌరవ వేతనం, ప్రయాణ ఖర్చులు ఆయా కళాశాలల ద్వారా చెల్లించనున్నట్టు పేర్కొన్నారు.

3న అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన



సాక్షి, అమరావతి: అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ పోస్టులకు ఎంపికై న అభ్యర్థుల ధ్రువపత్రాలను వచ్చేనెల 3వ తేదీన పరిశీలించనున్నట్టు ఏపీపీఎస్సీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఇందుకు సంబంధించి షెడ్యూల్ వివరాలను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు పేర్కొంది.

ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్‌గా పద్మావతి

సాక్షి, అమరావతి: ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్‌గా డాక్టర్ కె.పద్మావతికి ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులిచ్చారు. జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమం అడిషనల్ డైరెక్టర్‌గా పద్మావతి వ్యవహరిస్తున్నారు.

ఉమ్మడి ప్రాజెక్టులు కృష్ణా బోర్డు చేతికి!

సాక్షి, అమరావతి: ఉమ్మడి ప్రాజెక్టులు శ్రీశైలం, నాగార్జునసాగర్ నిర్వహణ బాధ్యతను కృష్ణాబోర్డుకు అప్పగించేందుకు కేంద్రం సిద్ధమైంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, జలవనరులశాఖ ఉన్నతాధికారులతో వచ్చేనెల మొదటి వారంలో కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ ఢిల్లీలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. బోర్డు పరిధిని నిర్దేశిస్తూ 2021 జూలై 15న కేంద్ర జల్‌శక్తి శాఖ జారీచేసిన నోటిఫికేషన్ మేరకు ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, సాగర్‌లను బోర్డుకు అప్పగించేందుకు కృష్ణాబోర్డు సర్వసభ్య సమావేశంలో రెండు రాష్ట్రాల అంగీకరించాయి. కానీ.. ఆ తర్వాత తెలంగాణ సర్కార్ అడ్డం తిరిగింది. సర్వసభ్య సమావేశంలో అంగీకరించిన మేరకు ఉమ్మడి ప్రాజెక్టులను కృష్ణాబోర్డుకు అప్పగించాలని రెండు రాష్ట్రాలకు కేంద్రం దిశానిర్దేశం చేయనుంది. విభజన నేపథ్యంలో కృష్ణా జలాల వినియోగంలో రెండు రాష్ట్రాల మధ్య వివాదాలు తలెత్తకుండా చూసేందుకు 2014లో కేంద్రం కృష్ణాబోర్డును ఏర్పాటుచేసింది. బోర్డు పరిధిని నిర్దేశించేవరకు శ్రీశైలం నిర్వహణ బాధ్యతను ఏపీ ప్రభుత్వానికి, సాగర్ నిర్వహణ బాధ్యతను తెలంగాణ సర్కార్‌కు అప్పగించింది. తన భూభాగంలో ఉందని సాకుచూపి శ్రీశైలం ఎడమగట్టు కేంద్రాన్ని తన అధీనంలోకి తీసుకున్న తెలంగాణ సర్కార్.. ఏపీ భూభాగంలో ఉన్న సాగర్ కుడికాలువ హెడ్ రెగ్యులేటర్‌ను మాత్రం రాష్ట్రానికి అప్పగించలేదు.

ఆరోగ్యానికి ఆట బాట

▶ మొదటి పేజీ తరువాయి

వివిధ దశల్లో ప్రత్యేక ఎస్‌వోపీలను రూపొందించి అమలు చేయాలన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులతో ఆయా విభాగాల అధికారులు సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలన్నారు. బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో ముఖ్యమంత్రి జగన్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే..



'ఆడుదాం ఆంధ్ర' సమీక్షలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సంకల్ప బలంతో.. అంచనాలకు మించి

నాడు– నేడు ద్వారా 45 వేల ప్రభుత్వ పాఠశాలలను సమూలంగా మార్పు చేస్తున్నాం. ఈ కార్యక్రమాన్ని మొదలు పెట్టినప్పుడు ఎన్నో ప్రశ్నలు ఎదురయ్యాయి. అలాగే 15 వేల సచివాలయాలను స్థాపించగలుగుతామా? ప్రతి సచివాలయం పరిధిలో విలేజ్ క్లినిక్ పెట్టగలుగుతామా? 1.30 లక్షల మందిని అతి తక్కువ కాలంలో సచివాలయాల్లో నియమించగలుగుతామా? అన్నవి కూడా గతంలో ప్రశ్నార్థకాలుగా ఉన్నవే. ప్రజలకు మంచి చేయాలనే మన సంకల్పమే వీటన్నింటినీ విజయవంతంగా పూర్తి చేసింది. సచివాలయాల దగ్గర నుంచి నేడు ఆరోగ్య సురక్ష వరకు ప్రతి కార్యక్రమాన్నీ ఒక చాలెంజ్‌గానే చేపట్టాం. ప్రతి అడుగులోనూ అంచనాలకు మించి పని చేశాం. అందులో భాగమే 'ఆడుదాం ఆంధ్ర' తలపెట్టాం.

మైదానాలు మెరవాలి..

ఆడుదాం ఆంధ్రలో భాగంగా 14,997 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో 9,043 క్రీడా మైదానాలను గుర్తించారు. క్రీడల నిర్వహణ కోసం మైదానాలు పూర్తి స్థాయిలో సిద్ధం చేయడంపై నిరంతరం పర్యవేక్షించాలి. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీ మైదానాలు, యూనివర్సిటీ గ్రౌండ్స్, మున్సిపల్ స్టేడియాలు, జిల్లా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు క్రీడలతో మెరిసేలా వినియోగంలోకి తేవాలి. ఇకపై ఏటా గ్రామ స్థాయి నుంచి మట్టిలోని క్రీడా రత్నాలను వెతికి పట్టుకుందాం. అప్పుడే పీవీ సింధు, జ్యోతి సురేఖ, రాయుడు, శ్రీకాంత్, సాకేత్ లాంటి మరింత మంది అంతర్జాతీయ క్రీడాకారులను చూడగలుగుతాం.

సచివాలయాల్లో పోస్టర్లు

ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై అవగాహన కల్పించేలా వెంటనే సచివాలయం పరిధిలో పోస్టర్లను ప్రదర్శించాలి. వలంటీర్లు తమ పరిధిలోని కుటుంబాలకు ఈ టోర్నీ విశిష్టతను వివరించాలి. 15 ఏళ్లు పైబడిన వారిని, ప్రధానంగా గ్రామాల్లో బాలికలను ఎక్కువగా క్రీడలవైపు నడిపించాలి. ఇప్పటికే 1.23 కోట్ల రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఇందులో ఏకంగా 34.19 లక్షల మంది క్రీడాకారులు 'ఆడుదాం ఆంధ్ర'లో పోటీపడతారు. వీరికి నాణ్యమైన కిట్లను అందించాలి.

ప్రొఫెషనల్స్ గుర్తింపు..

నియోజకవర్గ స్థాయిలో ఐదు రకాల క్రీడాంశాల్లో ప్రొఫెషనల్స్‌ను గుర్తించి వారికి చేయూతనిచ్చే గొప్ప కార్యక్రమాలన్ని తలపెడుతున్నాం. క్రికెట్‌లో చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే), ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ టాలెంట్ హంట్‌లో భాగస్వాములవుతాయి. బ్యాడ్మింటన్‌లో సింధు, శ్రీకాంత్ బృందాలు ప్రతిభగల క్రీడాకారులను వెలికి తీసేందుకు ముందుకొచ్చారు. వాలీబాల్‌లో ప్రైమ్ వాలీబాల్, కబడ్డీలో ప్రో కబడ్డీ ఆర్గనైజర్లు ఉత్తమ ప్రతిభను ఎంపిక చేస్తారు. క్రీడలను ప్రమోట్ చేసేందుకు 21 మంది రాష్ట్రస్థాయి అంబాసిడర్‌లు, 345 మంది జిల్లా స్థాయిలో ప్రతిభావంతులు ముందుకు వచ్చారు. దీంతో నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు పూర్తిస్థాయి ప్రొఫెషనల్స్ గేమ్స్ మొదలవుతాయి.

ప్రతిభకు నగదు బహుమతి

క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో ప్రథమ విజేతలకు రాష్ట్రస్థాయిలో రూ.5 లక్షలు, జిల్లాలో రూ.60 వేలు, నియోజకవర్గంలో రూ.35 వేలు చొప్పున నగదు బహుమతి ఇస్తున్నాం. ఈ క్రీడలకు సంబంధించి ద్వితీయ బహుమతి కింద రాష్ట్రస్థాయిలో రూ.3 లక్షలు, జిల్లాలో రూ.30 వేలు, నియోజక వర్గంలో రూ.15 వేలు, తృతీయ బహుమతిగా రూ.2 లక్షలు, రూ.10 వేలు, రూ.5 వేలు చొప్పున అందజేస్తాం. బ్యాడ్మింటన్ డబుల్స్ విజేతలకు రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి రూ.2 లక్షలు, జిల్లాలో రూ.35 వేలు, నియోజకవర్గంలో రూ.25 వేలు, ద్వితీయ బహుమతి కింద వరుసగా రూ.లక్ష, రూ.20 వేలు, రూ.10 వేలు, తృతీయ బహుమతిగా రూ.50 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులు అందచేస్తాం.

■ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పర్యాటక, సాంస్కృతిక, క్రీడాశాఖల మంత్రి ఆర్‌కే రోజా, సీఎస్ డాక్టర్ కె.ఎస్. జవహర్ రెడ్డి, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, యువజన సర్వీసుల శాఖ ముఖ్యకార్యదర్శి ప్రద్యుమ్న, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ పి.కోటేశ్వరరావు, శాప్ ఎండీ హెచ్‌ఎం.ధ్యానచంద్ర, అంతర్జాతీయ క్రీడాకారులు అంబటి రాయుడు, పీవీ సింధు, కిడాంబి శ్రీకాంత్, సాకేత్ మైనేని, వి.జ్యోతి సురేఖ, ఎస్‌కె జఫ్రీన్‌లతో పాటు పలువురు ఉన్నతాధికారులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఐదు రకాల క్రీడలు..

ప్రజారోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. విలేజ్ క్లినిక్స్ ద్వారా ప్రివెంటివ్ కేర్‌పై దృష్టి పెట్టాం. ప్రివెంటివ్ కేర్ మరింత సమర్థంగా పని చేయాలంటే నిత్యం వ్యాయామం అవసరం. ఆరోగ్య సురక్ష ద్వారా డయాబెటిక్, బీపీ కేసులు బయటపడ్డాయి. ప్రివెంటివ్ కేర్‌లో భాగంగా ప్రతి ఇంటిలో ఫిజికల్ యాక్టివిటీస్ పెరిగితే భవిష్యత్తులో అవన్నీ తగ్గుతాయి. అందుకే ఆడుదాం ఆంధ్రను ప్రాముఖ్యత ఉన్న అంశంగా గుర్తించాలి. గ్రామీణ క్రీడాకారులకు సరైన గుర్తింపు కల్పిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కుతుంది. ఇందులో భాగంగానే ఐదు రకాల క్రీడలు.. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో ప్రమోట్ చేయాలి. ప్రతిభగల క్రీడాకారులకు ఉన్నతస్థాయి శిక్షణ అందించే దిశగా అడుగులు వేయాలి. పోటీల ప్రారంభానికి ముందే అన్ని స్థాయిల్లో పెద్ద ఎత్తున పండుగ వాతావరణంలో సన్నాహక కార్యక్రమాలు చేపట్టాలి. 3 కిలోమీటర్ల మారథాన్ లాంటి కార్యక్రమాలు జిల్లా స్థాయిలో నిర్వహించాలి. దీనిద్వారా ఆడుదాం ఆంధ్రకు సరికొత్త ఉత్సాహాన్ని తీసుకురాగలుగుతాం.

మరింత వేగంగా సరుకు రవాణా

- హైస్పీడ్ కారిడార్ల విస్తరణకు నిర్ణయం.. సగటున గంటకు 85 కి.మీ. వేగం లక్ష్యం
- రాష్ట్రంలో 3,200 కి.మీ.మేర విస్తరణ.. ఎన్‌హెచ్‌ఏఐ ప్రణాళిక



సాక్షి, అమరావతి: ఆర్థికాభివృద్ధికి కీలకమైన సరుకు రవాణాను మరింత వేగవంతం చేసే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణను వేగవంతం చేస్తున్నాయి. సరుకును మరింత వేగంగా గమ్యస్థానాలకు చేర్చడమే లక్ష్యంగా జాతీయ రహదారులను హైస్పీడ్ కారిడార్లుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించాయి. ప్రధానంగా పోర్టులు, పారిశ్రామిక క్లస్టర్లు, వాణిజ్య కేంద్రాలను అనుసంధానిస్తూ జాతీయ రహదారులను విస్తరించి హైస్పీడ్ కారిడార్లుగా అభివృద్ధి చేస్తారు. ఇందుకోసం రెండు దశల్లో 36 వేల కి.మీ.మేర హైస్పీడ్ కారిడార్లను అభివృద్ధి చేయాలన్న ప్రణాళికను ఖరారు చేశాయి. దేశంలోని అన్ని నగరాలు, పట్టణాలు, పారిశ్రామిక–వ్యవసాయ క్లస్టర్ల నుంచి గరిష్టంగా 150 కి.మీ. ప్రయాణంతో హై స్పీడ్ కారిడార్లకు చేరుకునేలా ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. దేశంలో సరుకు రవాణా వేగాన్ని రెట్టింపు చేయాలని ఎన్‌హెచ్‌ఏఐ లక్ష్యంగా నిర్ణయించుకుంది. ప్రస్తుతం దేశంలో సరుకు రవాణా వేగం సగటున గంటకు 45 కి.మీ.గా ఉంది. దీనిని 85 కి.మీ.కు చేర్చాలన్నదే లక్ష్యం.

ఏపీలో 3,200 కి.మీ.మేర నిర్మాణం

సరుకు రవాణా వేగం లక్ష్యం సాధించేందుకు దేశంలో 36,542 కి.మీ. మేర హైస్పీడ్ కారిడార్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, ముంబాయిలను అనుసంధానించే ప్రాజెక్ట్‌తో పాటు విశాఖపట్నం, నాగ్‌పూర్, అహ్మదాబాద్, భోపాల్, అమృత్‌సర్ తదితర నగరాల మీదుగా హైస్పీడ్ కారిడార్లను ఏర్పాటు చేస్తారు. మొదటి దశలో 15,246 కి.మీ. మేర 2028 నాటికి పూర్తి చేయాలని నిర్ణయించారు. రెండో దశ కింద 21,296 కి.మీ. మేర 2032 నాటికి పూర్తి చేయాలని ప్రణాళిక రూపొందించారు. ఇందుకోసం రూ.19.5 లక్షల కోట్లతో ఆర్థిక ప్రణాళికను ఆమోదించారు. హైస్పీడ్ కారిడార్ల ప్రాజెక్ట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తగిన ప్రాధాన్యం దక్కడం విశేషం. రాష్ట్రంలో దాదాపు 3,200 కి.మీ.మేర హై స్పీడ్ కారిడార్లుగా అభివృద్ధి చేస్తారు. ఇందుకు భూసేకరణ, ఇతర అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామి కానుంది. విశాఖ, గంగవరం, కాకినాడ, కృష్ణపట్నం పోర్టులతో పాటు కొత్తగా నిర్మించనున్న భావనపాడు, బందరు, రామాయపట్నం తదితర పోర్టులను హైస్పీడ్ కారిడార్లతో అనుసంధానిస్తారు. ఇక విజయవాడ–నాగ్‌పూర్, విజయవాడ–హైదరాబాద్, విశాఖపట్నం–హైదరాబాద్ వయా భద్రాచలం, విశాఖపట్నం–రాయ్‌పూర్, ఖమ్మం–దేవరాపల్లి, చెన్నై–బెంగళూరు వయా చిత్తూరు తదితర హైవే ప్రాజెక్టులన్నీ హైస్పీడ్ కారిడార్ల పరిధిలోకి తేనున్నారు. రాష్ట్రంలోని పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తులను శరవేగంగా ఇతర ప్రాంతాలకు రవాణా చేసేందుకు మార్గం సుగమం కానుంది. పారిశ్రామిక, వాణిజ్య రంగాల అభివృద్ధితో ఉపాధి అవకాశాలు భారీగా పెరగడంతో పాటు రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి వేగం పుంజుకుంటుందని నిపుణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

వెబ్‌సైట్‌లో గ్రూప్–2 పోస్టుల సమాచారం

సాక్షి, అమరావతి: వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న గ్రూప్–2 పోస్టుల సమగ్ర సమాచారాన్ని బుధవారం వెబ్‌సైట్‌లో ఉంచినట్టు ఏపీపీఎస్సీ కమిషన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఖాళీగా ఉన్న గ్రూప్–2 పోస్టుల భర్తీకి ఈ నెల 7న నోటిఫికేషన్ ఇచ్చిన ఏపీపీఎస్సీ వివిధ సర్వీసులు, వాటి కిందకు వచ్చే పోస్టుల వివరాలు, ఖాళీల విభజన, వేతనం, వయసు, అర్హతలతో సమగ్ర సమాచారాన్ని వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఈ నెల 21వ తేదీ నుంచి జనవరి 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు కమిషన్ వెబ్‌సైట్ https://psc.ap.gov.inలో చూడవచ్చు.

నేడు రాష్ట్రవ్యాప్తంగా సీఎం జగన్ జన్మదిన వేడుకలు

- తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ సంబరాలు
- ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ
- నేడు రాష్ట్రవ్యాప్తంగా కేక్‌లు కటింగ్, రక్తదాన శిబిరాలు
- రెండ్రోజులు ముందే దేశ, విదేశాల్లో ఎన్నో సేవా కార్యక్రమాలు

సాక్షి,అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు పురస్కరించుకుని ఈనెల 21 (గురువారం) రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలు, విదేశాల్లో భారీఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘనంగా ఏర్పాట్లుచేశాయి. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో మొక్కలు నాటడంతో పాటు అన్నదానం, వస్త్రదానాలు చేయనున్నారు. అలాగే, ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేస్తారు. రక్తదాన శిబిరాలు కూడా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం పర్యవేక్షకులు, శాసనమండలిలో ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కోట్లాది మంది అభిమానులతో పాటు సంక్షేమ పథకాల లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు సైతం పాల్గొంటారన్నారు. అలాగే, వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం వద్ద గురువారం ఉ.9.30 గంటలకు దివంగత సీఎం వైఎస్సార్‌కి నివాళి అర్పించడంతో కార్యక్రమాలు మొదలవుతాయని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా సాంస్కృతి కార్యక్రమాలు, కేక్ కటింగ్, దుస్తులు, బహుమతుల పంపిణీ, అన్నదానం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇక ఇప్పటికే రెండ్రోజులు ముందే దేశ, విదేశాల్లో వైఎస్సార్‌సీపీ అభిమానులు ఎన్నో సేవా కార్యక్రమాలు ప్రారంభించారని అప్పిరెడ్డి చెప్పారు.

గుంటూరులో నంది నాటకోత్సవాల సందడి

సాక్షి, అమరావతి: రంగస్థల నంది నాటకోత్సవాల సందడి మొదలైంది. ఇప్పటికే గుంటూరులో ఉత్సవ వాతావరణం ప్రభవిస్తోంది. నగర ప్రధాన కూడళ్లలో 'నంది' నమూనాల అలంకరణలు ఆకట్టుకుంటున్నాయి. రాష్ట్ర చలనచిత్ర టీవీ నాటకరంగ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణ మురళి గుంటూరులో బసచేస్తూ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరుగుతున్న ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. 23వ తేదీ నుంచి పోటీలు జరుగనుండగా.. సురభి పర్యవేక్షణలో స్టేజీపై సౌండ్ అండ్ లైటింగ్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గుంటూరులోని ప్రధాన రహదారుల ఆర్చ్‌లకు తెలుగు నాటకరంగ ప్రముఖుల పేరుతో స్వాగత ద్వారాలను ఏర్పాటు చేస్తున్నారు. శనివారం నుంచి 29 వరకు నాటకోత్సవాలలో భాగంగా రాష్ట్రం నలుమూలల నుంచి 38 నాటక సమాజాలకు చెందిన సుమారు మూడు వేలమంది నటీనటులు సాంకేతిక రంగ నిపుణుల బృందాలు ప్రదర్శనలు ఇవ్వనున్నాయి. నాటక ప్రదర్శనల రౌండప్ క్యాప్సూల్ బులిటెన్‌ను ప్రతి రోజు సాయంత్రం విడుదల చేయనున్నారు.

ఊర కుక్కల కట్టడికి చర్యలు

- 2030 నాటికి రేబిస్ వ్యాధి నిర్మూలనే లక్ష్యం

సాక్షి, అమరావతి: గ్రామాల్లో ఊర కుక్కల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 2030 నాటికి కుక్కల ద్వారా రేబిస్ వ్యాధి వ్యాప్తిని పూర్తి స్థాయిలో కట్టడి చేయడమే లక్ష్యంగా కార్యాచరణను రూపొందిస్తోంది. ఈ మేరకు ఈ నెల 14న పంచాయతీరాజ్, వైద్య, ఆరోగ్య, పశుసంవర్థక అధికారులు ఉమ్మడి సమావేశం నిర్వహించారు. కుక్కలు కరిచిన వారికి రేబిస్ వ్యాధి సంక్రమణ అతి తక్కువ స్థాయిలో ఉండేలా గ్రామాల్లో సంచరించే కుక్కలన్నింటికీ రేబిస్ వ్యాధి నిరోధక టీకాలను వేయనున్నారు. అలాగే ఊర కుక్కల్లో సంతానోత్పత్తిని నియంత్రించేందుకు స్టెరిలైజేషన్ వంటివి చేపట్టేందుకు ఉమ్మడి కార్యాచరణ చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీ స్థాయిలో పంచాయతీరాజ్‌శాఖ ఎంపిక చేసిన వారికి పశు సంవర్థక శాఖ శిక్షణ అందించేందుకు ముందుకొచ్చింది. అదేవిధంగా పెంపుడు కుక్కల వివరాలను వాటి యజమానులు తప్పనిసరిగా గ్రామ పంచాయతీల్లో నమోదు చేసుకునేలా పంచాయతీరాజ్‌శాఖ కార్యాచరణను సిద్ధం చేస్తోంది.

రాష్ట్రంలో 8,63,707 ఊర కుక్కలు

దేశవ్యాప్తంగా రేబిస్ కారణంతో మరణించే వారిలో 96 శాతం మంది కుక్కల వల్లే మృతి చెందినట్టు కేంద్ర ప్రభుత్వ గణాంకాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో 2030 నాటికి కుక్కల ద్వారా వచ్చే రేబీస్‌ను పూర్తి స్థాయిలో కట్టడి చేయడమే లక్ష్యంగా కేంద్ర– రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయి. కాగా, గతేడాది నవంబర్ నెలాఖరు నాటికి రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మొత్తం 8,63,707 ఊర కుక్కలు ఉన్నట్టు అధికార గణాంకాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికే పట్టణ ప్రాంతాల్లో ఊర కుక్కల కట్టడికి మున్సిపాలిటీల పరిధిలో ప్రత్యేక వ్యవస్థలు పనిచేస్తున్నాయి. గ్రామాల్లో మాత్రం ఇలాంటి ప్రత్యేక వ్యవస్థ లేదు. పంచాయతీల్లో ఊర కుక్కల కట్టడికి పంచాయతీరాజ్ శాఖ కార్యాచరణను సిద్ధం చేసే యోచనలో ఉందని అధికారులు చెబుతున్నారు.

క్యాంపు కార్యాలయాల అంశం త్రిసభ్య ధర్మాసనానికి నివేదిస్తా

- అంగీకరించిన న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు
- త్రిసభ్య ధర్మాసనం నిర్ణయం చెప్పే వరకు స్టేటస్‌కో ఉత్తర్వులిస్తా
- ప్రభుత్వంతో సంప్రదించి నిర్ణయం చెబుతామన్న ప్రభుత్వ న్యాయవాదులు
- తదుపరి విచారణ నేటికి వాయిదా

సాక్షి, అమరావతి: ఉత్తరాంధ్ర అభివృద్ధి పర్యవేక్షణ, సమీక్ష నిమిత్తం విశాఖపట్నంలో ప్రభుత్వ క్యాంపు కార్యాలయాల ఏర్పాటు నిమిత్తం అనువైన ప్రదేశాల గుర్తిస్తూ ఐఏఎస్‌ల కమిటీ ఇచ్చిన నివేదికకు అనుగుణంగా ప్రభుత్వం జారీ చేసిన జీవో 2283ను సవాల్ చేస్తూ రాజధాని రైతులు దాఖలు చేసిన వ్యాజ్యాలను త్రిసభ్య ధర్మాసనానికి నివేదించేందుకు హైకోర్టు సింగిల్ జడ్జి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు సూత్రప్రాయంగా అంగీకరించారు. అయితే.. అనుబంధ వ్యాజ్యాలపై త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపి నిర్ణయం వెలువరించేంత వరకు క్యాంపు కార్యాలయాల తరలింపు విషయంలో యథాతథ స్థితి (స్టేటస్‌కో) కొనసాగించేలా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తానని న్యాయమూర్తి ప్రతిపాదించారు. ఇరుపక్షాల ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత ఈ కోర్టుపై ఉందన్నారు. స్టేటస్‌కో విషయంలో ప్రభుత్వాన్ని సంప్రదించిన తరువాత తమ నిర్ణయాన్ని చెబుతామని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదులు వేలూరు మహేశ్వరరెడ్డి, చింతల సుమన్ తెలిపారు. దీంతో న్యాయమూర్తి ఈ వ్యాజ్యాలపై తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వ్యాజ్యాలు విచారణకు రాగానే న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ స్పందిస్తూ.. తాను పలు సుప్రీంకోర్టు తీర్పులను, హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం తీర్పులను పరిశీలించానని తెలిపారు. ఏదైనా అంశానికి సంబంధించిన కేసు సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనం ముందు పెండింగ్‌లో ఉన్నప్పుడు, అదే అంశానికి సంబంధించి ఆ తరువాత దాఖలయ్యే వ్యాజ్యాలను కూడా విస్తృత ధర్మాసనానికే నివేదించాలన్నది సుప్రీంకోర్టు తీర్పు అని గుర్తు చేశారు. అదే రీతిలో క్యాంపు కార్యాలయాల ఏర్పాటు విషయంలో దాఖలైన ప్రస్తుత వ్యాజ్యాలు కూడా త్రిసభ్య ధర్మాసనం వద్దకే వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. కాబట్టి ఈ వ్యాజ్యాలను త్రిసభ్య ధర్మాసనం వద్దకే పంపుతూ ఉత్తర్వులు జారీ చేస్తానన్నారు. అయితే.. ఈ వ్యాజ్యాలపై త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపి నిర్ణయం వెలువరించేంత వరకు క్యాంపు కార్యాలయాల విషయంలో స్టేటస్‌కో ఉత్తర్వులు జారీ చేస్తానని తెలిపారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసమే..

ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదులు మహేశ్వరరెడ్డి, సుమన్ స్పందిస్తూ.. ప్రభుత్వ కార్యాలయాల తరలింపునకూ, క్యాంపు కార్యాలయాల ఏర్పాటునకు ఎంతో తేడా ఉందన్నారు. ముఖ్యమంత్రి ఎక్కడి నుంచైనా పని చేసేందుకు అవకాశం ఉంటుందని, దీనిని ఎవరూ అడ్డుకోజాలరన్నారు. ఈ విషయంలో తాము గతంలో త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలకు కట్టుబడి ఉన్నామన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు క్యాంపు కార్యాలయాలు ఏర్పాటవుతున్నాయని వారు కోర్టుకు నివేదించారు. పిటిషనర్లు కోరుతున్నట్టు ఒక ప్రాంతం మాత్రమే అభివృద్ధి చెందాలనడం సరికాదన్నారు. మిగిలిన ప్రాంతాల ప్రజల మనోభావాలను సైతం పరిగణనలోకి తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అందుకే ఉత్తరాంధ్రలో క్యాంపు కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. స్టేటస్‌కో విషయంలో ప్రభుత్వంతో సంప్రదించి తమ నిర్ణయాన్ని తెలియచేస్తామని వారు చెప్పారు.

హైకమాండ్‌కు కట్టుబడి ఉండాల్సిందే

- టీడీపీ–జనసేన కార్యకర్తలకు చంద్రబాబు స్పష్టీకరణ
- ఉద్యోగులు ప్రభుత్వానికి పూర్తిగా సరెండరయ్యారు
- యువగళం విజయోత్సవ సభలో చంద్రబాబు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: హైకమాండ్ తీసుకునే నిర్ణయం ఏదైనా టీడీపీ, జనసేన కార్యకర్తలు కట్టుబడి ఉండాలని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు హుకుం జారీ చేశారు. వంద రోజుల తర్వాత జనసేనను ఏ విధంగా ఆదరించాలో టీడీపీ చెబుతుందన్నారు. లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర ముగింపు సందర్భంగా బుధవారం విజయనగరం జిల్లా పోలిపల్లిలో విజయోత్సవ సభ నిర్వహించారు. కుప్పంలో జరిగిన లోకేశ్ పాదయాత్ర ప్రారంభోత్సవంలో పాల్గొని, అక్కడే తీవ్ర అనారోగ్యానికి గురై, చికిత్స పొందుతూ మృతి చెందిన ఎన్టీఆర్ మనుమడు నందమూరి తారకరత్నకు ఈ సభలో నివాళులర్పించకపోవడంపై కార్యకర్తల నుంచి నిరసన వ్యక్తమైంది. సభలో మాట్లాడిన నేతలు కనీసం తారకరత్న పేరు తలవకపోవడం నందమూరి కుటుంబం పట్ల చంద్రబాబుకు ఉన్న చిన్నచూపునకు, వాడుకొని వదిలేసే ఆయన తత్వానికి నిదర్శనమన్న వ్యాఖ్యలు వినిపించాయి. ఈ సభ చివర్లో చంద్రబాబు ప్రసంగిస్తూ.. రాష్ట్రంలో ఉద్యోగ సంఘాలకు తాము భయపడేవాళ్లమని, ఇప్పుడు ఉద్యోగులు ప్రభుత్వానికి సరెండరయ్యారని అన్నారు. తాను అధికారంలో ఉంటే 2020 నాటికే భోగాపురం విమానాశ్రయం, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేవాడినని అన్నారు. పాదయాత్ర చేసిన లోకేశ్‌పైన, వలంటీర్ల పైన కేసులు పెట్టినవారికి వడ్డీతో సహా అప్పగిస్తానన్నారు. జగన్ పాలనలో పరిశ్రమలు, ఉద్యోగాల్లేవని, విశాఖ మెట్రో పోయిందని, హెచ్‌ఎస్‌బీసీ పారిపోయిందని చెప్పారు. ఉత్తరాంధ్రలో సెటిల్‌మెంట్లు పెరిగాయన్నారు. టీడీపీ–జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలు అమరావతి, తిరుపతిలో వెల్లడిస్తామని తెలిపారు. ఆర్టీసీలో ఆడవాళ్లకు ఉచిత ప్రయాణం, ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగాలు, రూ.3 వేలు నిరుద్యోగ భృతి వంటి పలు హామీలు ఇచ్చారు. వైసీపీలో ఎమ్మెల్యేలు పనికిరారని ఎమ్మార్వోల మాదిరిగా ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారని, పనికిరాని వారు వాళ్లు కాదని, జగన్‌మోహన్‌రెడ్డి అని దూషించారు.

సభ మధ్యలోనే వెళ్లిపోయిన కార్యకర్తలు!



సభా ప్రాంగణం విశాఖ–కోల్‌కతా జాతీయ రహదారికి ఆనుకొని ఉంది. ఇక్కడ పార్కింగ్ తదితర ఏర్పాట్లలో ప్రణాళిక లోపం కారణంగా నేషనల్ హైవేపై గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయింది. సమీపంలోని రిసార్ట్‌లో బస చేసిన లోకేశ్ గంటన్నర ఆలస్యంగా సాయంత్రం 4:30కి సభకు వచ్చారు. విశాఖకు ప్రత్యేక విమానాల్లో వచ్చిన చంద్రబాబు, పవన్ సాయంత్రం 5 గంటలకు చేరుకున్నారు. బాలకృష్ణ, లోకేశ్ ప్రసంగిస్తుండగానే చాలామంది కార్యకర్తలు వెళ్లిపోయారు. 7:50 గంటలకు చంద్రబాబు ప్రసంగించే సమయానికే సభలో కుర్చీలు ఖాళీ అయిపోయాయి.

మార్పు కోసం టీడీపీతో పొత్తు: పవన్

ప్రజల బాధలు తెలుసుకోవడానికి పాదయాత్ర చేయలేకపోయాననే బాధ తనకు ఉందని జనసేన నేత పవన్ కళ్యాణ్ అన్నారు. బాబును జైలులో పెడితే చాలా బాధ కలిగిందన్నారు. భువనేశ్వరి బాధను దూరం నుంచి అర్థం చేసుకున్నానని చెప్పారు. ఒంటరి మహిళలు, ఒంటరిగా ఉన్న ఆడపిల్లల డేటాను వలంటీర్లు సేకరిస్తున్నారని ఆరోపించారు. 2024లో మార్పు కోసం టీడీపీతో పొత్తు పెట్టుకున్నామని, జగన్‌ను ఇంటికి పంపిస్తామని చెప్పారు. ఈ పొత్తు లేకపోతే వైసీపీ గూండాలతో కర్రలు పట్టుకొని కొట్లాడవలసి వస్తుందని చెప్పారు.

యుద్ధం ఆగదు: లోకేశ్

యువగళం ఆరంభం మాత్రమేనని, తాడేపల్లి కొంప తలుపులు బద్దలు కొట్టేవరకూ యుద్ధం ఆగదని లోకేశ్ వ్యాఖ్యానించారు. యువగళం ఆపడానికి ఆనాడు జగన్ జియో 1 (జీవో 1 అనబోయి) తీసుకొచ్చారని అన్నారు. తన గొంతు ఎన్టీ రామారావు ఇచ్చారని, దీన్ని నొక్కే మగాడు పుట్టలేదని, పుట్టబోడని చెప్పారు. అంతకుముందు ఎమ్మెల్యే బాలకృష్ణ, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, జనసేన నాయకుడు నాదెండ్ల మనోహర్ తదితరులు ప్రసంగించారు.

అశోక్‌కు అవమానం

టీడీపీలో అత్యంత సీనియర్ నేత, విజయనగరం జిల్లాకు చెందిన కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజుకు సభలో అవమానం తప్పలేదు. చోటా మోటా నాయకులకు సభలో ప్రసంగించేందుకు అవకాశమిచ్చిన నేతలు.. అశోక్‌కు మాత్రం ఆ అవకాశం ఇవ్వలేదు. ఆయన సొంత జిల్లాలో సభ పెట్టి, ఆయన్నే మాట్లాడనివ్వకపోవడం చర్చనీయాంశమైంది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943


'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 6.50

సంపుటి: 16
సంచిక: 96

గురువారం 21-12-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 6.50

సంపుటి: 16
సంచిక: 96

గురువారం 21-12-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | DELHI | CHENNAI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్



మ్యానిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం మద్యం మహమ్మారి నుండి కుటుంబాలను కాపాడేందుకు
మీ సోదరుడిగా నేనున్నానని అక్కా చెల్లెమ్మలకు భరోసానిస్తూ... ఈ నాలుగేళ్ళలో మన ముఖ్యమంత్రివర్యులు

శ్రీ వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి గారు

దశలవారీగా చేపట్టిన మద్యనియంత్రణ చర్యల ద్వారా మద్యానికి బానిసలైన కుటుంబాలలో సంతోషాలు నెలకొన్నాయి.

పాదయాత్రలో అక్క-చెల్లెమ్మలకు ఇచ్చిన మాట పక్రారం మద్యపానం నియంత్రణ విషయంలో గత ప్రభుత్వానికి - జగనన్న ప్రభుత్వానికి మధ్య తేడాలు..

గత ప్రభుత్వం	మన ప్రభుత్వం
4380 మద్యం దుకాణాలు ప్రైవేట్ వ్యక్తులచే నిర్వహించబడేవి.	మద్యం దుకాణాలు 2934కు తగ్గించబడినవి, ఎపిఎస్‌బిసిఎల్‌కు అప్పగించబడినవి.
రాష్ట్రవ్యాప్తంగా వివిధ గ్రామాలలో 43000 బెల్టుషాపులు ఉండేవి.	రాష్ట్రవ్యాప్తంగా వివిధ గ్రామాలలో విస్తరించి ఉన్న 43000 బెల్టు షాపులు తొలగించబడినవి.
మద్యపానం కోసం మద్యం దుకాణాలకు 4380 పర్మిట్ రూమ్స్ కలుపబడి ఉండేవి.	మద్యం దుకాణాలకు కలుపబడిన 4380 పర్మిట్ రూమ్స్ అన్నింటినీ తొలగించడమైనది.
మద్యం అమ్మకానికి వ్యాపార వేళలు ఉ. 10.00 గం.ల నుండి రా. 10.00 గం.ల వరకు ఉండేవి.	వ్యాపార వేళలు ఉ. 11.00 గం.ల నుండి రా. 09.00 గం.ల వరకు తగ్గించబడినవి.
మద్యపానం ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టబడినవి.	కొత్త పన్ను ఎఆర్ఇటి విధించడం, వ్యక్తి కలిగియుండు లిక్కర్ పరిమితి తగ్గింపు మరియు చైతన్య చర్యలతో సహా మద్యపానం తగ్గించడానికి చర్యలు.

శ్రీ వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి గారు
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు

ఇంధన గ్రీన్ హారిజన్స్ విస్తరణ :



సుస్థిరమైన భవిష్యత్ కోసం ఇథనాల్ ఉత్పత్తికి ప్రోత్సాహం.

- ప్రస్తుత ప్రభుత్వం 7 ఇథనాల్ ఉత్పత్తి చేసే యూనిట్లకు సంవత్సరానికి 3760 లక్షల BLs సామర్థ్యంతో లైసెన్స్‌లు / LOIs మంజూరు చేసింది.
- ఇథనాల్ కలిపిన ఇంధనానికి మారేందుకు గ్రీన్ ఎనర్జీ దిశగా గొప్ప ముందడుగు.

అధునాతన టెస్టింగ్ ఎక్సైజ్ లేబొరేటరీస్ : ఆధునికీకరించడం ద్వారా నాణ్యతను మెరుగుపరచడం



మద్య పానీయాల ఖచ్చితమైన పరీక్ష కోసం అధునాతన సాంకేతికత మరియు ఇండస్ట్రీ - లీడింగ్ సాఫ్ట్‌వేర్‌తో 5 ప్రాంతీయ ఎక్సైజ్ లేబొరేటరీలకు అన్ని సదుపాయాలు కల్పించబడినవి.



జప్తు కార్యకలాపాలు :

- ఇతర వాటితోపాటు మద్యం మరియు ఇసుకకు సంబంధించిన అన్ని చట్టవిరుద్ధమైన కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రత్యేక విభాగంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (SEB) ఏర్పాటు చేయబడినది.
- అక్రమ మద్యం బట్టీల ఖచ్చితమైన నియంత్రణ కోసం గ్రామ వలంటీర్లు మరియు వార్డు వలంటీర్ల సేవలు వినియోగించుకోబడుచున్నవి.
- ఐడి నేరంలో ప్రమేయం గల వ్యక్తులకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించబడిన వారి సంఖ్య : 3862.
- సారా రహిత గ్రామాలుగా మారిన ఐడి ప్రభావిత గ్రామాల సంఖ్య : 2006
- గంజాయి కేసులు నమోదు సంఖ్య : (16-5-2020 నుండి 18-12-2023 వరకు) : 6256





మద్యపానం - ఆరోగ్యానికి హానికరం

అమ్మకం, రవాణా పై ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక హెల్ప్ లైన్ **14500**

డ్రగ్స్‌తో చెలగాటం - ప్రాణానికి సంకటం




Ganja Leaf | Hashish Powder | Cocaine | Heroin

మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్

లక్షలాది కుటుంబాల్లో వెలకట్టలేని సంతోషాలు



మద్యం వద్దు ... ఆరోగ్యం ముద్దు ...


'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 6.50

సంపుటి: 16
సంచిక: 96

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | DELHI | CHENNAI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

గురువారం 21-12-2023

విశ్వసనీయతకు నిలువెత్తు రూపం.. ఆలోచనల్లో నిబద్ధత..

ఆచరణలో ఎంతటి కష్టం, నష్టం ఉన్నా వెనక్కి తగ్గని గుణం..

పాలనకు మానవత్వ పరిమళం అద్దడానికి నిరంతర ప్రయత్నం..

గడియారం ముల్లుతో పోటీపడే దినచర్య..

ఆడినమాట నిలబెట్టుకోవడమే లక్ష్యంగా కార్యాచరణ..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వ్యవహారశైలిపై కథనం

ఇదీ.. జగన్ కమిట్‌మెంట్

అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ అడుగులు



అమ్మ ఒడి అమలు చేస్తామని మేనిఫెస్టోలో హామీ

దాన్నుంచి ఒక్కొక్క పథకాన్నీ చేరుస్తూ విద్యలో విప్లవం

స్కూళ్లు, విద్యార్థుల స్థితిగతులు, చదివే విధానంలో సంస్కరణలు

- 'నాడు-నేడు'తో మారిన ప్రభుత్వ బడులు, ఆసుపత్రులు
- ఆరోగ్యాన్ని ప్రతి ఒక్కరికీ హక్కుగా ఇవ్వాలని భావించిన సీఎం
- అందుకే ఆరోగ్య శ్రీ పరిధిని విస్తరించి మరింత బలోపేతం
- చికిత్సలు, ఆసుపత్రుల సంఖ్య పెంపు.. రూ.25 లక్షల వరకూ ఉచితం
- స్పెషలిస్టు వైద్యులతో సహా వైద్య శాఖలో ప్రతి ఒక్క పోస్టూ భర్తీ
- గ్రామాలకు వెళ్లి మరీ సేవలందించేందుకు 'ఫ్యామిలీ డాక్టర్'
- వ్యవసాయంలో కొత్త ఒరవడికి ఆర్‌బీకేలతో నాంది
- విత్తనాలు, ఎరువుల విక్రయం నుంచి పంట కొనుగోలు దాకా అక్కడే
- రాష్ట్రంలో ప్రతి ఒక్క ఎకరా వివరాలతో 100 శాతం 'ఈ-క్రాప్'
- ఉచితంగా ప్రతి ఎకరాకూ బీమా.. ఏటా రూ.13,500 రైతు భరోసా
- ఎలాంటి నష్టం జరిగినా ఒకటిరెండు రోజుల్లో పక్కాగా నివేదించే వ్యవస్థ
- సొంతిల్లు లేనివారు ఉండకూడదన్న ఉద్దేశంతో 31 లక్షల ఇంటి స్థలాలు
- ఆనక వాళ్లందరికీ ఇళ్లు కట్టించి ఇచ్చే బాధ్యతనూ తీసుకున్న ప్రభుత్వం
- జగనన్న కాలనీల పేరిట ఎక్కడికక్కడ కొత్తగా వెలుస్తున్న ఊళ్లు

2లో

పరిపాలనను గ్రామ స్థాయికి వికేంద్రీకరిస్తూ గ్రామ సచివాలయాలు

స్థానికంగా ఏ సేవలైనా.. ధ్రువపత్రాలైనా అక్కడే పొందే వీలు

వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్లకే వెళ్లి పింఛన్లు అందిస్తున్న వలంటీర్లు

వీటితో పాటు ప్రభుత్వ పథకాలన్నిటికీ వారధులుగా ఈ సైనికులు

ఒకపక్క.. రోజుకు వంద రూపాయల సంపాదన కూడా లేక.. కనీస అవసరాలని చెప్పే తిండి, ఇల్లు, దుస్తులకు కూడా నోచుకోని జనం లెక్కించలేనంత మంది. మరోపక్క.. రోజుకు లక్ష రూపాయలు సైతం గ్యాంబ్లింగ్‌లో పోగొట్టుకుని చింతలేకుండా గడిపేసే శ్రీమంతులూ లెక్క లేనంతమంది. ఇదీ.. మన సమాజంలో ఉన్న విభజన. నానాటికీ పెద్దదవుతున్న ఈ రేఖ చెరిగేంతవరకూ అభివృద్ధి చెందిన దేశంగానో, రాష్ట్రంగానో మారటం అసాధ్యం. కనీస అవసరాలు తీర్చుకోలేని కోట్లాది మందిని విడిచిపెట్టేస్తే ఆ అభివృద్ధికి అర్థం ఉండదు. ఆ అభివృద్ధిలో వాళ్లకూ వాటా ఉండాలి. ఆ స్థాయికి వాళ్లను తీసుకురావాలి. వాస్తవానికి సంక్షేమ పథకాల పరమార్థం ఇదే. ఇపుడు ఆంధ్రప్రదేశ్‌లో కనిపిస్తున్నది ఆ అభివృద్ధే.

ప్రభుత్వానికీ మనసు ఉండాలని..


అక్షరానికి అగ్రపీఠం


అన్నదాతకు అభయం


'నాడి' పట్టిన నేత


జలాభిషేకం
వరుసగా నాలుగేళ్లుగా కోటి ఎకరాలకు సాగునీరు


ఆంధ్రా తీరం.. ఆర్థికంగా ఊతం


పరిశ్రమలు క్యూ...


రాష్ట్రం 'క్లిక్' అయిందిలా

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం సాధించిన ప్రగతిపై ప్రత్యేక కథనాలు..

2,3,4,5,6,7,8,9,10,11 పేజీల్లో..

ఇదీ.. జగన్ కమిట్‌మెంట్

రమణమూర్తి మంథా



ప్రతి రంగంలోనూ తనదైన ముద్ర

చదువుతోనే తలరాత మారుతుంది దీన్ని మనసావాచా నమ్మిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్. కాబట్టే తన పిల్లలిద్దరినీ టాపర్లుగా నిలబెట్టగలిగారు. ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రజలకూ సరైన విద్యనందించాలన్న ఉద్దేశంతోనే మేనిఫెస్టోలో 'అమ్మ ఒడి'ని ప్రతిపాదించారు. చేతిలో డబ్బుల్లేక చిన్న పిల్లల్ని సైతం కూలికి పంపే పరిస్థితిని మార్చాలన్నదే దీనివెనకున్న ఆలోచన. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక దీన్ని ఆచరణలోకి తెచ్చారు. ఆశించినట్టే 'అమ్మ ఒడి' ఊతంతో పిల్లలు బడి బాట పట్టారు.

మరి ఇది సరిపోతుందా?

ఇదిగో.. ఈ ఆలోచనే విద్యారంగంలో పెను సంస్కరణలకు బీజం వేసింది. స్కూళ్లకొచ్చే పిల్లల కడుపు నిండితేనే చదువు ఒంట బడుతుందన్న ఆలోచన.. పౌష్టికాహారంతో కూడిన 'గోరుముద్ద'కు ప్రాణం పోసింది. బళ్లు తెరిచిన ఆరు నెలలకు కూడా పుస్తకాలు అందకపోతే పిల్లలెలా చదువుతారు? ఎవరి స్థాయిని బట్టి వారు దుస్తులు, బ్యాగులతో వస్తే.. ఒకరు షూ వేసుకుని, మరొకరు చెప్పులు లేకుండా వస్తే అంతా ఒక్కటేనన్న భావన ఎందుకొస్తుంది? వీటన్నిటికీ సమాధానమే.. స్కూళ్లు తెరవటానికి ముందే ప్రతి విద్యార్థికీ అందుతున్న 'విద్యా కానుక'.

సరే! మరి స్కూళ్లో? తమ వారి ప్రయివేటు ప్రయోజనాల కోసం గత ప్రభుత్వాలు వాటిని చిత్రవధ చేసి చంపేశాయిగా? ఆడపిల్లలు టాయిలెట్ కోసం ఇంటికెళ్లాలి. సరైన గదుల్లేవు. బెంచీలు, బ్లాక్ బోర్డులు అన్నీ అంతంతే! ఎందుకెళ్లాలి?... అనిపించేలా ఉన్నాయి మన బడులు. వీటిని మార్చాలనుకున్నారు జగన్. అందుకే.. 'నాడు-నేడు' పేరిట ఓ యజ్ఞాన్ని ఆరంభించారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలనూ కార్పొరేట్ స్కూలుకు దీటుగా సౌకర్యాలతో తీర్చిదిద్దారు. వేల కోట్లు ఖర్చు చేయాల్సి రావటంతో.. దశల వారీగా ఈ యజ్ఞాన్ని పూర్తి చేస్తున్నారు.

స్కూళ్లకు వస్తున్నారు. భోజనం, దుస్తులు ఓకే. స్కూళ్లూ మారాయి. మరి చదువో! మన పిల్లలు పోటీ పడాలంటే ఇంగ్లిష్ రావాలి. వస్తేనే రాణించగలరు. అంతర్జాతీయంగానూ పోటీ పడగలరు. అందుకే ప్రయివేటు స్కూళ్లకు మళ్లే ప్రీప్రయిమరీ-1,2 తరగతులు వచ్చాయి. ఆది నుంచే ఇంగ్లిష్ మీడియంలో బోధన మొదలయింది. ఇలాగైతే ప్రయివేటు స్కూళ్లకు ఎవరూ రారు కనక.. మాతృభాషపై మమకారం లేదంటూ, ఇంగ్లీషు చదువులు వద్దంటూ మాఫియాగాళ్లంతా కలిసి మాయా యుద్ధానికి దిగారు. కేసులు వేశారు. అయినా సరే.. జగన్ సంకల్పం గట్టిది కావటంతో ఇంగ్లీషు మీడియం వచ్చింది. ఇప్పుడు చాలా మంది పిల్లలు అనర్గళంగా ఆంగ్లంలో మాట్లాడుతుండటం ఈ రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు. అక్కడితో ఆగలేదు జగన్. అగ్రశ్రేణి కార్పొరేట్ స్కూళ్లలోనే దొరికే ఎడ్యుటెక్ కంటెంట్‌ను దిగ్గజ సంస్థ 'బైజూస్' ద్వారా మన పిల్లలకూ అందుబాటులోకి తెచ్చారు. ఏటా 8వ తరగతి పిల్లలకు శాంసంగ్ ట్యాబ్‌లనూ అందజేస్తున్నారు. మిగిలిన తరగతుల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్‌ను (ఐఎఫ్‌పీ) ఏర్పాటు చేస్తున్నారు. డిజిటల్ క్లాస్ రూమ్‌లనూ అందుబాటులోకి తెస్తున్నారు. దీన్ని బట్టి తెలిసేది ఒక్కటే. పిల్లల చదువుపై సీఎం జగన్‌కు అంతులేని నిబద్ధత ఉంది. చదివించటం ద్వారా వారి రాతలను మార్చాలన్న తపనతో.. యావత్తు విద్యా రంగాన్ని సమూలంగా సంస్కరించటం మొదలెట్టారు. ఇదంతా చేసింది జస్ట్ నాలుగున్నరేళ్ల వ్యవధిలోనే!

అన్నిటినీ మించి వైఎస్ జగన్‌లో కనిపించేది విశ్వసనీయత, చిత్తశుద్ధి. వాస్తవానికి ఈ ప్రభుత్వ నాలుగున్నరేళ్లలో రెండేళ్లు కోవిడ్ సంక్షోభ ఛాయల్లోనే గడిచిపోయింది. యావత్తు ఆర్థిక వ్యవస్థ స్తంభించిపోయిన ఆ కాలంలో జీతాలు సహా అన్నింటా కోతలే. రాష్ట్రాలన్నీ పథకాలను నిలిపేశాయి. ఒక్క ఏపీ మాత్రం దీనికి మినహాయింపు. పేదలకిస్తున్న ఏ ఒక్క పథకాన్నీ ఆపలేదు. ఠంచనుగా ఖాతాల్లో డబ్బులు పడ్డాయి. పైపెచ్చు ఆహారం, మందులు అన్నీ ఉచితంగా ఇస్తూ ఖర్చుకు వెరవకుండా కోవిడ్ సంరక్షణ చర్యలు చేపట్టింది. దీనికి అప్పట్లో ముఖ్యమంత్రి జగన్ ఏమన్నారో తెలుసా..! 'ఇలాంటి కష్టకాలంలోనే కదా మనం తోడుండాల్సింది' అని. పొరుగు రాష్ట్రాల వారు ఏపీ మీదుగా కాలినడకన వారి సొంతూళ్లకు తరలిపోతున్నపుడు చేతిలో డబ్బులు పెట్టి మరీ సాగనంపిన ప్రభుత్వమిది. ఒక సొంతిల్లు ఎంతటి భరోసానిస్తుందో తెలుసు కనకే రాష్ట్ర వ్యాప్తంగా ఏక కాలంలో 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయటంతో పాటు.. వారికి ఇళ్లు కట్టించి ఇచ్చే బాధ్యతను తీసుకున్నారు సీఎం జగన్. జగనన్న కాలనీల పేరిట కొత్త ఊళ్లనే సృష్టించారు. ఈ చర్యతో రాష్ట్రంలో ఒక ప్రధాన సమస్య లేకుండా పోతుందని, జగన్‌కు ఎనలేని ఖ్యాతి వస్తుందని భావించిన ప్రతిపక్షం దీన్ని అడ్డుకోవటానికి రకరకాల ఎత్తుగడలు వేసింది. కోర్టులకెక్కింది. ఎక్కడికక్కడ లేని భూ వివాదాలు సృష్టించింది. అయినా సరే.. అన్నిటినీ దాటుకుని పేదలకు సొంతిళ్లు దక్కుతున్నాయంటే.. అది వైఎస్ జగన్ సంకల్పంలో ఉన్న బలమే.

వైద్యం.. ప్రతి ఒక్కరి హక్కు..

చదువుకైనా.. సరైన వైద్యం చేయించుకోవటానికైనా పేదరికం అడ్డు కాకూడదని, వైద్యం కోసం అప్పుల పాలు కాకూడదని జగన్ భావించారు. అందుకే.. వెయ్యి రూపాయలు దాటిన ఏ వైద్యానికైనా ఆరోగ్యశ్రీ వర్తింపజేస్తానని మేనిఫెస్టోలో చెప్పారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక దాన్ని అమల్లోకి తెచ్చారు. ఆరోగ్య సేవలకు అదొక బీజం మాత్రమే. అక్కడి నుంచి మొదలుపెడితే.. రాష్ట్రంలో ఆరోగ్య వ్యవస్థ అంచెలంచెలుగా విస్తరిస్తూ పోయింది. ఆసుపత్రులన్నీ స్కూళ్ల మాదిరే 'నాడు-నేడు' కింద కొత్త రూపాన్ని, కొత్త సౌకర్యాలను సంతరించుకున్నాయి. ఎక్కడా ఒక్క పోస్టు కూడా ఖాళీ లేకుండా వైద్యులు, నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు... ఇలా ప్రతి పోస్టూ భర్తీ చేశారు. సూపర్ స్పెషాలిటీ వైద్యుల భర్తీతో పాటు.. అత్యాధునిక పరికరాలనూ తీసుకొచ్చారు. యావత్తు ప్రపంచంతో పాటు రాష్ట్రాన్ని కూడా కోవిడ్ వణికించినపుడు వీళ్లంతా కలిసి వలంటీర్ల సాయంతో ఎంత అద్భుతం చేశారన్నది రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ తెలుసు. ఇతర రాష్ట్రాల్లో ఆసుపత్రుల్లో బెడ్లు దొరకని పరిస్థితుల్లో పొరుగు రాష్ట్రాల నుంచి సైతం ఇక్కడికి వచ్చి, సంరక్షణ కేంద్రాల్లో ఉచితంగా చికిత్స తీసుకుని వెళ్లారంటే.. అది రాష్ట్రంలో వైఎస్ జగన్ అమల్లోకి తెచ్చిన పక్కా వ్యవస్థ వల్లేనన్నది కాదనలేని నిజం. అంతే కాదు.. గ్రామ స్థాయి నుంచీ వైద్య వ్యవస్థను బలోపేతం చేస్తూ వచ్చారు. ఏకంగా 1,405 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ఏర్పడ్డాయి. ప్రతి చోటా వైద్యులొచ్చారు. ఉచిత మందులు అందుబాటులోకి వచ్చాయి. వీటన్నిటికీ తోడు విదేశాల్లోనే కనిపించే 'ఫ్యామిలీ డాక్టర్'... మన ఊళ్లలో ప్రతి ఇంటికీ అందుబాటులోకి వచ్చారు. రాష్ట్రంలో ఇపుడు నిరుపేదలందరికీ కావాలనుకున్న వెంటనే సూపర్ స్పెషాలిటీ డాక్టర్ అపాయింట్‌మెంట్.. అదీ ఉచితంగా దొరుకుతోందంటే.. అదే వైఎస్ జగన్ విజన్. పరిస్థితులు మారి... కొన్ని చికిత్సలకు వ్యయం ఎక్కువవుతోందని గ్రహించటంతో ఇపుడు ఆరోగ్య శ్రీ చికిత్సకయ్యే ఖర్చును ఏకంగా రూ.25 లక్షల వరకూ ప్రభుత్వమే భరించేలా నిర్ణయం తీసుకున్నారు. ప్రతి చికిత్సా ఆరోగ్య శ్రీ పరిధిలోకి వచ్చేలా చికిత్స ప్రకిరయలను సైతం 1,059 నుంచి 3,257కి పెంచారు. ఆరోగ్యశ్రీ కింద చికిత్స అందించే నెట్‌వర్క్ ఆసుపత్రుల సంఖ్యను 820 నుంచి 2,513కి పెంచారు. నాలుగున్నరేళ్లలో ఇవన్నీ చేయాలంటే ఎంత కమిట్‌మెంట్ ఉండాలి మరి!

ఇదీ వ్యవ'సాయం' అంటే..

దేశానికి రైతే వెన్నెముక. వైఎస్సార్ వారసుడిగా దీన్ని బలంగా నమ్మిన వ్యక్తి జగన్‌మోహన్ రెడ్డి. అందుకే ఏడాదికి రెండుసార్లు పంట వేసే ముందు రైతుకు పెట్టుబడిగా రూ.12,500 చొప్పున ఇస్తామని భరోసా ఇచ్చారు. దాన్ని మరో రూ.వెయ్యి పెంచి కోవిడ్ కష్టకాలంలోనూ ఆపకుండా మరీ అమల్లోకి తెచ్చారు. నిజానికి రైతుకు ఏం చేసినా తక్కువే. ఎంత చేసినా తక్కువే. అందుకే గ్రామ స్థాయిలోనే రైతులకు అన్ని సేవలూ అందించే ఓ బలమైన వ్యవస్థను సృష్టించాలని సంకల్పించారు. రైతు భరోసా కేంద్రాలకు ప్రాణం పోశారు. రైతు ఎదుర్కొంటున్న కష్టాలన్నిటికీ ఇది వన్‌స్టాప్ పరిష్కారంగా ఉండాలని భావించారు. నకిలీ విత్తనాల బారిన పడకుండా ఇక్కడే సర్టిఫైడ్ విత్తనాలు, పురుగు మందులు దొరుకుతాయి. భూసార పరీక్ష కేంద్రాల నుంచి పండిన పంటను నిల్వ చేసుకునే గిడ్డంగులు, ఆఖరికి ఖాతాలో పడ్డ నగదును డ్రా చేసుకునేందుకు ఏటీఎంలు కూడా కొన్నిచోట్ల ఆర్‌బీకేలలోనే అందుబాటులోకి వచ్చాయి. ఇపుడు ఆర్‌బీకే అనేది ఓ బలమైన ప్రభుత్వ వ్యవస్థ. రైతును విత్తు నుంచి పండిన పంటను విక్రయించుకునేదాకా చేయిపట్టి నడిపించే అమ్మ, నాన్న.. అన్నీ. మనసు మంచిదైతే ప్రకృతి కూడా సహకరిస్తుందనేది ఎంత నిజమో ఈ నాలుగున్నరేళ్ల వైఎస్ జగన్ పాలనలో ప్రస్ఫుటమైంది. సువిశాల కోస్తా తీరం కారణంగా కొన్నిసార్లు తుపాన్లు దెబ్బతీసినా.. తట్టుకుని రోజుల వ్యవధిలోనే బయటపడే వ్యవస్థను ఏర్పాటు చేశారు. నష్టపోయిన ప్రతి కుటుంబానికీ అతివేగంగా సాయం అందించటంతో పాటు ప్రతి ఎకరాకూ ఉచితంగా ప్రభుత్వమే బీమా చేయించటం, ఒక సీజన్లో జరిగిన నష్టానికి మళ్లీ ఆ సీజన్ రాకముందే పరిహారాన్ని అందించటం.. ఏ సీజన్లో జరిగిన నష్టానికి ఆ సీజన్లోనే ఇన్‌పుట్ సబ్సిడీని అందించటం.. ఇలా ప్రతిదీ నెరవేర్చేలా 'ఈ-క్రాప్' ద్వారా ఆర్‌బీకేల చుట్టూ ఓ బలమైన వ్యవస్థను సృష్టించారు. ఇదీ విజన్ అంటే.

వికేంద్రీకరణకు కొత్త అర్థం

వృద్ధులకు, దివ్యాంగులకు ప్రభుత్వమిచ్చే పింఛన్లంటే ఇదివరకు ఓ మహా ప్రహసనం. పట్టణాల్లోనైతే బ్యాంకుల ముందు పడిగాపులు. పల్లెల్లోనైతే ఇచ్చే వ్యక్తి ఏ రోజున వస్తాడో తెలియని దైన్యం. అసలే వాళ్లు వృద్ధులు, దివ్యాంగులు. అలాంటి వారికిచ్చే సాయమేదైనా వారికి సాంత్వన కలిగించాలి తప్ప ఇబ్బంది పెట్టకూడదు కదా? ఇదిగో.. ఈ ఆలోచనతోనే ఆంధ్రప్రదేశ్ సీఎం వైఎస్ జగన్ వలంటీర్ల సైన్యాన్ని సృష్టించారు. ప్రతినెలా ఒకటవ తేదీన ఠంచనుగా ఇళ్లకు వెళ్లి సామాజిక పింఛన్లు అందజేయటం ఈ సైన్యం బాధ్యత. ఆ తరవాత..! ఆ వలంటీర్లు మరిన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగమయ్యారు. పథకాలను లబ్ధిదారులకు చేరువ చేశారు. ప్రతి 50 ఇళ్లకు ఓ వలంటీరు. ప్రభుత్వానికి – ఆ గడపలకు తనే సంధానకర్త. సూక్ష్మ స్థాయిలో వికేంద్రీకరణ ఫలితాలను కళ్లకు కట్టిన వలంటీర్ల మాదిరే... గ్రామాల్లో సచివాలయాలు ఏర్పాటయ్యాయి. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు చేరువ చేయడానికి వలంటీర్లయితే... ప్రభుత్వాన్ని గ్రామ స్థాయికి చేర్చేది గ్రామ సచివాలయాలు. అవసరమైన సర్టిఫికెట్ల నుంచి స్థానికంగా కావాల్సిన సేవలూ అక్కడే. ఈ వ్యవస్థ ఆలోచనతో ఏకంగా లక్షన్నర ప్రభుత్వ ఉద్యోగాలొచ్చాయి. అవినీతికి, లంచాలకు ఆస్కారం లేకుండా యువత ఉన్న ఊళ్లోనే ఉద్యోగాలు తెచ్చుకుని కొలువుల్లో స్థిరపడింది. అక్కడితో ఆగకుండా గ్రామాల్లో రైతుల కోసం ఆర్‌బీకేలు, వైద్య సేవల కోసం పీహెచ్‌సీలు నిర్మించి, యావత్తు గ్రామ వ్యవస్థను బలోపేతం చేశారు జగన్. అందుకే ఇపుడు పల్లెల్లో ఆర్థిక కార్యకలాపాలు పెరిగాయి. పల్లెల నుంచి వలసలు తగ్గాయి. ఒక బలమైన ఆలోచన... దాని ద్వారా మరింత మంచి చేయాలన్న తపన... ఈ రెండూ ఉంటే ఎంతటి అద్భుతమైన వ్యవస్థలను నిర్మించవచ్చో చేసి చూపించారు జగన్. అందుకే ప్రతి రాష్ట్రం ఇప్పుడు మన రాష్ట్రం వైపు చూస్తోంది.

డీబీటీ ద్వారా వివిధ వర్గాల ప్రజలకు ఇప్పటిదాకా అందిన మొత్తం రూ.2,43,958.04 కోట్లు	లబ్ధి పొందిన వారి సంఖ్య (పలువురికి రెండు మూడు పథకాల ద్వారా లబ్ధి) 8,29,81,601	డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా వివిధ వర్గాల ప్రజలకు ఇప్పటిదాకా అందిన మొత్తం రూ.4,11,488.99 కోట్లు
నాన్ డీబీటీ ద్వారా వివిధ వర్గాల ప్రజలకు ఇప్పటిదాకా అందిన మొత్తం రూ.1,67,530.95 కోట్లు	లబ్ధి పొందిన వారి సంఖ్య (పలువురికి రెండు మూడు పథకాల ద్వారా లబ్ధి) 4,44,04,251	డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా లబ్ధి పొందిన వారి సంఖ్య (పలువురికి 2, 3 పథకాల ద్వారా లబ్ధి) 12,73,85,852

ప్రభుత్వానికీ మనసు ఉండాలని..

పాలనకు మానవత్వ పరిమళం అద్దడానికి నిరంతర ప్రయత్నం

గడియారం ముల్లుతో పోటీపడే దినచర్య

ఆడిన మాట నిలబెట్టుకోవడమే లక్ష్యంగా కార్యాచరణ

ఆలోచనల్లో నిబద్ధత.. ఆచరణలో కఠినత్వం

ఇదీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ వ్యవహార శైలి

సాక్షి, అమరావతి

విశ్వసనీయతకు నిలువెత్తురూపం ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి. ఆలోచనల్లో నిబద్ధత కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఆచరణలో ఎంతటి కష్టం, నష్టం ఉన్నా వెనక్కి తగ్గని గుణం ఆయన సొంతం. జీవనశైలి అత్యంత సాదాసీదాగా ఉంటుంది. మితాహారం ఆయనకు ఇష్టం. నిద్ర కూడా పరిమితమే. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎంత నిరాడంబరంగా ఉన్నారో, అధికారంలో ఉన్నప్పుడూ అంతే నిరాడంబరత ఆయనలో కనిపిస్తుంది. మాట, భాష, వ్యవహార శైలే దీనికి నిదర్శనం. రోజురోజుకూ ఆయనలో ఓపిక, సహనం పెరుగుతూనే ఉన్నాయి. ఎంతమందితో మాట్లాడినా, ఎన్ని గంటలు చర్చించినా ముఖంలో చిరునవ్వు అలాగే కనిపిస్తుంది.

మితాహారం

మితాహారం తీసుకోవడం, అదే సమయంలో శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండడం జగన్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. కొన్నేళ్లుగా ఆయన లేచిన తర్వాత రెండు కప్పుల టీ, తర్వాత గ్లాసుడు జ్యూస్‌ మాత్రమే ఉదయం తీసుకుంటారు. లంచ్‌కు ముందు కప్పు కాఫీ, లంచ్‌లో వెజిటబుల్‌ సలాడ్, పన్నీర్, తక్కువ మొత్తంలో ఫిష్‌ లేదా సంబంధిత ఆహారాన్ని మితంగా తీసుకుంటారు. సాయంత్రం కూడా ఒక కప్పు కాఫీ తాగుతారు. రాత్రికి పుల్కా లేదా, రోటీతో కూరగాయలు తీసుకుంటారు. ఆహారం విషయంలో చాలా జాగ్రత్తగా ఉంటారు. పరిమితమైన ఆహారం, వ్యాయామం విషయంలో చాలా కచ్చితంగా ఉంటారు. స్వీట్లు లాంటి పదార్థాలకు దూరంగా ఉంటారు. ఎంత అవసరమో అంతే ఆహారాన్ని తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం చాలా ముఖ్యమని అంటూ ఉంటారు.

నాన్చడం తెలియదు

జగన్‌ పరిపాలనా వ్యవహారాలను దగ్గరగా చూస్తే కొన్ని అంశాల్లో వినూత్నత కనిపిస్తుంది. సాధారణ రాజకీయ నాయకుడు మాదిరిగా ప్రతి అంశాన్ని నాన్చి మూలన పడేసే తత్వానికి ఆయన చాలా దూరం. ఏ విషయం మీద కూర్చున్నా దాని మూలాల వరకూ వెళ్తారు. అవసరమైతే మరింత ఆలోచన కోసం మరి కొంత సమయం వెచ్చిస్తారు. తన ఆలోచన మీద సంబంధిత అధికారులు, నిపుణులతో లోతైన చర్చ చేస్తారు. పూర్తిగా అవగతమైన తర్వాత కార్యాచరణకు దిగుతారు. అమలులో ఇబ్బందులొస్తే వెనక్కి తగ్గడం, వాయిదా వేయడం చేయకుండా, మరింత పట్టుదలతో ముందడుగు వేయడం ఆయన నైజం.

ఆపన్నులకు అండ

వైఎస్‌ జగన్‌.. అనే పేరు వింటే వెంటనే మనకు గుర్తుకు వచ్చేది ఒక నమ్మకం. ఆయన ఉన్నాడు.. మనల్ని చూసుకుంటాడనే భరోసా కనిపిస్తుంది. ఇంతటి విశ్వాసం పొందడానికి ఆయన అనుసరిస్తున్న మార్గాలు కూడా స్ఫూర్తిదాయకం. ఒక నాయకుడిగా తాను నడవటమే కాదు పది మందినీ నడిపించే ప్రేరణతో కూడిన శక్తి ఆయన సొంతం. రుజువర్తన, ప్రజలకు మేలు చేయాలనే పట్టుదల, అవి నేరవేరే దాకా చెక్కుచెదరని సంకల్పం, అన్నింటికీ మించి క్రమశిక్షణ ఆయన వ్యక్తిత్వాన్ని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దాయి. గొంతు విప్పలేని వర్గాలకు ఒక స్వరమై, ఆపన్నులకు ఆపద్బాంధవుడై ఆయన నిలవడం వెనుక ఈ వ్యక్తిత్వమే కారణం.

దినచర్య ఇలా..

సమయాన్ని అత్యంత విలువైనదిగా జగన్‌ భావిస్తారు. అందుకనే రోజువారీ ప్రణాళిక విషయంలో షెడ్యూలు ప్రకారం ముందుకు సాగుతారు. తెల్లవారక ముందే నిద్రలేచే అలవాటును అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఎప్పుడూ వదులుకోలేదు. ఉదయం 4గంటలకు ఆయన దినచర్య ప్రారంభం అవుతుంది. ఆరోజు దినపత్రికలను ఒకసారి పరిశీలిస్తారు. స్పందించదగ్గ విషయాలు ఉంటే వెంటనే సంబంధిత అధికారులతో నేరుగా మాట్లాడి ఆదేశాలు ఇస్తారు. గంటకు పైగా వ్యాయామం ఉంటుంది. వ్యాయామం చేస్తున్నప్పుడు కూడా జాతీయంగా, అంతర్జాతీయంగా వస్తున్న పరిణామాలను తెలుసుకునేందుకు ఇంగ్లిషు ఛానల్స్, లేదా ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక, సాంకేతిక, పాలనా రంగాల్లో వస్తున్న అంశాలపై నిపుణులు చేసిన పోడ్‌కాస్ట్‌ వింటారు. ఇందులో స్వీకరించదగ్గ అంశాలను గుర్తు పెట్టుకుని ఒక పేపర్‌పై రాసుకుంటారు. రాష్ట్రానికి అవసరమైన అంశాల విషయంలో అవి ఎంత వరకు మేలు చేస్తాయనే విషయాన్ని ఆలోచించి వాటిని అమలు చేస్తారు. వ్యాయామం ముగిసిన తర్వాత తన కార్యాలయానికి రెడీ అవుతారు. సాధారణంగా మధ్యాహ్నం రెండు గంటల వరకు కార్యాలయంలోనే ఉంటారు.



అధికారులతో సమీక్షలు, పాలనా పరమైన వ్యవహారాలు, పార్టీ పనుల్లో నిమగ్నమై ఉంటారు. కార్యాలయానికి వచ్చిన తర్వాత మొదట సీఎంఓ అధికారులతో సీఎం ప్రతి రోజూ సమావేశం అవుతారు. రాష్ట్ర వ్యాప్తంగా పరిణామాలపై చర్చ ఉంటుంది. ఇందులో ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలు అమలు, అప్పటికప్పుడు తీసుకోవాల్సిన చర్యలు ఏమైనా ఉన్నాయా? ఎవరినైనా ఆదుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయా? అన్నదానిపై ప్రధానంగా చర్చ ఉంటుంది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తొలినాళ్ల నుంచే ఆయన అధికారులతో నిరంతరం ఒక మాట చెప్తూ ఉంటారు. ‘నేను అయినా, మీరు అయినా ప్రజలకు మేలు చేయాలన్న ఉద్దేశంతోనే ఇక్కడ అందరూ కలిసి మాట్లాడుకుంటున్నాం. దాపరికంతో ఉన్నా, మీ ముందు నేను మనసు విప్పి ఓపెన్‌గా మాట్లాడకపోయినా ఈ సమావేశానికి అర్థం ఉండదు. ఏ అంశంపైనైనా మీ అభిప్రాయాలను సంకోచం లేకుండా చెప్పొచ్చు. అప్పుడే మనం మంచి నిర్ణయాలు తీసుకోగలుగుతాం’ అని పలుమార్లు చెప్పారు. వ్యతిరేకులు చెప్పిన విషయాల్లో కూడా తీసుకోదగ్గవి ఉంటే మనస్ఫూర్తిగా స్వీకరించాలని, వాటిని పాజిటివ్‌గా తీసుకోవాలని అధికారులకు సూచించడం.. ఆయన వ్యవహార శైలిలో భాగం. విపత్తు సమయాల్లో అసహాయులైన వారికి ప్రభుత్వం నుంచి సహాయం అందించేలా సీఎం మెరుపు వేగంతో స్పందించడం గురించి పలుమార్లు అధికారులు గుర్తు చేస్తుంటారు.

ఒంటరిగా భోజనం చేయడం అరుదు

మధ్యాహ్నం లంచ్‌ సమయంలో కూడా ఆ సమయం వృథా కాకుండా సీనియర్‌ అధికారులతోనో లేదా పార్టీకి చెందిన నాయకులతోనో కలిసి భోజనం చేస్తూ అనేక విషయాల మీద మాట్లాడతారు. తిరిగి మధ్యాహ్నం 3 గంటలకల్లా కార్యాలయానికి వచ్చి.. పాలనా విధుల్లో నిమగ్నమవుతారు. సాయంత్రం దాదాపు 7 గంటల వరకూ కార్యాలయంలో ఉంటారు. తిరిగి ఇంటికి వెళ్లిన సందర్భంలో కూడా ఒకరిద్దరు కార్యదర్శులు, సీనియర్‌ అధికారులు వెంటవెళ్తారు. ఈ సమయంలో మరో గంటన్నరసేపు ప్రభుత్వ కార్యక్రమాలపై చర్చలు ఉంటాయి. రోజు వారీ విధులు ముగించిన తర్వాత ఒక ఆలోచన వచ్చినా, లేక టీవీల్లో రాష్ట్రానికి సంబంధించి ఏదైనా వార్తను చూసినా, ఇంగ్లిషు ఛానళ్లలో కొత్త అంశాలు వచ్చినా.. అప్పటికప్పుడు స్పందించి ఆయన అధికారులకు, పార్టీ నాయకులకు మార్గనిర్దేశం చేస్తారు. తగిన ఆదేశాలు కూడా జారీ చేస్తారు. రాత్రి ఎంత లేటైనా, ఎంత అలసట ఉన్నా తిరిగి తెల్లవారుజామున 4 గంటలకు ఆయన దినచర్య ప్రారంభిస్తారు.

ప్రభుత్వానికి మనసు ఉండాలి

ప్రభుత్వానికి మనసు ఉండాలని అధికారులకు పదేపదే చెప్తారు ముఖ్యమంత్రి. అలాంటి మనసుతో ఆలోచించినప్పుడే పేదల కష్టాలను తీర్చగలమని తరచుగా అంటుంటారు. ఈ ప్రభుత్వ పాలనకు ప్రధానమైన పునాది ఉందంటే అది మానవత్వమేనంటూ అధికారుల్లో నిరంతరం స్ఫూర్తి నింపుతారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఒక బాలుడికి జీన్‌ థెరపీ అవసరం అని, దాని కోసం కనీసంగా రూ.50 లక్షలు ఖర్చు చేయాలని అధికారులు ప్రతిపాదించినప్పుడు ఏం చేద్దామని ఆయన ప్రశ్నించినప్పుడు.. అంత ఇవ్వలేమని అధికారులు బదులిచ్చారు. ప్రజలచేత ఎన్నుకోబడ్డ మనం ప్రజలకు అంత కష్టం వచ్చినప్పుడు, ఆలోచిస్తూ నిబంధనల సాకు చూపించడం అత్యంత అమానవీయం అని ఆయన కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు. ప్రభుత్వంగా మనం తప్పక సహాయం చేయాలని నిర్దేశించారు. అటు విశాఖలో పాలిమర్స్‌ ఘటన అయినా, బోటు ప్రమాదాలు అయినా, ప్రమాదాలు సంభవించినా, చివరకు మొన్నటి తుపానులో కానిస్టేబుల్‌ విధి నిర్వహణలో మరణించినా.. వైఎస్‌ జగన్‌ అత్యంత మానవీయతను చూపిస్తూనే ఉన్నారు. పేదల బాగు కోసం ఉన్న వ్యవస్థలను మార్చడానికైనా, బడ్జెట్లు దాటడానికైనా, నిబంధనలను తిరిగి రాయడానికైనా వెనుకాడని తత్వం ఆయన సొంతం.

విద్య, వైద్యం ప్రజలకు నాణ్యంగా అందించాలని తపన

విద్యలో నాణ్యత, ప్రజలకు అందించే వైద్య సేవల్లో నాణ్యత ఉండాలని ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు పడిన తపనను అధికారంలోకి రాగానే ఆచరణలోకి తీసుకొచ్చారు. ఈ రెండు రంగాల్లో నాడు–నేడు అలా పుట్టుకొచ్చిన కార్యక్రమాలే. అత్యంత భారంగా మారిన విద్య, వైద్యాన్ని విప్లవాత్మక సంస్కరణల ద్వారా ప్రజలకు ఒక హక్కుగా అందించడంతోపాటు, జనాభాలో మెజార్టీ ప్రజలు ఆధారపడే వ్యవసాయ అనుబంధ రంగాలతోపాటు, పారిశ్రామిక–ఉపాధి రంగాన్ని పటిష్టం చేయడానికి ఈ నాలుగున్నర సంవత్సరాల్లో సీఎం ఒక యజ్ఞమే చేశారు. జిల్లాల్లో పర్యటనలు లేని సమయంలో ఎక్కువ సమయం ఈ అంశాలకు సంబంధించిన వ్యవస్థలను పరుగులెత్తించడంపైనే ఆయన ప్రత్యేక దృష్టి పెట్టారు. క్రమం తప్పకుండా ఆయా శాఖలకు చెందిన అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించడం, వారికి లక్ష్యాలు నిర్దేశించడం, మరుసటి సమీక్షా సమావేశాలకల్లా వాటిలో ప్రగతిని సమీక్షించడం సీఎం ప్రాధాన్యతగా పెట్టుకున్నారు. కాబట్టే ఈ నాలుగున్నరేళ్లు సాగిన సమీక్షల్లో కీలక నిర్ణయాలు తీసుకోవడం, వాటిని అమలు చేయడం కూడా జరిగాయి. ప్రతి సమీక్ష ఒక సమస్యకు పరిష్కారాన్ని సాధించేలా సాగింది. తాను చేయాల్సిన పనులు, దృష్టి పెట్టాల్సిన అంశాలు కూడా తన జేబులో ఉన్న చిన్న పుస్తకంలో సీఎం ఇప్పటికీ రాసుకుంటారు. వాటిని తప్పనిసరిగా ఫాలోఅప్‌చేసి ఫలితాలు సాధించే వరకూ ఆయన నిద్రపోరు. హడావిడి లేకుండా సాఫీగా, సజావుగా సత్వర ఫలితాలను సాధించాలనే శైలి ఆయనది.

ఆదేశాల్లో స్పష్టత

అధికారులకు స్థిరమైన బాధ్యతలు అప్పగించడం, అందులో కూడా స్పష్టత ఉండడం ముఖ్యమంత్రి జగన్‌ పాలనా తీరుకు అద్దం పడుతుంది. అధికారులు ఎవరైనా వారిలో పూర్తి సామర్థ్యాలను వెలికితీసి, లక్ష్యాల దిశగా అడుగులు వేయించడం సాధ్యమవుతుందని ఆయన బలంగా విశ్వసిస్తారు. నాయకుడిగా ఆయనకున్న వ్యక్తిత్వం అధికారుల నుంచి ఉత్తమ పనితీరును రాబట్టుకోగలిగింది. ప్రతి ఒక్కరినీ చిరునవ్వుతో పలకరించడం, వారి అభిప్రాయాలను పూర్తిగా వినడం, బాధ్యతలను పూర్తిగా అప్పగించడం, సమిష్టి తత్వాన్ని పెంపొందించడం.. ఇలా అధికారుల పట్ల ఆయన వ్యవహరించే తీరుకు ప్రశంసలు దక్కాయి. అందుకే విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామిక రంగాలకు సంబంధించిన శాఖాధిపతులు చాలా వరకు సుదీర్ఘకాలంగా అదే స్థానాల్లో ఉండి సేవలు అందించారు. ఇప్పుడూ కొనసాగుతున్నారు.

కీలక ఘటనలు

02.09.2009: మహానేత వైఎస్‌ రాజశేఖరరెడ్డి హఠాన్మరణం

09.04.2010: పశ్చిమగోదావరి జిల్లా నుంచి ఓదార్పుయాత్ర ప్రారంభించిన వైఎస్‌ జగన్‌

29.11.2010: ఎంపీ, ఎమ్మెల్యే పదవులకు, కాంగ్రెస్‌ పార్టీకి వైఎస్‌ జగన్, వైఎస్‌ విజయమ్మలు రాజీనామా

12.03.2011: ఇడుపులపాయలో మహానేత వైఎస్‌ సమాధి వద్ద వైఎస్సార్‌సీపీ పతాకం ఆవిష్కరణ.. పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు వైఎస్‌ జగన్‌ ప్రకటన

13.05.2011: కడప లోక్‌సభ స్థానం ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వైఎస్‌ జగన్‌ 5,46,673 ఓట్ల రికార్డు మెజార్టీతో ఘన విజయం. పులివెందుల శాసనసభ ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వైఎస్‌ విజయమ్మ 81,373 ఓట్ల రికార్డు మెజార్టీతో విజయభేరి.

27.05.2012: టీడీపీ, కాంగ్రెస్‌ కుమ్మక్కై పెట్టిన కేసుల్లో దర్యాప్తు కోసమని ఉప ఎన్నికల ప్రచారంలో ఉన్న వైఎస్‌ జగన్‌ను పిలిచి, అరెస్టు చేసిన సీబీఐ

14.06.2012: 19 శాసనసభ నియోజకవర్గాలకు నిర్వహించిన ఉప ఎన్నికల్లో 17 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయభేరి, ఒక లోక్‌సభ స్థానంలో వైఎస్సార్‌సీపీ విజయం

24.09.2013: అక్రమ కేసుల్లో జైలు నుంచి బెయిల్‌పై వైఎస్‌ జగన్‌ విడుదల

05.10.2013: రాష్ట్ర విభజనను నిరసిస్తూ.. సమైక్య రాష్ట్రాన్ని ఆకాంక్షిస్తూ లోటస్‌ పాండ్‌లో ఆమరణ దీక్ష

18.12.2013: రాష్ట్ర విభజనను వ్యతిరేకిస్తూ లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ అవిశ్వాస తీర్మానం

16.5.2014: సాధారణ ఎన్నికల ఫలితాల ప్రకటన.. 67 శాసనసభ స్థానాల్లో.. 8 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం.. కేవలం ఐదు లక్షల ఓట్ల తేడాతో అధికారానికి దూరం

20.06.2014: శాసనసభలో ప్రతిపక్ష నేతగా వైఎస్‌ జగన్‌కు గుర్తింపు

25.10.2017: అసెంబ్లీ సమావేశాలను బహిష్కరించిన వైఎస్‌ జగన్‌

06.11.2017: ఇడుపులపాయలో ప్రజాసంకల్ప పాదయాత్ర ప్రారంభం

09.01.2019: 3,648 కి.మీ.లు సాగిన పాదయాత్ర ఇచ్ఛాపురంలో ముగింపు

23.05.2019: రాష్ట్రంలో జరిగిన సాధారణ ఎన్నికల్లో 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం

30.05.2019: రాష్ట్ర ముఖ్యమంత్రిగా సీఎం వైఎస్‌ జగన్‌ ప్రమాణ స్వీకారం

రాష్ట్రం 'క్లిక్' అయిందిలా...

ఐటీ వినియోగంలో అగ్రగామిగా ఏపీ • మహిళల రక్షణకు 'దిశ' ద్వారా పరిష్కారం

రెవెన్యూ డిజిటలైజేషన్లో అందరికీ ఆదర్శం
కనీస మద్దతు ధరల నిర్ణయానికీ టెక్నాలజీ దన్ను
రాష్ట్రంలో ప్రతి ఎకరా పంట ఇపుడు ఆన్‌లైన్లో
విద్యార్థుల హాజరు నుంచి సౌకర్యాల పర్యవేక్షణ కూడా...
ప్రతి విభాగంలోనూ సమర్థంగా ఐటీ వినియోగం



సుమతి రోడ్డుమీద వెళుతుండగా ఆకతాయిలు ఫాలో అవుతున్నారు. భయం వేసింది. చేతిలోని ఫోన్లో ఓ బటన్ నొక్కింది. ఐదు నిమిషాలు గడవకముందే పోలీసులొచ్చారు. ఆకతాయిల్ని పట్టుకుని బుద్ధి చెప్పారు. ఇదంతా.. 'దిశ' టెక్నాలజీతోనే సాధ్యమయింది. సుమతి దిశ యాప్‌లోని బటన్‌ను ప్రెస్ చేయటంతో అది పోలీస్ కమాండ్ కంట్రోల్‌కు సమాచారం పంపింది. అక్కడి నుంచి దగ్గర్లోని పెట్రోలింగ్ బృందానికి మెసేజ్ వెళ్లింది. అంతా క్షణాల్లో జరిగిపోవటంతో.. సుమతికి ఆపద తప్పింది.

ఢిల్లీ అత్యాచార ఘటన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ఈ యాప్‌ను.. 1.46 కోట్ల మంది మహిళలు డౌన్‌లోడ్ చేసుకున్నారు. దీనిద్వారా అలెర్ట్ రావటంతో... 31,541 ఘటనల్లో పోలీసులు తక్షణం స్పందించి చర్యలు తీసుకున్నారు.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ!. ఐటీ. హైదరాబాద్‌ను ఐటీ హబ్‌గా మార్చింది తానేనంటారు చంద్రబాబు. ఈ క్లెయిమ్‌పై ఉన్న విభిన్న వాదనలనిక్కడ ప్రస్తావించాల్సిన అవసరం లేదు. మరి 2014 నుంచీ ఏపీ ముఖ్యమంత్రిగాఉన్నపుడు ఐటీని ఏం చేశారు? ప్రపంచమంతా కొత్త ఆవిష్కరణలతో పరుగులు తీస్తున్నపుడు ఇక్కడ మాత్రం అన్నీ మాటలే తప్ప చేతల్లో ఎందుకు కనిపించలేదు? ఐటీకి పితామహుడినని చెప్పారే తప్ప... కొత్తగా టెక్నాలజీని వినియోగించిందెక్కడ? సువిశాల తీరం ఉందని... దాన్నే అడ్వాంటేజ్‌గా తీసుకోవాలని పదే పదే చెప్పారు తప్ప ఒక్క పోర్టును గానీ, హార్బర్‌ను గానీ తేలేదెందుకు? మరి వైఎస్ జగన్ మాత్రం మాటలు చెప్పకుండా ప్రతి విభాగంలోనూ టెక్నాలజీని సమర్థంగా అమలు చేస్తున్నారు కదా? కొత్త పోర్టులు, హార్బర్లను తెచ్చారు కదా? మనకు కావాల్సింది హోరెత్తించే మాటలా..? కళ్లముందు కనిపించే నిజాలా?

రాష్ట్రంలో గత ఖరీఫ్‌లో 93,29,128 ఎకరాల్లో పంటలు వేశారు. దీన్లో వరి 32,83,593 ఎకరాల్లోను... వేరు శనగ 5,93166 ఎకరాల్లోను వేశారు. ఈ లెక్కల్లో ఒక్క ఎకరా కూడా తేడా లేదు. ఎందుకంటే 'ఈ-క్రాప్' టెక్నాలజీ ఉందిప్పుడు. ప్రతి రైతూ తన పంటను నమోదు చేసుకునే ఈ పటిష్ఠమైన డిజిటల్ వ్యవస్థతో... రాష్ట్రంలోని 27,800 గ్రామాల్లో ఉన్న ప్రతి ఎకరాకూ లెక్క ఉంది. అది బీమాకైనా... పంట నష్టానికైనా.. దిగుబడికైనా.

ఈ ఉదాహరణలన్నీ చూస్తే... రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రంగంలోనూ టెక్నాలజీని ఎంత సమర్థంగా వినియోగిస్తోందో అర్థమవుతుంది. భారీ ఎత్తున ఐటీ కాంట్రాక్టులివ్వకుండా, ఉన్న వనరులను... నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ సేవలను సమర్థంగా వాడుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి విభాగంలోనూ పూర్తిస్థాయిలో టెక్నాలజీని వాడుతోంది. అందుకనే... మునుపెన్నడూ చూడని పారదర్శకత, జవాబుదారీతనం ఇపుడు కనిపిస్తోంది. చేసిన పని పావలాదే అయినా... పదిరూపాయల ప్రచారం చేసుకోవటమనేది ఈ ప్రభుత్వ విధానం కాదు కాబట్టి.. పెద్దపెద్ద ఆరంభాలు, ఆర్భాటాలు లేకుండానే ప్రజలకు సమర్థమైన ఐటీ సేవలు అందుతున్నాయి.

ఏఎన్ఎం యాప్‌లో 15 మాడ్యూల్స్...

2020లో ప్రభుత్వం రూపొందించిన ఏఎన్ఎం యాప్ ద్వారా... క్షేత్ర స్థాయిలో ప్రతి కార్యక్రమాన్నీ వారు రిపోర్ట్ చేస్తుంటారు. ఎన్‌సీడీ–సీడీ సర్వే, ఫీవర్ సర్వే, గర్భిణి స్త్రీలు, చిన్న పిల్లలు, పాఠశాల విద్యార్థుల హెల్త్ స్క్రీనింగ్, ఆరోగ్యశ్రీ ఫీడ్ బ్యాక్ ఇలా అన్నిటినీ నమోదు చేస్తారు. ఆశా వర్కర్లకు తెచ్చిన 'ఈ–ఆశా' యాప్ ద్వారా గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యాన్ని వైద్యశాఖ నిరంతరం పర్యవేక్షిస్తుంది. పీహెచ్‌సీల్లో పనిచేసే మెడికల్ ఆఫీసర్లు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్‌లో పనిచేసే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకూ యాప్‌లున్నాయి. ఇవన్నీ ఒకదానికొకటి అనుసంధానమై పనిచేస్తాయి.

స్కూళ్లకు పక్కా సమాచార వ్యవస్థ...

ఈ ప్రభుత్వం తెచ్చిన స్కూల్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టం(సిమ్స్)లో ఎల్‌కేజీ నుంచి ఇంటర్ వరకు ఉన్న 82 లక్షల విద్యార్థుల వివరాలు అప్ టు డేట్‌గా ఉన్నాయి. విద్యార్థుల ఆధార్‌ను లింక్ చేస్తూ... ప్రత్యేక ఐడీ నెంబర్ కేటాయించారు. దీంతో స్టూడెంట్ హాజరు యాప్ ద్వారా ట్రాక్ చెయ్యటం... గ్రామ/వార్డు కార్యదర్శుల ద్వారా వారిని తిరిగి బడికి రప్పించటం సులువవుతోంది. ఇక టీచర్ల అటెండెన్స్‌కూ యాప్ ఉంది. జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌తో అనుసంధానించిన ఈ యాప్... టీచర్ తమ స్కూల్ పరిసరాలకు 10 మీటర్ల దూరంలో ఉంటేనే హాజరును తీసుకుంటుంది. జగనన్న గోరుముద్ద అమలును పర్యవేక్షించడానికి 'ఇంటిగ్రేటెడ్ మోనిటరింగ్ సిస్టం ఫర్ మిడ్‌డే మీల్స్ అండ్ శానిటేషన్' (ఐఎంఎంఎస్) వచ్చింది. వారంలో ఆరు రోజులు.. రోజుకు సగటున దాదాపు 37,63,698 మంది విద్యార్థులకు ఆహారం తీసుకుంటున్నారు. టీచర్ల ఫోన్‌లోని ఈ యాప్ ద్వారా... హాజరుతో పాటు ఎంతమంది పిల్లలు ఆహారం తీసుకుంటున్నారు? ఏరోజు ఏం వడ్డించారు, ఇచ్చిన సరుకు ఎంత? ఎంత స్టాక్ ఉంది? వంటి వివరాలన్నీ తెలుస్తాయి. ప్రతిరోజు టాయిలెట్ల పరిస్థితులూ అప్‌డేట్ అవుతాయి. ఎంప్లాయి ఇన్ఫర్మేషన్ సిస్టంలో టీచర్ల హాజరుతో పాటు ఎస్‌టీసీ, సెలవులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, గ్రీవెన్స్ సహా సర్వీసు రికార్డు మొత్తం ఉంటోంది.

- చైల్డ్ ఇన్ఫో సిస్టంలో విద్యార్థులు ఏ స్కూల్ నుంచి ఏ స్కూల్‌కు మారారు. కుటుంబ సభ్యుల ఆధార్ వివరాలు, బ్యాంకు ఖాతా లింకేజ్ వంటివన్నీ ఉంటాయి.
- జేవీకే యాప్ ద్వారా ప్రతి స్కూల్లో అవసరమైన జగనన్న విద్యాకానుక కిట్లు ఎన్ని? ఎన్ని అందించారు? ఎన్ని మిగిలాయి? వంటివన్నీ తెలుస్తాయి. పైపెచ్చు ఈ వ్యవస్థలను పర్యవేక్షించేందుకు జిల్లాకు ఇద్దరు అధికారుల చొప్పున నియమించి ఇబ్రహీంపట్నం, విశాఖపట్నంలో రెండు కమాండ్ కంట్రోల్ సెంటర్లున్నాయి. బడుల్లో టీచర్లు, పిల్లల అటెండెన్స్ వేశాక అది ఈ సెంటర్లకు వెళుతుంది.

అర చేతిలో ఆరోగ్యశ్రీ...

ఆరోగ్య శ్రీ యాప్‌లో లాగిన్ అయితే... తాము గతంలో ఏ చికిత్స పొందామన్నది లబ్ధిదారులు తెలుసుకోవచ్చు. పథకం కింద ఏ ఆస్పత్రుల్లో ఏ వైద్య సేవలు అందుతాయి? దగ్గర్లో నెట్‌వర్క్ ఆసుపత్రులు ఏమేం ఉన్నాయి? తెలుసుకోవచ్చు. వాటి లొకేషన్‌నూ ట్రాక్ చేయొచ్చు. 'ఈహెచ్ఆర్- డాక్టర్ కేర్' ఆన్‌లైన్ వేదికతో యూపీహెచ్‌సీలు, పీహెచ్‌సీల్లో డిజిటల్ వైద్య సేవలందుతున్నాయి. ఈ పోర్టల్ నుంచి రోగులకు అందించిన వైద్యం వివరాలను వారి ఆయుష్మాన్ భారత హెల్త్ ఖాతాలో అప్‌లోడ్ చేస్తున్నారు. ల్యాబ్ టెస్ట్‌ల ఫలితాలు ఈహెచ్ఆర్ నుంచి నేరుగా రోగుల మొబైల్‌కే ఎస్సెమ్మెస్ ద్వారా వెళుతున్నాయి.

టెక్నాలజీతో రైతుకు దన్ను...

'ఈ-కర్షక్' యాప్‌తో ఆర్‌బీకేలో రైతులు సీజన్‌లో తాము సాగు చేసే పంటల వివరాలను నమోదు చేసుకుంటారు. తర్వాత ఆర్బీకే సిబ్బంది పొలాలకు వెళ్లి స్వయంగా జియో కో ఆర్డినేట్స్, జియో ఫెన్సింగ్ ద్వారా రైతుసాగు చేసే పంట పొలం విస్తీర్ణం, సర్వే నెంబర్‌తో పాటు పంట వివరాలనూ ధ్రువీకరిస్తారు. పొలం ఫోటో డిజిటైజ్ చేస్తారు.

- ఆర్‌బీకేల్లోని వెటర్నరీ సహాయకుల పనితీరును పర్యవేక్షించడానికి 'పశు సంరక్షక్' యాప్ ఉంది.
- రోజువారీ వ్యవసాయ పంటల హెచ్చుతగ్గులను పర్యవేక్షించడానికి మార్కెటింగ్ శాఖ 'కంటిన్యూస్ మోనిటరింగ్ ఆఫ్ ప్రైస్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ పేమెంట్స్' (సీఎంయాప్)ను తీసుకొచ్చింది.
- 'ఈ-మత్స్యకార' పోర్టల్‌ను వివిధ యాప్‌లతో అనుసంధానించారు. అప్సడా రిజిస్ట్రేషన్లు, ఆర్‌బీకే ఇన్‌పుట్ సప్లయి, ఈక్రాప్, మత్స్య సాగుబడి, కేసీసీ, పీఎంఎంఎస్‌వై వంటివన్నీ దీని ద్వారానే నిర్వహిస్తున్నారు.
- 'వైఎస్సార్ సంపూర్ణ పోషణ' యాప్‌తో 55607 అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షిస్తున్నారు.

నాలుగున్నరేళ్లలో భారీగా నియామకాలు చకచకా..

విభాగం	రెగ్యులర్	కాంట్రాక్టు	ఔట్‌సోర్సింగ్, ఇతర	మొత్తం
వ్యవసాయ, సహకార	133	2	40	175
పశుసంవర్థక, డెయిరీ, మత్స్య	56	290	26	372
బీసీ సంక్షేమం	328	-	41	369
పౌరసరఫరాలు	2	116	119	237
ఇంధన	639	7,694	-	8,333
ఆర్థిక	92	2	7	101
జీఏడీ(ఏపీపీఎస్సీ)	3,784	-	22	3,806
గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్లు	1,25,110	-	2,60,867	3,85,977
ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమం	21,109	16,766	15,251	53,126
ఉన్నత విద్య	136	385	533	1,054
గృహ నిర్మాణం	1	-	-	1
పరిశ్రమలు, వాణిజ్యం	17	-	46	63
ఐటీ, ఎలక్ట్రానిక్స్	-	-	2	2
కార్మిక విభాగం	59	-	22	81
మున్సిపల్, పట్టణాభివృద్ధి	25	11	21	57
పాఠశాల విద్య	6,361	-	-	6,361
స్కిల్‌డెవలప్‌మెంట్, శిక్షణ	88	814	374	1,276
సాంఘిక సంక్షేమం	605	1	152	758
ఏపీఎస్ఆర్‌టీసీ	51,387	-	7,001	58,388
గిరిజన సంక్షేమం	650	-	525	1,175
జలవనరులు	176	1	-	177
మహిళా, శిశు, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమం	90	7	3,403	3,500
యువజన సర్వీసు, పర్యాటక, సాంస్కృతిక	19	3	70	92
గ్రూప్-1(నోటిఫికేషన్ విడుదలైంది)	81	-	-	81
గ్రూప్-2(నోటిఫికేషన్ విడుదలైంది)	897	-	-	897
పశుసంవర్థక సహాయకులు (నోటిఫికేషన్ విడుదలైంది)	1,896	-	-	1,896
సబ్ టోటల్	2,13,741	26,092	2,88,522	5,28,355
డీఎస్సీ-2008	-	2,193	-	2,193
డీఎస్సీ-1998	-	5,887	-	5,887
ఆప్కాస్	-	-	95,212	95,212
మొత్తం	2,13,741	34,172	3,83,734	6,31,647

క్రొంగొత్తగా... రిజిస్ట్రేషన్ల వ్యవస్థ

దేశంలో దస్తావేజులు రాయటానికి కొన్ని స్టార్టప్‌లు ఆన్‌లైన్ రైటర్లను అందుబాటులోకి తెచ్చాయి. ఇక్కడ ప్రభుత్వమే ఆ పనిచేసింది. 'కార్డ్ ప్రైమ్' విధానం ద్వారా రిజిస్ట్రేషన్ల శాఖను పూర్తిగా డిజిటలైజ్ చేసిన వైఎస్ జగన్ ప్రభుత్వం... వినియోగదారులు ఎవరిపైనా ఆధారపడకుండా నేరుగా ఆన్‌లైన్లో డాక్యుమెంట్లు తయారు చేసుకునే వీలు కల్పించింది. ఆన్‌లైన్లోనే చలానాలు కట్టి స్లాట్ బుక్ చేసుకోవచ్చు. ఆ టైమ్‌లో సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌కి వెళితే అరగంటలో పని పూర్తవుతుంది. గతంలోలా డాక్యుమెంట్ల స్కానింగ్ అక్కర్లేదు కూడా. డిజిటల్ సిగ్నేచర్ ఒక్కటీ చాలు.

- ఇక వ్యవసాయ భూములకు రిజిస్ట్రేషన్ సమయంలోనే ఆటో మ్యుటేషన్ జరిగే కొత్త విధానాన్ని తెచ్చింది ప్రభుత్వం. గతంలో రిజిస్ట్రేషన్ అయ్యాక ఆ డాక్యుమెంట్లను రెవెన్యూ అధికారులకిస్తే వాళ్లు మ్యుటేషన్ చేసేవారు. దీనికి సమయం పట్టేది. ఇప్పుడా అవసరం లేదు.
- స్టాంపు పేపర్ల స్థానంలో ఈ స్టాంపింగ్‌ను అందుబాటులోకి తెచ్చింది ప్రభుత్వం. గతంలో భౌతికంగా స్టాంపులు కొని, వాటి ద్వారా అగ్రిమెంట్లు చేసుకునేవారు. ఇప్పుడు స్టాంపు పేపర్లతో పని లేదు. కామన్ సర్వీస్ సెంటర్లు, మీ సేవా కేంద్రాలు, డాక్యుమెంట్ రైటర్ల వద్ద కూడా ఈ-స్టాంపింగ్ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. స్టాంపు పేపర్ల అవకతవకలకు చెక్ పడింది.
- భూముల రీ సర్వే ద్వారా ఏ రాష్ట్రంలో లేని విధంగా డిజిటల్ రెవెన్యూ రికార్డులు తయారవుతున్నాయి. డ్రోన్లతో సర్వే చేసి శాటిలైట్ లింకు ద్వారా జియో కోఆర్డినేట్స్‌తో రైతుల భూముల హద్దులు నిర్ధారిస్తున్నారు. ప్రతి భూ కమతానికి ఆధార్ తరహాలో యునిక్ ఐడీ ఉంటోంది.

పరిశ్రమలు క్యూ..



ఏపీలో పెట్టుబడులు పెడుతున్న టాటా, బిర్లా, అదానీ, అర్సెలర్ మిట్టల్, సంఘ్వీ, భజాంకా, భంగర్‌లు

- విశాఖ జీఐఎస్ సదస్సులో రూ.13.11 లక్షల కోట్ల విలువైన 386 ఒప్పందాలు.. వీటిని అమల్లోకి తీసుకురావడం ద్వారా 6 లక్షల మందికి ఉపాధి
- నాలుగున్నరేళ్లలో 130 భారీ ప్రాజెక్టులతో రూ.69 వేల కోట్ల పెట్టుబడులు వాస్తవ రూపంలోకి
- 3 పారిశ్రామిక కారిడార్లు.. 4 భారీ పారిశ్రామిక పార్కులు
- సులభతర వాణిజ్యంలో వరుసగా ఏపీకి మొదటి స్థానం



కొత్త పెట్టుబడులను ఆకర్షించడం.. వచ్చిన పెట్టుబడులను వాస్తవ రూపంలోకి తీసుకురావడంలో ఆంధ్రప్రదేశ్ దూసుకుపోతోంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న పారిశ్రామిక ప్రోత్సాహక నిర్ణయాలతో గతంలో ఎన్నడూలేని విధంగా ముఖేష్ అంబానీ, టాటా, బిర్లా, అదానీ, అర్సెలర్ మిట్టల్, సంఘ్వీ, భజాంకా, భంగర్ వంటి పారిశ్రామిక దిగ్గజాలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నారు.

సాక్షి, అమరావతి: విశాఖపట్నంలో ఈ ఏడాది జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో 386 ఒప్పందాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.13.11 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులను ఆకర్షించింది. ఈ ఒప్పందాలను అమల్లోకి తీసుకురావడం ద్వారా 6 లక్షల మందికి ఉపాధి లభించనుంది. ఇందులో ఇప్పటికే 33 యూనిట్లు ఉత్పత్తులు ప్రారంభించగా మరో 94 ప్రాజెక్టుల పనులు వేగంగా జరుగుతున్నాయి. మరి కొన్నింటి పనులు ప్రారంభదశలో ఉన్నాయి. వీటికి అదనంగా దావోస్ పర్యటనలో మరో రూ.1,26,000 కోట్ల పెట్టుబడుల ఒప్పందాలను కుదుర్చుకుంది. వీటి అమలు ద్వారా 38 వేల మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. పారిశ్రామికవేత్తలకు అన్ని అనుమతులు ఒకేచోట లభించేలా 'వైఎస్సార్ ఏపీ వన్' పేరుతో యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నాలుగున్నరేళ్లలో 130 భారీ, అతిభారీ ప్రాజెక్టులను ప్రారంభించడం ద్వారా దాదాపు రూ.69 వేల కోట్ల పెట్టుబడులు వాస్తవ రూపంలోకి వచ్చాయి. వీటి ద్వారా 86 వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించారు. మూడేళ్ల నుంచి సులభతర వాణిజ్యంలో ఏపీ అగ్రస్థానంలో నిలుస్తోంది.

కొత్తగా 3 పారిశ్రామిక కారిడార్లు..

- విశాఖ–చెన్నై, చెన్నై–బెంగళూరు, హైదరాబాద్–బెంగళూరు కారిడార్.
- విశాఖ–చెన్నై కారిడార్ అభివృద్ధిలో భాగంగా 2 గ్రీన్‌ఫీల్డ్ ఇండస్ట్రియల్ నోడ్‌లను తీర్చిదిద్దింది.
- విశాఖలోని నక్కపల్లి–రాంబిల్లి క్లస్టర్లను, చిత్తూరు నోడ్‌లో ఏర్పేడు, శ్రీకాళహస్తి క్లస్టర్లలో అంతర్గత సదుపాయాలను కల్పించారు.
- వీసీఐసీ ప్రాజెక్టుకు సంబంధించిన ఎక్స్‌టెర్నల్ సదుపాయాల కల్పనలో భాగంగా తిరుపతి స్పెషల్ జోన్‌లోని నాయుడుపేట, అనకాపల్లి స్పెషల్ జోన్‌లోని అచ్యుతాపురం ప్రాంతాలను పారిశ్రామిక ప్రాంతాలుగా అభివృద్ధి చేసింది.
- నాయుడుపేటలో 276 పరిశ్రమల ఏర్పాటు ద్వారా రూ.3,051 కోట్ల పెట్టుబడులు, 9,030 ఉద్యోగాలు. అచ్యుతాపురంలో 2,272 పరిశ్రమల ఏర్పాటుతో రూ.12,381 కోట్ల పెట్టుబడులు, 60 వేల మందికి ఉద్యోగాలు.
- వీసీఐసీలో భాగంగా వైఎస్సార్ జిల్లాలోని కొప్పర్తిలోని 6,740 ఎకరాలలో పరిశ్రమల హబ్.
- కొప్పర్తి కేంద్రంగా మోడల్ ఇండస్ట్రియల్ పార్కు, ఎంఎస్ఈసీడీపీ, వైఎస్సార్ ఈఎంసీ, వైఎస్సార్ జగనన్న మెగా ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు ప్రణాళిక. రూ.2,595.74 కోట్ల నిక్‌డిక్ట్ నిధులతో అభివృద్ధికి కార్యాచరణ. ఇప్పటికే 66 పరిశ్రమలు కొలువుదీరాయి. రూ.1,875.16 కోట్ల పెట్టుబడులు, 13,776 మందికి ఉద్యోగాలిచ్చేందుకు కొప్పర్తి సిద్ధమైంది.
- కృష్ణపట్నంను పారిశ్రామిక నోడ్‌గా తీర్చిదిద్దుతోంది. తిరుపతి జిల్లాలో క్రిస్ సిటీ ఏర్పాటుకు నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. దీనిద్వారా రూ.5 వేల కోట్ల పెట్టుబడులు, 14 వేల మందికి ఉద్యోగాలు వస్తాయి. ఓర్వకల్లు వద్ద పారిశ్రామిక నగరాన్ని అభివృద్ధి చేస్తోంది.
- పారదర్శక పెట్టుబడుల కోసం ప్రభుత్వం 'పారిశ్రామిక అభివృద్ధి విధానం–2023–27'ను తీసుకొచ్చింది. 'వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం' పేరుతో ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల కోసం ఒక ప్రత్యేక పాలసీ. 9,140 ఎంఎస్ఎంఈ పరిశ్రమలకు ప్రోత్సాహకాలు.
- వీటికి గత ప్రభుత్వం జూన్ 2019 నాటికి పెండింగ్‌లో పెట్టిన రూ. 3,409 కోట్ల ప్రోత్సాహకాలను ప్రస్తుత ప్రభుత్వం చెల్లించింది.
- 11,059 ఎంఎస్ఎంఈ యూనిట్లకు సంబంధించిన రూ.1,324.53 కోట్ల బకాయిలతో పాటు రూ.962.05 కోట్ల బకాయిల (7,039 ఎంఎస్ఎంఈలకు మంజూరు) ఎరియర్లను కూడా అందజేసింది. 75 భారీ, మెగా యూనిట్లకు గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన రూ. 380.85 కోట్ల ప్రోత్సాహకాలను కూడా క్లియర్ చేసింది.
- వీటిలో ఆర్థిక సంక్షోభంలో ఉన్న 49 టెక్స్‌టైల్ యూనిట్లకు రూ.242.13 కోట్లు ఇచ్చింది.

సీఎం ప్రారంభించిన కొన్ని ప్రముఖ పరిశ్రమలు..

అచ్యుతాపురంలో యకహోమా టైర్స్..



జపాన్‌కు చెందిన ప్రముఖ టైర్ల తయారీ సంస్థ యకహోమా గ్రూప్ అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో ఏర్పాటు చేసిన అలయన్స్ టైర్స్ కంపెనీ (ఏటీసీ)ని సీఎం జగన్ 2022 ఆగస్టు 16న ప్రారంభించారు. తొలి దశలో రూ.1,384 కోట్లతో హాఫ్ హైవే టైర్ల తయారీ యూనిట్ ద్వారా సుమారు 2,000 మందికి ప్రత్యక్ష ఉపాధి. యకహోమా గ్రూప్ విశాఖ యూనిట్‌ను రూ.680 కోట్లతో విస్తరణ చేపట్టింది. 2024 చివరి త్రైమాసికానికి ఉత్పత్తి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

బిర్లా గ్రాసిం కాస్టిక్ సోడా యూనిట్..



తూర్పు గోదావరి జిల్లా బలభద్రపురంలో ఆదిత్య బిర్లా గ్రూపు సుమారు రూ. 2,700 కోట్లతో కాస్టిక్ సోడా తయారీ యూనిట్‌ను 2022 ఏప్రిల్ 21న సీఎం జగన్ ప్రారంభించారు. ఈ యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 3,000 మందికి ఉపాధి లభించనుంది. అంతకుముందు 2 నెలల క్రితం బిర్లా గ్రూపు వైఎస్సార్ జిల్లాలో గార్మెంట్ యూనిట్‌ను ఏర్పాటుచేసింది.

బద్వేల్‌లో సెంచురీ ప్యానల్స్..



వైఎస్సార్ జిల్లా బద్వేల్ సమీపంలోని గోపవరం వద్ద 482 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న సెంచురీ ప్యానల్స్ తయారీ యూనిట్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. సుమారు రూ.1,600 కోట్లతో ఏర్పాటుచేస్తున్న ఈ యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా 2,000 మందికి పరోక్షంగా 4,000 మందికి ఉపాధి లభించనుంది. ఈ యూనిట్ నిర్మాణ పనులకు సీఎం జగన్ 2021, డిసెంబర్ 24న భూమి పూజ చేశారు. ఈ యూనిట్ తొలిదశ పనులను 2024 డిసెంబర్ నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఏసీ తయారీ హబ్‌గా శ్రీసిటీ..



తిరుపతి జిల్లా శ్రీసిటీకి ఏసీ తయారీ యూనిట్లు క్యూ కడుతున్నాయి. బ్లూస్టార్, డైకిన్ వంటి బ్రాండ్లతో పాటు దేశంలోని 20కి పైగా బ్రాండ్లకు సరఫరా చేసే అంబర్, హావెల్స్, ఈప్యాక్ డ్యూరబుల్స్, పానాసోనిక్–యాంకర్ వంటి విడిభాగాల తయారీ యూనిట్లు తమ పెట్టుబడులకు రాష్ట్రాన్ని వేదికగా ఎంచుకున్నాయి. వీటి ద్వారా రూ.3,755 కోట్ల విలువైన పెట్టుబడులు రాష్ట్రానికి రానుండగా, 9,700 మందికి ఉపాధి కల్పించనున్నాయి.

కొప్పర్తిలో డిక్సన్ ఉత్పత్తి ప్రారంభం..



వైఎస్సార్ జిల్లా కొప్పర్తిలో వైఎస్సార్ ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్‌లో ఏఐఎల్ డిక్సన్ కంపెనీ వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించింది. రూ.127 కోట్లతో సీసీటీవీ, ఐపీ కెమెరాలు, డిజిటల్ వీడియో రికార్డుల తయారీ యూనిట్‌ను ఏర్పాటుచేసింది. ఆదిత్య ఇన్ఫోటెక్‌తో కలిసి డిక్సన్ టెక్నాలజీస్ ఏర్పాటుచేసిన ఈ యూనిట్ ద్వారా 1,800 మందికి ఉపాధి లభించనుంది. ఈ యూనిట్‌ను ఈ ఏడాది జూలై 11న సీఎం జగన్ ప్రారంభించారు.

గుంటూరులో ఐటీసీ స్పైసెస్ పార్క్..



ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీ ఐటీసీ కూడా రాష్ట్రంలో భారీగా విస్తరిస్తోంది. రూ.140 కోట్లతో వెల్‌కమ్ పేరుతో గుంటూరులో ఫైవ్‌స్టార్ హోటల్‌ను, రూ. 200 కోట్లతో గ్లోబల్ స్పైసెస్ పార్కులను ప్రారంభించింది. పల్నాడు జిల్లా యడ్లపాడు సమీపంలో సుమారు 6.2 ఎకరాల్లో సుగంధ ద్రవ్యాలను ప్రాసెస్ చేసి, ఎగుమతి చేసేలా గ్లోబల్ స్పైసెస్ పార్కును అభివృద్ధి చేసింది. దీనిని సీఎం జగన్ సెప్టెంబర్ 2022లో ప్రారంభించారు. ఈ పార్కు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 1,500 మందికి ఉపాధి కల్పిస్తోంది.

చిన్న పరిశ్రమలకు చేయూత

చంద్రబాబు ప్రభుత్వం దిగిపోయేనాటికి ఎంఎస్ఎంఈల సంఖ్య	జగన్ సీఎం అయిన తర్వాత కొత్తగా వచ్చిన యూనిట్లు	నాలుగున్నరేళ్లలో కొత్తగా ఉపాధి లభించిన వారి సంఖ్య	ఈ ఏడాది నెలకు సగటున ఏర్పాటైన యూనిట్లు	జగన్ ప్రభుత్వం ఎంఎస్ఎంఈలకు అందించిన ప్రోత్సాహకాలు	ఎంఎస్ఎంఈల కోసం రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న క్లస్టర్లు	చంద్రబాబు ప్రభుత్వం ఎగ్గొట్టిన బకాయిల కోసం జగన్ సర్కార్ చెల్లించిన మొత్తం
1,93,530	3.87 లక్షలు	12.61 లక్షలు	19,476	రూ.2,087 కోట్లు	54	రూ.1,588 కోట్లు

తాజాగా విజయనగరంలో జిల్లా ఎస్.కోటలో రూ.531 కోట్లతో జేఎస్‌డబ్ల్యూ ఇండస్ట్రియల్ పార్కు అభివృద్ధి.. ఇది అందుబాటులోకి వస్తే 35,750 మందికి ప్రత్యక్షంగా, 9,375 మందికి పరోక్షంగా ఉద్యోగావకాశాలు. అనకాపల్లి, కొప్పర్తిలో కూడా ఎంఎస్ఎంఈ పార్కులను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది.



అక్షరానికి అగ్రపీఠం



విద్యా సంస్కరణలకు ఏకంగా రూ.66,722.36 కోట్లు వ్యయం

మనబడి నాడు-నేడుతో మారిన 45 వేల సర్కారు పాఠశాలల రూపురేఖలు

ఇంగ్లిష్ మీడియంతోపాటు సీబీఎస్ఈ బోధన

ఉన్నత చదువులకు ఆసరాగా జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగాన్ని అత్యంత ముఖ్యమైన ప్రాధాన్యత రంగాల్లో ఒకటిగా గుర్తించారు. టీడీపీ పాలనలో అస్తవ్యస్తంగా మారిన ప్రభుత్వ విద్యా రంగాన్ని విప్లవాత్మక సంస్కరణలతో ప్రక్షాళన చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సంచలనాత్మక పథకాలకు శ్రీకారం చుట్టారు. గత ప్రభుత్వం కార్పొరేట్, ప్రైవేటు విద్యా రంగానికి పెద్దపీట వేసి ప్రభుత్వ విద్యను భ్రష్టు పట్టించగా సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వ విద్యా రంగానికి తనదైన శైలిలో ఊపిరిలూది ప్రగతి బాట పట్టించారు. ఇంటాబయటా వెల్లువెత్తుతున్న ప్రశంసలే దీనికి నిదర్శనం. దాదాపు ఈ నాలుగున్నరేళ్ల కాలంలో విద్యా సంస్కరణలకే ఏకంగా రూ. 66,722.36 కోట్లు వ్యయం చేశారు. నాడు-నేడుతో పాఠశాలల్లో కొత్త భవనాలు, తరగతి గదులు, అదనపు తరగతి గదులు, ప్రహరీ, డిజిటల్ బోర్డులు, ఫర్నీచర్, తాగునీటి సౌకర్యం, రన్నింగ్ వాటర్ సదుపాయంతో బాలబాలికలకు వేర్వేరుగా టాయిలెట్లు, తదితరాలను ఏర్పాటు చేశారు.

నవశకానికి నాంది..



- 2020 జనవరి 1న 'జగనన్న గోరుముద్ద' పథకానికి శ్రీకారం.
- ఏటా సగటున రూ.1,400 కోట్లు చొప్పున ఐదేళ్లలో మొత్తం రూ.6,995.34 బడ్జెట్ కేటాయింపు
- టీడీపీ ప్రభుత్వం మధ్యాహ్న భోజనం కోసం ఏటా చేసిన ఖర్చు రూ.450 కోట్లు మాత్రమే.
- 2020–21 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం అందుబాటులోకి.
- ఈ ఏడాది ముగిసిన ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్ఏ) పరీక్షల్లో 91.33 శాతం మంది విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలోనే పరీక్షలు రాశారు.
- నాడు నేడులో తొలి విడత కింద 2019–20 విద్యా సంవత్సరంలో 15,713 పాఠశాలలను రూ.3,669 కోట్లతో సంపూర్ణంగా అభివృద్ధి చేశారు. రెండో విడత కింద రూ.8 వేల కోట్లతో 22,344 పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పిస్తున్నారు.
- 42.62 లక్షల మంది తల్లుల ఖాతాల్లో జగనన్న అమ్మ ఒడి కింద ఏటా రూ.15 వేల చొప్పున జమ.
- పది, ఇంటర్ బోర్డు పరీక్షల్లో ప్రతిభ చాటినవారిని 'జగనన్న ఆణిముత్యాలు' పేరిట రాష్ట్ర ప్రభుత్వం సత్కారం.
- 10 మంది పేద ప్రతిభావంతులైన విద్యార్థులను అమెరికా సందర్శించే అవకాశం.
- 2019 జూన్ నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు దాదాపు 47 లక్షల మంది విద్యార్థుల కోసం ప్రభుత్వం రూ.15,762 కోట్లు ఖర్చు చేసింది. ఇందులో జగనన్న విద్యాదీవెన కింద రూ. 11,317 కోట్లు, జగనన్న వసతి దీవెన కింద మరో రూ. 4,267 కోట్లు చెల్లించింది.
- ప్రైవేటు వర్సిటీల్లో రూ.5 లక్షల వరకు ఫీజు చెల్లించాల్సిన ఇంజనీరింగ్ కోర్సుల్లో 35 శాతం సీట్లలో రిజర్వేషన్ కోటా అమలు.
- గత నాలుగున్నరేళ్లల్లో 1,925 మంది విద్యార్థులకు జగనన్న విదేశీ విద్యా దీవెన కింద ఆర్థికంగా అండ.
- నైపుణ్య వర్సిటీ, ప్రత్యేక శిక్షణ సంస్థల ఏర్పాటుతోపాటు ఐటీఐలు, పాలిటెక్నిక్ కాలేజీలను మరింత అభివృద్ధి చేస్తున్నారు. ఇందుకు 2021–22 బడ్జెట్‌లో రూ.774.01 కోట్లు ఖర్చుచేయగా 2022–23 బడ్జెట్‌లో రూ.969.91 కోట్లు కేటాయించారు.

మైక్రోసాఫ్ట్‌తో ఒప్పందం..

ఎడ్యుస్కిల్, సేల్స్‌ఫోర్స్‌తో కుదుర్చుకున్న ఒప్పందంతో మరో 1.45 లక్షల మంది విద్యార్థులు నైపుణ్య కోర్సులు పూర్తి చేశారు. ఒక రాష్ట్రంలో 1.64 లక్షల మంది విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంచేందుకు మైక్రోసాఫ్ట్‌తో ఒప్పందం చేసుకున్న మొట్టమొదటి ప్రభుత్వం ఏపీనే కావడం విశేషం. దీంతో 2018–19లో క్యాంపస్ ఎంపికల్లో 37 వేల మంది ఉద్యోగాలు పొందితే, 2019–20లో 52 వేల మంది, 2020–21లో 69 వేల మంది, 2021–22లో 85 వేల మంది ఉద్యోగాలు పొందారు. ఇక 2022–23లో 1.20 లక్షల మందికి ఉద్యోగాలు లభించాయి.

దేశ సగటు కంటే మెరుగ్గా జీఈఆర్..

ప్రభుత్వం పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తుండడంతో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్)లో మన రాష్ట్రం దేశ సగటుకంటే చాలా ముందుంది. 2019–20లో ఇండియా సగటు 27.1 శాతం ఉంటే.. రాష్ట్రంలో 35.2 శాతం, 2020–21లో దేశ సగటు 27.3 శాతం ఉంటే రాష్ట్రంలో 37.2 శాతం జీఈఆర్ నమోదు కావడం విశేషం. మరోవైపు కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాల నిబంధనలు కూడా విద్యా అవసరాన్ని స్పష్టం చేస్తున్నాయి. దీంతో ఆడపిల్లలను చదివించేందుకు తల్లిదండ్రులు మొగ్గుచూపుతున్నారు.


అన్ని రంగాల్లో రెండంకెల వృద్ధి


నాలుగేళ్లలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.4.44 లక్షల కోట్లు పెరుగుదల

- 2018–19లో 8.73 లక్షల కోట్లు.. 2022–23లో 13.17 లక్షల కోట్లు
- నాలుగేళ్లలో 50.81 శాతం పెరుగుదల.. ఏటా సగటున 12.70 శాతం వృద్ధి
- వ్యవసాయ రంగం వృద్ధి 63.19 శాతం
- పారిశ్రామిక వృద్ధి విలువ 50.48 శాతం
- నిర్మాణ రంగం వృద్ధి 39.83 శాతం
- తయారీ రంగం వృద్ధి 48.24 శాతం
- బ్యాంకింగ్ రంగం వృద్ధి 71.94 శాతం
- సేవా రంగం వృద్ధి విలువ 47.43 శాతం
- 2018–19లో తలసరి ఆదాయంలో 17వ స్థానం.. 2022–23లో 9వ స్థానం

సాక్షి, అమరావతి: ఆర్థిక మందగమనం, కోవిడ్ సంక్షోభాలను సైతం అధిగమించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లుగా రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో గణనీయమైన పెరుగుదలను నమోదు చేసింది. రాష్ట్ర స్థూల ఉత్పత్తితో పాటు వ్యవసాయం, పారిశ్రామిక, సేవారంగం, నిర్మాణ, తయారీ తదితర అన్ని రంగాల్లోనూ వరుసగా ఏటా సగటున రెండంకెల వృద్ధి నమోదైంది. కోవిడ్‌లాంటి సంక్షోభాలు లేనప్పటికీ గత చంద్రబాబు పాలనలో వ్యవసాయ రంగం వృద్ధి తిరోగమనంలోకి వెళ్లింది. ప్రస్తుత ధరల ప్రకారం 2019-20 ఆర్థిక ఏడాది నుంచి 2022–23 ఆర్థిక ఏడాది వరకు వరుసగా నాలుగేళ్ల పాటు రాష్ట్ర స్థూల ఉత్పత్తి విలువ పెరుగుతూనే ఉంది. 2018–19లో చంద్రబాబు హయాంలో ప్రస్తుత ధరల ప్రకారం రాష్ట్ర స్థూల ఉత్పత్తి విలువ రూ.8,73,712.11 కోట్లు ఉండగా, 2022–23 నాటికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాలుగేళ్లలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి విలువ రూ.13,17,728.15 కోట్లుకు పెరిగింది. అంటే నాలుగేళ్లలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి 4.44 లక్షల కోట్ల మేర పెరిగింది. నాలుగేళ్లలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి విలువ 50.81 శాతం పెరగ్గా ఏటా సగటున వార్షిక వృద్ధి 12.70 శాతం నమోదైంది.







- రైతన్నను అక్కున చేర్చుకున్న రైతు భరోసా కేంద్రాలు
- ప్రభుత్వ ప్రోత్సాహంతో సిరులు కురిపిస్తున్న పల్లె మాగాణులు.. నేడు సీజన్ ముందుగానే నాణ్యమైన ఉత్పాదకాలు అందజేత
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వ్యవసాయ అనుబంధ రంగాలకు పెద్దపీట

అన్నదాతకు అభయం



ఆర్బీకేల్లో ఇదీ ప్రగతి

గ్రామస్థాయిలో ఏర్పాటైన ఆర్బీకేలు 10,778	వ్యవసాయ సహాయకులు 6,246	పశుసంవర్థక సహాయకులు 4643
ఉద్యాన సహాయకులు 2,356	మత్స్య సహాయకులు 731	పట్టు పరిశ్రమ సహాయకులు 377

ఈ నాలుగున్నరేళ్లలో సగటున 53.53 లక్షల మందికి వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.33,209.81 కోట్ల సాయం

సాక్షి, అమరావతి: రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకే) అన్నదాతకు అభయమిస్తున్నాయి. రాత్రనకా, పగలనకా సేద్యం చేసి ఉత్పత్తి చేసిన పంటలకు గిట్టుబడి లేక సతమతమయ్యే రైతన్న పాలిట భరోసా కల్పిస్తున్నాయి. విత్తు నుంచి పంట విక్రయం వరకు ప్రతీ రైతును గ్రామస్థాయిలో చేయి పట్టి నడిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో ఎండనక, వాననక సొసైటీల వద్ద పడిగాపులు పడితే తప్ప విత్తనాలు దొరికేవి కావు. కానీ ప్రస్తుతం ఆర్బీకేల రాకతో రాష్ట్రంలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఎరువుల కోసం అర్రులు చాస్తూ క్యూలైన్లలో నిలబడే దృశ్యాలు మచ్చుకైనా కన్పించడం లేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయానికి పెద్ద పీట వేసి వాటి స్వరూపాన్ని మార్చేసింది. వ్యవసాయాన్ని పండగ చేసి చూపించింది.

నాటికి... నేటికీ కొనుగోళ్లు చెల్లింపులు ఇలా...

అంశం	టీడీపీ పాలనలో	వైఎస్సార్‌సీపీ పాలనలో
కొనుగోలు చేసిన ధాన్యం	2.65కోట్ల టన్నులు	3.16కోట్ల టన్నులు
చెల్లించిన మొత్తం	రూ. 43,134కోట్లు	రూ. 61వేల కోట్లు
గోతాలు ఇతరత్రా సాయం	---	రూ. పదివేలు
కొనుగోలు చేసిన ఇతర ఉత్పత్తులు	9లక్షల టన్నులు	21.59లక్షల టన్నులు
చెల్లించిన మొత్తం	రూ. 3,322 కోట్లు	రూ.7751.43 కోట్లు
పొగాకుకు చెల్లించిన మొత్తం	----	రూ. 139.90కోట్లు
పత్తికి చెల్లించిన మొత్తం	---	రూ. 1789కోట్లు

ఆర్బీకేల్లో పురుగు మందుల వివరాలు
- రైతుల సంఖ్య: 1.51 లక్షలు
- లబ్ధి: రూ. 14 కోట్లు
- పంపిణీ చేసిన పురుగు మందులు 1.36 లక్షలు (లీటర్లలో)

రైతన్నకు భరోసా ఇలా..

- రైతులకు చంద్రబాబు ఎగ్గొట్టిన బకాయిలు 6.19 లక్షల మందికి రూ.715.84 కోట్లు
- క్లెయిమ్‌లు, సెటిల్‌మెంట్లు, చెల్లింపుల్లో తొలి ఏడాది రైతుల వాటాతో కలిపి ప్రభుత్వం చెల్లించిన బకాయిలు - రూ.971 కోట్లు
- ఏటా సగటున 13.62 లక్షల మందికి రూ.1,950.51 కోట్ల చొప్పున నాలుగేళ్లలో 54.48 లక్షల మంది రైతులకు చేకూరిన లబ్ధి - రూ.7,802.05 కోట్లు
- 2023-24 రూపాయి ప్రీమియంతో బీమా కల్పిస్తూ ఏపీ మోడల్‌లో నడిచే రాష్ట్రాలు- మహారాష్ట్ర, ఒడిశా, పుదుచ్చేరి, మేఘాలయ
- ఏపీ మాదిరిగా ఈ పంట నమోదు చేస్తున్న రాష్ట్రాలు - తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర

- ఈ- పంట నమోదే అర్హతగా ఉచితంగా బీమా కవరేజ్ కల్పిస్తూ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకానికి శ్రీకారం.
- భూముల్లేని కౌలుదారులకు ఈ-క్రాప్ ప్రామాణికంగా రాయితీపై విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల పంపిణీ
- స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు
- రూ.లక్ష లోపు రుణాలు తీసుకుని చెల్లించిన రైతుకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద వడ్డీ రాయితీ జమ
- వైఎస్సార్ రైతు భరోసా ద్వారా ఏటా 3 విడతల్లో రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం
- ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయే రైతులకు సీజన్ చివరలో ఇన్‌పుట్ సబ్సిడీ
- సీజన్‌కు ముందుగానే వైఎస్సార్ ఉచిత పంటల బీమా పరిహారం
- యూనివర్సల్ కవరేజ్‌కు కేంద్రం అంగీకరించకపోవడంతో మొత్తం బీమా పరిహారం ప్రభుత్వమే చెల్లింపు
- 2022-23 నుంచి ఫసల్ బీమాతో అనుసంధానించి వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం అమలు
- ప్రతి ఎకరాకు ఈ క్రాప్ ఆధారంగా యూనివర్సల్ బీమా కవరేజ్‌ను కల్పిస్తోన్న ఏకైక రాష్ట్రం ఏపీయే
- ఏటా లబ్ధిదారుల జాబితాలను ఆర్బీకేల్లో ప్రదర్శిస్తూ అభ్యంతరాలు పరిష్కారం
- ఎన్నికల హామీ మేరకు 2019 ఖరీఫ్ సీజన్‌లో రూపాయి ప్రీమియంతో పథకం

ఆర్బీకేల్లో రాయితీలో అందించిన విత్తనాల వివరాలు
- రైతుల సంఖ్య: 54.34 లక్షలు
- లబ్ధి: రూ. 881.47 కోట్లు
- పంపిణీ చేసిన విత్తనాలు: 31.16 లక్షలు (క్వింటాళ్లలో)

- ఆర్బీకేలకు అనుబంధంగా ఏర్పాటు చేసిన కలెక్షన్ సెంటర్లు - 421 వాటికైన ఖర్చు-రూ.63.15 కోట్లు
- ఈ సెంటర్లలో సేవలు పొందిన రైతులు-4 లక్షల మంది
- రూ.5.37 కోట్లతో ఏర్పాటైన శీతల గిడ్డంగుల సంఖ్య: 43

30.99 లక్షల మంది రైతులకు రూ.1,289.52 కోట్ల విలువైన 11.66 లక్షల టన్నుల ఎరువులు పంపిణీ

40 శాతం సబ్సిడీపై అందించిన యంత్రాలు రూ. 1,052.16 కోట్లతో
- ట్రాక్టర్లు - 6,362
- కంబైన్డ్ హార్వెస్టర్లు - 491
- ఇతర వ్యవసాయ పనిముట్లు - 36,153

ఆదర్శం.. 'ఫిష్ ఆంధ్ర'

- రాష్ట్రంలో ఏటా 50 లక్షల టన్నుల మత్స్య ఉత్పత్తులతో దేశంలోనే మొదటి స్థానం.
- ఏటా 4.36 లక్షల టన్నులున్న మత్స్య ఉత్పత్తుల స్థానిక వినియోగాన్ని 2025 నాటికి కనీసం 15 లక్షల టన్నులకు పెంచాలన్న సంకల్పానికి పదును.
- రూ.కోటి అంచనాతో జిల్లాకో ఆక్వా హబ్..
- జిల్లాకొకటి చొప్పున 26 ఆక్వా హబ్‌లు. 4,007 ఫిష్ ఆంధ్రా మినీ అవుట్‌లెట్స్
- 351 డెయిలీ, 149 సూపర్, 62 లాంజ్ యూనిట్లు ఏర్పాటు లక్ష్యం
- వీటికి అనుబంధంగా రిటైల్ మినీ అవుట్‌లెట్స్, ఈ మొబైల్ త్రీ వీలర్, 4 వీలర్ ఫిష్ వెండింగ్ డెయిలీ యూనిట్లు, ఏర్పాటు.

'ఫిష్ ఆంధ్ర'లో ఏమేమి దొరుకుతాయి...
- మెత్తళ్లు, పండుగప్పలు, కాలువ రొయ్యలు, సముద్ర పీతలు, టూనా, కోనాం చేపలు ఇలా ఏది కావాలన్నా, తాజాగా బతికున్నవి లభ్యం. రాయలసీమ ప్రాంతంలో సముద్ర మత్స్య ఉత్పత్తులకు డిమాండ్ క్రమేపీ పెరుగుదల.



ఆక్వా రైతు ఆనందం

ఈ-ఫిష్ సర్వే ఆధారంగా రాష్ట్రంలో ఆక్వా సాగు పరిస్థితి
- సాగు విస్తీర్ణం: 4,65,877.54 ఎకరాలు
- ఆక్వాజోన్ పరిధిలోని భూమి: 4,22,309.63 ఎకరాలు
- పదెకరాల లోపు విస్తీర్ణం: 3,56,278 ఎకరాలు
- పదెకరాల పైబడి విస్తీర్ణం: 6,60,321.63 ఎకరాలు
- నాన్ ఆక్వాజోన్ పరిధిలోని భూమి: 43,567.91 ఎకరాలు
- పదెకరాల లోపు విస్తీర్ణం: 23,042.02 ఎకరాలు
- పదెకరాలకు పైబడి విస్తీర్ణం: 20,524.89 ఎకరాలు
- మొత్తం విద్యుత్ కనెక్షన్లు: 64,645
- సబ్సిడీ పరిధిలోని కనెక్షన్లు: 50,659

అక్కచెల్లెమ్మలు హ్యాపీ

ఆసరా, చేయూతతో మహిళా వికాసం

ఏపీలో 91 శాతానికి పైగా సంఘాలు ఏ, బీ గ్రేడ్‌లో..

- చంద్రబాబు హయాంలో కుదేలైన పొదుపు సంఘాలకు తిరిగి జీవం
- డ్వాక్రా మహిళలకు ఇప్పటికే మూడు విడతల్లో రూ.19,178.17 కోట్ల రుణాలు అందజేత
- వైఎస్సార్ చేయూత ద్వారా 16,44,029 మంది మహిళలకు జీవనోపాధి
- 26.39 లక్షల మంది మహిళలకు మూడేసి విడతల్లో రూ.14,129.11 కోట్లు పంపిణీ



లక్షలాది మంది మహిళలకు సీఎం జగన్ ఓ సోదరుడిలా అండగా నిలిచారు. వైఎస్సార్ చేయూత, ఆసరా వంటి చరిత్రాత్మక పథకాలకు రూపకల్పన చేసి వారి జీవితాల్లో వెలుగు నింపారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు హామీలను నమ్మి మోసపోయి కుదేలైన పొదుపు సంఘాల మహిళలందరినీ ఆదుకునేందుకు సీఎం జగన్ 'ఆసరా' పథకాన్ని అమలు చేశారు. పొదుపు సంఘాల మహిళలకు రుణ విముక్తి కలిగించి ఆర్థికంగా బలోపేతం చేశారు. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం తిరిగి ప్రవేశపెట్టారు.

-సాక్షి, అమరావతి

'చేయూత' ఇలా..

- వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఇప్పటికే 16,44,029 మంది మహిళలకు లబ్ధి.
- వివిధ రకాల వ్యాపారాలు, శాశ్వత జీవనోపాధుల ద్వారా స్థిర ఆదాయం.
- దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా 45–60 ఏళ్ల మధ్య వయసు మహిళలకు వైఎస్సార్ ఆసరా పేరుతో వినూత్న పథకం.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ మహిళలకు చేయూత పథకం ద్వారా ఒక్కొక్కరికి ఏటా రూ. 18,750ల చొప్పున నాలుగేళ్లలో రూ. 75 వేల ఆర్థిక సహాయం.
- ఈ పథకం ద్వారా 26.39 లక్షల మంది మహిళలకు మూడేసి విడతలుగా రూ. 14,129.11 కోట్లు అందజేత.
- మహిళలు శాశ్వత జీవనోపాధి పొందేలా వ్యాపారాలకు పెట్టుబడి తోడ్పాటు అందించేందుకు హిందూస్థాన్ యూనీలీవర్, ప్రోక్టర్ అండ్ గ్యాంబల్, ఐటీసీ, రిలయెన్స్ వంటి ప్రముఖ సంస్థలతో ఒప్పందం.



- కోటి మంది మహిళల అప్పు తీరేలా.. 'ఆసరా' పథకం ద్వారా 2019 ఎన్నికలు జరిగిన ఏప్రిల్ 11 నాటికి పొదుపు సంఘాల పేరిట మహిళలకు బ్యాంకుల్లో ఉండే అప్పు 4 విడతల్లో చెల్లింపు.
- బ్యాంకర్ల లెక్కల ప్రకారం మహిళల పేరిట రూ. 25,517 కోట్ల అప్పు... ఇప్పటికే 3 విడతల్లో రూ.19,178.17 కోట్లు అందజేత.
- వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం పునఃప్రారంభంతో పొదుపు సంఘాల మహిళలకు ఊతం. చంద్రబాబు హయాంలో 60 శాతం పైబడి సంఘాల సీ, డీ గ్రేడ్‌లకే పరిమితం. ఇప్పుడు రాష్ట్రంలో 91 శాతానికి పైగా సంఘాలు ఏ, బీ గ్రేడ్‌లో..



జలాభిషేకం

- పులిచింతల ఫుల్ 2019 ఆగస్టులో తొలిసారిగా 45.77 టీఎంసీల నిల్వ
- రూ.500 కోట్లు తెలుగుగంగ ప్రధాన కాలువ, లింక్ కెనాల్ లైనింగ్ పూర్తి
- వరుసగా నాలుగేళ్లుగా కోటి ఎకరాలకు సాగునీరు
- సంగం, నెల్లూరు బ్యారేజీలు, లక్కవరం ఎత్తిపోతల, అవుకు రెండో టన్నెల్ జాతికి అంకితం
- తుది దశలో వెలిగొండ.. కుప్పం బ్రాంచ్ కెనాల్
- పులిచింతల, సోమశిల, కండలేరు, గండికోట, బ్రహ్మంసాగర్, చిత్రావతిలో గరిష్ఠంగా నిల్వ
- పోలవరంలో తప్పిదాలను సరిదిద్దుతూ వేగంగా సీఎం జగన్ అడుగులు

- వైఎస్సార్ చేపట్టిన సంగం, నెల్లూరు బ్యారేజీలలో మిగిలిన పనులను సీఎం జగన్ పూర్తి చేసి 2022లో జాతికి అంకితమిచ్చారు.
- హంద్రీ–నీవా సుజల స్రవంతి ప్రధాన కాలువ నుంచి నీటిని ఎత్తిపోసి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 77 చెరువులను నింపడం ద్వారా లక్కవరం ఎత్తిపోతల పథకాన్ని సీఎం జగన్ పూర్తి చేసి సెప్టెంబరు 18న జాతికి అంకితం చేశారు.
- గాలేరు–నగరిలో అంతర్భాగమైన అవుకు వద్ద రెండో టన్నెల్‌ను పూర్తి చేసి నవంబర్ 30న జాతికి అంకితం చేశారు. ప్రస్తుత డిజైన్ మేరకు 20 వేల క్యూసెక్కులు తరలించేందుకు మార్గం సుగమం చేశారు.
- వెలిగొండ ప్రాజెక్టు మొదటి సొరంగంలో మిగిలిన 2.833 కి.మీ. పనులను 2021 జనవరి 13 నాటికే సీఎం జగన్ పూర్తి చేశారు. రెండో సొరంగంలో మిగిలిన 7.698 కి.మీ.లో 7.506 కి.మీ. పనులు పూర్తయ్యాయి. మిగిలిన 192 మీటర్ల పనులు పూర్తి చేసి సొరంగాలను జాతికి అంకితం చేయనున్నారు.
- విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన చంద్రబాబు కమీషన్ల దాహంతో పోలవరాన్ని నీరుగార్చారు. జగన్ అధికారంలోకి వచ్చాక అప్రోచ్ ఛానల్, స్పిల్‌వే, స్పిల్ ఛానల్, పైలట్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేసి 2021లో గోదావరి వరద ప్రవాహాన్ని స్పిల్‌వే మీదుగా మళ్లించారు. బాబు అవినీతితో ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో అగాధాలను పూడ్చి యథాస్థితికి తెచ్చే పనులను వేగవంతం చేశారు.

కడలి పాలవుతున్న నదీ జలాలను బంజరు భూములకు మళ్లించి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా దివంగత వైఎస్సార్ జలయజ్ఞం చేపట్టగా ఆయన తనయుడు సీఎం జగన్ ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టులను పూర్తి చేసి జాతికి అంకితం చేస్తున్నారు. ఆయకట్టుకు నీళ్లందించడం ద్వారా జలయజ్ఞం ఫలాలను రైతులకు అందిస్తున్నారు. కోవిడ్ ఆర్థిక ఇబ్బందుల్లోనూ సాగునీటి పనులను పరుగులెత్తించారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా 2019, 2020, 2021, 2022 ఖరీఫ్, రబీతో కలిపి ఏటా కోటి ఎకరాలకు సీఎం జగన్ నీళ్లందించారు. దేశవ్యాప్తంగా ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా రాష్ట్రంలో ఆయకట్టుకు సమృద్ధిగా నీళ్లందించడంతో రైతులు భారీ ఎత్తున పంటలు సాగు చేశారు. రికార్డు స్థాయిలో ధాన్యపు దిగుబడులతో ఏపీని మళ్లీ దేశ ధాన్యాగారం (రైస్ బౌల్ ఆఫ్ ఇండియా)గా సీఎం జగన్ నిలిపారు.

-సాక్షి, అమరావతి

నీటి నిల్వలో రికార్డు

కృష్ణా డెల్టా వరదాయిని పులిచింతల ప్రాజెక్టును దివంగత వైఎస్సార్ సాకారం చేశారు. గత సర్కారు నిర్వాసితులకు పునరావాసం కల్పించకపోవడం వల్ల 2019 వరకూ పూర్తి స్థాయిలో 45.77 టీఎంసీలను నిల్వ చేయలేని దుస్థితి నెలకొంది. నిర్వాసితులకు వేగంగా పునరావాసం కల్పించిన సీఎం జగన్ 2019 ఆగస్టులోనే పులిచింతలలో 45.77 టీఎంసీలను నిల్వ చేసి కృష్ణా డెల్టాలో రెండో పంటకూ నీళ్లందించేందుకు మార్గం సుగమం చేశారు.

గత సర్కారు నిర్వాసితులకు పునరావాసం కల్పించకపోవడం వల్ల గండికోట, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, సోమశిల, కండలేరులో కూడా పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేయలేని పరిస్థితి ఏర్పడింది. సీఎం జగన్ గండికోట నిర్వాసితులకు రూ.వెయ్యి కోట్లతో, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్వాసితులకు రూ.250 కోట్లతో పునరావాసం కల్పించారు. దీంతో గండికోటలో 26.85 టీఎంసీలు, చిత్రావతిలో పది టీఎంసీలు నిల్వ చేస్తున్నారు.

తెలుగుగంగ ప్రధాన కాలువ, లింక్ కెనాల్‌కు రూ.500 కోట్లతో లైనింగ్ చేయడం ద్వారా సకాలంలో వెలిగోడు, బ్రహ్మంసాగర్‌ను నింపడానికి సీఎం జగన్ మార్గం సుగమం చేశారు. బ్రహ్మంసాగర్ మట్టికట్టకు డయాఫ్రమ్ వాల్ ద్వారా లీకేజీలకు అడ్డుకట్ట వేసి పూర్తి స్థాయిలో 17.74 టీఎంసీలు నిల్వ చేస్తున్నారు.

గత నాలుగున్నరేళ్లలో ఆరు రిజర్వాయర్లలో గరిష్ఠ స్థాయిలో నీటి నిల్వకు మార్గం సుగమం చేయడం ద్వారా నీటి పారుదల రంగ చరిత్రలో సీఎం జగన్ రికార్డు సృష్టించారు.



ఉత్తరాంధ్ర వైభోగాపురం

సిద్ధమవుతున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం

- సీఎం వైఎస్ జగన్ భూమి పూజతో శరవేగంగా నిర్మాణ పనులు
- 2025 నాటికి మొదటి దశ పూర్తి చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం
- వాణిజ్య, పర్యాటక రంగాలు సహా ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఊతం

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ప్రపంచస్థాయి సౌకర్యాలతో విజయనగరం జిల్లా భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం సిద్ధమవుతోంది. ఈ ఏడాది మే 3న సీఎం వైఎస్ జగన్ భూమిపూజ చేయగా.. పనులు పురోగతిలో ఉన్నాయి. జీఎంఆర్ గ్రూప్ పీపీపీ విధానంలో ఇక్కడ విమానాశ్రయ నిర్మాణాన్ని చేపట్టింది. 2025 నాటికి మొదటి దశ పూర్తి చేయాలనే లక్ష్యం. విమానాశ్రయ నిర్మాణానికి సేకరించిన 2,203.26 ఎకరాల భూమిని ప్రభుత్వం జీఎంఆర్‌కు స్వాధీనం చేసింది. ప్రస్తుతం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ల్యాండ్ ఫిల్లింగ్ చేస్తున్నారు. 3,800 మీటర్ల పొడవున రన్‌వేతో పాటు సమాంతరంగా ట్యాక్సీ వే కూడా నిర్మించనున్నారు. 5 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ప్రత్యేక కార్గో విభాగాన్ని ఏర్పాటు చేయనున్నారు.



ఆర్థిక ప్రగతికి దోహదం

ఏడాదికి 4 కోట్ల మంది ప్రయాణికుల సామర్థ్యం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం సొంతం. ఇది అందుబాటులోకి వస్తే రాష్ట్రం నుంచి దేశీయ, విదేశీ విమానయానం మరింత ఊపందుకుంటుంది. ఇంటర్నేషనల్, డొమెస్టిక్ కార్గో టెర్మినల్ కూడా అందుబాటులోకి వస్తుంది. ఇప్పటికే ఉత్తరాంధ్రలో ఉన్న ఫార్మా తదితర పరిశ్రమల విస్తరణకు, ఎగుమతుల ప్రోత్సాహకానికి ఉపయోగపడుతుంది. వాణిజ్య, పర్యాటక రంగాల అభివృద్ధికి దోహదం చేస్తుంది. విశాఖపట్నం పోర్టు నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వరకూ ప్రభుత్వ పరిశీలనలోనున్న భీమిలి బీచ్ కారిడార్ కార్యరూపం దాల్చితే ఈ ప్రాంతంలో మల్టీ మోడల్ లాజిస్టిక్ నెట్‌వర్క్ పెరగడానికి, పెట్టుబడులను ఆకర్షించడానికి అవకాశం ఏర్పడుతుంది.

ప్రభుత్వ తోడ్పాటు ఇలా...

- రూ.835.48 కోట్లతో భూసేకరణ పూర్తి. నిర్వాసితులైన నాలుగు గ్రామాల్లోని 404 కుటుంబాలకు రూ.67.04 కోట్లతో అన్ని మౌలిక వసతులున్న రెండు పునరావాస కాలనీల నిర్మాణం.
- ప్రతి కుటుంబానికి 240 చదరపు గజాల ఇంటిస్థలం, అక్కడ నిర్మాణం పూర్తి చేసుకోవడానికి రూ.9.50 లక్షల చొప్పున ఆర్థిక సహాయం.
- విమానాశ్రయానికి ఏటా 5 ఎంఎల్‌డీ నీటి సరఫరా చేయడానికి ఒప్పందం. తక్షణమే 1.70 ఎంఎల్‌డీ నీటి సరఫరాకు సంబంధించిన పనులను పూర్తి చేయడానికి రూ.5.30 కోట్లు మంజూరు.
- 2.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా ఏర్పాట్లకు రూ.2.62 కోట్లు మంజూరు.
- విమానాశ్రయానికి సేకరించిన భూమిలో విద్యుత్ లైన్లు, స్తంభాల స్థల మార్పిడికి రూ.2.30 కోట్ల వ్యయం.
- స్టాఫ్ క్వార్టర్ల నిర్మాణానికి భోగాపురం మండలం బసవపాలెం వద్ద 24.30 ఎకరాల భూమి కేటాయింపు.
- 132/133 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భోగాపురం మండలం కొంగవానిపాలెం వద్ద 5.47 ఎకరాల భూమి కేటాయింపు.

నెరవేరిన కల.. ఇళ్లతో కళకళ



- 30.7 లక్షల ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన సీఎం జగన్
- ఇంటి నిర్మాణానికి యూనిట్‌కు రూ.1.80 లక్షలు
- మౌలిక సదుపాయాల కల్పన ద్వారా మరో రూ.1.70 లక్షల మేర అదనపు లబ్ధి
- 17,005 వైఎస్సార్ జగనన్న కాలనీల రూపంలో ఏకంగా కొత్త ఊళ్లే నిర్మాణం

సొంతింటి కలను నెరవేరుస్తూ పేదలందరికీ ఇళ్ల పథకం

-సాక్షి, అమరావతి

తమకంటూ ఓ పక్కా ఇల్లు ఉండాలనేది ప్రతి పేదింటి మహిళ స్వప్నం. ఈ కల నెరవేర్చుకోలేని పేదరికంలో ఉన్న అక్కచెల్లెమ్మలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం' కింద ఉచితంగా స్థలాలు ఇవ్వడంతోపాటు, ఇంటి నిర్మాణానికి అండగా నిలిచారు.

- మహిళల పేరిట ఏకంగా 30.7 లక్షల ఇళ్ల పట్టాలను పంపిణీ తో దేశంలో ఓ రికార్డు
- ఇంటి స్థలాల పంపిణీ కోసం రాష్ట్రంలో 17,005 వైఎస్సార్ జగనన్న కాలనీల రూపంలో ఏకంగా కొత్త ఊళ్లు నిర్మాణం.
- 71,811.49 ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేసిన స్థలాల మార్కెట్ విలువ రూ.2.5 – రూ.5 లక్షల పైనే
- కనిష్టంగా రూ.75 వేల కోట్లు నుంచి గరిష్టంగా రూ.1.5 లక్షల కోట్ల విలువైన భూమి పేదల చేతుల్లో..
- టీడీపీ, ఎల్లో మీడియా, దుష్ట పన్నాగాలను ఛేదిస్తూ ముమ్ముందుకే...
- ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేసరికి ప్రతి మహిళకూ కనిష్టంగా రూ.7 – రూ.10 లక్షలకుపైగా స్థిరాస్తి

చకచకా నిర్మాణాలు

- రెండు దశల్లో కలిపి 21.75 లక్షలకుపైగా గృహ నిర్మాణాలకు అనుమతులు.
- ఈ ఏడాది అక్టోబర్ 12వ తేదీ నాటికి 7.43 లక్షల టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు అందజేత.

ఉచితంగా స్థలం.. ఆపై సాయం

- ఇంటి నిర్మాణానికి యూనిట్‌కు రూ.1.80 లక్షలు బిల్లు మంజూరు.
- స్వయం సహాయక బృందాల ద్వారా లబ్ధిదారులైన మహిళలకు పావలా వడ్డీకి రూ.35 వేలు రుణ సాయం.
- ఉచితంగా ఇసుకను పంపిణీ చేయడంతోపాటు 12 రకాల నిర్మాణ సామగ్రిని సబ్సిడీపై సరఫరా
- రూ.40 వేలు చొప్పున మొత్తంగా రూ.2.70 లక్షల చొప్పున అదనంగా లబ్ధి.

వసతుల రూపంలో మరో రూ.1.5 లక్షలు

- ఉచితంగా స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.2.70 లక్షల చొప్పున ప్రయోజనం.
- ప్రతి ఇంటికీ ఉచితంగా మౌలిక సదుపాయాల కల్పన ద్వారా మరో రూ.1.70 లక్షల మేర అదనపు లబ్ధి.
- ఉచితంగా నీటి, విద్యుత్ సరఫరా కనెక్షన్లు ఇవ్వడం, డ్రైన్లు, రోడ్లు లాంటి వసతుల కల్పన.

పథకం అమలులో కీలక ఘట్టాలు ఇలా...

- 2020 డిసెంబర్: 25 లక్షల ఇళ్ల స్థలాల పంపిణీ. తొలిదశలో 15.60 లక్షల ఇళ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు.
- 28 ఏప్రిల్ 2022: రెండో దశకు శ్రీకారం. 1.24 లక్షల ఇళ్ల పట్టాలు పంపిణీ. 3.53 లక్షల ఇళ్లకు అనుమతులు.
- 27 మే 2023: సీఆర్‌డీఏలో 1,402.58 ఎకరాలు 50,793 మందికి పంపిణీ.
- 12 అక్టోబర్ 2023: 7.43 లక్షల ఇళ్లు లాంఛనంగా లబ్ధిదారులకు అందజేత.

వ్యయం రూ.కోట్లలో...

నీటి సరఫరా	3,847.18
విద్యుత్	4,431.26
ఇంటర్నెట్	707.48
రోడ్లు	10,408
డ్రైన్లు	5,927.78
ఆర్చ్‌లు	347.34
ఇంకుడు గుంతలు	108
ఫేజ్ 2	7,131.96
మొత్తం	32,909

ఊరూరా కొత్త భవనాలు



మౌలిక వసతుల కల్పనపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి

- ప్రభుత్వ సేవలతో పాటు వైద్యపరంగా, రైతులకు ఎక్కడికక్కడే సేవలు
- ప్రతి చోటా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం

సాక్షి, అమరావతి : అధికారం చేపట్టిన వెంటనే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మౌలిక వసతుల కల్పన పై ప్రత్యేక దృష్టి పెట్టారు. వినూత్నంగా ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ ద్వారా ప్రజల గడప వద్దకే ప్రభుత్వ పాలన తీసుకువచ్చారు. పేదలందరికీ అన్ని సేవలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపట్టారు. ప్రభుత్వ పరమైన సేవలతో పాటు వైద్యపరంగా, రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలు వారికి అందేలా చూస్తున్నారు. అందుకనుగుణంగా ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వ భవనాల నిర్మాణానికి పూనుకున్నారు. రాష్ట్రంలో ఏ గ్రామానికి వెళ్లినా ఆరంభంలోనే ఇటీవలే కొత్తగా నిర్మాణం పూర్తయిన, దాదాపు నిర్మాణం పూర్తవుతున్న దశలో ఉన్న భవనాలు దర్శనమిస్తాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల కోసం రెండతస్తుల గ్రామ సచివాలయాల భవనాలను నిర్మిస్తున్నారు. ప్రభుత్వ స్థాయిలోనే ప్రాథమిక వైద్య సేవలు అందించేలా హెల్త్ క్లినిక్‌లను నిర్మించారు. రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లలో అవసరమైన అత్యాధునిక సాంకేతిక పరికరాలను కూడ ప్రభుత్వం సరఫరా చేసింది.

- కొత్త భవనాల నిర్మాణం కోసం రూ. 4573 కోట్ల నిధులు వెచ్చింపు
- ఇందులో ఇప్పటికే 14,935 భవనాలకు ప్రారంభోత్సవం
- గ్రామీణ ప్రాంతాల్లో 22,435 భవనాల నిర్మాణం ఇప్పటికే పూర్తి
- పేదల వైద్య సేవల కోసం ఒక్కొక్కటి రూ. 20.88 లక్షలతో హెల్త్ క్లినిక్‌
- ప్రతి గ్రామంలో రూ. 23.94 లక్షలతో రైతు భరోసా కేంద్రాల నిర్మాణం
- దాదాపు 36,796 నూతన ప్రభుత్వ భవనాల నిర్మాణం
- ఒక్కొక్కటి రూ. 43.6 లక్షల ఖర్చుతో గ్రామ సచివాలయాల భవనాలు

భవనం	నిర్మాణం దాదాపు పూర్తయినవి	ప్రారంభోత్సవం చేసినవి
గ్రామ సచివాలయాలు	9585	6765
రైతు భరోసా కేంద్రాలు	7436	5211
హెల్త్ క్లినిక్‌లు	5,414	2980
మొత్తం	22435	14956



జిల్లాల పాలన సరి 'కొత్త'గా..

- అధికార వికేంద్రీకరణే ప్రభుత్వ లక్ష్యం
- ప్రజా మనోభావాలకూ ప్రాధాన్యం
- అదనంగా 13 జిల్లాల ఏర్పాటుతో సుపరిపాలన
- పునర్వ్యవస్థీకరణతో సాహసోపేత నిర్ణయం
- పార్లమెంట్ నియోజకవర్గ యూనిట్‌గా విభజన
- కొత్త జిల్లాలకు మహనీయుల పేర్లు
- సంస్కరణలతో పాలన మరింత సులభతరం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే రెవెన్యూ డివిజన్‌గా కుప్పం ఆవిర్భావం
- ఎన్టీఆర్‌ను విస్మరించిన టీడీపీ సర్కారు
- ఆదివాసీలకు అందలం
- సొంత నియోజకవర్గాన్ని సైతం పట్టించుకోని చంద్రబాబు
- కృష్ణా జిల్లాకు ఆయన పేరు పెట్టిన జగన్ ప్రభుత్వం

అంశం	గతం	ప్రస్తుతం
జిల్లాలు	13	26
రెవెన్యూ డివిజన్లు	51	78

చరిత్రలో నిలిచిపోయేలా..

దేశంలోనే తొలిసారిగా సచివాలయ వ్యవస్థకు శ్రీకారం

వలంటీర్లతో ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు

నేనున్నానంటూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో పేదలకు భరోసా ఇచ్చారు. మడమ తిప్పను..మాట తప్పను.. అంటూ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తొలిరోజే గ్రామ వార్డు సచివాలయాల వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థలను ప్రకటించి సంచలన సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. నగరాల్లో నివసించే వారి రీతిలోనే ఏపీలో మన్యంలో కొండలపై నివసించే కుగ్రామాల ప్రజలకు సైతం వారి గ్రామాల్లోనే ప్రభుత్వ సేవలను చేరువచేశారు. పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే శ్రమ తప్పించారు. చిన్న వయసులోనే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినా.. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి జరిగిన పాలనతో పోల్చితే నాలుగున్నరేళ్ల జగన్ పాలన కచ్చితంగా పూర్తి



భిన్నమైనది. పారదర్శకంగా ఉన్న ఊరిలోనే ప్రభుత్వ సేవలందుతుండడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయాల వ్యవస్థతో వైఎస్ జగన్ తన పేరును దేశ చరిత్రలో చిరస్థాయిగా లిఖించుకున్నారనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

- సాక్షి, అమరావతి

సచివాలయాల స్వరూపం..

గ్రామ సచివాలయాలు	10,960
వార్డు సచివాలయాలు	4,044
శాశ్వత ఉద్యోగులు	1,34,694
వలంటీర్లు	2,55,457
ప్రత్యేక కేబుల్ వసతి ఇంటర్‌నెట్	14,095
టెలిఫోన్ సిగ్నల్ ద్వారా నెట్	909
ప్రజలకు అందిన సేవల సంఖ్య	9.74 కోట్లు
అందుతున్న సేవల రకాలు	722
కంప్యూటర్లు	30,004
యూపీఎస్‌లు	15,004
ప్రింటర్లు	15,004
స్మార్ట్ ఫోన్లు	29,592
లామినేషన్ మిషన్లు	16,851
ఫింగర్ ప్రింట్ స్కానర్లు	2,86,646
మొబైల్ ఫోను సిమ్‌లు	2,91,592
ఆధార్ కిట్లు	3,000

- హైస్పీడ్ ఇంటర్‌నెట్‌తో సచివాలయాల అనుసంధానం
- 2020 జనవరి 26 న సచివాలయ సేవలు ప్రారంభం.

భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా దశలవారీగా సచివాలయాల్లోనే చేపట్టేలా ప్రణాళికలు

- ప్రతి 50 ఇళ్లకు ఒకరు చొప్పున వలంటీర్లు
- అవినీతికి తావులేకుండా పారదర్శకంగా సేవలు

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల అందజేత

- ఠంచనుగా ఒకటో తేదీనే ఇళ్లకు వెళ్లి అవ్వాతాతల చేతిలో పింఛన్ సొమ్ము
- డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) విధానంలో సీఎం బటన్ నొక్కగానే లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ



నాడు ప్రభుత్వాసుపత్రుల్లో శిశువులను ఎలుకలు పీక్కుతిన్న అధ్వాన పరిస్థితులు.. సెల్‌ఫోన్ లైట్ వెలుతురులో సర్జరీలు చేసిన ఘటనలు.. విపరీతమైన సిబ్బంది కొరత.. వెరసి ప్రభుత్వాసుపత్రులపై రాష్ట్ర ప్రజలకు నమ్మకం అడుగంటింది..

నేడు సర్కారీ వైద్యం ప్రజలకు అత్యంత చేరువైంది. నాడు–నేడుతో ప్రభుత్వాసుపత్రులు కార్పొరేట్ ఆస్పత్రులకు ఏమాత్రం తీసిపోని విధంగా మారాయి. 53 వేలకుపైగా పోస్టుల భర్తీ. అటకెక్కిన ఆరోగ్యశ్రీ మళ్లీ పట్టాలెక్కింది. పిలవగానే పలికే అంబులెన్సులు. గ్రామ స్థాయిలో ఆరోగ్య శిబిరాలు. ఇలా నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజారోగ్య ముఖచిత్రాన్ని సీఎం వైఎస్ జగన్ సమూలంగా మార్చేశారు.

'నాడి' పట్టిన నేత..

ప్రజారోగ్య ముఖచిత్రం మార్చిన సీఎం వైఎస్ జగన్

- గ్రామస్థాయికి ప్రభుత్వ వైద్యసేవల విస్తరణ
- వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి విప్లవాత్మక సంస్కరణలు
- అంతంతమాత్రంగా ఉన్న 108, 104 సేవలకు జవసత్వాలు
- ఆరోగ్యశ్రీ పథకం కింద 3,257 ప్రొసీజర్లతో ఉచిత వైద్యం

2019కి ముందు చిన్న జబ్బు చేసినా ప్రజలు పట్టణాలు, నగరాల్లోని ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు తీయాల్సిన దుస్థితి. ఇప్పుడు అందుకు పూర్తి భిన్నం. ఏకంగా రూ.16 వేల కోట్లకుపైగా నిధులతో నాడు–నేడు కింద వివిధ కార్యక్రమాలను చేపట్టారు. గతంలో పడకేసిన డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి కుటుంబాల్లోని ప్రజల ఆరోగ్యానికి రెట్టింపు భరోసా కల్పిస్తున్నారు. పథకంలో ఏకంగా 3,257 వైద్య ప్రొసీజర్లు అందుబాటులో తీసుకొచ్చారు. అంతేకాక.. దేశంలో ఎక్కడా లేనట్లుగా వైద్యులే ప్రజల వద్దకు వెళ్లి చికిత్సలు అందించే ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని సీఎం జగన్ ప్రవేశపెట్టారు.

– సాక్షి, అమరావతి

ఆరోగ్యశ్రీ బలోపేతం ఇలా..

- 2014–19 మధ్య ఆరోగ్యశ్రీ పథకంలో ప్రొసీజర్లు 1,059
- వైఎస్ జగన్ సర్కార్ కొత్తగా చేర్చిన ప్రొసీజర్లు 2,198
- వైద్యం ఖర్చు రూ. వెయ్యి దాటే ప్రతి చికిత్సకు ఆరోగ్యశ్రీ పథకం వర్తింపు.
- 2019 నుంచి ఈ ఏడాది నవంబరు వరకు ఆరోగ్యశ్రీలో వైద్యం పొందినవారు– 37,40,525 మంది
- వీరికి వైద్యం కోసం ప్రభుత్వం ఖర్చు చేసిన మొత్తం – రూ. 11,859.96 కోట్లు
- ఆరోగ్య ఆసరా కోసం వెచ్చించిన మొత్తం – రూ.1,309.90 కోట్లు
- నాలుగున్నరేళ్లలో ఆరోగ్యశ్రీ, ఆసరా కోసం చేసిన ఖర్చు– రూ.13,169.86 కోట్లు
- ఆరోగ్యశ్రీకి 2014–19 మధ్య గత టీడీపీ ప్రభుత్వం చేసిన ఖర్చు– రూ. 5,177.38 కోట్లు
- కరోనాకు సంబంధించిన 10 రకాల చికిత్సలను 2021 మే, జూన్ నెలల్లో ఆరోగ్యశ్రీలోకి చేర్చారు.
- రెండు లక్షల మందికిపైగా కరోనా బాధితులకు ఉచితంగా చికిత్స అందించారు.
- కోవిడ్ బాధితుల చికిత్స కోసం ప్రభుత్వం చేసిన ఖర్చు రూ.744 కోట్లు.

ప్రజారోగ్యానికి రక్ష జగనన్న ఆరోగ్య సురక్ష..

- రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన శిబిరాలు **12,423**
- సొంత గ్రామంలోనే చికిత్స పొందినవారు **60.27** లక్షలు
- మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రులకు రిఫర్ చేసింది **86,690** మంది
- కేటరాక్ట్ సర్జరీలు నిర్వహించింది **78,292** మందికి

నాడు-నేడులో పనులు..

- రూ.1,692 కోట్లతో 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ల ఏర్పాటు.. వీటి ద్వారా 12 రకాల వైద్యసేవలు, 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులు గ్రామంలోనే అందుతున్నాయి.
- రూ.664.96 కోట్లతో పీహెచ్‌సీల బలోపేతం చేశారు. 983 పీహెచ్‌సీ భవనాలకు మరమ్మతులు చేయడంతో పాటు 150 కొత్త భవనాలను నిర్మించారు. కొత్తగా 176 పీహెచ్‌సీల ఏర్పాటు. ప్రతి పీహెచ్‌సీలో 63 రకాల వైద్య పరీక్షలు, 215 రకాల మందులను అందుబాటులోకి తెచ్చారు.
- రూ. 374.61 కోట్లతో 528 వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు. వీటి కోసం 184 భవనాలకు మరమ్మతులు, 344 కొత్త భవనాల నిర్మాణం.
- రూ.682 కోట్లతో 42 ఏరియా ఆస్పత్రులు, రూ.13 కోట్లతో ఎంసీహెచ్/జిల్లా ఆస్పత్రులు, రూ.528 కోట్లతో 121 సీహెచ్‌సీల బలోపేతం చేశారు.
- రూ.246 కోట్లతో రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో ఐదు ట్రైబల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల ఏర్పాటు..
- రూ. 272 కోట్లతో కడపలో క్యాన్సర్, మెంటల్ హెల్త్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణం..
- రూ.85 కోట్లతో శ్రీకాకుళం జిల్లా పలాసలో డాక్టర్ వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుచేశారు.





17 వైద్యకళాశాలల ఏర్పాటుతో నూతన అధ్యాయం

మన విద్యార్థులకు వైద్యవిద్య అవకాశాలను మెరుగుపరచడంతోపాటు.. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలను చేరువ చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో తన ముద్ర చూపించారు. ప్రభుత్వ వైద్యరంగాన్ని బలోపేతం చేయడంలో భాగంగా వైద్యవిద్యకు పెద్దపీట వేశారు.

- రూ. **8,480** కోట్లతో **17** కొత్త కళాశాలల ఏర్పాటుద్వారా **2,550** ఎంబీబీఎస్ సీట్లు.
- 2023లో విజయనగరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల, రాజమహేంద్రవరం వైద్యకళాశాలల ప్రారంభం.
- కొత్త వైద్య కళాశాలలో ఒక్కోచోట **150** చొప్పున మొత్తం **750** ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి.
- వచ్చే విద్యాసంవత్సరంలో మార్కాపురం, మదనపల్లె, పాడేరు, పులివెందుల, ఆదోని వైద్యకళాశాలల ప్రారంభం.
- ఇక మిగిలిన ఏడు కళాశాలలు 2025–26లో ప్రారంభించడానికి అనుగుణంగా చర్యలు.

108 సేవలకు ఊపిరి..



ఇక వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చే నాటికి 108 అంబులెన్సు సేవలు 336 వాహనాలతో అరకొరగా ఉండేవి. అంటే అప్పట్లో 679 మండలాలు (ప్రస్తుతం 686) ఉంటే మండలానికి ఒక అంబులెన్స్ కూడా లేని దుస్థితి ఉండేది. ఈ పరిస్థితుల్లో మార్పునకు శ్రీకారం చుట్టిన సీఎం జగన్ 2020 జులై 1న 412 కొత్త అంబులెన్సులను ప్రారంభించారు. దీంతో..

- ఒక్కసారిగా ప్రభుత్వ అంబులెన్సుల సంఖ్య 748కు పెరిగింది. ఇందుకోసం మొత్తం రూ.96.5 కోట్లు ఖర్చుచేశారు.
- వీటిలో 2.5 లక్షల కిలోమీటర్లకు పైగా తిరిగిన పాత వాహనాలను తొలగించి వాటి స్థానంలో ఈ ఏడాది జులైలో 146 కొత్త అంబులెన్సులను అందుబాటులోకి తెచ్చింది. వీటి కొనుగోలుకు మరో రూ.34.79 కోట్లు ఖర్చుచేసింది.
- మరోవైపు.. గత ప్రభుత్వంలో కేవలం 292 '104' వాహనాలు ఉండగా ఇందులో పాతవాటిని తొలగించి మొత్తం 910 మొబైల్ క్లినిక్ యూనిట్లను ఈ ప్రభుత్వం కొనుగోలు చేసింది. వీటి నిర్వహణ కోసం గత ప్రభుత్వం కన్నా ఇప్పుడు భారీగా ఖర్చు పెడుతున్నారు.
- గిరిజన ప్రాంతాల కోసమే ప్రత్యేకంగా రూ.4.76 కోట్లతో 20 కొత్త అంబులెన్స్‌లను 2022 అక్టోబరులో అదనంగా కొన్నారు. దీంతో 108 అంబులెన్సుల సంఖ్య 768కి చేరింది.
- ఇలా అంబులెన్స్‌ల కొనుగోలుకు రూ.136.05 కోట్లు ఖర్చుచేశారు. వీటి నిర్వహణ కోసం ఏటా రూ.188 కోట్ల చొప్పున ఖర్చుచేస్తున్నారు.
- ఈ లెక్కన పరిశీలించినట్లయితే నిర్వహణ, కొత్త వాహనాల కొనుగోలు రూపంలో రూ.750 కోట్లకు పైగానే ఖర్చు చేసినట్లయింది.



ఆంధ్రా తీరం.. ఆర్థికంగా ఊతం

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి ఉన్న సుదీర్ఘ సముద్ర తీరాన్ని ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం పలు కీలక ప్రాజెక్టులను చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతి 50 కి.మీకు ఒక్క పోర్టు లేదా ఫిషింగ్ హార్బరు (మినీ పోర్టు)లను నిర్మిస్తోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒకేసారి నాలుగు పోర్టులతో పాటు పది ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ ల్యాండ్ సెంటర్ల నిర్మాణాన్ని చేపట్టి రికార్డు సృష్టించింది. ఇందుకోసం సుమారు రూ.20,000 కోట్లు వ్యయం చేస్తుండటం గమనార్హం. తొలి దశలో జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్ల పనులు దాదాపు పూర్తయ్యి ప్రారంభానికి సిద్ధం కానున్నాయి. ఎగుమతులను ప్రోత్స హించే విధంగా తీర ప్రాంత అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను నీతి ఆయోగ్ కూడా ప్రశంసించింది. 2022 సంవత్సరానికి నీతి ఆయోగ్ ప్రకటించిన ఎగుమతి సన్నద్ధత రాష్ట్రాల్లో రాష్ట్రం 59.27 పాయింట్లతో 8వ స్థానంలో నిలిచింది. మరోవైపు మత్స్యకారులు చేపల వేటకు గుజరాత్, తమిళనాడు, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన అవసరం ఉండదు. మరో వైపు పోర్టులను ఆధారంగా చేసుకుని చుట్టుపక్కలా పారిశ్రామిక ప్రగతిని వెదజల్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. సుమారు 8,000 ఎకరాల విస్తీర్ణంలో పారిశ్రామిక పార్కుతో పాటు తెట్టు వద్ద కార్గో ఎయిర్‌పోర్టును అభివృద్ధి చేస్తున్నారు. ఫిషింగ్ హార్బర్ల సమీపంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నారు.

- పోర్టులు హార్బర్ల నిర్మాణం కోసం రూ.20,000 కోట్లు
- ఏక కాలంలో నాలుగు పోర్టుల నిర్మాణం
- ప్రారంభానికి సిద్ధంగా రామాయపట్నం పోర్టు
- మిగిలిన మూడు పోర్టుల్లో వేగంగా పనులు
- 10 ఫిషింగ్ హార్బర్లు, 6 ఫిష్ ల్యాండ్ సెంటర్ల అభివృద్ధి

రాష్ట్రంలో **60,000** మత్స్యకార కుటుంబాలకు స్థానికంగానే ఉపాధి

పోర్టులు	తొలిదశ వ్యయం	సామర్థ్యం	విస్తీర్ణం
రామాయపట్నం	రూ.3,736.14కోట్లు	34.04 ఎంటీపీఏ	851.15 ఎకరాలు
మూలపేట	రూ.4,361.91కోట్లు	23.5 ఎంటీపీఏ	1254.72 ఎకరాలు
మచిలీపట్నం	రూ.5,155.73కోట్లు	35.12 ఎంటీపీఏ	1922.97 ఎకరాలు
కేసెజ్ పోర్టు	రూ.2,123.43 కోట్లు	16 ఎంటీపీఏ	1944 ఎకరాలు (పీపీపీ విధానంలో)

ఫిషింగ్ హార్బర్	ప్రాజెక్ట్ వ్యయం	మత్స్యకారులకు లబ్ధి	బోట్లు నిలిపే సామర్థ్యం
జువ్వలదిన్నె	రూ.288.80 కోట్లు	6,100	1,250
నిజాంపట్నం	రూ.451 కోట్లు	9,000	1,600
మచిలీపట్నం	రూ.422 కోట్లు	3,300	550
ఉప్పాడ	రూ.361 కోట్లు	17,700	2,500
మంచినీళ్లపేట	డీపీఆర్ దశలో ఉంది		
బుడగట్ల పాలెం	రూ.365.80 కోట్లు	3,840	780
పూడిమడక	రూ.392.53 కోట్లు	4,870	930
కొత్తపట్నం	రూ.392.53 కోట్లు	4,200	820
వాడరేవు	రూ.417.55 కోట్లు	9,500	1,650
బియ్యపు తిప్ప	రూ.429.43 కోట్లు	2,348	441
మొత్తం	రూ.3,520.64 కోట్లు	60,858	10,521

ఎగుమతుల్లో 10 శాతం వాటా లక్ష్యం

దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఎగుమతుల్లో 10 శాతం వాటాను చేజిక్కించుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారులకు లక్ష్యాన్ని నిర్దేశించారు. 2030 నాటికి 10 శాతం మార్కెట్ వాటాతో టాప్ 3 రాష్ట్రాల్లో ఒకటిగా నిలవాలన్న లక్ష్యానికి అనుగుణంగా ప్రభుత్వం పలు కీలక చర్యలు తీసుకుంటోంది. ఫలితంగా గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది ఆరు నెలల కాలంలో రాష్ట్ర వాణిజ్య ఎగుమతుల విలువ రూ. 82,732.65 కోట్ల నుంచి రూ.85,021.74 కోట్లకు చేరాయి. ఇదే సమయంలో దేశ వ్యాప్తంగా ఎగుమతుల విలువ రూ. 18,17,640.99 కోట్ల నుంచి రూ. 17,42,429.99 కోట్లకు పడిపోవడం గమనార్హం. 2022–23 ఆర్థిక సంవత్సరం మొత్తం మీద రాష్ట్రం రూ.1,59,368.02 కోట్ల ఎగుమతులు చేయడం ద్వారా 4.40 శాతం వాటాతో ఆరో స్థానంలో నిలవగా, ఈ ఏడాది మొదటి ఆరు నెలల కాలంలో రూ. 85,021.74 కోట్ల ఎగుమతులతో దేశ ఎగుమతుల్లో రాష్ట్ర వాటాను 4.88 శాతంకు పెంచుకొని ఐదో స్థానానికి ఎగబాకింది.

ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు

- ✔ విశాఖపట్నం జిల్లా భీమిలి
- ✔ అనకాపల్లి జిల్లా రాజయ్యపేట, దొండవాక
- ✔ విజయనగరం జిల్లా చింతపల్లి
- ✔ తిరుపతి జిల్లా రాయదరువు
- ✔ కాకినాడ జిల్లా ఉప్పలంక

సీఎం మార్క్ బ్రాండ్ సిటీ

నాలుగున్నరేళ్లలో విశాఖకు కొత్త రూపు



ఐటీ, గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్, జీ20 సదస్సుతో పెరిగిన ఇమేజ్


- అంతర్జాతీయ గుర్తింపుతో ప్రపంచ దృష్టిని ఆకర్షించిన నగరం
- పెట్టుబడుల స్వర్గధామంగా మార్పు
- సక్సెస్ మంత్రంగా బీచ్ ఐటీ కాన్సెప్ట్
- ఇన్ఫోసిస్, విప్రో తదితర సంస్థలతో కళకళ
- నగర అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రత్యేక దృష్టి
- ప్రజల్ని సరికొత్తగా పలకరిస్తున్న రహదారులు, పార్కులు
- ఎన్ఏడీ ఫ్లైఓవర్ పూర్తి.. సిరిపురం జంక్షన్‌లో జోరుగా మల్టీ లెవల్ కార్ పార్కింగ్ పనులు
- జీవీఎంసీ పరిధిలో రూ.వేల కోట్లతో అభివృద్ధి పనులు

టైర్-1 సిటీలతో పోటీ

నీతి ఆయోగ్ ఇటీవల వెల్లడించిన పట్టణ సుస్థిర అభివృద్ధి సూచిక ర్యాంకుల్లో విశాఖకు 18వ ర్యాంకు సాధించింది. దేశంలోని రాష్ట్రాల రాజధానులు, 10 లక్షల జనాభా పైబడిన నగరాలు.. మొత్తంగా 56 నగరాలకు ఈ ర్యాంకులు ఇచ్చారు. టైర్-1 సిటీల కంటే ద్వితీయ శ్రేణిలో ఉన్న వైజాగ్.. అందర్నీ ఆకర్షిస్తోంది. స్మార్ట్ సిటీ ర్యాంకింగ్‌లోనూ సత్తా చాటుతోంది. 2018-19లో 23వ ర్యాంకులో ఉన్న నగరం ఆ తర్వాత వరుసగా టాప్-10లోనే కొనసాగుతోంది. ఈ ఏడాది క్లైమేట్ స్మార్ట్ సిటీ ఫ్రేమ్ వర్క్‌లో 4 స్టార్ రేటింగ్ సాధించింది.

సాక్షి, విశాఖపట్నం/సాక్షి, అమరావతి

సువిశాల సాగరతీరం చెంతనే ఆహ్లాదకరమైన వాతావరణంలో ఐటీ పరిశ్రమల్ని అభివృద్ధి చేసి.. సిటీ ఆఫ్ డెస్టినీని ఐటీ హబ్‌గా మార్చాలనే ఉద్దేశంతో.. బీచ్ ఐటీ కాన్సెప్ట్‌ని తొలుత ప్రమోట్ చేయాలని భావించారు. ఇందులో భాగంగానే ఇన్ఫోసిస్, టెక్‌మహీంద్ర, హెచ్‌సీఎల్, యాక్సెంచర్, రాండ్‌స్టాడ్, డబ్ల్యూఎన్ఎస్, అమేజాన్ తదితర ఐటీ, ఐటీ అనుబంధ దిగ్గజ సంస్థలు విశాఖ వైపు అడుగులు వేశాయి. వర్చువల్ డెస్క్‌టాప్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(వీడీఐ), క్లౌడ్ ప్రాజెక్టులకు కేంద్రంగా విశాఖ క్యాంపస్‌ని మార్చాలని విప్రో నిర్ణయించింది. విశాఖలో స్టార్టప్‌ల ఏర్పాటుకు తాము సిద్ధంగా ఉన్నామంటూ నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్(నాస్కామ్) సీఈవో సంజీవ్ మల్హోత్రా ప్రకటించారు. ఐటీ రంగంలో తిరుగులేని నగరంగా విశాఖపట్నంని అభివృద్ధి చేసేందుకు ఇక్కడే ఐటీ ఎమర్జింగ్ టెక్నాలజీ రీసెర్చ్ యూనివర్సిటీ ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. ఐటీ పరిశోధనలు, అభివృద్ధిలో భాగంగా.. ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఎకోసిస్టమ్‌ని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు కేంబ్రిడ్జిలోని మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ) సహకారంతో పాటు సంయుక్త సర్టిఫికేషన్ కోర్సుల్ని ప్రవేశపెట్టాలని భావిస్తోంది. అమెరికాకు చెందిన ప్రముఖ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ సంస్థ చెగ్.. విశాఖలో కొత్త బ్రాంచ్‌ని ప్రారంభించింది. అదానీ డేటా సెంటర్ ఏర్పాటుకు సీఎం వైఎస్ జగన్ స్వయంగా శంకుస్థాపన చేశారు. వైజాగ్ టెక్ పార్క్ కూడా డేటా సెంటర్‌తో పాటు బిజినెస్ పార్క్, స్కిల్ యూనివర్సిటీని రూ.21,844 కోట్ల పెట్టుబడితో 39,815 మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ముందుకు వచ్చింది. గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల్లో ఎన్టీపీసీ, ఇంధన రంగంలో హెచ్‌పీసీఎల్, పర్యాటక రంగంలో ఒబెరాయ్, తాజ్, ఇనార్బిట్‌మాల్, టర్బో ఏవియేషన్.. ఇలా.. విభిన్న రంగాల్లో బహుళ ప్రాజెక్టుల్ని ఏర్పాటు చేస్తున్నారు.



ఐటీ ఉద్యోగాల జోరు..

రాష్ట్రంలోని ఐటీ రంగంలో 2014-19 కాలంలో 24,350 ఐటీ ఉద్యోగాల కల్పన జరిగితే ఆ తర్వాత రెండేళ్లు కోవిడ్ వంటి కష్టకాలం ఉన్నప్పటికీ ఈ నాలుగున్నర ఏళ్లల్లో కొత్తగా 29,500 ఉద్యోగాలు వచ్చాయి. దీంతో రాష్ట్రంలో పనిచేస్తున్న ఐటీ ఉద్యోగుల సంఖ్య 53,850కు చేరింది.

భూసంస్కరణలతో నవశకం

రైతులకు మేలు చేసేలా రెవెన్యూ శాఖలో సీఎం జగన్ సాహసోపేత నిర్ణయాలు

- కుప్పలు తెప్పలుగా ఉన్న రెవెన్యూ సమస్యలన్నింటికీ పరిష్కారం
- లక్షల ఎకరాలపై ఆంక్షలు తొలగింపు
- నిరుపేదలకు 46 వేలఎకరాల భూముల పంపిణీ.. లంక భూములకు అసైన్‌మెంట్ పట్టాలు
- వివాదాలు లేని భూయాజమాన్యం కోసం భూముల రీ సర్వే
- దేశంలోనే మొదటిసారి ల్యాండ్ టైట్లింగ్ చట్టం అమలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర గతిని మార్చేలా భూములకు సంబంధించి సీఎం జగన్ ఈ నాలుగున్నరేళ్లలో అనేక సంస్కరణలు అమలు చేశారు. భూముల రీ సర్వే, ల్యాండ్ టైట్లింగ్ చట్టం ద్వారా రెవెన్యూ శాఖను సమూలంగా మార్చి భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఏపీని తయారు చేసేందుకు కంకణం కట్టుకున్నారు. లక్షలాది ఎకరాలపై ఉన్న ఆంక్షలను తొలగించారు. 20 ఏళ్ల దాటిన అసైన్డ్ భూము లకు యాజమాన్య హక్కులు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయంరెవెన్యూ వ్యవస్థలో పెను మార్పులు తెస్తోంది.

రెవెన్యూలో సాధించిన పురోగతి ఇదీ

- భూ పంపిణీలో డీకేటీ పట్టాలు పొందిన వారు - 42,307 మంది
- పంపిణీ చేసిన ఎకరాలు (విస్తీర్ణంలో) - 46,463.82
- లంక భూముల్లో పట్టాలు పొందిన వారి సంఖ్య - 17,768 మంది
- పంపిణీ చేసిన ఎకరాలు (విస్తీర్ణంలో) - 9,064 ఎకరాలు
- దళిత వాడల్లో శ్మశానాల స్థలం లేని గ్రామాలు - 1,563
- ప్రభుత్వ భూమిని శ్మశానాల కోసం కేటాయించిన స్థలం (విస్తీర్ణం) - 951 ఎకరాలు
- చుక్కల భూములను నిషేధిత ఆస్తుల జాబితా నుంచి తొలగించడంతో లబ్ధిపొందిన రైతుల సంఖ్య - 1.50 లక్షలు మంది
- వారికి అందించిన ఎకరాలు (విస్తీర్ణంలో) - 2.06 లక్షలు
- ఈనాం భూములపై ఆంక్షలు తొలగడంతో లబ్ధిపొందినవారు - 1,61,584
- వారికి పంపిణీ చేసిన ఎకరాలు (విస్తీర్ణంలో) 1,58,113 ఎకరాలు
- భూమికొనుగోలు పథకంలో లబ్ధిపొందిన దళితులు - 22,347
- పంపిణీ చేసిన ఎకరాలు (విస్తీర్ణంలో) - 22,837 ఎకరాలు
- శాశ్వత భూ హక్కు పథకంలో పూర్తయిన రీ సర్వే గ్రామాలు - 4 వేలు
- పంపిణీ చేసిన భూ హక్కు పత్రాలు - 20 లక్షలు
- భూముల సరిహద్దులు గుర్తిస్తూ పాతిన రాళ్లు - 50 లక్షలు







Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ
The Andhra Pradesh Mineral Development Corporation Ltd.

మైనింగ్ రంగాన్ని వైవిధ్యభరితమైన సంస్కరణలతో అభివృద్ధి పథంలో పయనింపచేస్తూ, బెరైటీస్, గ్రానైట్, బొగ్గు మరియు ఇతర ఖనిజాల ఎగుమతులకు అనుకూలంగా పోర్టులు, అనుబంధ ప్రాసెసింగ్ & ఇతర సంస్థల ఏర్పాటుకు తోడ్పడుతూ, వినూత్న విధానాలతో పారిశ్రామికాభివృద్ధి సాధిస్తూ.. సంక్షేమ పథకాలతో సుపరిపాలన సాగిస్తున్న గౌరవ ముఖ్యమంత్రివర్యులు

శ్రీ వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి గారి సారథ్యంలో విజయపథంలో ఎపిఎండిసి

ముఖ్యమంత్రివర్యులు శ్రీ వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలతో...



ప్రగతిపథంలో ఎపిఎండిసి

- 2020-21 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ: రూ.434 కోట్లు
- 2021-22 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ : రూ.900 కోట్లు
- 2022-23 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ: రూ.1800 కోట్లు
- 2023-24 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ లక్ష్యం : రూ.4000 కోట్లు
- గ్రానైట్, కాల్సైట్, బాల్ క్లే, ఐరన్ ఓర్ మైనింగ్ లో పురోగతి
- 'కడప ఉక్కు కర్మాగారం'కు ఖనిజ సరఫరాకై అనంతపురం జిల్లాలో 110 మి.టన్నుల హైగ్రేడ్ ఖనిజ నిల్వల గుర్తింపు
- కడప జిల్లా బ్రహ్మంగారి మఠం (మం.) పలుగురాళ్లపల్లిలో వైట్ బెరైటీస్ ప్రాజెక్ట్
- జగనన్న భూహక్కు-భూరక్ష సర్వే కోసం ఇప్పటివరకు 75 లక్షల సర్వే రాళ్ళ సరఫరా
- చిలకలూరిపేట (మం.) యడవల్లి (గ్రా)లో 70 హెక్టార్లలో కలర్ గ్రానైట్ లీజు
- రూ. 300కోట్లతో మంగంపేటలో పునరావాసం.

అంతర్జాతీయంగా 'ఎపిఎండిసి' రికార్డులు

- మిడిల్ ఈస్ట్ దేశాల్లో మంగంపేట బెరైటీస్‌కు గట్టి డిమాండ్
- అమెరికా మార్కెట్లో 54 శాతం ఎపిఎండిసి బెరైటీస్ వాటా
- అంతర్జాతీయంగా 30 దేశాలకు బెరైటీస్ ఎగుమతులు



జాతీయస్థాయిలో ఎపిఎండిసి విజయాలు

- సింగరేణి, కోల్ ఇండియా సరసన నిలిచిన 'ఎపిఎండిసి'
- 2022-23లో మధ్యప్రదేశ్ సుల్యారీ లో బొగ్గు ఉత్పత్తి ద్వారా రెవెన్యూ : రూ.487 కోట్లు.
- 2023-24 ఆర్థిక సంవత్సరంలో సుల్యారీ బొగ్గు గనుల ద్వారా రెవెన్యూ లక్ష్యం : రూ. 1600 కోట్లు. ఇప్పటివరకు రూ. 1,000 కోట్లు రెవెన్యూ ఆర్జన.
- ప్రైవేటు సంస్థలతో పోటీ పడి ఝార్ఖండ్ లోని బ్రహ్మదియా కోకింగ్ కోల్‌ను వేలంలో దక్కించుకున్న ఎపిఎండిసి
- 2023-24 లో బ్రహ్మదియాలో కోకింగ్ కోల్ ఉత్పత్తికి సన్నాహాలు
- రెండు HMBS మైనింగ్ లీజులను ఎపిఎండిసికి కేటాయించిన కేంద్రం

ఎపిఎండిసి ఫౌండేషన్ ద్వారా సామాజిక కార్యక్రమాలు

- అన్నమయ్య జిల్లా మంగంపేటలో ఎపిఎండిసి పబ్లిక్ స్కూల్ ద్వారా 1000 మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య
- విద్యార్థులకు ఉచితంగా పౌష్టికాహారంతో మధ్యాహ్న భోజనం.
- డిజిటల్ క్లాస్‌రూంలతో అత్యుత్తమ బోధన.
- మంగంపేట పరిసర 10 గ్రామాలకు హెల్త్ సెంటర్ ద్వారా ఉచిత వైద్య సేవలు.
- మంగంపేట పరిధిలో సిఎస్ఆర్ కింద 211 మందికి ప్రతినెలా రూ.2 వేల చొప్పున పెన్షన్
- సామాజిక అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా కమ్యూనిటీ హాళ్ళు, బస్ షల్టర్ల నిర్మాణం
- వికలాంగులకు ఉచితంగా ట్రై స్కూటర్లు
- 4 జిల్లాల్లో 300 హ్యాబిటేషన్ లలో దాదాపు 3 లక్షల మందికి ఆర్వో వాటర్ ప్లాంట్ల ద్వారా రక్షిత మంచినీరు
- మధ్యప్రదేశ్ లోని సుల్యారీలో 800మంది విద్యార్థులకు డి.ఎ.వి. భాగస్వామ్యంతో మోడల్ స్కూల్
- సుల్యారీ పరిసర ప్రాంతాల్లోని 10 గ్రామాలకు ఉచిత వైద్య సేవలు

డోర్‌నెం. 294/1డి, తాడిగడప-ఎనికేపాడు 100 అడుగుల రోడ్డు, కానూరు, విజయవాడ - 521 137
ఆంధ్రప్రదేశ్, ఫోన్: 0866-2429999, ఫ్యాక్స్ : 0866 - 2429977 E-mail : info-ho@apmdc.in :: website : www.apmdc.ap.gov.in

సాక్షి 24|7 కర్ణాటక

KARNATAKA

గురువారం : 21 : డిసెంబర్ : 2023



బుధవారం ఉదయం ధార్వాడ శివార్లలో ఆవరించిన పొగమంచు



బెంగళూరు మెజెస్టిక్ రైల్వేస్టేషన్ వద్ద ఈ బోగీని రెస్టారెంటుగా మార్చనున్నారు

న్యూస్‌రీల్

కుక్కెలో మంత్రి పొంగులేటి పూజలు



ఆలయంలో మంత్రి, కుటుంబ సభ్యులు

యశవంతపుర: దక్షిణ కన్నడ జిల్లా కుక్కే సుబ్రమణ్య దేవస్థానంలో తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అన్నదానం కోసం కోటి రూపాయిల చెక్కును దేవస్థానం అధికారులకు అందజేశారు. దేవస్థానంలో జరుగుతున్న చంపా షష్టి వేడుకల్లో మంత్రి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. వారికి దేవస్థానం అధికారులు, వేద పండితులు లాంఛనాలతో స్వాగతం పలికారు. అనుకున్న కోరికలు నెరవేరడంతో సుబ్రమణ్యస్వామిని దర్శించుకున్నట్లు మంత్రి తెలిపారు.

ఊపిరితీసిన పొగమంచు

- లారీని కారు ఢీ.. ప్రైవేటు ఉద్యోగి మృతి





ప్రమాద దృశ్యం (ఇన్‌సెట్‌లో) మృతుడు సంతోష్

బనశంకరి: రోడ్డుపై నిలబడిన లారీని వెనుక నుంచి కారు ఢీకొట్టిన ప్రమాదంలో సంతోష్ (35) అనే అమెజాన్ కంపెనీ మేనేజర్ మృతిచెందాడు. ఈ ఘటన నగరంలో కామాక్షిపాళ్య ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెచ్ఎస్ఆర్.లేఔట్ నివాసి సంతోష్ బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు కారులో బయలుదేరాడు. నైస్‌రోడ్డు జంక్షన్ వద్ద వెళుతుండగా దట్టమైన పొగమంచు ఉండడంతో దారి సరిగా కనిపించలేదు. దీంతో రోడ్డుపక్కన నిలిచి ఉన్న లారీని కారు ఢీకొట్టింది. కారు పూర్తిగా ధ్వంసం కాగా సంతోష్ అక్కడికక్కడే మరణించాడు. కామాక్షిపాళ్య ట్రాఫిక్‌పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని విక్టోరియా ఆసుపత్రికి తరలించారు.

మైనర్ల అతి తెలివి

- నకిలీ నోట్ల మార్పిడికి యత్నం



తుమకూరు: ముగ్గురు మైనర్ బాలలు నకిలీ నోట్ల చలామణికి యత్నించారు. మొబైల్‌ఫోన్ దుకాణం యజమాని సమయస్ఫూర్తితో వారి మోసం నుంచి బయటపడ్డాడు. మధుగిరి పట్టణం వీఆర్‌ఎస్‌టీ రోడ్డులో ఉన్న ఒక మొబైల్ షాపులో మంగళవారం సాయంత్రం ముగ్గురు అబ్బాయిలు మొబైల్‌ఫోన్ కొనాలని వచ్చారు. తక్కువ ధరలో మొబైల్ చూపించాలని కోరారు. ఆ తర్వాత రూ. 10,500 విలువైన మొబైల్ తీసుకుంటామని చెప్పి 21 రూ.500 నోట్లను ఇచ్చారు. ఆ నోట్లను తీసుకుని లెక్కిస్తుండగా అనుమానం రావడంతో ఇవి మీ దగ్గరికి ఎలా వచ్చాయని వారిని ప్రశ్నించారు. దీంతో ఆ పిల్లలు భయపడి పారిపోయారు. వెంటనే దుకాణం యజమానికి నకిలీ నోట్లను మధుగిరి పోలీసు స్టేషన్‌లో అప్పగించి ఫిర్యాదు చేశాడు. పిల్లల కోసం గాలింపు చేపట్టారు.

కోవిడ్‌పై గాబరా వద్దు





బుధవారం బెంగళూరు కేఆర్ మార్కెట్‌లో మాస్కు కొంటున్న బాలిక



నగరంలో ఎంజీ రోడ్డులో మాస్కులు ధరించి వెళ్తున్న ఓ జంట

- క్రిస్మస్, కొత్త ఏడాది వేడుకలపై ఆంక్షలు లేవు
- రాష్ట్రంలో కరోనా టెస్టుల్ని పెంచుతాం
- ఆరోగ్య మంత్రి దినేశ్ వెల్లడి

శివాజీనగర: కోవిడ్ కేసులు పెరుగుతున్నా కూడా ప్రస్తుతానికి క్రిస్మస్, నూతన ఏడాది వేడుకలపై ఎలాంటి షరతులను విధించే యోచన లేదని ఆరోగ్య మంత్రి దినేశ్ గుండూరావు తెలిపారు. బెంగళూరు అంతర్జాతీయ ప్రయాణికులపై కూడా ఆంక్షలు లేవన్నారు. దేశంలో కరోనా కొత్త వేరియంట్ జేఎన్ 1.1 బయటపడి వైరస్ కేసులు పెరుగుతున్నందున కేంద్ర ఆరోగ్య మంత్రి మన్సుక్ మాండవీయ అన్ని రాష్ట్రాల ఆరోగ్య మంత్రులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. అందులో పాల్గొన్న మంత్రి ఆపై విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 1.1 వైరస్ బయటపడలేదు. ప్రస్తుతం కరోనా గురించి ఆందోళన అవసరం లేదు అని అన్నారు.

రద్దీ ప్రాంతాల్లో మాస్క్ మంచిది

60 ఏళ్ల పైబడిన వారికి, ఆరోగ్య కార్యకర్తలకు మాస్క్ తప్పనిసరి, అలాగే రద్దీ ప్రాంతాల్లో ప్రజలు మాస్క్ వేసుకోవడం మంచిదని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో కరోనా టెస్టులను పెంచి, గత 24 గంటల్లో 1,020 టెస్టులు చేసినట్లు చెప్పారు. శనివారం నాటికి 5 వేలకు పెంచుతామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆర్‌టీపీసీఆర్ పరీక్షలను ఉచితంగా చేస్తున్నారు, ప్రైవేట్ ఆసుపత్రుల్లో దీనికి ధరను గురువారం నిర్ధారిస్తామన్నారు.

నేడు సీఎం సమీక్ష

సీఎం సిద్దరామయ్య గురువారం కరోనాపై సమీక్ష నిర్వహిస్తారు. అధిక కేసులు వస్తే క్వారంటైన్ అమలుపై ఆలోచిస్తామని మంత్రి చెప్పారు. ప్రస్తుతం కోవిడ్ కేసుల్లో 90 శాతం మంది హోమ్ క్వారెంటైన్‌లో ఉన్నారని, ఆక్సిజన్, ఐసీయూలను సిద్ధంగా ఉంచుకోవాలని కేంద్రమంత్రి సూచించారని చెప్పారు. కరోనా వల్ల బెంగళూరు చామరాజపేటలో ఒక వృద్ధుడు మరణించాడని తెలిపారు. ఆయనకు అప్పటికే పలు రకాల జబ్బులు ఉన్నాయని అన్నారు.



బ్రిగేడ్ రోడ్‌లో కొత్త ఏడాది వేడుకల్లో రద్దీ (ఫైల్)

రాష్ట్రంలో 22 కేసుల నమోదు

సాక్షి, బెంగళూరు: కన్నడనాట కరోనా కేసుల తాకిడి మొదలైంది. వివిధ జిల్లాల్లో బుధవారం 22 పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. బాధితుల్లో ఇద్దరు మరణించడం గమనార్హం.

- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఇచ్చిన సమాచారం మేరకు బెంగళూరు నగరంలో మొత్తం 359 మందికి పరీక్షలు చేయగా అందులో 19 మందికి పాజిటివ్ అని నిర్ధారణ అయింది.
- చిక్కబళ్లాపురలో 94 మందికి, ధారవాడలో ఐదుగురికి పరీక్షలు నిర్వహించగా పాజిటివ్‌లు లేవు.
- దక్షిణ కన్నడ, జిల్లాలో ఇద్దరికి పరీక్షలు చేస్తే ఒకరికి పాజిటివ్ అని తేలింది. బళ్లారిలో మరో ఇద్దరికి కోవిడ్ పాజిటివ్ అని గుర్తించారు.
- ప్రస్తుతం రాష్ట్రంలో 92 యాక్టివ్ కోవిడ్ కేసులు ఉన్నాయి. వీరిలో 72 మంది హోం ఐసోలేషన్‌లో ఉండగా, 20 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఏడుమంది ఐసీయూలో ఉన్నారు.
- గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలో 808 టెస్టులు చేశారు. ఇప్పటివరకు పాజిటివిటీ రేటు 1 శాతం కన్న తక్కువగా ఉండేది. తాజాగా అది 2.47 శాతానికి పెరిగింది.

రామనగరలో యువతికి కోవిడ్

దొడ్డబళ్లాపురం: రామనగరలో రెండో కరోనా కేసు నమోదయింది. పట్టణ నివాసి అయిన యువతి (21)కి కోవిడ్ పాజిటివ్ వచ్చింది. జిల్లా ఆస్పత్రిలోని కోవిడ్ వార్డులో ఆమెకు చికిత్స అందిస్తున్నారు. పక్క వార్డులో కరోనా సోకిన యువకునికి కూడా చికిత్స ఇస్తున్నారు. బాధిత యువతి తల్లికి కూడా సోకినట్లు అనుమానాలున్నాయి.

గుండెపోటుతో విద్యార్థిని మృతి



విద్యార్థిని సృష్టి (ఫైల్)

యశవంతపుర: ఆడి పాడే చిన్న వయసులోనే బాలికను గుండెపోటు పొట్టనపెట్టుకుంది. ఈ సంఘటన చిక్కమగళూరు జిల్లా మూడిగెరె తాలూకా జోగణ్ణనకెరె గ్రామంలో జరిగింది. విద్యార్థిని సృష్టి (13) 8వ తరగతి చదువుతోంది. బుధవారం పొద్దున్నే పాఠశాలకు వెళ్లడానికి సిద్ధమవుతుండగా గుండెపోటు రావటంతో కుప్పకూలిపోయింది. కుటుంబసభ్యులు మూడిగెరె ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా దారిలో కన్నుమూసింది. బిడ్డను కోల్పోయిన కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

నిన్నే పెళ్లాడుతా

- బాలికపై ఉపాధ్యాయుని వేధింపులు

తుమకూరు: వసతి పాఠశాల విద్యార్థినితో ఒక ఉపాధ్యాయుడు అనుచితంగా ప్రవర్తించాడు. ఈ ఘటన తుమకూరు తాలూకా హెబ్బూరులోని నరసాపుర మొరార్జీ వసతి పాఠశాలలో జరిగింది. ఇటీవల జరిగిన ఒక స్వాగత వేడుకలో ఆరో తరగతి చదువుతున్న బాలికతో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు రవీంద్ర అసభ్యంగా ప్రవర్తించాడు. నువ్వు చీరలో చాలా అందంగా ఉన్నావు, వచ్చే జన్మలో పెళ్లి చేసుకుంటే నిన్నే చేసుకుంటానంటూ రవీంద్ర వేధించాడు. పదే పదే వెంటబడి వేధిస్తున్న రవీంద్ర పోరు తట్టుకోలేక బాలిక ప్రిన్సిపాల్‌కు సమాచారం అందించింది. తరువాత తన సోదరుడు, మామతో పాటు మహిళా పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. పోలీసులు సదరు కీచకున్ని అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

వాట్సాప్ స్టేటస్.. ఇద్దర్ని బలిగొంది



శృతి, మురళి(ఫైల్)

మైసూరు: సోషల్ మీడియా వల్ల ఎన్ని ఉపయోగాలు ఉన్నా, జాగ్రత్తగా ఉండకపోతే ప్రాణాలే పోతాయని అనేకసార్లు రుజువైంది. సామాజిక మాధ్యమాల్లో తమ ఇద్దరి ఫోటో వైరల్‌గా మారడంతో ఇరు కుటుంబాల ఘర్షణ పడగా, మనస్తాపానికి గురై గృహిణి, మరో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన జిల్లాలోని హుణసూరులో జరిగింది. హుణసూరులోని కల్కుణి నివాసి వివాహిత శృతి (28), మురళి (20) ఆత్మహత్య చేసుకున్నవారు. వీరిద్దరి మధ్య స్నేహం కుదిరింది. ఇద్దరు కలసి ఉన్న ఫోటోను మురళి వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకోగా ఊళ్లో చాలామంది అది చూశారు. దీంతో ఇరు కుటుంబాల మధ్య గొడవ జరిగింది. దీంతో భయపడిపోయిన శృతి మనస్తాపానికి గురై ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మురళి కూడా భయంతో ప్రాణాలు తీసుకున్నాడు.

కరువు సాయం ప్లీజ్

- కేంద్ర హోంమంత్రికి సీఎం వినతి

శివాజీనగర: రాష్ట్రంలో కరువు నివారణకు పరిహార నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య, బుధవారం ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా కు విన్నవించారు. పార్లమెంటులో ఆయనను కలిసి రాష్ట్రంలో తీవ్ర కరువు సమస్య తలెత్తిందని, 236 తాలూకాలలో 223 తాలూకాలు కరువుకు గురయ్యాయని, 48.19 లక్షల హెక్టార్లలో పంట నష్టం జరిగిందని వివరించారు. తక్షణం రూ.18,000 కోట్లు కేటాయించాలని విన్నవించారు.

నేత్రపర్వంగా మహా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కంప్లి: ఎమ్మిగనూరు గ్రామ ప్రజల ఆరాధ్య దైవమైన జడెసిద్ధ శివయోగి 63వ మహా రథోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. జిల్లాతో పాటు ఇతర జిల్లాలు, పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి తమ మొక్కులు చెల్లించుకొని జడెసిద్దేశ్వర శివయోగి దర్శనం పొందారు. రథోత్సవంలో వేలాదిగా భక్తులు పాల్గొనడంతో గ్రామమంతా పండగ వాతావరణం నెలకొంది. ఎక్కడ చూసిన భక్తుల సందడి కనిపించింది. రథోత్సవంలో మంగళవాయిద్యకారులు, వివిధ జానపద కళాకారులు, ప్రజలు పాల్గొన్నారు.

కన్నకొడుకునే నదిలోకి విసిరేసి..

- కిరాతక తల్లి అకృత్యం



చిన్నారి మృతదేహం

దొడ్డబళ్లాపురం: అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ఒక కసాయి తల్లి కన్నకొడుకును నదిలో విసిరేసి హత్య చేసిన సంఘటన చెన్నపట్టణలో వెలుగు చూసింది. తాలూకాలోని బానగల్లి గ్రామంలో భాగ్య అనే వివాహిత తన కుమారుడు దేవరాజ్ (13 నెలలు)ను కణ్వ నదిలోకి విసిరేసింది.

చెడు అలవాట్లకు లోనై..

భర్తను వదిలి పుట్టింట్లో ఉంటున్న భాగ్య స్థానికంగా ఒక వ్యక్తితో భాగ్య అక్రమ సంబంధం ఏర్పడింది. పగలంతా ప్రియునితో తిరుగుతుండడంతో భాగ్య తల్లి కొడుకును పట్టించుకోవా అని చీవాట్లు పెడుతుండేది. మరోవైపు ప్రియుడు కూడా మన సంతోషానికి నీ కొడుకు అడ్డుగా ఉన్నాడని, నేను కావాలో నీ కొడుకు కావాలో తేల్చుకోవాలనేవాడు. దీంతో భాగ్య క్రూరంగా ఆలోచించి.. మంగళవారం రాత్రి కొడుకును ఎత్తుకెళ్లి నదిలోకి పడేసింది. ఆపై కాలికెరె దేవాలయం వద్దకు వచ్చి తన కుమారుడు నదిలో పడిపోయాడని ఏడవసాగింది. బుధవారం ఉదయం బాలుని మృతదేహం లభించింది. స్థానికుల సమాచారంతో భాగ్యను పోలీసులు తమదైన శైలిలో విచారించగా తానే పడేసినట్లు ఒప్పుకుంది. అక్కూరు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

సిరిగేరిలో వేడుకగా కుంభోత్సవం





అలంకరణలో అమ్మవారు, కుంభాలతో భక్తుల ఊరేగింపు

సిరుగుప్ప: తాలూకాలోని సిరిగేరిలో తొమ్మిదేళ్లకు ఒకసారి జరిగే కుంభోత్సవంలో గ్రామంలోని అన్ని దేవుళ్లకు సమస్త ప్రజలు నైవేద్యాన్ని సమర్పించడం ఆనవాయితీ. బుధవారం తెల్లవారుజాము నుంచి గ్రామంలోని అన్ని మేటి కుంభాలు, కలశాలతో భక్తిశ్రద్ధలతో డోలు మేళ వాయిద్య బృందాలతో గ్రామదేవతలైన మారెమ్మ దేవి, కెంచమ్మదేవి, జుగలమ్మదేవి, కుంబార దేవమ్మదేవి, గర్జనగడ్డ తాయమ్మదేవి, కురుబర దేవమ్మ దేవి, సిరిగేరమ్మదేవి తదితర దేవతలకు భక్తులు మహా ప్రసాదం సమర్పించారు. రాత్రికి శశిరేఖ పరిణయం అనే బయలు నాటకం ప్రదర్శించారు. గ్రామంలో శాంతిభద్రతల రక్షణకు తెక్కలకోటి సీఐ, సిరిగేరి పోలీస్ సిబ్బంది కట్టుదిట్టమైన భద్రత కల్పించారు. జీపీ పాలక మండలి, అధ్యక్షులు, సభ్యులు,గ్రామ ప్రముఖులు, సంఘ సంస్థల పదాధికారులు సహకరించి శాంతిని నెలకొల్పారు.

కట్నం కోసం ప్రియుని ఒత్తిడి

- న్యాయ విద్యార్థిని ఆత్మహత్య

మైసూరు: నిశ్చితార్థం అయిన తర్వాత వరకట్నం కోసం ఒత్తిడి చేయడంతో కాబోయే వధువు బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మైసూరు కువెంపునగర పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. తమిళనాడు నీలగిరీస్‌కు చెందిన యువతి కవీశ (21) నగరంలోని జేఎస్ఎస్ న్యాయ కళాశాలలో ఏడో సెమిస్టర్ చదువుతోంది. కవీశ కొన్ని రోజులుగా ఊటీకి చెందిన కిరణ్ అనే యువకుడిని ప్రేమిస్తోంది. ఇద్దరి ప్రేమ విషయం ఇంట్లో పెద్దలకు తెలిసింది. ఈ సమయంలో కిరణ్ కుటుంబ సభ్యులు కవీశ తల్లిదండ్రులను పెళ్లికి ఒప్పించారు. ఇద్దరికీ నిశ్చితార్థం కూడా జరిగింది. అప్పటినుంచి తనకు దండిగా కట్నకానుకల కూడా ఇవ్వాలని ప్రియుడు, కుటుంబీకులు ఒత్తిడి చేయసాగారు. కారు, బంగారం కావాలని లేదంటే పెళ్లిని ఆపేస్తామని వేధించ సాగారు. దీంతో ఆవేదన చెందిన కవీశ తాను ఉంటున్న హాస్టల్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె తల్లిదండ్రులు.. కిరణ్, అతని తల్లిదండ్రులు సేతుమాధవ, లతా పై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

కీచక హెచ్‌ఎం పరారు



నిందితుడు కృష్ణమూర్తి

మైసూరు: గౌరవనీయమైన గురువు స్థానంలో ఉండి విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన హుణసూరు తాలూకా హొసవారంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.కృష్ణమూర్తి (58) సస్పెండ్ అయ్యాడు. కొన్ని రోజులుగా పాఠశాలలో ఆడపిల్లలతో అనుచితంగా ప్రవర్తిస్తూ, ఎవరికీ చెప్పవద్దని బెదిరించేవాడు. గత శనివారం పాఠశాలకు ఇతడు గైర్హాజరవడం చూసి విద్యార్థినులు ఇతర టీచర్ల ముందు గోడును వెళ్లబోసుకున్నారు. వారు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. కృష్ణమూర్తిపై చర్యలు తీసుకోవాలని నినాదాలు చేస్తూ ఆందోళన చేశారు. దీంతో అధికారులు అతనిని సస్పెండ్ చేశారు. కొందరు తల్లిదండ్రులు అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. దీంతో అతడు పరారయ్యాడు.

మాడాళ్‌కు పెద్ద ఊరట

- టెండర్- లంచం కేసు కొట్టివేత



బనశంకరి: చెన్నగిరి బీజేపీ మాజీ ఎమ్మెల్యే మాడాళ్ విరూపాక్షప్పకు పెద్ద ఉపశమనం లభించింది. కర్ణాటక సోప్స్ సంస్థ టెండర్ లంచం కేసును హైకోర్టు రద్దు చేసింది. లోకాయుక్త దాఖలు చేసిన ఈ కేసును రద్దుచేయాలని మాడాళ్ హైకోర్టును ఆశ్రయించారు. బుధవారం విచారణ చేపట్టిన ఏకసభ్య పీఠం వాదనలు ఆలకించి ఈ కేసును కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. కేసు నమోదులో నిబంధనలను పాటించలేదని మాడాళ్ వకీళ్లు వాదించారు. సోప్స్ సంస్థలో మాడాళ్ తనయుడు ఉన్నతాధికారిగా పని చేస్తుండగా, ఒక టెండర్ ఇవ్వడానికి కోట్లాది రూపాయలు లంచం తీసుకుంటూ లోకాయుక్తకు దొరికిపోయారు. ఈ కేసులో తండ్రీ కొడుకులను అరెస్టు చేయగా, కొన్నిరోజులు జైల్లో ఉన్నారు. వారి ఇళ్లలో సోదాలు జరపగా రూ.4 కోట్ల వరకూ నగదు లభించింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు జరిగిన ఈ ఘటనతో బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది.

ఎమ్మెల్సీ సూరజ్‌కు ఊరట

యశవంతపుర: మాజీ మంత్రి హెచ్‌డీ రేవణ్ణ కొడుకు, ఎమ్మెల్సీ సూరజ్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని హైకోర్టులో దాఖలైన పిటిషన్‌ను కొట్టేసింది. ఎన్నికలలో అక్రమాలకు పాల్పడినందున చట్టసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని దేవరాజేగౌడ అనే న్యాయవాది పిటిషన్‌ను దాఖాలు చేశారు. విచారించిన న్యాయమూర్తి నాగప్రసన్న ధర్మాసనం బుధవారం పిటిషన్‌ను కొట్టివేయడంతో సూరజ్‌కు ఉపశమనం దక్కింది.

మరో పొంజి స్కీం.. బడా మోసం

- పెట్టుబడి పెడితే అధిక లాభాలని ప్రచారం
- రూ. 25 కోట్లకు పైగా వసూలు
- బెంగళూరులో బాగోతం
- యజమాని, మేనేజర్ అరెస్టు



చిల్లర ఆశ చూపి లక్షలు దోపిడీ



పోలీసులకు పట్టుబడిన ప్రదీప్, వసంత్

బనశంకరి: పెట్టుబడి పెట్టండి, ఆకర్షణీయ లాభంతో పాటు చివరికి అసలు కూడా పొందండి అనే మోసపూరిత మాటలు నమ్మి వందలాది మంది లక్షల రూపాయలు నష్టపోయారు. ఈ ఆర్థిక కుంభకోణం ఐటీ సిటీలో వెలుగుచూసింది. వివరాలు.. రామనగర జిల్లా హారోహళ్లి తాలూకా గుండనగొల్లహళ్లి గ్రామానికి చెందిన ప్రదీప్ 2021లో బెంగళూరు దొడ్డకల్లసంద్ర సమీపంలోని నారాయణనగరలో భార్య సౌమ్యా పేరుతో ప్రమ్య ఇంటర్నేషనల్ అనే ఒక కంపెనీని తెరిచాడు. దీనికి ఏ అనుమతులు లేవు. ఈ కంపెనీలో వసంత్‌కుమార్ అనే వ్యక్తి మేనేజర్‌గా, అతనికి సహాయకారిగా ఉన్నాడు. తమ కంపెనీలో రుణం రూపంలో పెట్టుబడి పెడితే 15 నుంచి 20 శాతం లాభం ఇస్తామని ప్రదీప్ ప్రచారం చేశాడు. ఇతని మాటలు నమ్మిన ప్రజలు పెద్దసంఖ్యలో పెట్టుబడి పెట్టారు. మొదటి ఒకటి రెండు కంతులు లాభం ఇచ్చి, ఇంకా పెద్ద మొత్తంలో పెట్టుబడి పెడితే మరింత లాభం వస్తుందని ఖాతాదారులను మభ్యపెట్టాడు.

లక్షకు నెలకు రూ.15 వేలు ఇస్తామని

లక్ష రూపాయలు పెట్టుబడి పెడితే ప్రతి నెల రూ.15 వేలు తిరిగి ఇస్తామని, ఇక చాలనుకున్నప్పుడు లక్షను తిరిగి ఇచ్చేస్తామని ప్రదీప్ ఆశచూపాడు. కొన్నినెలల్లోనే పెట్టుబడి తిరిగి వస్తుంది కదా అని అమాయకులు బుట్టలో పడ్డారు. కొత్త సభ్యులను చేర్పిస్తే పాత కస్టమర్లకు ప్రోత్సాహకాలు ఇస్తామని చెప్పడంతో వారు స్నేహితులను, బంధువులను కూడా చేర్పించారు. ఇలా ఈ మోసపూరిత పొంజీ స్కీంలో రెండేళ్లలో సుమారు 700 మంది రూ.25 కోట్ల వరకూ ధారపోశారు.

రూ. 70 కోట్ల లావాదేవీలు?

ప్రతి ఒక్కరికీ మొదటి రెండు నెలలు చెప్పినంత సొమ్ముతిరిగి ఇచ్చి ఆపై మొండిచేయి చూపారు. దీంతో కొందరు బాధితులు సీసీబీ ఆర్థిక నేర విభాగం సీఐ ప్రవీణ్ సీ.యలిగార్, కోణనకుంటె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రదీప్ సుమారు రూ.70 కోట్ల కార్యకలాపాలు నిర్వహించినట్లు దర్యాప్తులో వెలుగుచూసింది. విచారణ చేపడుతున్నామని వంచన ఇంకా పెద్ద ఎత్తున ఉండవచ్చునని అధికారులు తెలిపారు. నిందితులు కోణనకుంటె జేఎస్.ప్రదీప్, నాగవార వసంత్ కుమార్ అనే ఇద్దరినీ అరెస్టు చేశామని సీసీబీ అధికారులు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.7 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. కంపెనీలోనూ సోదాలు చేపట్టారు. తమ సొమ్ము తిరిగి వస్తుందా, నీళ్లొదులుకోవాలా? అని ఖాతాదారులకు నిద్ర కరువైంది.



ప్రమ్య ఇంటర్నేషనల్ కంపెనీ వెబ్‌సైట్